స్వాతి వీక్లీ సంచలన ప్రేమ నవల

# ఓ హృదయం లేని ప్రియురాలా!



డా॥ కె. కిరణ్ కుమార్

ఓ రోమియో జూలియట్, ఓ లైలా మజ్నూ, ఓ పార్వతీ-దేవదాస్ ప్రేమకథలకు ఏ మాత్రం తీసిపోని అద్భుత ప్రేమ కథాకావ్యమ్

# ఓ హృదయం లేని ప్రియురాలా!

(స్వాతి సీరియల్)

## డా॥ కె. కిరణ్‌కుమార్

ప్రచురణ

**శ్రీ వైభవ పబ్లికేషన్స్**

102, దివ్యసాయి అపార్ట్‌మెంట్స్
1-9-285/9/1, విద్యానగర్, హైదరాబాద్-44
ఫోన్ : 040-27090541

Copyright : @ with writer

**EDITION: 2014**

**PRICE : ₹ 80/-**

**O HRUDAYAM LEENI PRIYURAALAA!**

*by*

**Dr. K. Kiran Kumar**

<u>గమనిక</u>

ఈ నవలలో పాత్రలు, సన్నివేశాలు అన్నీ కల్పితం. ఎవరిని ఉద్దేశించి రాయబడినావు కావు. ఒకవేళ ఏదైనా పాత్ర ఎవరినైనా పోలి వుంటే అది కేవలం కాకతాళీయమే కాని ఎవరినీ ఉద్దేశించి రాసినవు కావు.

**– రచయిత, పబ్లిషర్**

*Published by*

**SRI VAIBHAVA PUBLICATIONS**
102, Divyasai Apts.,
1-9-285/9/1, Vidyanagar,
Hyderabad-44.
Ph: 040-27090541
Cell: 9247579336

*Subject to Hyderabad Jurisdiction only*

# ఓ హృదయం లేని ప్రియురాలా!

## నాంది

అవి రెండవ ప్రపంచయుద్ధం జరుగుతున్న రోజులు.

ప్రపంచాన్ని గుప్పెట్లో ఉంచుకోవాలని అనుకున్న జర్మనీ తన శత్రుదేశాలైన అమెరికా, రష్యా, బ్రిటన్‌లతో హోరాహోరీగా పోరాడసాగింది.

హిట్లర్ నాయకత్వంలో నాజీ సైన్యం ఒక్కొక్క దేశాన్నే కబళించి పోతూ విజయవంతంగా ముందుకు సాగిపోతోంది.

ఆ నాజీ సైన్యాన్ని తరిమికొట్టడానికి శత్రుదేశాలు తమ వ్యూహాన్ని సరిదిద్దు కుంటున్నాయి.

సరిగ్గా అప్పుడు - స్వీడిష్ నోబుల్ కమిటీ 1839వ సంవత్సరానికి నోబుల్ అవార్డులను ప్రకటించింది. అందులో రసాయన శాస్త్రానికి గాను నోబుల్ ప్రైజ్‌ని జర్మనీకి చెందిన జీవరసాయన శాస్త్రవేత్త అడాల్ఫ్ బుటెనాన్‌డ్‌కి ప్రకటించారు. ఫెరమోన్స్‌ని కనిపెట్టి ఆ రంగంలో విశేషమైన కృషి సలిపినందుకు గాను ఆయనని ఆ అవార్డు వరించింది.

ఆడ, మగజీవుల మధ్య పరస్పరం సెక్స్ ఆకర్షణని కలిగించే వాసన సంకేతాల్ని 'ఫెరమోన్స్' అంటారు. ఆ 'ఫెరమోన్స్' ద్వారా ఓ జంతువు పశుపక్ష్యాదులు ఇంకో జంతువుని, ఇతర పక్ష్యాదుల్ని సెక్సువల్‌గా ఆకర్షింపజేసి తద్వారా మానవాళికి

ఉపయోగపడే జంతువుల సంఖ్యని పెంచి పాలు, కొన్ని రకాల మందులలో వాడే ముడిపదార్థాలను ఎక్కువగా పొందడానికి వీలవుతుంది.

ఆ ప్రయోగం యొక్క విశేషాలు విన్న దేశ దేశాల శాస్త్రజ్ఞులు అబ్బురపడ్డారు. ఆ జర్మనీ శాస్త్రజ్ఞుడి అవిరళకృషికి జోహార్లు అర్పించారు.

కానీ... పరాయి దేశాల వారు తమ దేశంలోని సైంటిస్ట్‌కి నోబుల్ బహుమతిని ఇవ్వడం జర్మనీ సుప్రీం కమాండర్ – ది గ్రేట్ హిట్లర్‌కి నచ్చలేదు.

ఆ బహుమతిని స్వీకరించడానికి వీల్లేదని ఆ సైంటిస్ట్‌కి ఆజ్ఞలు జారీచేశారు. ఫలితంగా ఆ సైంటిస్ట్ నోబుల్ ప్రైజ్‌ని స్వీకరించడానికి వెళ్ళలేదు.

ఇది జరిగిన కొద్ది రోజులకు –

ఆ సైంటిస్ట్ హిట్లర్ ముందుకు పిలిపించబడ్డాడు.

"నీకు సరిగ్గా రెండు నెలలు టైమిస్తున్నాను. నీవు కనిపెట్టిన ఫెరమోన్స్ తాలూకు ఫార్ములాని మనుషులకు పనిచేసేటట్లుగా తయారుచేసి నాకివ్వాలి. ఆ మందుని శత్రుదేశాలన్నింటి పైన ప్రయోగిస్తాను.

దాంతో ఆ దేశాల ప్రజలు, సైనికులు సెక్సువల్‌గా ఆడా మగా ఆకర్షింపబడుతూ కర్తవ్యం మర్చిపోతారు. అదునుచూసి ఆ దేశాలపైన దాడిచేసి వాటిని నా అధీనంలోకి తీసుకుంటాను..."

రెండు నెలలు గడిచిపోయాయి.

సరిగ్గా 61వ రోజు. ఆ సైంటిస్ట్ తాను తయారుచేసిన మందుని ఆరు పెద్ద సీసాలలో సీల్‌చేసి హిట్లర్ ముందుంచాడు. మరుక్షణం ఆ సైంటిస్ట్‌కి సైనైడ్ మాత్ర ఇవ్వబడింది.

తాను కనిపెట్టిన ఫార్ములా బాటిల్స్ ముందే నేలకొరిగి పోయాడు ఆ సైంటిస్ట్.

*(పైన పేర్కొన్న సంఘటన నిజంగా చరిత్రలో జరిగింది. కాకపోతే ఆ సైంటిస్ట్ చనిపోయే సీను మాత్రం కల్పితం – రచయిత)*

ఆ సైంటిస్ట్ మరణించిన నాలుగు గంటలలోపు హిట్లర్ ఆదేశాల మేరకు అతని నలుగురు ప్రధాన సైనికాధికారులు అక్కడకు పిలిపించ బడ్డారు.

"మీరు జెట్‌ప్లేన్‌లో ఈ బాటిల్స్‌ని తీసుకెళ్ళండి. ముందుగా ప్రపంచ పటం చివరున్న దేశంపైన వెదజల్లండి. అలా వారం రోజులలో ఒక్క మన జర్మనీ, జపాన్, ఇటలీ లాంటి మిత్రదేశాల్ని వదిలేసి మిగతా వాటిపైన వాటిని వెదజల్లుతూ పోండి..."

హిట్లర్ ఆజ్ఞ మేరకు ఆ నలుగురూ జెట్‌ప్లేన్‌లో బయలు దేరారు. జెట్‌ప్లేన్ అరేబియా సముద్రంపైన ప్రయాణిస్తోంది వేగంగా.

సరిగ్గా అప్పుడు... ఇంజన్‌లో ఏం లోపముందోగానీ ఆ ప్లేన్ అటూ ఇటూ ఊగసాగింది. పైలెట్ ఎంత కంట్రోల్ చేసినా లాభం లేకపోయింది.

ఆ ప్లేన్ ఒక్క ఉదుటున కిందికి దూసుకెళ్ళి అరేబియన్ సముద్రంలో 'క్రాష్' అయ్యింది.

ఆ ప్లేన్‌లో వున్న సైనికాధికారులు, ఫార్ములా తాలూకు *మందూ– ఆ ప్లేన్ అగ్నికి ఆహుతి అయిపోతూ అరేబియన్ సముద్రంలో కలిసిపోయారు. అలా ఓ భయంకర విధ్వంసం తాలూకు కుట్ర ఘోరంగా విఫలమైంది.*

**అలాంటి ఫెరమోన్స్‌ని మనుషులపైన ప్రయోగించే సంఘటన మళ్లీ భవిష్యత్తులో సంభవిస్తే?**

❖ ❖ ❖

# కథాప్రారంభం

2014, జూన్ 21 –

హైదరాబాద్ –

ఓ ప్రముఖ మెడికల్ కాలేజీ.

ఆ రోజే కాలేజీ ఓపెనింగ్ డే కావటం వల్ల ఆ పరిసరాలు కళకళలాడుతున్నాయి.

సీతాకోక చిలుకల్లా హడావిడిగా తిరగేస్తున్నారు అమ్మాయిలు. లూజు చొక్కా, ప్యాంట్లతో అమ్మాయిలకు సైటు కొడుతున్నారు అబ్బాయిలు. తమ సహజ గాంభీర్యపు హోదాలతో విద్యార్థుల విష్‌లకు తల పంకిస్తూ నడుస్తున్నారు ప్రొఫెసర్లు.

సీనియర్లంతా ఆనందంగా కేరింతలు కొడుతుంటే, జూనియర్స్ భయం భయంగా అడుగుపెడుతున్నారు. అమ్మాయిలైతే ఆ రోజు తమని ఎవరూ ఏం చేయకుండా వుంటే చాలు అనుకుంటూ బిక్కు బిక్కుమంటూ నడుస్తున్నారు.

మూడో నెంబర్ బస్ వేగంగా వచ్చి ఆగింది. గబ–గబా దిగసాగారు ఒక్కొక్కరు.

"ఛ.... ఆ అమ్మాయి అసలు బాగా లేదురా... జిడ్డు మొహం" ఆ బస్టాండ్‌లో సీనియర్లంతా చేరి బస్సులో నుంచి దిగుతున్న అమ్మాయిలకేసి చూస్తూ చిలిపి మాటలతో కామెంట్ చేయసాగారు.

"అదిగో గురూ....ఆ అమ్మాయి బాగుంది కానీ ముఖమంతా స్ఫోటకపు మచ్చలే..." ఇంకొకడు కామెంట్ చేశాడు.

"ఒదిలెయ్ గురూ! తర్వాత చూడు...."

"ఛ..... ఈ పిల్ల మరీ బాగోలేదురా.... అచ్చం గెడకర్రలా వుంది."

"బ్యాడ్‌లక్ బ్రదర్! లెటజ్ ట్రై నెక్ట్స్...." ఓదార్చాడు ఇంకొక స్టూడెంట్.

ఇంకో అమ్మాయి దిగింది బస్సులోంచి.

"వామ్మో అంత లావా? ఈ అమ్మాయి బస్సులో ఎలా పట్టిందిరా?" స్పృహ తప్పిపోయాడు.

"నిజమేరా! ఈ రుబ్బురోలుకే సరిపోతుంది క్లాస్‌రూమ్! మిగతా వాళ్ళు ఎక్కడ కూచుంటార్రా?"

"ఏముంది – ఆ అమ్మాయి భుజం మీద పదిమంది, చేతుల మీద ఇరవై మంది, తొడల మీద నలభై మంది సరిపోతార్రా" అన్నాడు మరో స్టూడెంట్.

బస్సు ఖాళీ అయింది. "అంతా ఎక్కారా?" అంటూ అలవాటుగా అరిచాడు కండక్టర్.

"ఎక్కార్లే పోవయ్యా!" అరిచాడో సీనియర్.

"రైట్ గురూ!" అన్నాడు కండక్టరు.

డ్రైవర్ బస్సు స్టార్ట్ చేయబోయాడు.

అప్పుడు విన్పించిందో మృదువైన స్త్రీ కంఠం బస్సు వెనుకవైపు నుంచి "ఉండండి! నన్ను బట్టలు వేసుకోనీయండి" అంటూ.

అంతే! సీనియర్సంతా ఒక్కసారి ఉలిక్కిపడి ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. వారి గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

"వారెవ్వా! భలే సీను దొరికింది పదరా చూద్దాం...." అనుకుంటూ అంతా నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ బస్సు వెనుక వైపుకు వెళ్ళారు.

అక్కడి దృశ్యం చూసి నిర్ఘాంతపోయారు.

అక్కడున్నది ఒక బట్టలుతికే పిల్ల. వెర్రిముఖాలు వేసుకుని నిలబడున్న వారిని చూసి "ఛ... ఏమి మొగవాళ్ళయ్యా మీరు?" అంటూ బట్టల మూటని తన తల మీద నుంచి బస్సు టాపు మీదకు దించింది.

నీరసంగా కూలబడ్డారు అంతా.

"ఛ... ఏమిటో అన్నీ బ్యాడ్‌లక్‌లేరా! అమ్మాయిలు ఒక్కళ్ళూ బాగోలేదు. ఛ... ఛ... రాను రాను యూనివర్సిటీలో కలర్ బొత్తిగా తగ్గిపోతుందిరా... ఈ జూనియర్స్‌లో ఒక్కరంటే ఒక్కరూ బాగోలేదు.

అంతా ఛండాలంగా అఘోరించారు. ఏం బతుకురా మనది? కనీసం ఓ మంచి అమ్మాయిని చూసి ఎంజాయ్ చేద్దామంటే ప్రాప్తం లేదు..."

సరిగ్గా అప్పుడు –

మెరుపువేగంతో వచ్చి ఆగిందో కంటెస్సా.

ఛక్‌మంటూ తెరుచుకుందా కారు డోర్.

అప్పుడు దిగిందా అమ్మాయి బురఖాతో.

ఆమె కిరుపక్కలా రైఫిళ్ళతో అంగరక్షకుల్లా నిలబడ్డారు ఇద్దరు. ఆమె వెనక మరో ఇద్దరు వున్నారు. ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయిందక్కడ.

సరిగ్గా అప్పుడే గాలికి ఆమె మొహం మీదున్న బురఖా కొద్దిగా పక్కకి తొలగింది.

ఆ ఒక్క క్షణంలో గులాబీ ఛాయతో మెరుస్తున్న ఆమె ముఖం కొద్దిగా కన్పించింది. సంపెంగ పువ్వులాంటి నోరు, గులాబీ రేకుల్లాంటి పెదవులు, కోటేరులాంటి ముక్కు ఒక్క క్షణం అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి.

శరీరం మొత్తం బురఖా ధరించినా, ఆమె పర్సనాలిటీ ప్రస్ఫుటంగా బయటకు తెలుస్తోంది. ఆమె నిల్చున్న తీరు ఓ యువరాణి ఠీవిగా నిలబడినట్లుంది.

ఆమె అడుగు ముందుకు వేసింది.

"ఆహా... ఏమి నడకరా.... హంస నడకరా..." కామెంట్ చేశాడో సీనియర్.

"అబ్బా! ఏం స్ట్రక్చర్‌రా.... ఏమా ఒంపుసొంపులు - 38-24-36 అనుకుంటాను' గుటక మింగాడు ఇంకొక సీనియర్ విద్యార్థి.

మిగతావారు కామెంట్స్ చేయకుండా గుక్కతిప్పుకోలేకపోతున్నారు ఆమె అందానికి.

ఇంకొందరయితే అప్పటిదాకా చేస్తున్న రాగింగ్‌ని ఆపేసి నిలబడిపోయారు.

అంతా నిశ్శబ్దం... నిశ్శబ్దం... అక్కడ.

ఆమె కదిలింది. కదిలి కారిడార్‌లో నిలబడున్న జూనియర్స్‌ని పరిచయం చేసుకుంది. ఆ తర్వాత ... ఆమెతోపాటు జూనియర్స్ బయలుదేరారు. ఆ జూనియర్స్‌తో పాటు ఆ రోజే కొత్తగా జాయిన్ అయిన అమ్మాయిలు ఉత్సాహంగా కదిలారు.

సీనియర్స్ ఏం అర్థం కాక చూస్తూండిపోయారు.

ఆమె ముందుకు కదిలి వారికేసి చూసింది.

"డియర్ సీనియర్స్! కమాన్ - ఇప్పుడు టీజ్ చెయ్యండి" అంది.

సీనియర్స్ బిక్కముఖం వేసి చూస్తూండిపోయారు.

ఆమె కంఠం కదిలింది. "ఏమిటలా చూస్తూండిపోయారు? సాధారణంగా కాలేజీల్లో ఫ్రెషర్స్‌ని సీనియర్స్ రాగింగ్ చేస్తారు. కానీ ఇప్పుడు ఆ ట్రెండ్ మారిపోబోతోంది. కొత్తగా కాలేజీలో జాయిన్ అయిన మేమే మిమ్మల్ని రాగింగ్ చేయబోతున్నాం."

వెంటనే ఆమె ఓ హిప్పీ జుట్టు కుర్రాడికేసి "ఏం భాయ్! జుట్టు గట్ల పెంచినావ్? మీ చెల్లి జుట్టు కూడా నీవే పెంచుకుంటున్నట్లున్నావ్" అంటూ జుట్టుని సవరించింది. ఆ యువకుడు నిశ్చేష్టుడైపోయాడు. ఫ్రెషర్స్ చప్పట్లు కొట్టారు ఆమె తెలంగాణా యాసకు.

మరుక్షణం ఆమె పక్కనే ఉన్న జూనియర్ చెవిలో ఏదో మాట్లాడి ఇంకో యువకుడిని పట్టుకుంది.

"ఏం బిడ్డా? నీవు ఇంకా ఎమ్మెస్సీని ఆరు సంవత్సరాలనుండి చదువుతున్నావంట? మరీ ఒక్కో పాఠం బాగా అర్థం చేసుకొని చదువుతున్నట్లున్నావ్? అందుకే ఒక్కో పాఠం చదివేసరికి ఇప్పటికి ఆరు సంవత్సరాలు పట్టినట్లుంది." గొల్లుమన్నారంతా.

ఒక పక్క నుంచి మెల్లగా జారుకోబోతున్న ఓ సీనియర్‌ని చుట్టుముట్టిందామె మిత్రబృందంతో.

"ఏం కుర్రాడా- మెల్లగా జారుకోబోతున్నావ్? ముందు ముస్తఫా... ముస్తఫా... డోంట్‌వర్రీ ... పాట పాడు బ్రదర్" అన్నదామె.

ఇక తప్పదన్నట్లుగా పాడసాగాడు అతడు.

"ముస్తఫా.... ముస్తఫా... డోంట్ వర్రీ.... కాలం నీ నేస్తం..." అంటూ.

"సరే - పాట బాగానే పాడావ్. ఇంతకీ కాలం మాత్రమే నీ ఫ్రెండా? మేము కాదా?" టీజ్ చేసిందామె.

అక్కడ నవ్వులు పువ్వులై విరజిమ్మాయి.

సరిగ్గా అదే సమయంలో ఓ నలుగురు సీనియర్స్ పరుగులాంటి నడకతో వచ్చి నిలబడ్డారు.

"ఓహో! కోళ్ళ ఫారమ్ వచ్చింది" తాపీగా వదిలింది కామెంట్.

అంతా పక్కుమన్నారు.

కారణం - ఆ వచ్చిన సీనియర్సంతా వైట్ ప్యాంటు, వైట్ షర్టు, వైట్ షూలో వున్నారు. కోళ్ళ ఫారంలోని బ్రాయిలర్ కోళ్ళలా తెల్లగా మెరుస్తున్నారు.

"రండి. ఇప్పటిదాకా ఎక్కడున్నారు?"

"క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్నాం" అన్నాడు లావూరావ్. పేరుకు తగ్గట్టే అతడు లావుగా వుంటాడు.

"ఇంత లావున్నాడు. ఇతడేం పరుగెత్తుతాడు?" కామెంట్ చేసిందొక జూనియర్.

"రన్స్ తీయాలంటే పరుగెత్తనవసరంలేదు. దొర్లుకుంటూ వెళ్ళి రన్స్ తీస్తాడు" అందామె. మరుక్షణం కరతాళధ్వనులు మిన్నంటాయి అక్కడ.

సీనియర్స్‌కి ఏం చెయ్యాలో అర్థం కావటం లేదు. ఇంకా షాక్‌లోనే వున్నారు.

ఇప్పటివరకూ అంతా కొత్తవారిని రాగింగ్ చేయటమే కాని ఇలా ఎన్నడూ జరగలేదు. పైగా తను పేర్లని సైతం ముందే తెలుసుకొని ఆట పట్టిస్తోంది. ఓహ్ గాడ్! ఇలాంటి వింతని ఎక్కడా చూడలేదు.

వారలా ఆలోచనలో వుండగానే ఆమె బృందం ఈసారి లెక్చరర్స్ వైపు కదిలింది. ముందుగా అనాటమి లెక్చరర్ సర్దేశరావుని పట్టుకుంది.

"ఏం సార్! మీరసలు క్లాసులో పాఠాలే చెప్పరట. ఏమన్నా అంటే గొంతునొప్పి అంటారు. కానీ ఇంట్లో మటుకు ఉదయం ఆరు నుంచి రాత్రి దాకా ట్యూషన్స్ చెప్తారు. మరి క్లాసులోని గొంతునొప్పి ట్యూషన్స్ చెప్పేటప్పుడు రాదా?"

నివ్వెరపోయాడు సర్దేశరావు. ఇప్పటివరకూ తనని ఎవరూ అంత మాట అనలేదు.

పైగా ప్రిన్సిపాల్ యమధర్మారావ్‌కి కూడా తానంటే భయం. ఈ పిల్లకాకి... ఆవేశంతో ఏదో మాట్లాడబోయాడు సర్దేశరావు.

"ప్చ్... ఊరుకోండి సార్! సరస్వతిదేవి రహస్యంగా అమ్ముకోకండి. అది మంచిది కాదు".

ఏం చెయ్యలేక పళ్ళు నూరుకుంటూ అక్కడ్నించి వెళ్లిపోయాడు బంగారు రావు.

అప్పుడు పడిందామె దృష్టి అటుగా వెళుతున్న మల్లీశ్వర రావువైపు.

"హలో! ఏమిటీ క్లాసులో ముందు బెంచీల్లో కూర్చున్న అమ్మాయిల జాకెట్ల లోపలికి తొంగి చూస్తున్నారంట. 'మన మానవ శరీరంలో రక్తం, ఎముకలు తప్ప మరేమీ లేవు' అని బోధిస్తూనే అమ్మాయిలకేసి చూస్తూ చొంగ కార్చుకుంటున్నారట."

బిత్తరపడిపోయాడు మల్లీశ్వర రావు. అతని ముఖం ఎర్రబడింది అవమానభారంతో.

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్! హూ ఆర్ యూ?" అన్నాడు కోపంగా.

"ఐయామ్ టాకింగ్ విత్ సైన్స్ సార్! ఐయామ్ ఫస్ట్ ఇయర్ యం.బి.బి.యస్. స్టూడెంట్ సార్..."

ఆశ్చర్యంగా చూశారంతా ఆమె వైపు. మైగాడ్! మెడికల్ స్టూడెంట్స్ ఫాస్ట్‌గా వుంటారని తెలుసు కానీ ఫస్టియర్ స్టూడెంట్స్ మరీ ఇంత ఫాస్ట్ అని అనుకోలేదు.

అంతా ఆమెని అనుసరించారు.

"ఇంతకూ ఎవరు గురూ ఈమె? ఈ కాలేజీలో ఇంత డైనమిక్ పర్సనాలిటీని ఇప్పటివరకూ చూడలేదు" లేటుగా వచ్చిన ఓ సీనియర్ అడిగాడు.

"చూస్తుంటే ఎవరో నవాబు కూతురులా వుంది. పైగా ఎంట్రన్స్ టెస్ట్‌లో స్టేట్ ఫస్ట్ అట..."

"అవునూ – మెడికల్ ఎంట్రన్స్‌లో స్టేట్ ఫస్ట్ ముగ్గురికి వచ్చిందట గురూ, మరి మిగతా యిద్దరు ఎవరు?"

"తెలీదు గురూ! అయినా తినబోతూ రుచులెందుకు? ఇంకాసేపటిలో ఎలాగూ తెలుస్తుంది కదా?"

ఇంతలో బెల్ అయింది. క్లాసులు మొదలవుతున్నట్టుగా అంతా బిలబిలమంటూ నడవసాగారు. ఆమె కూడా కదిలింది.

అప్పుడు అడిగాడో సీనియర్ ఆరాధనగా.

"మీ పేరు ఏమిటి?"

అప్పుడు అక్కడ గాలి స్తంభించిపోయింది. చెట్లు, పుట్టలు కదలడం ఆగిపోయాయి ఆమె చెప్పేది వినడం కోసం. అంతా చెవులు రిక్కించారు.

ఆమె నోట్లోంచి పదాలు గాలిలో అలలు అలలుగా తేలుతూ అక్కడున్నవారి చెవులను తాకాయి.

**"సౌగంధిక".**

# 2

నిశ్శబ్దంగా వుంది క్లాస్‌రూమ్. సీతాకోకచిలుకలన్నీ ఒక్కమారుగా వచ్చి వాలినట్టుంది అక్కడ.

లెక్చరర్ వర్మ ఒక్కొక్క స్టూడెంట్‌ని నిలబెట్టి పరిచయం చేసుకుంటున్నాడు. ఆమె వంతు వచ్చింది. అందరి తలలు ఆమెవైపు తిరిగాయి.

"చాలా సంప్రదాయక ముస్లిం కుటుంబంలో జన్మించాను. ఫలితమే ఈ బురఖా. అయితే సర్వమత సౌభ్రాతృత్వము అంటే మక్కువ మా తాతగారికి. అందుకే నాకు 'సౌగంధిక' అన్న పేరు పెట్టారు.

నిజానికి నేను ఉమెన్స్ మెడికల్ కాలేజీలో చేరాల్సింది. కానీ.. దానివల్ల మన ప్రపంచం మనమే కుదించుకున్నట్టువుతుంది. మగ, ఆడా లాంటి తారతమ్యాలు లేకుండా వున్నప్పుడే కాలేజీలో పోటీతత్వం పెరుగుతుంది. పట్టుదల పెరుగుతుంది.

అల్లరిచేస్తూ, పాడుతూ, స్వేచ్ఛగా విహరిస్తూ జీవితంలోని అత్యంత ముఖ్య ఘట్టమయిన ఈ కాలేజీ జీవితాన్ని పరిపూర్ణంగా ఎంజాయ్ చేయాలని నా కోరిక. అందుకే ఈ కాలేజీలో చేరాను".

మరుక్షణం చప్పట్లు మారుమోగాయి. అక్కడ ఆమె పరిచయ వాక్యాలకు ముగ్ధులై పోయారు అంతా.

"నెక్ట్స్" కదిలింది లెక్చరర్ గొంతు.

"ఇప్పుడు మెడిసిన్‌లో సౌగంధికతో పాటు స్టేట్ ఫస్ట్ వచ్చిన మిగతా ఇద్దరి పరిచయం చూద్దాం."

అందరి తలలు విభ్రాంతిగా కదిలాయి అక్కడ. ఎవరు మిగతా వాళ్లు? సౌగంధికతో పాటు మెడిసిన్‌లో స్టేట్ ఫస్ట్ వచ్చిన ఆ జీనియస్‌లు ఎవరు?

వాళ్ళలా ఆలోచనల్లో వుండగానే ఫస్ట్ బెంచీలో నున్న ఓ యువకుడు లేచాడు.

"నమస్కారం! నా పేరు విశ్వసౌరభ్. నాకు ఎనిమిదేళ్ళ వయసులో మా అమ్మ పోయింది. ఊహ తెలిసేసరికి 'ఇక నా అవసరం నీకు లేదనుకుంటాను. నేను కూడా పైనున్న అమ్మను కలుసుకోనా' అంటూ నాన్న పోయారు. ఇక అక్కడ్నుంచి గవర్నమెంటు వారిచ్చిన స్కాలర్‌షిప్‌తో ఒక్కో క్లాసు గట్టెక్కుతూ హాస్టల్‌లో చదివి మెడికల్ ఎంట్రన్స్‌లో స్టేట్ ఫస్ట్ వచ్చాను. ఇదీ నా కథ...." అన్నాడు.

ఆరాధనగా చూశారు కొంతమంది అమ్మాయిలు అతనివైపు. సౌగంధిక స్పోర్టివ్‌గా చప్పట్లు కొట్టింది అతనివైపు చూస్తూ, వెంటనే లేచి నిలబడింది.

"ఎక్స్క్యూజ్ మీ సర్" అని లెక్చరర్ వంక చూస్తూ కదిలిందామె కంఠం –

"మేమిద్దరం స్టేట్ ఫస్ట్ వచ్చినా అతనే గ్రేట్. ఎందుకంటే అమ్మా నాన్నల ప్రోత్సాహం, ఆస్తిపాస్తులు వున్న నేను స్టేట్ ఫస్ట్ రావటం గొప్పేం కాదు. కానీ... ఇతను ఇవేవీ లేకుండా కేవలం స్వశక్తి మీద కష్టపడి పైకొచ్చారు. సో... నిశ్చయంగా అతనే గొప్ప..."

ఆమె స్పోర్టివ్‌నెస్‌కి ఆశ్చర్యపోయారు అంతా. వాళ్ళే కాదు. విశ్వసౌరభ్ కూడా!

వెంటనే లేచి నిలబడ్డాడు.

నో! నిశ్చయముగా ఆమే గొప్ప. ఎందుకంటే అంత ఐశ్వర్యం వుండీ, తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛని దుర్వినియోగం చేయకుండా కష్టపడి చదివి ర్యాంకు తెచ్చుకోవడం నిజంగా గొప్ప విషయం..."

సౌగంధిక పెదాలమీద చిరునవ్వు కదలాడింది. ఫర్వాలేదు! తన ప్రత్యర్థికూడా తక్కువవాడు కాదు. తనకు తగ్గట్టుగానే ధీటుగానే సమాధానం చెప్పగలడు.

ఈ మెడిసిన్ చదివే ఐదేళ్ళలో అతడిని ఇలా చాలాసార్లు ఎదుర్కోవాలి కాబోలు. అప్పుడే పోటీ రంజుగా వుంటుంది.

"ఇప్పుడు" లెక్చరర్ వర్మ కంఠం అక్కడ ప్రతిధ్వనించింది. 'మెడిసిన్ ఎంట్రన్స్‌లో స్టేట్‌ఫస్ట్ వచ్చిన మూడో వ్యక్తి తన పరిచయాన్ని చెప్పాలి..."

ఒక్కసారిగా క్లాసు నిశ్శబ్దమైపోయింది. అందరిలో ఒక్కసారిగా ఉత్కంఠత నెలకొంది.

అప్పుడు లేచాడు రఫ్‌గా వున్న ఓ యువకుడు.

"నా పేరు యుద్ధ్‌వీర్. చిన్నప్పటినుండి ఎన్.సి.సి.లో వుండటం వల్ల దేశమన్నా, జన్మభూమన్నా యిష్టం. ఆ ఇష్టంతోటే మిలటరీలో జవానులకు వైద్యం చేసే డాక్టర్ కావాలని నా కోరిక. అందుకే మెడికల్ ఎంట్రన్స్ రాయడం, స్టేట్ ఫస్ట్ రావడం జరిగాయ్...." అంటూ చెప్పాడు అతను.

విద్యార్థులు చప్పట్లు కొట్టారు.

ఆ చప్పట్లు మధ్యలోనుంచి దూసుకొచ్చింది సౌగంధిక కంఠం కవ్విస్తున్నట్లుగా.

"పాపం... దేశసేవ చేయాలంటే డాక్టర్ కోర్సే చదవాలి కాబోలు- వేరే ఏ కోర్సు లేనట్లు...."

యుద్ధ్‌వీర్ మొహం ఎర్రబారింది ఆ కామెంట్‌తో. వెంటనే లేచి నిలబడ్డాడు.

"ఈ దేశంలో పుట్టాము... ఈ దేశపు పవిత్ర గాలిని పీల్చాము. ఈ దేశపు పుణ్య నదులలో స్నానమాడాము. ఈ దేశపు పంట భుజిస్తున్నాము. అలాంటిది ఈ దేశం కోసం మిలటరీలో చేరి సేవ చేయాలనుకోవడం తప్పా? అయినా బావిలో కప్పలాంటి జీవితం గడిపేవారికి దేశం గురించి చెప్తే ఏం అర్థమవుతుందిలే! అన్నాడతను ఆవేశంగా.

మ్రాన్పడిపోయింది సౌగంధిక. ఏదో జోక్‌గా ఆటపట్టిద్దామనుకుంది గానీ, దానిని అతడు సీరియస్‌గా తీసుకుని తనని తిరిగి కామెంట్ చేస్తాడనుకోలేదు.

అవమానభారంతో ఆమె గొంతు కదలబోయింది. కానీ అంతకంటే ముందే ఫస్ట్ బెంచీలో కూర్చున్న విశ్వసౌరభ్ గొంతు కదిలింది.

"డియర్ ఫ్రెండ్ యుద్ధ్‌వీర్! టేకిట్ ఈజీ! ఆమె అన్నదాంట్లో తప్పేమిలేదు. దేశసేవ చేయాలంటే ఎన్నో మార్గాలున్నాయి కదాని ఆమె ఉద్దేశం. దానిని స్పోర్టివ్‌గా తీసుకోవాలేగానీ 'బావిలో కప్ప' లాంటి పదజాలం ఉపయోగించి ఆమె మనసుకు కష్టం కలిగించనవసరంలేదు కదా! స్టేట్ ఫస్ట్ వచ్చినవాళ్ళం మనముగ్గురం. అలాంటిది ఈ క్లాసులో మన ముగ్గురి మధ్య ఆరోగ్యకరమైన పోటీ వుండాలే గానీ ఇలా కాదు...."

"ఐ మీన్ - నా ఉద్దేశం ఏమంటే..." అంటూ ఏదో చెప్పబోయాడు యుద్ధ్‌వీర్.

ఇంతలో బెల్ మోగింది టైమ్ అయిపోయినట్లుగా.

లెక్చరర్ వర్మ అటెండెన్స్ రిజిస్టర్, డస్టర్ చేతిలోకి తీసుకొని "ఓ.కె. రేపు కలుద్దాం" అని వెళ్ళటంలో ఆ టాపిక్‌కి గండిపడింది.

❖ ❖ ❖

మూసుకున్న రెప్పల వెనుక అతడి కళ్ళు అల్లరి చేస్తున్నాయి. ఆ కళ్ళలో మెరిసే కాంతివేగాన్ని సునిశితమైన అతని చూపులు అంచనా వేస్తున్నాయి. గుండె పొరల్లో కదలాడే భావాల్ని తన భాషలోకి తర్జుమా చేస్తున్నాడు...... విశ్వసౌరభ్.

ఆ రోజు కాలేజీలో ఆమె అల్లరి, క్లాసులో తనని ఆమె పొగిడిన ఆలోచనలే అతడిని పరిమళంలా చుట్టేస్తున్నాయి. ఆ అనుభూతిలో హృదయం పలుకుతోంది. కవ్వం పెట్టి చిలికినట్టు హృదయాన్ని చిలుకుతోంది. ఆనందం హృదయపు అంచుల్ని తాకి తుళ్ళుతోంది. గుండెకు గండిపడ్డట్టయింది. ఘనీభవించిన ఫీలింగ్స్ కరిగి పొంగి పొర్లుతున్నాయి.

అంతవరకూ తన ఒంటరి జీవితంలో ఇంత అపురూపమూ, అద్భుతమూ అయిన సంఘటన అతనికి సంభవించలేదు.

ఆమె అతనికి కొత్త – ఆ అనుభవం అతనికి కొత్త. అసలు ఆ స్పందనే కొత్త. గుండెలమీద సున్నితమూ, సుకుమారమూ అయిన గాఢపు పరిమళం శరీరం మొత్తాన్ని కమ్మేసినట్టయింది.

ఆ అనుభూతి ఆనందంగా వుంది. గొప్ప తృప్తిగా వుంది. ఆమెని మళ్ళీ వెంటనే చూడాలన్న కోరికగా వుంది. ఇప్పటి వరకూ నిస్సారంగా వున్న తన జీవితంలో ఆమె ప్రవేశం ఓ కొత్త శక్తిని యిచ్చింది.

ఆ రాత్రి అతడు నిద్రపోలేదు ఆమె ఆలోచనలతో.

## 3

యూనివర్శిటీ సెమినార్ హాల్. విద్యుద్దీపాలతో అందంగా అమర్చారు. ముఖ్య అతిధులు ఆసీనులు కావడానికి వేదికను చక్కగా అలంకరించారు. దేశం నలుమూలల నుండి వస్తున్న ప్రొఫెసర్లకోసం ముందు వరసల్లో ప్రత్యేక కుర్చీలు వేశారు.

దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన సెమినార్ కావడంవల్ల అన్ని యూనివర్శిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, రీడర్లు, లెక్చరర్లు హాజరయ్యారు. పైగా అయిదువేలమంది స్టూడెంట్స్ పాల్గొంటున్నారు.

ముందుగా అనుకున్న సమయానికి కార్యక్రమాన్ని ప్రారంభించటానికి కమిటీ నిర్వాహకులు తమ శాయశక్తులా కృషి చేస్తున్నారు.

అందరిలో ప్రత్యేకంగా కనిపిస్తున్నారు సౌగంధిక, విశ్వసౌరభ్‌లు. అన్నింటా తామై కలివిడిగా తిరుగుతున్నారు. అతిథిలకు బొకేలను అందించే దగ్గర్నుంచి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.

విజ్ఞానానికి ఎల్లలు లేవు. తవ్వేకొద్దీ బావిలో నీరు వూరినట్లుగా నేర్చుకున్న కొలదీ విజ్ఞానమూ మిగిలే వుంటుంది. ఇలాంటి సెమినార్లలోనే కొత్త విషయాలు బయటపడుతూ వుంటాయి. అందుకే సెమినార్‌లో యాక్టివ్‌పార్టు తీసుకోవడానికి ఉవ్విళ్లూరుతున్నారు సౌగంధిక, విశ్వసౌరభ్‌లు.

గంట మోగింది సెమినార్ ప్రారంభమైనట్లుగా. వైస్–ఛాన్సలర్ లేచి నాటి సెమినార్ ప్రాముఖ్యం గురించి ప్రసంగించారు.

అప్పుడు ప్రవేశించాడు సెమినార్ హాల్లోకి యుద్ధ్‌వీర్. తన క్లాస్‌మేట్స్ సౌగంధిక, విశ్వసౌరభ్‌లకు విష్‌చేసి స్టూడెంట్స్ వరసలో కూర్చున్నాడు చిరునవ్వుతో.

క్షణాలు గడుస్తున్నాయ్. అప్పుడు ప్రారంభమయ్యాయి రకరకాల టాపిక్‌లపైన డిబేట్లు. ఆ డిబేట్లలో స్టూడెంట్స్ కూడా పాల్గొనవచ్చు. ముందుగా "ఈ ప్రపంచంలో అన్నింటికంటే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి ఏమిటి?" అన్న టాపిక్‌తో మొదలైంది పోటీ.

"ఎయిడ్స్" యుద్ధ్‌వీర్ కంఠం అంది.

"కానే కాదు – క్యాన్సర్..." ఇంకో స్టూడెంట్ లేచి నిలబడి అన్నాడు.

"హెపటైటిస్.బి. అనే వ్యాధి చాలా ప్రమాదకరమైనది. అది సోకితే లివర్ దెబ్బతిని మనిషి చస్తాడు."

నిజమేనన్నట్లుగా కొంతమంది ప్రొఫెసర్లు తలలు కదిలాయి.

ఈ నేపథ్యంలో ఛైర్మన్ గొంతు కదిలింది.

"సరే – సైన్స్ తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు కదా. ఇప్పుడు రాబోయే కాలంలో సైన్స్‌వల్ల సంభవించే అద్భుతాల గురించి చర్చిద్దాం."

"ఓ.కె!" ఉత్సాహంగా అరిచారంతా.

"రాబోయే కాలంలో చాలా పరిణామాలు చోటుచేసుకుంటాయి. నల్లవారు కాస్తా తెల్లవారుగా మారిపోతారు. వారి శరీరంలోని మెలనిన్ మారిస్తే తెల్లవారుగా పరిణామం చెందుతారు. అప్పుడు నల్లవారు, బ్లాక్, ఛామనచాయ అన్న పదాలు విన్పించవు" అన్నాడో విద్యార్థి.

"బట్టతలవారు కాస్తా మాయమవుతారు. వారి తలమీద దట్టంగా జుట్టు వస్తుంది" అన్నాడు ఇంకో విద్యార్థి.

విశ్వసౌరభ్ లేచి నిలబడ్డాడు.

"రాబోయే కాలంలో 'కంప్యూటర్' చాలా ముఖ్యపాత్రని వహిస్తుంది.

రాబోయే కాలంలో కంప్యూటర్ మన మాటలని వినగలదు. మాట్లాడగలదు. పైగా మనకేదైనా సమస్య వస్తే అదే పరిష్కరించగలదు. కొంతమంది విస్మయంగా చూశారతనివైపు.

అప్పుడు కదిలాడు యుద్ధ్‌వీర్. తన ముందున్న మైక్‌సెట్‌ని అందుకున్నాడు.

"ప్రపంచంలో ఆటంబాంబు తర్వాత భయంకరమైనది. 'క్లోనింగ్. మనిషి నుంచి మరో మనిషిని పుట్టించడాన్నే 'క్లోనింగ్' అంటారు.

ఎక్కడ చూసినా మనుషుల్ని పోలిన మనుషులు... ఇలా ప్రపంచం పెద్ద అనైతిక వలయంలో చిక్కుకుపోతుంది...."

అప్పుడు మోగాయ్ హాలు హాలంతా చప్పట్లు. క్లోనింగ్ గురించి అందరూ విని వున్నారు. సైన్స్ సాధించిన అద్భుతాలలో అదొకటి.

కానీ దానిని విశ్వశ్రేయస్సుకోసం ఉపయోగిస్తే మంచిదేగానీ.... మానవ విధ్వంసానికి ఉపయోగిస్తే మాత్రం విధ్వంసం జరిగిపోతుంది.

ఓ హిట్లర్, ఓ ఈదిఅమిన్ లాంటివారు తిరిగి పుడితే ఈ ప్రపంచం గతి అధోగతే!

ఛైర్మన్ నిశ్శబ్దంగా వున్న సౌగంధిక వైపు చూస్తున్నాడు. ఆ అమ్మాయి ఈ టాపిక్‌లో ఇంకా జోక్యం చేసుకోలేదు. ఎందుకో? ఆయనలా ఆలోచనలో వుండగానే సౌగంధిక లేచి నిలబడింది.

"సైన్స్ ఎన్ని అద్భుతాలు చేసినా, ప్రకృతిముందు దిగదుడుపే. వరదల్ని, భూకంపాల్ని అది ఎప్పటికీ ఆపలేదు. ప్రకృతి సహజమైన ఎన్నో మార్పులు మెచ్యూర్ అవటం, ప్రేమ, కామం, మరణాలను ఆపడంలాంటి ఎన్నింటినో అది చేయలేదు. కాబట్టి ప్రకృతిముందు సైన్సు తలదించుకోవాల్సిందే..."

దిగ్భ్రాంతిగా చూశారంతా.

సైన్స్ సెమినార్‌లో ప్రకృతి గొప్పతనం గురించి ఆమె మాట్లాడటం అందరికీ ఆశ్చర్యంగా వుంది. అలా అన్ని డిబేట్లలోనూ యుద్ధవీర్, సౌగంధిక, విశ్వసౌరభ్‌లు ఉత్సాహంగా పాల్గొని వాక్చాతుర్యంతో, విజ్ఞానంతో అందరిని అలరించారు.

అందరికి దిగ్భ్రాంతిగా ఉంది వారి విజ్ఞానానికి.

వారలా దిగ్భ్రాంతిలో వుండగానే డిబేట్లు ముగిశాయి.

అప్పుడు ఛైర్మన్ ముందున్న కంప్యూటర్ డిబేట్ ఫలితాలను ప్రకటించింది.

*ఫస్ట్ ప్రయిజ్ – కుమారి సౌగంధిక*

*సెకండ్ ప్రయిజ్ – విశ్వసౌరభ్*

*థర్డ్ ప్రయిజ్ – యుద్ధ్‌వీర్.*

అంతటితో సెమినార్‌ని ముగిస్తూ ఛైర్మన్ ప్రసంగించారు.

“ఇన్నేళ్ళ నా జీవితానుభవంలో ఎన్నో సెమినార్లలో, అంతర్జాతీయ వేదికలలో పాల్గొన్నాను. కానీ ఈ సెమినార్‌లో జరిగిన డిబేట్లు మటుకు నేను ఎప్పటికీ మరువలేను. ముఖ్యంగా సౌగంధిక, విశ్వసౌరభ్, యుద్ధ్‌వీర్‌ల లాంటి జీనియస్‌లని నేను దేశంలో ఎక్కడా చూడలేదు. ఇంత చిన్న వయసులో వీరు అఖండ మేధా సంపత్తిని స్వంతం చేసుకోవడం దేశానికే గర్వకారణం! భవిష్యత్తులో వీరు ముగ్గురూ కలిసి ఎన్నో అద్భుతాలు సృష్టించి భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకు వెళ్తారని నేను ఆశిస్తున్నాను.”

కానీ... ఆ సమయంలో ఆయనకు తెలియదు. భవిష్యత్తులో వారు ముగ్గురూ మూడు విభిన్న శక్తులకు నాయకత్వం వహించి, దేశచరిత్రలో సరికొత్త అధ్యాయాల్ని సృష్టించబోతున్నారని.

## 4

ఆ రోజు కాలేజీ అంతా హడావుడిగా వుంది.

కారణం – విద్యార్థులంతా పిక్నిక్‌కి వెళుతున్నారు. ఎప్పుడూ క్లాసులు, ప్రాక్టికల్స్ కావడంవలన విద్యార్థులకు బోర్‌కొట్టింది. అందులో మెడిసన్ అవటం వలన రోజుకు పది గంటలు కష్టపడాల్సి వుంటుంది. దాంతో రిలీఫ్ టైమ్‌కోసం ప్రతి విద్యార్థి ఎదురు చూస్తుంటాడు.

అందుకే పిక్నిక్ అంటే స్టూడెంట్స్‌లో అంత కోలాహలం.

అంతా కలిసి రెండు బస్సులలో శామిర్‌పేట బయలుదేరారు. బస్సులోనే పాటలు కట్టి పాడుతూ దారినపోయే వారిని వెక్కిరిస్తూ అల్లరి చేస్తున్నారు. బస్సుని స్పీడుగా పోనివ్వమంటూ డ్రైవర్‌ని ఉత్సాహపరుస్తున్నారు. క్లాసులో ఎప్పుడూ గంభీరంగా వుండే ప్రొఫెసర్ల ముఖాలలో నవ్వు తాండవిస్తోంది.

స్టూడెంట్స్ అందరిలో ప్రత్యేకంగా కనిపిస్తోంది సౌగంధిక. పేరుకు బురఖా వేసుకున్నా శంఖం లాంటి మెడ, రాజసంతోకూడిన ఠీవి, ఏనుగు దంతాల్లాంటి పాదాలతో ఓ నవాబు కూతురులా దర్పం ఒలకబోస్తోంది. కొంతమంది స్టూడెంట్స్ యథాలాపంగా చూస్తున్నట్లుగా ఆమెను క్రీగంట చూస్తున్నారు.

బస్సు శామిర్‌పేట సమీపించింది.

బస్సు ఆగీ ఆగకముందే స్టూడెంట్స్ ఒక్క ఉదుటున దూకారు.

బిలబిలమంటూ లేడీ స్టూడెంట్స్ కూడా వారిని అనుకరించారు.

ఆఖరున దిగారు విశ్వసౌరభ్, యుద్ధ్‌వీర్. అప్పుడే సూర్యుడు వెలుతుర్ని నింపుకుంటూ లోకాన్ని ప్రకాశవంతం చేస్తున్నాడు. అలమీద తేలివచ్చిన నులివెచ్చని కిరణం తాటిచెట్టు గుబురులోంచి వక్రీభవనం చెందుతోంది. కుంచెని రంగుల్లో ముంచి పిచ్చిగా కాన్వాస్ మీద గీయాలని వుంటుంది ఎవరికైనా అపురూపమైన ఆ దృశ్యాన్ని చూస్తుంటే.

కొంతమంది పిచ్చుకగూళ్ళు కడుతున్నారు. ఇంకొంతమంది సరస్సులో ఈత కొడుతున్నారు.

అమ్మాయిలు కనిపించిన చెట్టు పువ్వుల్ని, కాయలను కోస్తున్నారు.

అక్కడ సీతాకోకచిలుకలన్నీ ఒక్కసారిగా నేలమీద వాలాయా అన్పిస్తోంది.

అలా మధ్యాహ్నందాకా ఆడి అలసిపోయారు. భోజనాలయ్యాక మొదలయిందా కార్యక్రమం.

క్లాస్ రిప్రజెంటేటివ్ యుద్ధ్‌వీర్ ఆధ్వర్యంలో ప్రారంభమైంది.

"ఇప్పుడు...." కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం.

"మనమంతా ఓ చిన్న గేమ్ ఆడుతున్నాము. ఇదిగో ఈ డబ్బా చూశారుకదా! ఇందులో నలభై చీటీలు వున్నాయి. మీ అందరూ ఇక్కడకు వచ్చి తలా ఓ చీటీ తీస్తారు. ఎవరికి ఏ చీటీ వస్తే వారు ఆ చీటీలో వున్నట్లుగా చేయాలి. ఓ.కే.?"

హుషారుగా కేకలు వేశారు కొంతమంది. ఇంకొంతమంది ఆనందంతో కుప్పిగంతులు వేశారు.

"ఇంకో విషయం! మన ప్రొఫెసర్లుకూడా ఈ రోజు ఇక్కడ ఈ చీటీగేమ్‌లో పాల్గొంటారు. పోతే–చీటీలు అటెండెన్స్‌లో ఆఖరి పేరునుండి మొదలువుతాయి" అంటూ మొదటి పేరు పిలిచాడు.

"ఉదయభాస్కర్"

ఆ పేరుగల విద్యార్థి లేచి డబ్బాలోని చీటీల్లో ఒకదానిని బయటికి తీశాడు.

"ఏదైనా ఓ పాట పాడు" అని వుంది.

ఆ అబ్బాయి ఉత్సాహంగా "గ్రీకువీరుడూ.... రాకుమారుడూ... కలలో నేస్తం..." అంటూ పాడాడు.

అంతా చప్పట్లు కొట్టారు.

ఇంకో అబ్బాయికి "మన అనాటమీప్రొఫెసర్‌లా పాఠం చెప్పాలి" అంటూ వచ్చింది.

వెంటనే ఆ అబ్బాయి ఓ కళ్ళజోడు పెట్టుకుని, ఓ రాయిని డస్టర్‌లా చేతిలో వుంచుకొని 'మన శరీరంలో రక్తం, ఎముకలు, మాంసం తప్ప ఏమీ వుండవు' అంటూ ఎదురుగా వున్న ఓ అమ్మాయి జాకెట్లోకి ముఖంపెట్టి చూడసాగాడు.

"మార్వలెస్" అంటూ అంతా చప్పట్లు చరిచారు. తమ అనాటమీ లెక్చరర్ అచ్చు అలాగే ఆడపిల్లలని చూస్తూ చొంగ కార్చుకుంటాడు.

ఒక స్టూడెంట్‌కి ఇంకో చీటీ వచ్చింది.

అందులో –

"నీవు ఓ ఎయిడ్స్ పేషెంటువి. ఇంకా బతికేది ఆరునెలలే. దానిని ఏక్ట్‌చేసి చూపించు" అని వుంది.

వెంటనే ఆ అబ్బాయి లేచాడు.

అక్కడే ఎత్తుగా వున్న ఓ దిబ్బమీద విచారంగా పడుకొని, ఓ మంచినీళ్ళ గ్లాసుని మందుగ్లాసులా పట్టుకొని – "ఆగదు ఈ నిమిషం నీ కోసం" అంటూ విషాదస్వరంతో పాడుతూ –

"ఛ... ఆ పక్కింటి ఆంటీ పిల్చినప్పుడే అనుకున్నాను. ఇలాంటిదేదో వుందని. ఛ... క్యాంప్ కెళ్ళిన అంకుల్ ఉసురు యిలా తగిలిందన్న మాట..." అని వైరాగ్యంగా అనుకోసాగాడు.

అంతా చప్పట్లు కొట్టారు... అతని యాక్టింగ్‌కి.

ఇంకో స్టూడెంట్‌కి "నీవు ఇండియన్ క్రికెట్ టీమ్‌కి కేప్టెన్‌వి. నీ జట్టు ఓటమికి గల కారణాన్ని ప్రెస్ స్టేట్‌మెంట్ ఇవ్వు" అని వచ్చింది.

అప్పుడా స్టూడెంట్ గొంతు సవరించుకొని –

"విలేఖరులారా! మేము పరమ నికృష్ఠులం. బంతి మా వైపుకు దూసుకొస్తుంటే దానిని బలంగా కొట్టడానికి బద్దకం వచ్చి కావాలని అవుట్ అయిపోతాం. ఆ బంతిని బలంగా కొడితే మా చేతులు నొప్పని హాయిగా వికెట్ పారేసుకొని పెవిలియన్‌కి వెళతాం. అక్కడయితే ఎండ వుండదు.

హాయిగా కూల్‌డ్రింక్స్ తాగుతూ సినిమా తారలని ఒళ్ళో వేసుకొని కూర్చోవచ్చు..."

అంతా అదిరిపోయారు అతని యాక్షన్‌కి

కాలం కరుగుతోంది... వారి ఉత్సాహంతో.

ఆడపిల్ల వంతు వచ్చింది.

ఓ అమ్మాయి ఉత్సాహంగా చీటీ తీసింది.

"డాక్టర్‌గా నీ ప్రాక్టీస్ ఇంప్రూవ్ చేసుకోవటానికి ఏం చర్యలు తీసుకుంటావు?"

"వెరీ సింపుల్" ఆ అమ్మాయి ఉత్సాహంగా అరిచింది. "మలేరియానో, మశూచో ఏదో ఒక అంటువ్యాధిని నేనే మా వీధిలో అంటిస్తే సరి...."

ముక్కుమీద వేలేసుకున్నారు కొంతమంది.

ఇంకో అమ్మాయికి వచ్చింది చీటీ.

"హఠాత్తుగా ఫలానా నెంబర్‌వన్ హీరో ఇప్పుడు నీకు కన్పిస్తే ఏమని పిలుస్తావు?" అని.

ఆ అమ్మాయి వెంటనే రియాక్ట్ అయింది.

"ఆ హీరో మేకప్‌లో లేకపోతే తాతయ్య అని, మేకప్‌లో వుంటే తమ్ముడూ అని పిలుస్తాను."

సూర్యుడు పడమరవైపుకు కుంగిపోతున్నాడు మెల్లమెల్లగా, ఆ స్టూడెంట్స్ అల్లరికి ప్రకృతి కూడా పరవశిస్తున్నట్లుగా గాలి వీస్తోంది.

ఆఖరిగా వచ్చింది సౌగంధిక వంతు.

అందరిలో ఉద్రిక్తత, ఉద్వేగం, టెన్షన్... ఏం జరగబోతోందని. ఆమె చేయి కదిలి ఓ చీటిని తీసింది.

ఆ చీటీలో మ్యాటర్‌ని చదువుతూనే ఆమె మొహం ఓ క్షణం తెల్లబోయింది.

అయితే ఆ తడబాటుని పైకి కనబడకుండా ఆమె బురఖాలో కప్పిపుచ్చుకుంది.

ఆ చీటీలో... "నీవొక జూలియట్‌వి. ఇక్కడ నీ రోమియోని వెతికి చూపించు..."

ఆమె చీటీలోని మ్యాటర్ గ్రహించిన మిగతా విద్యార్థులు ఆనందంతో వూగిపోతూ ఎగిరి గంతేశారు. కేరింతలు కొట్టారు.

క్షణాలు గడుస్తున్నాయి. ఆమెకేం చెయ్యాలో తోచటంలేదు.

ఛ! తన దురదృష్టం కాకపోతే ఇలాంటి అబ్సర్డ్ చీటీ తనకే రావాలా? తనొక జూలియట్ అట, తన రోమియోని చూపించాలట ఇక్కడ... ఛీ.... "కమాన్, క్యారీ ఆన్... క్యారీ ఆన్..." అంటూ వుత్సాహంగా అరిచారు అక్కడున్న స్టూడెంట్స్ అందరూ.

అప్పుడు కదిలిందామె గొంతు. ఓ ఐడియా స్ట్రయిక్ అయినట్లుగా. "నా రోమియో ఇక్కడ లేడు. స్టేట్స్‌లో వున్నాడు. కాబట్టి నన్ను వదిలెయ్యండి" ఆమె జవాబుకు అంతా ఓ క్షణం అవాక్కయ్యారు.

ఓ క్షణం నిశ్శబ్దం తర్వాత...

అప్పుడు...

"నో....నో... అలాంటి డొంకతిరుగుడు జవాబుని మేము అంగీకరించము. నీ రోమియోని ఇక్కడున్న వారిలోనే సెలక్ట్ చేసుకుని చూపించాలి. అదీ... చీటీలు తీయని వాళ్ళల్లోనే సుమా..." అంటూ అంతా ఆమె చుట్టూ చేరి గొడవ చేయసాగారు.

నిజానికి ఇంకా చీటీలు తీయకుండా మిగిలిపోయినవారు ఇద్దరే. వారు... విశ్వసౌరభ్, యుద్ధ్‌వీర్.

ఆమెకేం చెయ్యాలో తోచటంలేదు. ఇక తప్పదన్నట్లుగా మగవాళ్ళు కూర్చున్న బెంచీలకేసి కదిలింది.

ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయిందక్కడ.

ఆమె ఒక్కసారిగా ఆగిపోయింది. యుద్ధ్‌వీర్ అంటే మొదట్నుంచి ఆమెకు పెద్దగా ఆసక్తిలేదు. క్లాసులో మొదటిరోజు తనని అల్లరిచేసిన దగ్గర్నుంచి ఆమెకు అతడంటే కొద్దిగా మంటగా వుంది.

ఇక రెండోవాడు విశ్వసౌరభ్ సౌమ్యుడు, నిదానస్తుడు. సీతాదేవి స్వయంవరంలో ఎవరికి దండ వేయబోతుందా అన్నట్లుగా ఆసక్తిగా చూశారంతా.

ఒక్కక్షణం, మరుక్షణం ఆమె వేగంగా కదలడం, విశ్వసౌరభ్ దగ్గరకు నడవడం "హీ ఈజ్‌మై రోమియో" అనడం, ఆమె గబగబా అక్కడ్నుంచి వచ్చి తన సీట్‌లో కూర్చోవడం చక చకా జరగిపోయాయి.

మరుక్షణం అక్కడ కేకలు మిన్నంటాయి.

"సౌరభ్! యూ ఆర్ లక్కీ..."

"విశ్వసౌరభ్! యూ ఆర్ రోమియో..." అంటూ.

సౌరభ్ దిగ్భ్రాంతిగా అలాగే చూస్తున్నాడు. అతడికంతా ఏదో లోకంలో వున్నట్లుంది. సిగ్గువల్లో, మరిదేనివల్లో అతని మొహం కందిపోయింది.

అతడి స్థితిని దూరంనుంచి చూస్తోంది సౌగంధిక. ఆమెలో ఎలాంటి భావాలు లేవు. తప్పదు కాబట్టి అలా చేయవలసి వచ్చింది.

మరుక్షణం ఆమె లేచి అతడి దగ్గరకు నడిచింది.

"జరిగిందంతా తేలికగా తీసుకోండి. ఇందులో నాకు ఏ ఉద్దేశమూ లేదు. వీళ్ళ గోల భరించలేము కాబట్టి అలా చేశాను. నన్ను అపార్థం చేసుకోకండి. మనం ఎప్పుడూ స్నేహితులమే..."

ఆమె వ్యక్తిత్వానికి అతనికి ముచ్చటేసింది. జరిగినదాంట్లో తన ప్రమేయం ఏమీ లేకున్నా తానెక్కడ నొచ్చుకుంటానో అన్నట్లుగా అపాలజిటిక్‌గా చెప్పింది.

పిక్నిక్ అయిపోవడంతో అందరూ బస్సు ఎక్కారు. అందరితో పాటు ఆఖరిగా ఎక్కింది సౌగంధిక.

బస్సు కదిలింది.

*ఆ క్షణంలో ఆమెకు తెలియదు అతనిలో అంతకు ముందే తనపట్ల ప్రేమబీజం నాటుకుందని. అనాలోచితంగా తాను చేసినటువంటిపనితో ఆ ప్రేమ తీవ్రమైన భవిష్యత్తులో తాను లేకపోతే అతడు బతకలేని స్థితికి చేరుకుంటాడని.*

## 5

"ప్రేమన్నది ఆరాధన... ఆరాధనే ఒక వేదన... కరిగే కర్పూరము ఈ జీవితమూ..."

వీనులవిందుగా జానకి కంఠం, ఇళయరాజా సంగీతం, ఆనందంతో కూడిన ఒంటరితనం, రేపటి ప్రత్యూషకు నిరీక్షణం... ఇది అతడి స్థితి.

పక్క తీసుకుని డాబామీదకు వెళ్లాడు. పడుకుంటే నిద్ర రావట్లేదు. సౌగంధిక గుర్తొస్తోంది.

"హీ ఈజ్ మై రోమియో..." అన్న ఆమె మాటలు అతడి హృదయంలో ఆనందాన్ని పంప్ చేస్తున్నాయి. శరీరంలో ఎందుకో ప్రకంపనాలు కలుగుతున్నాయి. పడుకోబుద్ధవుతోంది. మళ్ళీ కూర్చోబుద్ధవుతోంది. ఏదీ చేయలేకపోతున్నాడు.

తీరంలో పరిగెత్తాలనిపిస్తోంది. అంతలోనే నిండా ముసుగుతన్ని ఆలోచించాలని పిస్తుంది.

ఎందుకో అతనికి దుఃఖం వస్తోంది. చిన్నపిల్లాడిలా ఏడ్వాలని వుంది. గుండెని పిండిచేసే సందిగ్ధత. నిజానికి అతను అంతవరకు ప్రేమరాహిత్యంతో బతుకుతున్నాడు. ప్రేమను పంచిచ్చే తల్లిదండ్రులు ఎప్పుడో పోయారు. తోబుట్టువులు లేరు.

తన ప్రేమ వ్యక్తం చేయాలన్నా, పంచుకోవాలన్నా ఎవరూ సహకరించలేదు. తను నిరంతరం ఒంటరి.

అలాంటి సమయంలో దేవతలా...

విశ్వసౌరభ్ కళ్ళు వర్షిస్తున్నాయి. ఆమె గురించి ఆలోచనలు జ్ఞాపకం వస్తున్నాయి.

సెకండ్ షో సినిమా వదిలినట్లున్నారు.

జనాలు హడావుడిగా వెళ్తున్నారు.

అతడు బయోకెమిస్ట్రీ పుస్తకం తీశాడు. ఒక్క ముక్క కూడా బుర్రకు ఎక్కడంలేదు.

అతనికి హఠాత్తుగా గుర్తొచ్చాయి ఆ రోజు పిక్నిక్‌లో బస్సులో యుద్ధ్‌వీర్ మాటలు.

"ఏం ఫ్రెండ్ నేను ఏర్పాటు చేసిన ఆ చీటీల ఆట బాగుందా?"

తాను చిరునవ్వు నవ్వాడు బాగుందన్నట్లుగా. అప్పుడొచ్చింది తనకు ఆ సందేహం. యుద్ధ్‌వీర్ కావాలని ఆ చీటీలో అలా రాసి వుంచాడా?

"అవునూ! ఇంకా దాంట్లో నా చీటీ రాలేదు కదా! ఏముందందులో?" అడిగాడు తను.

యుద్ధ్‌వీర్ తన చేతిలోని బాక్స్‌లో మిగిలిపోయిన చీటీని తీసి చూపించాడు.

దానిలో "యూ ఆర్ రోమియో! చూపించు నీ జూలియట్‌ని..." అని రాసి వుంది.

'మై గాడ్! ఆ చీటీ తనకు రావాల్సింది. కానీ ఈ లోపే సౌగంధిక చీటీని తీసింది.

అంటే.. అంటే... అటెండెన్స్‌లో తామిద్దరూ టాప్ పేర్లు కాబట్టి కావాలనే తామిద్దర్నీ రోమియో, జూలియట్‌లను చేయటానికి ఆడిన గేమ్...'

అతని సందేహం అర్థమైనట్లుగా యుద్ధ్‌వీర్ నవ్వి అతని చేతిని నొక్కుతూ అన్నాడు. "అవును... నేనే అలా ఏర్పాటు చేశాను. నీ వంతు ఆఖరికి వస్తుందని తెలుసు. అందుకే చీటీలన్నీ అయిపోయాక నా జేబులో వున్న మీ ఇద్దరి చీటీలు డబ్బాలో వేశాను. ఆమంటే నీకు ఆరాధనని నాకు తెలుసు. అందుకే నిన్ను సంతోషపెట్టాలని –"

"వీర్..." ఒక్కసారిగా కదిలిపోయాడు విశ్వసౌరభ్. "నిజంగా ఫ్రెండ్‌వంటే నీవే. నా హృదయాన్ని అర్థం చేసుకున్నావ్.. ఐ లైక్ యూ థాంక్యూ.... థాంక్యూ...."

"నో మెన్షన్ ప్లీజ్" చిరునవ్వుతో కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం. "ఆమెతో నీ ప్రేమ సక్సెస్ కావాలనుకునే వారిలో నేను ప్రథముడిని. గుర్తు పెట్టుకో... విష్ యూ ఆల్ ది బెస్ట్..."

రోడ్డుమీద ఏదో హారన్ విన్పించటంతో ఈ లోకంలోకి వచ్చాడు సౌరభ్.

తిరిగి ఆలోచనలు చుట్టుముట్టాయి అతనిలో.

'నో... ఈ ఒంటరితనం తాను భరించలేడు. రేపే ఆమెతో తన ప్రేమ విషయం చెప్పాలి. ఆమె తనని తప్పక ఒప్పుకుంటుంది. తనకేం తక్కువ? అన్ని విషయాల్లో ఆమెతో సమానంగా వున్నాడు. అవునూ, ఆమెకి తన ప్రేమ ఎలా వ్యక్తం చేయాలి?'

ప్రేమని ఎన్నో రకాలుగా వ్యక్తపరచవచ్చు.

కాలేజీలో ఓ అమ్మాయికి ప్రేమలేఖ అందించడం, ఓ అమ్మాయిని చూసి కన్ను కొట్టడం, ఇంకా డైరెక్టుగా ఆ అమ్మాయిముందే 'ఐ లవ్ యూ' అనడం... ఇవన్నీ ప్రేమని తెలిపే సంకేతాలే. ప్రేమని వ్యక్తపరిచే పద్ధతిని బట్టే రెస్పాన్స్ వుంటుంది. విశ్వసౌరభ్ వ్యక్త పరిచిన పద్ధతి మాత్రం అపూర్వం, అద్వితీయం.

అదెలా జరిగిందంటే....

# 6

మెడికల్ కాలేజీ కంప్యూటర్ రూమ్.

ఇంకా టైమ్ కాకపోవటంతో ఎవరూ లేరు. సౌగంధిక ఒక్కతే తన కంప్యూటర్ ముందు కూర్చొని వుంది. ప్రస్తుతం మెడిసన్ ప్రాక్టికల్స్ అంతా కంప్యూటర్ ద్వారానే జరుగుతున్నాయి. కంప్యూటర్‌లోనే బాడీస్ట్రక్చర్, ఏ కెమికల్ వేస్తే శరీరంలో ఏ పార్ట్ ఎలా పనిచేస్తుందో – మొత్తం అనాటమీ ఫిజియాలజీదాకా ప్రాక్టికల్స్ ఫీడ్ అయి వున్నాయి.

కంప్యూటర్ ముందు కూర్చున్న ఆమె చేయి చకచకా కదులుతోంది. అందుకను గుణంగా స్క్రీన్‌మీద ఇమేజస్ మారిపోతున్నాయి. మధ్య మధ్యలో కాఫీ సిప్‌చేస్తూ రిలాక్స్ అవుతూ, కంప్యూటర్‌లోని సమాచారాన్ని తన మెదడులో నిక్షిప్తం చేసుకుంటోంది.

అప్పుడు అడుగుపెట్టాడు విశ్వసౌరభ్ అక్కడ. కంప్యూటర్‌మీదే దృష్టంతా నిలబెట్టి వుంచిన సౌగంధిక అతడిని చూడలేదు.

లోపలికి అడుగుపెట్టిన విశ్వసౌరభ్, బ్యాగ్ జిప్‌లాగి మల్లెపూలు, గులాబీపూలు తీసి దోసిలిలో పెట్టాడు. పట్టి ముందుకు కదిలాడు అతి నిశ్శబ్దంగా.

అతడు... ముందుగా ఆమె వెనక నిలబడి పూలు ఆమె తలమీద మృదువుగా పోశాడు. ఇంకో దోసిలి తీసి ఆమెపైన చల్లాడు.

పూలవర్షం! తడిసి ముద్దయిందామె.

ఆమె కాళ్లకు వెండి పట్టీలు మెరుస్తున్నాయి. ఆ మెరుపుని ఛేదించుకుంటూ మల్లెపూలు ఆమె సుతిమెత్తని పాదాలను చుట్టుముట్టాయి.

ఆమెకేం అర్థంకాలేదు ఓ క్షణం.

ఈలోగా అతడు వంగి వెండిమువ్వలు, మల్లెపూలు కలబోసినట్లున్న ఆమె లేతపాదాలపై సుతారంగా ముద్దుపెట్టుకున్నాడు.

బురఖా మీద పడ్డ గులాబీరేకులతో ఓ వింత అందంతో భాసిస్తోంది ఆమె.

అప్పుడు అతడు ఆమె పాదాలకు ప్రణమిల్లి "ఓ దేవతా! కాశ్మీరు నుండి కన్యాకుమారిదాకా ఎంతోమంది అమ్మాయిలను చూశాను. కానీ నీలాంటి అమ్మాయి నాకెక్కడా కన్పించలేదు.

నాకు నీవు కావాలి. వాటికోసం భూగోళాన్ని సైతం మడిచి నీ ముందు పెట్టగలను. నాకు నీవు కావాలి. నేను నిన్ను వివాహం చేసుకుంటాను. నీలాంటి చక్కని భార్య ఆధ్వర్యంలో నేను యముడినైనా ఎదిరించగలను" అన్నాడు ఆర్తిగా.

ఆమె ఇంకా నిశ్చేష్టతలోనే వుంది.

విశ్వసౌరభ్ ఏమిటి? ఇలా చేయడం ఏమిటి? అన్న ఆలోచనలోనే వుంది.

అప్పుడు అతడు కంప్యూటర్ పక్కనే సగం తాగి వున్న కాఫీ కప్పుని చేతిలోకి తీసుకున్నాడు.

"ఓ దేవతా! నీ అమూల్యమైన పెదాల తడి తగిలి ఈ కాఫీ కాస్తా ప్రక్షాళనమైంది. నా ప్రేయసి ఎంగిలి నాకు అమృతం కంటే ఎక్కువ. అందుకే నా ప్రేమదాహాన్ని వీటితో తీర్చుకుంటున్నాను..." అంటూ ఎంతో ప్రీతిగా ఆ కప్పు మొత్తం తాగేశాడు ఒక్క చుక్కకూడా మిగల్చకుండా.

ఆలోచనలన్నీ ఉడిగిపోయినట్లుగా ఆమె మనసు అచేతనావస్థలోకి జారిపోయింది. ఆమె ఆ స్థితిలో వుండగానే తిరిగి కదిలింది విశ్వసౌరభ్ కంఠం.

"ప్రేమ ఒక వరం. అదో దైవత్వంలాంటిది. మిమ్మల్ని చూశాక నా మదిలో ప్రేమకు అంకురార్పణ జరిగింది. ప్రేమ ఉద్భవించాలంటే జన్మ జన్మల బంధం, ఏళ్ళ తరబడి పరిచయమే వుండక్కరలేదు. కేవలం కొన్ని క్షణాలు చాలు.

మొదటిసారి కాలేజీలో మిమ్మల్ని చూడటంతోనే ఓ రకమైన వర్షిప్ ఏర్పడింది. మన ఇద్దరి మధ్య స్నేహం మొలకెత్తింది. స్నేహానికి పరాకాష్ట ప్రేమ. ఆ ప్రేమే నాలో మీ పట్ల అంకురించింది..."

సౌగంధిక అలాగే నిలబడిపోయింది. ఆమె మెదడులో రక్తనాళాలు వేగంగా కదులుతున్నాయి.

అతడు మటుకు చెప్పుకుపోతున్నాడు.

"మీపట్ల నాలో కలిగిన స్పందనని, ఆరాధనని, భావాల్ని ఈ డైరీలో పొందు పరిచాను. వీటిని చదివితే నేనంటే ఏమిటో, ప్రేమపట్ల నా భావాలేమిటో స్పష్టంగా తెలుస్తాయి. రేపు మీ అభిప్రాయాన్ని చెబుతారు కదూ?" అంటూ గులాబీరంగు డైరీని ఆమె బ్యాగులో తానే పెట్టి వెళ్ళిపోయాడు.

మెదడులో సప్తసముద్రాలు ఘర్షిస్తున్న భావన. ఏమిటిది? ఇలా ఎందుకు జరుగు తోంది? మనుషుల్లో ఇలాంటి భావాలు కూడా వుంటాయా?

ఇక ఆమెకు అక్కడ వుండాలనిపించలేదు. బ్యాగ్‌ని చేతిలోకి తీసుకొని బయటకి నడిచింది.

మనసంతా మొద్దుబారినట్లు అన్పిస్తోంది. కాలేజీ మెట్లమీద ఆమెని చూస్తూనే అలర్టయ్యారు బాడీగార్డులు. వెంటనే తలుపుతీసి పట్టుకున్నాడు ఒకడు. ఆమె నిర్లిప్తంగా వ్యాన్ ఎక్కి కూర్చుంది.

ఇంటికి ఎలావచ్చిందో ఆమెకే తెలియదు. విసురుగా డబల్‌కాట్ బెడ్‌మీద వాలింది.

ఆ విసురుకు బ్యాగులోంచి గులాబీరంగు డైరీ బయటపడింది. ఆమె కళ్ళు యథాలాపంగా దానిని చూశాయి. దానిమీద 'నా ప్రేమ దేవతకు నా ప్రేమ భావాల హారం' అని రాసి వుంది.

ఆమె చేయి కదిలి మొదటి పేజీని తిప్పింది.

**అక్టోబర్ 17, 2013**

భగవంతుడు రతీదేవిని అడిగి కొద్దిగా అందాన్ని, చందమామ నుండి చల్లదనాన్ని, గులాబీ పువ్వునుండి మృదుత్వాన్ని, క్షమకు మారుపేరైన అవనినుండి మంచితనాన్ని, బృహస్పతి నుండి తెలివితేటలను తీసుకున్నాడు. వీటనన్నిటినీ మిశ్రమంతో రంగరించి ఓ అపూర్వ సుందరిని తయారుచేశాడు.

ఆ అపూర్వ సుందరి పేరు.... సౌగంధిక.

ఆకాశం నుండి భూమిమీదకు 'ఇంద్రధనస్సు' అనే వారధి ద్వారా గుప్పెడు మల్లెపూలు చిలకరించినట్లుంది ఆమె ఆగమనం కాలేజీలో. ఆ పూలవర్షంలో తడిసి ముద్దయి... జ్ఞాపకాల అలలమీద ఆమె మధురిమలు నన్ను తడుతోంటే, నేనొక అద్భుత రసానుభూతిలో మునిగిపోయి ఇదిగో ఇప్పుడు తేరుకొని నా భావాల్ని కాగితం మీద పెడుతన్నాను.

**అక్టోబర్ 24, 2013**

జీవితంలో అప్పుడప్పుడు కొన్ని కొన్ని అద్భుత సంఘటనలు జరుగుతుంటాయి. అలాంటి అద్భుత సంఘటనల్లో ఒకటి ఆమె ఆగమనం. చిన్నప్పటి నుంచి కాస్తంత అనురాగానికి, ఆప్యాయతకీ నోచుకోలేకపోయానేమో, ఆమె ఆగమనంతో నా జీవితంలో ఓ సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది.

ఆమె సన్నిధి నాకు ఆనందకరం! ఆమె స్పర్శ నాకు దగ్గరితనం! ఆమె నవ్వు నాకు వీణాస్వరం! ఆమె మాటలు నాకు ముత్యాలసరాల్లా అన్పిస్తున్నాయి.

ఇంతకుముందు కాలేజీకెళ్లాలంటే విసుగు ఆమె సన్నిధిలో నా విసుగు పారిపోయింది. మనసంతా వెలుగుతో నింపినట్లు ఓ అర్ధభావం కమ్మేస్తోంది.

**నవంబర్ 8, 2013**

ఆమె మధురానుభూతి నుండి బయటికెలా రాను? కోయిల కిలా కిలా రావాలు, చిగురాకు మెత్తదనం, పచ్చిక సెలయేర్లు, చల్లని చంద్రుడి వెన్నెలని ఆమె హస్తగతం చేసుకున్నట్లుంది. నీలిమబ్బు కెరటాలు జాలువారే వెలుగు జావళీలా, సుదూర తీరాలనుండి వీచే సౌగంధ మలయపవన వీచికలా ఆమె సన్నిధి నా హృదయతోటని పులకరింపజేస్తుంది.

ఆమె పక్కన వుంటే గాలి సున్నితంగా చెంపని స్పృశిస్తూ నెమ్మదిగా చెవులమీదుగా అలా సాగిపోయినట్లుగా,వర్షం కురిసి వెలిసిన తర్వాత నిన్న గాలి తెరకే కదిలి నీటి ముత్యాల్ని జలజల రాల్చే సన్నజాజి పందిరి కింద నిలబడినట్లనిపిస్తోంది.

**డిసెంబర్ 9, 2013**

రోజు రోజుకూ ఆమె ఓ అద్భుతంలా కన్పిస్తోంది. ఆమెలో నాకు నచ్చిన గొప్ప గుణం..... ఎన్నెన్నో రూపాలతో కన్పించడం. ఓ పరిపూర్ణ యువతిగా, ఓ తల్లిగా, ఓ ఫ్రెండ్‌గా.... ఇలా రకరకాలుగా కన్పిస్తోంది. అందుకే ఆమెకు చేతులెత్తి –

'ఓ స్త్రీ! నీవు నాకు తల్లివా? చెల్లివా? అక్కవా? ప్రేయసివా? భార్యవా? ఎవరైతేనేం? నీ సన్నిధిలో నాకు స్వర్గధామంగా వుంది' అని నమస్కరించాలనిపిస్తోంది. ఐ లవ్ యూ! ఐ లవ్ యూ ప్రియతమా!

ఆమె తియ్యటి జ్ఞాపకాలే టానిక్స్‌లాంటివి. కానీ వరసగా నాలుగు రోజులు సెలవులు వచ్చాయి. ఎలా భరించను ఈ ఎడబాటు? ఈ రోజు ఉదయం నుంచి ఆమె జ్ఞాపకాల అలలు నన్ను తినేస్తుంటే, మంచంమీద నుండి లేవాలన్పించటంలేదు.

ఏదో వెల్తి.... బావురుమంటోంది మనస్సు... ఎలా భరించను ఈ భాద? అలాగే మంచంమీద పడుకుని కిటికీలోంచి బయటకి చూశాను. అంతవరకు బిగపట్టిన కన్నీటిచుక్కలు చెంపల్ని పరిహసించాయి.

దూరంగా మామిడిచెట్టు ఓదారుస్తున్నట్లుగా తల ఊపుతోంది. చెట్టుమీదున్న పాలపిట్ట 'ఇంత' పెద్దయి ఇంకా బాధపడ్తున్నావా?' అన్నట్లుగా సానుభూతిగా చూస్తోంది. ఛ... అదృష్టం వుంటే ఈ జీవితమంత అపురూపమైంది ఇంకొకటిలేదు.

చిన్నప్పట్నుంచి నేను అనుకునేవాడిని నేను ప్రేమించే అమ్మాయి ఓ అందాల పొదరిల్లుని నిర్మిస్తుందని. అప్పుడా పొదరిల్లు ముందు పిచ్చిమొక్కలు కూడా కళాత్మకంగా నృత్యం చేస్తాయి.

అక్కడ గాలి, వెలుతురు అన్నీ ఆమె ప్రేమతో పునీతం అవుతాయి. ప్రస్తుతం మాత్రం... దూరమైన ఆమె తియ్యటి జ్ఞాపకాలు పదే పదే నా గుండెల్ని కోస్తుండగా వెర్రిగా కాలం కదులుతోంది.

**జనవరి 31, 2013**

ఇవాళ ఏదో వంకతో సౌగంధిక నోట్స్ తీసుకున్నాను. ఆ నోట్‌లోని అక్షరాలు పారిజాతాలై ఆ పరిమళం నన్ను చుట్టిముట్టి తనని మరింత దగ్గర చేర్చాయి. ఎంతయినా నా ప్రియబాంధవి చేతినుండి రాలిన ముత్యపు సరాలు కదా ఆ అక్షరాలు!

ఛ, ఆ బంగారు చేతిలోని ఓ వేలి ఉంగరమైనా కాకపోతిని. ఏమిటి... ఏమిటి ఇవాళ నాలో కవిత్వం ఇలా పొంగుకు వస్తోంది? సముద్ర తీరాల్లాంటి నీ పెదాలపై తుమ్మెదనై వాలాలని, చంద్రబింబంలాంటి మోముపై ఎర్రటి బొట్టునై నిలవాలని, శంఖంలాంటి నీ మెడలో బంగారు నగనై వేలాడాలని, నెమలికి నడక నేర్పేటట్లున్న నీ కాలినడకలతో ఏడు అడుగులు నడిచి జీవించాలన్నదే నా జీవిత ధ్యేయం.

**మార్చి 4, 2013**

ఈ రాత్రి నాకు నిద్రపట్టడంలేదు.

నీ ఆలోచనలతో, నీ స్మృతులతో, నీ జ్ఞాపకాల వానతో నాకు అస్పష్టంగా ఉంది.

“నువ్వు లేవు కాని నీ జ్ఞాపకం మాత్రం వుంది. ఇంటిముందు జాజిమల్లెతీగలో చుట్టుకుని నా లోపల లోపల ఆరిపోయిన కుంపటిలో రగులుతున్న ఒక స్మృత్యాగ్ని కణంలాగ. నీ ఒడిలో నా తలపెట్టుకుని, నీ ఎర్రటి పెదాలు నా నొసటిమీద చిత్రించే మధుర ధ్వనిని గుర్తుకు తెస్తోంది నీ జ్ఞాపకం.

ఎవరమ్మా నీవు? ఏ దివిలోంచి విరిసిన పారిజాతానివి? మనసు పుట్టిన వేళలో మనులు రాసుకున్న గ్రంథంలో ప్రబంధ నాయికవా? ఎవరమ్మా నీవు? కన్ను మూసినా తెరిచినా నీవే కన్పిస్తున్నావు?

**ఏప్రిల్ 6, 2013**

ప్రియా! నీవు బురఖా ధరించినా, నా భావలోకంలో నీ అందచందాలు నాకు స్పష్టంగా తెలుస్తున్నాయి. బురఖా చాటున నీ కనురెప్ప అలికిడిలో మూగబాసలు, నీ చిరుదరహాసరేఖల్లో మేఘసందేశాలు, నీ అందెల సవ్వడిలో సరిగమలు, నీ కురుల అలలో సప్తస్వరాలు, నన్ను నన్నుగా వుండనీయక నా మనస్సుని జలతరంగిణిలా ఎగసి పడేస్తున్నాయి.

గమ్మత్తేమిటంటే – మన మధ్య ఎన్నో వైరుధ్యాలున్నా చక్కగా కల్సిపోయాము. నేను మొహమాటస్తుడుని. నీవు చలాకీ సుందరివి.

నీవు ముస్లిం, నేను హిందువుని. మన హృదయాలు రెండయినా, మనసులు రెండయినా, భావాలు, ఆలోచనలు ఒక్కటే. ఇద్దరి లక్ష్యం – మెడిసిన్‌లో టాప్ పొజిషన్‌కు వెళ్ళటం! మన ధ్యేయం ఒకటే కావటం నాకు చాలా ఆనందాన్నిస్తుంది దేవీ! వేర్వేరు ధృవాలు ఆకర్షింపబడటం  అంటే ఇదేనేమో!

**మే 2, 2013**

ఓనా పంచప్రాణాల ప్రియా! ఎంత కాదనుకున్నా నీ సామీప్యం నాకు ఓ అద్భుత అనుభూతి. అందుకే నీ సామీప్యాన్ని నేను జీవితాంతం కోరుకుంటున్నాను. అందుకే

భావకత్వం నుండి వాస్తవానికి వస్తూ అసలు విషయం రాస్తున్నాను. నాతో కల్సి ఏడడుగులు నడవగలవా? నాతో జీవితం పంచుకోగలవా?

నా దృష్టిలో పెళ్లంటే సహచర్యం. ఓ స్నేహితురాలు లాంటి వ్యక్తితో కష్టసుఖాల్ని పంచుకుంటూ, ఆమెని సంతోషంగా వుంచుతూ, నేను ఆనందంగా వుండటం. పార్ట్‌నర్‌గా ఆమె అభిప్రాయాల్ని గౌరవిస్తూ, పరస్పర అవగాహనతో వుండటం.

నీకు తెల్సు నేను నీ వాడినని. పుట్టినప్పట్నుంచి మిమ్మల్ని తప్ప ఎవర్ని ప్రేమించ లేదు. వూహించుకోలేదు. నేను ఒకానొక ప్రేమాభిమానిని, ఒకానొక దేవీశాక్త్యుణ్ణి, ఒకానొక త్రికరణేకాంతుడివి.

అందుకే ప్రియబాంధవీ! నీవే నాకు కావాలి.

నీవే నాకు మనసెరిగిన అర్థాంగివి కావాలి. చాలు... చాలు... ఈ సంతృప్తి చాలు నాకు... ఇంకేమీ అడగను ఆ భగవంతుడిని. మరి నీ అభిప్రాయం తెల్పుతావు కదూ,

నీ
ప్రేమభక్తుడు
విశ్వసౌరభ్

# 7

ఆ మర్నాడు విశ్వసౌరభ్ ఆశగా చూస్తున్నాడు ఆమె రాకకోసం. స్టూడెంట్సంతా అతనిని వింతగా చూసి క్లాసుల్లోకి వెళుతున్నారు.

సరిగ్గా పదికి ఓ అయిదు నిముషాలయింది. దుమ్ముని రేపుకుంటూ అక్కడ ఆగింది జీపు. బాడీగార్డులు దిగి డోర్ తెరిచి పట్టుకోగా దిగింది సౌగంధిక.

వేయి సూర్యకాంతులు ఒక్కసారిగా ధగధగా మెరిసినట్లుగా అతని కళ్లు వెలిగిపోయాయి.

ఆమె ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ పైకి వస్తోంది. అతడు ఆమె వంకే చూస్తున్నాడు. ఆఖరి మెట్టు ఎక్కాక ఆమె కళ్లు, అతని కళ్లు కలుసుకున్నాయి.

అతడు ఏదో మాట్లాడబోయాడు.

ఆమె మౌనంగా తన బ్యాగ్‌లోంచి అతని గులాబీరంగు డైరీ బయటికి తీసింది. తీసి అతనికి ఇస్తూ కదిలిందామె కంఠం.

“కొన్ని పనులు అసాధ్యమైనవి. అసాధ్యమైన పనులు మనం చేయలేము. ఐయామ్ సారీ....” అన్నది సౌగంధిక.

అతనికి అర్థం కాలేదు. ఆమె మనస్సులోకి చొరబడి సర్జరీ చేయడానికి ప్రయత్నిస్తున్నాయి విశ్వసౌరభ్ చూపులు.

తిరిగి కదిలిందామె కంఠం – "ఐయామ్ సారీ! మీ ప్రేమ అపూర్వం. జీవితంలో ఓ లక్ష్యంకోసం పాటుపడ్తున్నాను. అందువల్ల ప్రేమ, పెళ్లిలాంటి వాటికి దూరంగా వుండాలని నా భావన..." అన్నదామె.

"నేను... నేను...." నీళ్లు నమిలాడు అతను.

"మీరంటే నాకు చాలా గౌరవం. చాలా కష్టపడి ఈ స్టేజికి వచ్చారు. ఓ స్నేహితుడిగా మిమ్మల్ని ఇష్టపడతాను. అంతకుమించి పోవటం నా కిష్టంలేదు....." అంటూ అక్కడ్నుంచి క్లాసుకి వెళ్లిందామె.

నెత్తిమీద వేయి టన్నుల బరువు మీద పడ్డట్టుగా కూలిపోయాడు విశ్వసౌరభ్. ఆమె మాటలు అతడి మెదడుని కోసేస్తున్నాయి. తన ప్రేమని ఆమె తిరస్కరించిందన్న సత్యం అతడి మెదడు జీర్ణించుకోలేకపోతోంది. కంట్లో నీటిపొర పేరుకోగా, అతడు అక్కడ్నించి నడిచాడు బస్టాండుకేసి.

మనస్సంతా చేదుగా తయారైంది. ఇంక క్లాసులకు వెళ్ళబుద్ధికాలేదు. బస్సు ఎలా ఎక్కాడో అతనికే తెలియదు. అతని కళ్లముందే యూనివర్శిటీ వెనక్కి వెళ్లిపోతోంది. అతనికి మతి పోయినట్టయింది. కలలో కూడా ఊహించలేదు ఆమె తన ప్రేమని తిరస్కరిస్తుందని. ఇద్దరూ తెలివైన వారు కాబట్టి జీవితాన్ని అందంగా, అర్థవంతంగా తీర్చిదిద్దుకోవచ్చునని భావించాడు. కానీ ఇలా జరిగిందేమిటి?

వ్యథ ధారణమై అతడిని తినేస్తోంది.

కడుపులో పేగులు ఎవరో లుంగచుట్టి నలిపేస్తున్నట్టుగా బాధగా వుంది. కమ్మరి కొలిమిలోపడి కాలిపోయే పిట్ట ఎలా అరుస్తూ బూడిదై పోతుందో అలా వుంది అతని పరిస్థితి ఆ సమయంలో.

బస్సు దిగి రూమ్‌లోకెళ్ళి పడ్డాడు.

గుండెల్లో మండే మంట కళ్లల్లో ప్రతిఫలిస్తోంది... కన్నీళ్ళ రూపంలో. కొన్ని మెగాటన్నుల శక్తిగల ఆటంబాంబుల వరుసగా తలలో పేలుతున్నట్లుగా దుర్భరమైన వేదన.

ఎక్కడో దూరంగా సైగల్ స్వరం బరువుగా, విషాదంగా గుండెల్ని పిండుతూ విన్పిస్తోంది.

❖ ❖ ❖

పదిహేను రోజులు గడిచాయి.

ఆ పదిహేను రోజుల్లో విశ్వసౌరభ్ దాదాపు ఎనిమిది కిలోల బరువు తగ్గిపోయాడు. పాతిక లంఖణాలు చేసినట్లుగా చిక్కిపోయాడు. గడ్డం బాగా మాసింది. కళ్ళు పీక్కుపోయాయి. తిండి, బట్టమీద ధ్యాసవుండేది కాదు. ఏ పనిమీదా ఆసక్తి లేదు. ఒక్కడే రూమ్‌లో కూర్చొని ఆలోచిస్తుండేవాడు.

అతడు కాలేజీకి వెళ్ళడంలేదు. కారణం..... ఎవరికీ అర్థంకాలేదు. దేశంలోనే బ్రిలియంట్ స్టూడెంట్‌గా పేరుగాంచిన అతడు కాలేజీకి ఎందుకు రావడం లేదో అర్థంకాక ప్రొఫెసర్లు సందిగ్ధంలో పడ్డారు.

క్లాసులో అతడు లేకపోయేసరికి సందడేలేదు. అతడుంటే క్లాసులో చైతన్యం వెల్లివిరుస్తుండేది. క్లాసులో మొదటి బెంచీమీద కూర్చుని ఒక్కొక్క ప్రశ్నకు అతడు జవాబు చెప్పే తీరు మిగతా విద్యార్థులను అబ్బురపరిచేది.

క్లాసులో సౌగంధిక తెలివికి ఆనకట్టవేసి ధీటుగా జవాబు చెప్పే అతడి ధాటికి ప్రొఫెసర్లే విస్మయపడేవారు.

క్లాసులో అమ్మాయిల వర్గానికి సౌగంధిక నాయకత్వం వహించగా, అబ్బాయిల గ్రూప్‌కు విశ్వసౌరభ్ నాయకత్వం వహించేవాడు. ఆమె చెప్పే ఆన్సర్‌కి అతడు ధీటుగా సమాధానం ఇచ్చేవాడు. ఆ చెప్పే జవాబులు కూడా రొటీన్‌గా, మామూలుగా కాకుండా గొప్ప సృజనాత్మకతతో కూడిన జవాబులై వుండేవి.

సౌగంధిక ఒక జవాబు చెప్పగా, ఆడపిల్లలు తలలు ఎగరేసి ఆమెకు సపోర్ట్‌గా బెంచీలు చరిచేవాళ్ళు. దానికి ధీటుగా విశ్వసౌరభ్ జవాబు చెప్పగానే అందుకు సవాలుగా మగవాళ్ళు చప్పట్లు కొట్టేవారు. నీవా, నేనా అని పోటీపడే వాళ్ల క్లాసుని తీసుకోవడానికి ప్రొఫెసర్లు పోటీలు పడేవాళ్లు.

అలాంటిది ప్రస్తుతం... అతడు క్లాసులో లేకపోయేసరికి విద్యార్థులకు క్లాసులన్నీ చప్పగా, డల్‌గా అన్పించసాగాయి. పేరుకు సౌగంధిక, యుద్ధ్‌వీర్‌ల మధ్య పోటీ జరుగుతున్నా విశ్వసౌరభ్ లేని లోటు పూర్తిగా తెలుస్తోంది. కానీ.... అతను కాలేజీకి ఎందుకు రావటం లేదో ఎవరికీ అర్థం కావటంలేదు.

ఆ రోజు సాయంత్రం ఆ విషయం తెలుసుకోవటానికి యుద్ధ్‌వీర్ బయలుదేరాడు. కాలేజీ ఆఫీసులో తీసుకున్న అడ్రస్ ప్రకారం విశ్వసౌరభ్ ఇంటిని వెతుక్కుంటూ వెళ్ళాడు.

తలుపు తీసిన విశ్వసౌరభ్‌ని చూస్తూనే ప్రమాన్పడిపోయాడు యుద్ధ్‌వీర్. అతడు గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు విశ్వసౌరభ్. "ఫ్రెండ్! ఏమిటి అసలు ఏం జరిగింది? ఇలా అయిపోయావేం? అనారోగ్యమా?" అతని చేయి పట్టుకొని అడిగాడు యుద్ధ్‌వీర్.

నీరసంగా నవ్వాడు విశ్వసౌరభ్

"చెప్పు ఫ్రెండ్! ఏం జరిగింది? కాలేజీకి ఎందుకు రావటంలేదు?"

"ఏం లేదు వీర్...." విశ్వసౌరభ్‌కి అనాసక్తిగా వుంది.

"ఏం లేకుండా ఎందుకు కాలేజీకి రావటంలేదు? అసలు ఇంతకు ముందు నీవు కాలేజీకి ఎప్పుడన్నా ఆబ్సెంట్ అయ్యావా? ఏం జరిగింది?"

"ఏం లేదు. నీరసంగా వుంది... అంతే!"

యుద్ధ్‌వీర్ అతనివంక పరిశీలనగా చూసి "లేదు సౌరభ్! నీవేదో దాస్తున్నావ్? కేవలం నీరసం వున్నంత మాత్రాన కాలేజీకి నీవు రాకుండా వుండవు.

ఇంతకు ముందు 104 డిగ్రీల జ్వరంతో కూడా నీవు కాలేజీకి రావటం నాకు తెలుసు. ఒక్కరోజు కాలేజీని చూడకపోతే వుండలేకపోయేవాడివి. అలాంటిది... కాస్త నీరసానికే కాలేజీ మానివేయవు. ఏదో కారణం వుంది. చెప్పవూ? అసలు కాలేజీలో నీవు లేకపోతే కాంపిటేటివ్ స్పిరిట్ లేదు తెలుసా?"

"నాతో సమానంగా పోటీపడగల నీవు వున్నావు కదా వీర్. నేను లేకపోతేనేం..."

"వజ్రం ఎప్పుడూ స్ఫటికంతో సమానం కాదు సౌరభ్! క్లాసులో పేరుకు నేను వున్నా, నాకున్న ఎన్.సి.సి. క్లాసు రిప్రజెంటేటివ్ లాంటి బిజీ పొజిషన్స్ వల్ల నేనెప్పుడూ క్లాసులో మీ ఇద్దరి తర్వాతే... మన ఫ్రెండ్స్ కూడా నిన్ను అడుగుతున్నారు సౌరభ్..." అన్నాడతను.

పేలవంగా ఓ చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు అతను.

తిరిగి యుద్ధ్‌వీర్ కంఠం కదిలింది.

"సౌరభ్! ఇంతకూ అసలు విషయం నాకు చెప్పవూ? ఎందుకు కాలేజీకి రావటంలేదు? నీకోసం ఇంతగా ప్రాధేయపడుతున్న నాకు చెప్పవూ?"

కళ్లమ్మట నీళ్లు తిరిగాయి విశ్వసౌరభ్‌కి. నిజమే! తనకు ఈ ప్రపంచంలో ఎవరున్నారు? ఈ యుద్ధవీర్ తప్పించి! తనంటే అభిమానం వుండబట్టి తనకోసం ఇంతదూరం వెతుక్కుంటూ వచ్చాడు. మనిషి మనిషికీ మధ్య వ్యాపారబంధాలు తప్ప స్నేహబంధాలే కన్పించని ఈ లోకంలో యుద్ధ్‌వీర్‌లా ఆర్తిగా తన సమస్యని తెలుసుకోవాలని ప్రయత్నించేదెవరు?

అప్పుడు బరస్ట్ అయ్యాడు విశ్వసౌరభ్. వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

"సౌరభ్! ఏం జరిగింది? ఏమిటిలా? చెప్పు మిత్రమా? ఏం జరిగింది? నా మిత్రుడు బాధపడకూడదు. స్వచ్ఛంగా నవ్వులు చిందించే నా మిత్రుడు కంట నేడు కన్నీరా? నీ సమస్య చెప్పు మిత్రమా! నీకోసం ఏదైనా చేస్తాను."

"చెప్తాను వీర్... ఈ లోకంలో నన్ను కాస్తో కూస్తో అర్థం చేసుకున్నది నీవొక్కడివే వీర్... నీకు చెప్పకపోతే నన్ను నేను హింసించుకున్నట్లే..." అంటూ కదిలి తాను సౌగంధికకు తన ప్రేమని వెలిబుచ్చడం దానికి ఆమె ప్రతిస్పందించి విధానం వివరించ సాగాడు.

క్షణాలు కదులుతున్నాయి.

నిట్టూర్పు విడిచాక యుద్ధవీర్ అంతా విన్నాక -

"సౌరభ్! ప్రపంచంలోని ఇంటలిజెంట్స్‌లో నీవొకడివి. నీవు రాసిన ఆర్టికల్స్ ఎన్నో ప్రపంచ వ్యాప్తంగా జర్నల్స్‌లో చోటు చేసుకున్నాయి. నోబెల్ ప్రైజ్ పొందిన సైంటిస్టులు సైతం నీ పరిశోధనల్ని, నీ గైడ్‌లైన్స్‌ని మెచ్చుకున్నారు. అలాంటి నీవు ప్రేమకోసం నీ అమూల్య మైన సమయాన్ని వృధా చేసుకోవడం నాకు బాధ కలిగిస్తోంది. ఒకసారి పాఠాలు పోతే మళ్ళీ పికప్ చేసుకోవడం కష్టం. నా మాట విను. రేపట్నుంచి కాలేజీకి వచ్చేయ్" అన్నాడు.

"ఐయాంసారీ వీర్! ప్రేమలో పడినవాడికే దాని తీవ్రత తెలుస్తుంది. నీవు చెప్పిన ఆర్టికల్స్ అవార్డులు నాకు ముఖ్యం కావు. అవన్నీ నా ప్రేమ ముందు దిగదుడుపు. సౌగంధిక నాకు కావాలి. ఆమె లేకపోతే బ్రతకలేని స్థితికి వచ్చాను వీర్...."

"ఆమె నీ ప్రేమని కాదన్నది కదా! ఇంకా నీవు ఆమెకోసం పాకులాడటం ఎందుకు?"

"జీవితంలో కొన్నింటిని మనం చూడకపోతే బాధే వుండదు. చూసిన తర్వాత అవి లభ్యం కాకపోతే అదింకా కావాలని, దానిని ఎలాగయినా అందుకోవాలన్న తపన బయలుదేరుతుంది. ప్రస్తుతం నా ప్రేమ కూడా అదే స్థితిలో వుంది" అన్నాడు సౌరభ్.

యుద్ధవీర్‌లో దిగ్భ్రాంతి. నిజంగా సౌరభ్ ఓ జీనియస్సా? పిచ్చివాడా? లేక ఎంత జీనియస్ అయినా ప్రేమ వరకు వచ్చేసరికి అలాగే మారిపోరా? చరిత్రకారులు రాస్తుంటారు 'స్త్రీ' వల్లే రక్తపాతాలు, యుద్ధాలు జరుగుతాయని. నిజమేనా? సౌగంధికతో ఇతడి ప్రేమ ఎటువైపుకు తీసుకెళుతుందో అర్థం కావటంలేదు.

"సరే... సౌరభ్! నీ ప్రేమ చాలా గొప్పది. కానీ నీవు యిలా ఒక్కడివే రూమ్‌లో వుంటే నీకొచ్చే ప్రయోజనం ఏమిటి? దానివల్ల ఇంకా మానసికాందోళన ఎక్కువవుతుంది. పైగా నిన్ను వెతుక్కుంటూ సౌగంధిక నీ రూమ్‌కి రాదు కదా!

కాబట్టి నా మాట విని కాలేజీకి వచ్చేయ్. కనీసం అక్కడ నీ ప్రేయసిని చూసినట్లు వుంటుంది. నీకు దక్కకపోవచ్చు కాని ఆమె క్లాసులో ఎప్పుడూ నీ కళ్లెదుటే వుంటుంది కదా..."

విశ్వసౌరభ్ మౌనంగా అతడి మాటలు వింటున్నాడు. అతడు మెత్తబడటం చూసి ఉత్సాహం వచ్చింది యుద్ధవీర్‌కి.

"సౌరభ్! నా మాట విను. చందమామని చూసి ఆనందించటం వేరు దానిని స్వంతం చేసుకోవాలనుకోవడం వేరు. స్వంతం కానప్పుడు కనీసం చూసి ఆనందించడంలో తప్పులేదు కదా!

అందుకే నీవు కాలేజీకి రావటం వల్ల ప్రయోజనం తప్ప కలిగే కీడు ఏమీ లేదు..." ఓ క్షణం ఆగి తిరిగి కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం.

"ఇంకోవిషయం! ఇంకా మనకు కాలేజీ లైఫ్ దాదాపు రెండు సంవత్సరాలు వుంది. ఆ రెండు సంవత్సరాలలో నీ ప్రేమకు ఆమె కరిగిపోవచ్చు. నీ అనురాగానికి ఆమె లొంగిపోవచ్చు. అభిమానానికి ఆమె మనసు మార్చుకొని నీవంటే ఇష్టం పెంచుకోవచ్చు. నా మాట విని కాలేజీకి వచ్చెయ్..."

ఒకటి ... రెండు... మూడు....నిముషాలు కదులుతున్నాయి. నాలుగో నిమిషంలో ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా అంగీకారంగా తల వూపాడు విశ్వసౌరభ్.

❖ ❖ ❖

అతడు నెమ్మదిగా కాలేజీకి వెళ్లసాగాడు.

పేరుకు వెళుతున్నాడే కానీ అతనికి ఏ విషయంలోనూ ఆసక్తి లేదు. క్లాసులో వెనకటి మాదిరిగా ముందు బెంచీలలో కూర్చోవడం లేదు. ఏటాపిక్‌పైనా ఆసక్తిగా జవాబు చెప్పడానికి ముందుకు రావడంలేదు. ప్రొఫెసర్ అడిగిన వాటికి మటుకు ముక్తసరిగా జవాబు చెప్పి వూరుకుంటున్నాడు.

ఒక తెలివైన విద్యార్థి ఎందుకలా మారిపోయాడో అర్థమయ్యేది కాదు విద్యార్థులకు. తన వాగ్ధాటితో క్లాసుని ఉత్తేజపరిచే అతడు ఎందుకలా మారిపోయాడో అర్థంకాక అయోమయంలో కొట్టుకుపోయేవారు ప్రొఫెసర్లు. మొత్తంమీద అతడి మూడీనెస్‌తో క్లాస్ మొత్తం డల్‌గా వున్నట్లు అన్పిస్తోంది.

పరిస్థితి చూస్తున్న యుద్ధ్‌వీర్‌లో బాధ. తాను ఎంతో కష్టపడి ఒప్పించి అతడిని కాలేజీకి తీసుకొస్తే, ఇక్కడా అతడు ప్రేమ మైకంలో వున్నట్లు ప్రవర్తించడం అతనికి బాధాకరంగా వుంది.

విశ్వసౌరభ్‌ని చూస్తుంటే కడుపంతా దేవిరించినట్లయింది అతనికి. ఓ గొప్ప జాతిరత్నం మట్టిలో కలిసిపోతున్న ఆందోళన అతనిలో.

అందుకే... రోజూ కాలేజీ అవగానే ల్యాబ్‌కెళ్లి పిచ్చి ప్రయోగాలు చేస్తున్న సౌరభ్‌ని కలిసాడు.

"సౌరభ్! ఏమిటి నీవు చేస్తున్నది? ఎందుకలా మూడీగా వుంటున్నావ్? ఇందుకా నిన్ను కాలేజీకి రమ్మన్నది?" అని నిలదీసి అడిగాడు.

విశ్వసౌరభ్ చేతిలో వున్న బిరడాని పక్కనపెట్టి అతడికేసి తిరిగాడు.

'ఏమైంది ఫ్రెండ్? మనుషులన్నాక రకరకాల మూడ్స్‌లో కన్పిస్తారు. ఇప్పుడు నాకేమైంది? నీవు కోరినట్లుగానే కాలేజీకి వస్తున్నాను...."

"కాలేజీకి రావటమంటే భగ్నప్రేమికుడిలా రావటం? ఆ పెరిగిన గడ్డం ఏమిటి? ఆ మాసిన ప్యాంటు ఏమిటి? పైగా సౌగంధిక వైపు అలా కన్నార్పకుండా చూడటం మిగిలినవారి దృష్టిలో విమర్శలపాలు..."

"ఎవరి వ్యక్తిగత ప్రవర్తన వారి ఇష్టం వీర్! పాఠాలు, అటెండెన్స్‌కోసం కాలేజీకి వస్తున్నాను. నేనేం చేస్తున్నా మిగతావారికి నష్టంలేదు కదా...."

"అసలు నీకు ఒక్కపాఠం అర్థమవుతుందా? ఏదో శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తుంటావు?"

"ఇంతకుముందే చెప్పానుగా ఎవరి వ్యక్తిగత ప్రవర్తన వారిదని. దానివల్ల ఎవరికి నష్టం? పైగా పాఠాలా? అడుగు ఏ పాఠంలోని ప్రశ్నలు చెబుతాను....

యుద్ధ్‌వీర్ వెంటనే అతడు కాలేజీకి రాని రోజుల్లో జరిగిన లెసన్స్‌లోని ప్రశ్నలు అడిగాడు.

ఒక్కదానికి కూడా పొల్లుపోకుండా కరెక్ట్‌గా జవాబులు చెప్పాడు విశ్వసౌరభ్. నిజానికి ప్రొఫెసర్లు కూడా అంత ఎగ్జాట్లీగా చెప్పలేరు. అంతెందుకు ఆ ప్రశ్నలకు జవాబులు యుద్ధ్‌వీర్‌కే సరిగా తెలియదు.

కంటినిండా నీరు చిప్పిల్లగా యుద్ధ్‌వీర్ కదిలిపోయాడు. "సౌరభ్ యూ ఆర్ జీనియస్... నీలాంటి జీనియస్‌ని పట్టుకొని అవివేకంగా ప్రశ్నలు అడిగినందుకు నన్ను క్షమించు. నిజమే... మిగతా విషయాల్లో ప్రవర్తన సరిగ్గా వుంటే, ఎవరి వ్యక్తిగత ప్రవర్తన వారిది. ఐయమ్ రియలీ సారీ...."

అక్కడి నుండి కదలబోతూ ఓ క్షణం ఆగాడు యుద్ధ్‌వీర్. "సౌరభ్ నేనో విషయం అడుగుతాను ఏమనుకోవు కదా? వ్యక్తిగతమే అయినా అడుగుతున్నాను క్షమిస్తావు కదూ....."

విశ్వసౌరభ్ తన చేతికున్న గ్లౌవ్స్‌ను తొలగిస్తూ అతడి భుజంమీద చేయివేశాడు.

"వీర్! ఈ ప్రపంచంలో నాకెవ్వరూ లేదు. ఎవరైనా స్నేహితులు అంటూ వుంటే అది నీవే. అడుగు నీ సందేహమేమిటో...?" అన్నాడు విశ్వసౌరభ్.

"అదికాదు సౌరభ్! రోజూ క్లాసులు అయిపోయాక, అంతా వెళ్ళిపోగానే నీవు ఈ ల్యాబ్‌లో ఏం చేస్తుంటావు? ఏం ప్రయోగాలు చేస్తుంటావు?"

అతను చిన్నగా నవ్వాడు.

ఆ నవ్వులో జీవం లేదు.

"ఫ్రెండ్ వీర్! సౌగంధిక అంటే నాకు ఇష్టం. ఆమె లేకుంటే నేను బతకలేను. ఆమె నా ప్రేమని అంగీకరించే ప్రేమ ఫార్ములా వుందేమో ప్రయత్నిస్తున్నాను. ఇద్దరి ప్రేమికుల మధ్య ఆకర్షణని, ప్రేమని పుట్టించే ఏదైనా రసాయనం వుందేమో ఈ ల్యాబ్‌లో పరిశీలిస్తున్నాను. అప్పుడయినా ఆమె నా ప్రేమని అంగీకరిస్తుందేమోనన్న ఆశ... చిరు ఆశ..."

అలా మాట్లాడుతున్న సౌరభ్‌వైపు దిగ్భ్రాంతిగా చూస్తుండిపోయాడు యుద్ధ్‌వీర్.

"ఓ ప్రేమమూర్తి ప్రేమకోసం ఇంతగా పాకులాడుతున్న నీ ప్రేమ ఫలించుగాక! నీ ప్రేమ తప్పక విజయం అవుగాక! ఎప్పటికైనా సౌగంధిక నీ ప్రేమ తాకిడికి దాసోహం అవ్వాల్సిందే! ఎప్పటికైనా ఆమె నీ ప్రేమ తీవ్రతకి లొంగిపోవాల్సిందే... అలా కాని నాడు ఆమె హృదయం ఓ బండ రాయి మాత్రమే. అలా జరగనినాడు ఆమె హృదయం రాక్షసుడికంటే కర్కోటకమే.... దట్సాల్! ఆల్ ది బెస్ట్ మై డియర్ ఫ్రెండ్... నీకు విజయం కలుగుగాక!"

ప్రజ్వరిల్లుతున్న ఓ నిప్పుకణికలా నిష్క్రమిస్తున్న అతడివైపు చూస్తుండిపోయాడు విశ్వసౌరభ్.

# 8

వేసవి సెలవులు ప్రకటించారు కాలేజీకి.

తన రూమ్‌లో వున్న విశ్వసౌరభ్‌కి అస్పష్టంగా వుంది. ఆ రోజుకు ఆమెని చూడక దాదాపు నెల రోజులైంది. అందీ అందకపోవడంలోని ప్రేమతాపం ఎక్కువై అతడిని వివశుడిని చేస్తోంది.

వారం రోజుల్నుంచి ఆమె తలపులు మెదడులోకి రాకుండా విశ్వప్రయత్నం చేస్తున్నాడు. సీసాలు సీసాలు విస్కీ తాగాడు. అవి తాగితే మెదడు మత్తుగా వుంది. కాని ఆమె తలపులు మాత్రం అతడిని వెంటాడుతూనే వున్నాయి. సినిమాలు చూశాడు. కానీ ఆ సినిమాల్లో హీరోయిన్‌ని చూస్తూనే తిరిగి సౌగంధిక గుర్తుకొచ్చేది. చిరాగ్గా హాలు బయటకి వచ్చేవాడు.

బయట ఎండ ఎర్రగా కాలిపోతోంది. ఎక్కడో దూరంగా కాకులు అరుస్తున్నాయి దాహంతో.

అతనికి బయట వేడికంటే తన హృదయంలో వేడి ఎక్కువగా వున్నట్లనిపిస్తోంది. ఓ గాడ్! ఎలా? ఎలా ఈ టార్చర్‌ని భరించటం? ఇప్పుడు ఆమెని ఎలాగైనా చూడాలి. లేకపోతే తాను బతకలేడు.

ఓ నిశ్చయానికి వచ్చినట్లుగా లేచాడు అతడు. అతడి కళ్లు ఎర్రగా మండుతున్నాయి.

కాలేజీలో ఉన్నప్పుడు ఓ రోజు సౌగంధిక జీప్‌ని అతడు ఆటోలో ఫాలో అయ్యాడు. ఓల్డు సిటీలోని పురానాపూల్ దగ్గరున్న రాజభవనంలాంటి ఓ బంగళా ముందు ఆగింది. ఆ రోజు ఆమె జీపు ఆ బంగళాని కాపలాకాస్తూ చుట్టూ వందమంది పైగా సెక్యూరిటీవారు వున్నారు. చీమనైనా లోపలికి పోకుండా, రెప్పవాల్చకుండా తుపాకులతో అప్రమత్తతతో కాపలా కాస్తున్నారు. చుట్టూ వున్న వారి కాపలాని దాటి లోపలకి పోవడం అసాధ్యమని అర్థమవడంతో ఆ రోజు అతడు తిరిగి వెనక్కి వచ్చేశాడు.

క్షణాలు గుడుస్తున్నాయి... అతడి ఆలోచనల్తో.

అసలు ఎలా వెళ్లాలి ఆ బంగ్లాలోకి?

ఏ రెక్కలతో ఎగిసివెళ్లినా సెక్యూరిటీ చాలా టైట్‌గా వుంటుంది. చుట్టూ పద్మవ్యూహంలా దడికట్టి కాపలాకాస్తున్న ఆ రక్షణ సిబ్బంది తప్పుకొని సౌగంధికని ఎలా చూడాలి? అందుకు ఏ ప్రణాళిక వేయాలి, పరిస్థితిని అంచనా వేస్తోంది అతడి మెదడు.

ఒకటి... రెండు.... మూడు...

గంటలు గడుస్తున్నాయి.

సరిగ్గా నాలుగో గంటలో ఎలక్ట్రానిక్‌వైర్‌లోంచి విద్యుత్ మెరుపు వేగంలో బయటికి వచ్చి తళుక్కుమన్నట్లుగా మెరిసిందో ఐడియా అతడి మెదడులో.

అది.... స్విమ్మింగ్‌ఫూల్ నీళ్లు బయటికి పోయే పెద్ద గొట్టంలో లోపలికి వెళ్ళడం.

పెద్ద పెద్ద హోటల్స్‌లో స్విమ్మింగ్ ఫూల్ నీళ్లు బయటికి వెళ్లడానికి అండర్‌గ్రౌండ్ ట్యాంకులు వుంటాయి. అవి కిలోమీటర్ దూరాన బయటికి ప్రవహించి, సిటీలో వున్న అండర్ గ్రౌండ్ డ్రయినేజీలో కలిసిపోతాయి.

ఆ అవకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్నాడు విశ్వసౌరభ్. ఉషారుగా బయటకు వచ్చి రూమ్ తాళం వేశాడు. గబగబా మెట్లు దిగి ఆటో ఎక్కాడు. దాదాపు గంట పట్టింది గమ్యస్థానం చేరడానికి.

పురానాపూల్ చేరుకున్న విశ్వసౌరభ్ చూపులు అక్కడున్న అండర్‌గ్రౌండ్ డ్రయినేజీని వెతుకుతున్నాయి. అప్పుడే చీకటి పడబోతోంది.

ఓ పావుగంట తర్వాత ఓ మేన్‌హోల్ కన్పించింది. అటూ ఇటూ చూసి తననెవ్వరూ పట్టించుకోలేదని తీర్మానించుకున్నాక, ఆ మేన్‌హోల్ మూతని తీసి గబుక్కున లోపలికి దూరాడు. లోపలంతా చీకటిగా వుంది. మేన్‌హోల్ మూతని తిరిగి యధాస్థానంలో పెట్టాడు.

జేబులోంచి గంట క్రితమే కొన్న బ్యాటరీ సెర్చి లైటు తీసి బటన్ నొక్కాడు.

తెల్లటి వెలుతురు అక్కడ పరుచుకుంది.

చుట్టూ మురుగు వాసన! కప్పలు, జెర్రెలు, బొద్దింకలు అతడి బూటు కాళ్ళకింద నలిగిపోతున్నాయి. ఓ పావుగంట అతికష్టంమీద అలాగే నడుచుకుంటూ వెళ్లి స్విమ్మింగ్ ఫూల్ అండర్‌గ్రౌండ్ చేరుకున్నాడు. ఆ అండర్‌గ్రౌండ్‌లోంచి రెండు ఫర్లాంగులు లోపలికి వెళ్లాలి.

ఒక్కో అడుగూ ముందుకు వెళుతున్న విశ్వసౌరభ్‌కి తెలుసు... అనుకున్నది అనుకున్నట్టు జరగకపోతే తన శరీరంలో బుల్లెట్లు దూసుకుపోయి అంగుళమంటూ మిగలదని. అయితే ప్రాణంకంటే ప్రేమ ముఖ్యమని, ఆమెని చూడకపోతే ప్రాణం నిలవదని అతనికి తెలుసు. అందుకే పట్టుదలతో కదులుతున్నాడు ఆ నీళ్లల్లో. స్విమ్మింగ్‌ఫూల్ అడుగుభాగం సమీపిస్తూనే ఒక్క ఉదుటున నీటిలోంచి తల బయటపెట్టి చూశాడు. తోటలో ఎవరూ కన్పించలేదు.

మరుక్షణం స్విమ్మింగ్‌ఫూల్‌లోంచి బయటికి వచ్చి పక్కనే వున్న ఓ చెట్టు పక్కకు తప్పుకున్నాడు. సరిగ్గా ఏడు గంటలైంది అప్పుడు. మరుక్షణం ఫ్లడ్‌లైట్లు వెలిగాయి అక్కడ కన్నులు మిరుమిట్లు గొలుపుతూ.

అప్పుడు అడుగు పెట్టింది సౌగంధిక.

ధగధగ మెరుస్తున్న ఫ్లడ్‌లైట్ల వెలుగుని సైతం లొంగదీస్తూ ఒంటిమీదున్న గులాబీఛాయ మెరుస్తోంది. గుండ్రటి మొహం, చిన్ని నోరు, లేత పెదవులు, పెద్దకళ్లతో దివినుండి భువికి దిగివచ్చిన దేవతలా వుంది. ఆమె నడుస్తూంటే అడుగడుగునా రాజసం వుట్టిపడుతోంది. ఆమె కాళ్లకున్న వెంటి పట్టాలు ఘల్లు ఘల్లుమంటూ శబ్దం చేస్తున్నాయి.

ఒక్కో అడుగూ వేస్తూ స్విమ్మింగ్‌ఫూల్ కేసి నడుస్తున్న ఆమె ఒంటిమీద నీలిరంగు స్విమ్మింగ్ సూట్ మరింత అందాన్నిస్తోంది.

తన ప్రియురాలి అందాన్ని దిగ్భ్రాంతిగా చూస్తున్నాడు విశ్వసౌరభ్. అంతవరకూ బురఖాలో వున్న ఆమె సహజ సౌందర్యం ఇప్పుడు అతని కళ్ళు చెదరగొడుతోంది. ఆమె

స్ట్రక్చర్, ఆమె అద్భుత సౌందర్యం ఆమె నడకలోని హొయలు అతడిని అలౌకిక స్థితిలో పడేస్తున్నాయి. తన ప్రియురాలు అందగత్తె అనుకున్నాడు. కానీ మరీ ఇంత అద్భుత సౌందర్యరాశి అని కలలో కూడా అనుకోలేదు.

ఒక్కో క్షణం గడిచిపోతోంది అక్కడ ఉద్రికత్తంగా సౌగంధిక అందాల పాదాలు నెమ్మదిగా స్విమ్మింగ్‌పూల్‌ని సమీపించాయి.

ఒక్క ఉదుటున చేపపిల్లలా స్విమ్మింగ్‌పూల్‌లోకి దూకింది ఆమె. మరుక్షణం నీళ్లు నలుదిక్కులకూ చెదిరిపోయాయి ఆమె ధాటికి. సౌగంధిక శరీర స్పర్శకు పావనమై నట్టుగా ఆమెనే ఆరాధనగా చూస్తూ పక్కకితప్పుకుంటున్నాయి స్విమ్మింగ్‌పూల్‌లోని నీళ్లు.

సౌగంధిక ఇంకొంచెం లోతుకు వెళ్ళింది కాళ్లూ చేతులూ ఆడిస్తూ ఆ కన్నెపిల్ల సోయగానికి నివ్వెరపోయి చూస్తోంది ప్రకృతి. ఆకాశంలో చంద్రుడు మేఘాల్లోంచి తొంగి చూస్తున్నాడామె అందాన్ని. దూరంలో చెట్టుపైనున్న ఉడుత ఆ దృశ్యాన్ని ఉద్వేగంగా చూస్తోంది.

ఆమె చేతులు నీళ్లని వెనక్కి తోస్తూ కదిలాయి. ఓ రకమైన పరవశంతో ఆమె కాళ్లు కదులుతున్నాయి – స్విమ్మింగ్‌కి అనుగుణంగా.

అతడు అచేతనుడై చూస్తున్నాడు ఆమెకేసి. మైగాడ్! ఇంత అందం ఈ భూలోకంలో సాధ్యమా! ఎందుకింత అందాన్ని ఇంతకాలం బురఖాలో దాచింది? ఆమె ఒళ్లంతా నున్నగా గంధపు చెక్క రంగులో మెరిసిపోతూ అలా చెయ్యివేసి చూద్దామా జారిపోతుందేమో అన్పించేటట్లుంది. ఆమెని అలా లేపి భుజంమీద వేసుకొని అలా గాల్లోకి లేచి పైకెగిరిపోయి స్వర్గంలో ఎవరికీ తెలియని చోట కాపురం పెట్టేద్దామా అన్పించేటట్లుగా రక్తం ఉరకలు వేస్తోంది.

విశ్వసౌరభ్ అలా కలల్లో తేలుతూ వుండగానే సౌగంధిక స్విమ్మింగ్ పూల్ బయటి వచ్చింది... స్నానం ముగించుకొని.

చేతిలోని టవల్‌తో జలపాతంలా దూకుతున్న జుట్టుని తుడుచుకుంటోంది.

అలా తుడుచుకుంటూనే వెనక్కి తిరిగి తోటలోంచి బంగళాలోకి కదిలి వెళ్ళి పోయింది.

మరుక్షణం ఫ్లడ్‌లైట్లు ఆరిపోయాయి తోటలో... ఓ అద్భుతలోకంలోంచి మామూలు లోకానికి వచ్చినట్లుగా అతడు విస్మయంలోంచి తేరుకున్నాడు. ఆమెని ఇంకా చూడాలని కోరిక కలుగుతోంది.

ఆమెని మళ్లీ తనివితీరా చూడాలని, లేకపోతే బతకడం కష్టమన్న భావన కలిగింది అతనిలో.

అందుకే మొండిగా అతడు నడిచాడు బంగళాకేసి. ఒక్కో అడుగూ వేసుకుంటూ కారిడార్‌లోంచి అవతల కేసి నడిచాడు. ఒక్కొక్క రూమ్ చాలా విశాలంగా, రాజభవనాలంత పెద్దవిగా వున్నాయి.

అదృష్టవశాత్తూ అక్కడ ఎవరూ లేరు. అతడు ఒక్కో అడుగూ వేసుకుంటూ ముందుకు నడవసాగాడు. దూరంగా ఓ రూమ్‌లోంచి లైట్లు కన్పిస్తున్నాయి. ఏవో మాటలు విన్పిస్తున్నాయి.

అతడు ఆ గది ముందు ఆగాడు. ఆ గది కిటికీ అద్దాలు కొద్దిగా తెరిచివున్నాయి. ఆ అద్దాల సందుల్లోంచి లోపలికి తొంగి చూశాడు.

సౌగంధిక సల్వార్ కమీజ్‌లో వుంది.

ఆమె పక్కనే ఎవరో వున్నారు.

"బేబీ! ఎలా జరుగుతోంది నీ కాలేజీ?"

"బాగుంది డాడీ! ఎగ్జామ్స్ బాగానే రాశాను."

"అలాగా! నిన్ను ఇక్కడ ఎవరూ గుర్తుపట్టలేదు కదా..." అన్నాడతను.

"లేదు డాడీ! బురఖా వుంది కదా! ఏది ఏమైనా నేను ఇక స్వేచ్ఛగా, ఎగిరేపావురంలా ఫ్రీగా వున్నాను డాడీ!" అంది సౌగంధిక.

"అలాగా!" అంటూ ఆమె పక్కనున్న ఆయన ఇటుగా తిరిగాడు.

ఇప్పుడు ఆ వ్యక్తి సౌరభ్‌కి కన్పిస్తున్నాడు.

అతను.. అతన్ని... ఎక్కడో చూసినట్లుంది విశ్వసౌరభ్‌కి క్షణం గుర్తుకొచ్చింది పేపర్లలో చూసినట్లుగా. మై గాడ్! అతడు కాదు!

**మహంతి! భారత ప్రధానమంత్రి! అవును! నిస్సందేహంగా భారత ప్రధానే. మైగాడ్!**

అంటే.. అంటే... సౌగంధిక ఆయన కూతురు. మైగాడ్! ప్రధాని కూతురు.

చిక్కుముడి ఒక్కొక్కటి క్రమ క్రమంగా విడిపోతున్నట్లుగా అతడి మెదడులో ఒక్కో పొర సస్పెన్స్‌ని విప్పేస్తున్నాయి.

అతనికి జరిగిందంతా ఒక్కసారిగా గుర్తుకొస్తోంది.

సౌగంధిక.... బురఖా... ప్రధాని మహంతి...

అంతే! ఒకటి ప్లస్ ఒకటి ప్లస్ ఒకటి కలిసి మూడు అయినట్లుగా అతనికి పరిస్థితి అర్థమైంది.

*సౌగంధిక ప్రధాని కూతురు. ఢిల్లీలో ప్రయివసీ వుండకపోవటంవల్ల ఈ మారుమూల ఆంధ్రప్రదేశ్ వచ్చి మెడిసిన్ చదువుతోంది. ఆమె ఫొటో ఇంతకుముందే*

*ఢిల్లీటైమ్స్ లాంటి పేపర్లలో పబ్లిష్ అయినందున తననెవరూ గుర్తుపట్టకుండా బురఖా వేసుకొని ఓ నవాబు కూతురులా ఏర్పాట్లు చేసుకొని ఇక్కడ చదువుకుంటోంది. బహుశా టెర్రరిస్టుల దాడి తప్పించుకోవడం కోసం ఈ వేషంలో సెటిలై వుంటుంది. మైగాడ్! తన ప్రేయసి ప్రధాని కూతురు.*

నోట్లో తడారిపోయినట్లుగా అతడు అవాక్కయిపోయాడు. తన జీవితంలో ఎప్పుడూ అంత షాక్ తిని వుండడతడు. అతడు ఎంత దిగ్భ్రాంతిలో వున్నాడంటే, గోడ గడియారం తొమ్మిదిగంటలు కొట్టేదాకా ఈ లోకంలోకి రాలేదు.

మైగాడ్! తాను ఈ బంగళాలోకి వచ్చి రెండు గంటలైంది. అదృష్టవశాత్తూ తాను నిలబడినచోట చీకటిగా వుంది కాబట్టి తననెవరూ పట్టించుకోలేదు.

అతడు వెనుదిరిగాడు. మెల్లగా తోటలోకి ప్రవేశించాడు తిరిగి. స్విమ్మింగ్‌ఫూల్ అండర్‌గ్రౌండ్ డ్రయినేజీ మూత తెరిచాడు చప్పుడు కాకుండా. డ్రయినేజీలో దిగాక తిరిగి జాగ్రత్తగా మూతని బిగించాడు సరిగ్గా. ఆ తర్వాత స్వప్నావస్థలోంచి బయటపడ్డట్లుగా తన గమ్యస్థానంకేసి బయలుదేరాడు.

# 9

ఆ మర్నాడు –

ఆమె అందం కలలో అతడిని గిలిగింతలు పెట్టగా, లేటుగా నిద్రలేచాడు అతడు.

నిన్న చూసిందంతా అతడికి నమ్మశక్యంగా లేదు. ఆమె స్విమ్మింగ్‌ఫూల్‌లో ఈతకొట్టడం, బురఖాలేని ఆమె అందమంతా అతడికి కనువిందు చేయడం, అన్నింటికి మిన్నగా ఆమె ప్రధాని కూతురన్న నిజం తెలియడం అతనికి దిగ్భ్రాంతిగా వుంది.

కాలం గడుస్తున్నకొద్దీ అతడికి ఆమెని మరోసారి చూడాలన్న తపన ఎక్కువవు తోంది.

బురఖాలో ఆమె అందాన్ని అతడు చూసింది చాలా తక్కువ. ఇప్పుడు... బురఖాలేని ఆమె అందం కళ్ళముందు అతడ్ని పరవశుడ్ని చేస్తోంది. ఆమె అందాన్ని తిరిగి చూడకపోతే తాను బతకడం కష్టమన్న విషయం అతడికి అర్థమైంది.

మనసు ఓ సముద్రం లాంటిది. ఆ సముద్రంలో భావాలు కెరటాల్లా కదులుతాయి. కదిలి లావాలా పొంగి, మనసునే ముంచేస్తాయి. మనసుని అదుపులో పెట్టుకోవడం అతడివల్ల కావడంలేదు.

అందుకే ఆ రోజు సాయంత్రం తిరిగి బయలుదేరాడు పురానాపూల్ కేసి.

బంగాళాఖాతంలో అల్పపీడనం రాష్ట్రంవైపు రావడంతో సిటీ మొత్తం ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురుస్తోంది.

అతడా వర్షంలోనే బయలుదేరాడు. మ్యాన్‌హోల్ మూతతీసి, దిగి స్విమ్మింగ్‌పూల్ కేసి కదిలాడు.

స్విమ్మింగ్‌పూల్ సమీపించగానే ఒక్క ఉదుటున లేచి తోటలోకి నడిచాడు.

తోటంతా వర్షపు గాలితో కొట్టుకుపోతోంది.

అతడు నెమ్మదిగా బంగళావైపే నడిచాడు. ఏదో మొండి ధైర్యం అతన్ని ముందుకు నడిపిస్తోంది.

రాత్రి తొమ్మిది గంటలవుతోంది.

అతడు ఒక్కో గది దాటిపోతున్నాడు.

చివరకు లైటు వేసినట్లున్న ఓ గదిముందు ఆగాడు. ఆ గదే నిన్న అతడు చూసింది.

కిటికీ తలుపుల సందులోంచి చూద్దామని ప్రయత్నించాడు. ఊహూ! కిటికీ తలుపులు లోపల్నుంచి గడియపెట్టి వున్నాయి. అప్పుడు ఏం చేయాలో అర్థంకాక అలాగే నిల్చుండిపోయాడు.

❖ ❖ ❖

లోపల ఆ గదిలో.....

సౌగంధిక రగ్గు కప్పుకొని మెడికల్ జర్నల్ చదువుతోంది. వెస్ట్ జర్మనీ ఎయిర్ కండిషనర్ ఆ గదిలోని వర్షం తాలూకూ చల్లటి గాలిని పీల్చుకొని, వెచ్చటి గాలిని బయటికి వదులుతోంది.

క్షణాలు గడుస్తున్నాయి.

బయట భోరున వర్షం కురుస్తూనే వుంది. ఆకాశం తళుకు తళుక్కుమంటూనే వుంది.

ఆమె మెడికల్ జర్నల్‌ని చదువుతూనే వుంది. రాబర్ట్‌బెండమ్ రాసిన 'మైండ్ కంట్రోల్' ఆర్టికల్‌ని ఆమె సునిశిత మెదడు గ్రహించుకుంటోంది.

సరిగ్గా అదే సమయంలో....

డోర్ బెల్ మోగిన శబ్దం... ఉలిక్కిపడిందామె. ఆలోచననుండి బయటపడు తున్నట్లుగా.

ఈ సమయంలో ఎవరొస్తారు? నాన్నగారు ఉదయమే ఫ్లయిట్‌లో న్యూఢిల్లీ వెళ్లిపోయారు. తన భోజనం కూడా అయిపోయింది. తనని డిస్టర్బ్ చేసేవారే లేరు. ఒకవేళ తనని కాంటాక్ట్ చేయాలంటే హోమ్‌ఫోన్లో మాట్లాడతారు.

మరో రెండు క్షణాలు గడిచాయి ఆ స్థితిలోనే.

సరిగ్గా అప్పుడు... మళ్లీ బెల్ మోగింది ఆమెని ఉద్విగ్నతలోకి నెడుతూ. ఆమె లేచింది.

ఒక్కొక్క అడుగు వేసుకుంటూ డోర్ దగ్గర ఆగింది. అరక్షణం ఉద్విగ్నతని అణుచుకుంటూ, నెమ్మదిగా ఊపిరి వదులుతూ, డోర్ లాక్ రిలీజ్ చేసి తలుపు వెనక్కి లాగింది.

తలుపులు తెరుచుకున్న మరుక్షణం....

పెళపెళమంటూ గర్జించింది ప్రకృతి. ప్రతిగా ఆకాశం పగిలింది భోరున విలపిస్తూ.

ఆమె కళ్లు పెద్దవయ్యాయి ఆశ్చర్యంతో... ఎదురుగా కనిపిస్తున్న వ్యక్తిని చూసి.

అతను.... విశ్వసౌరభ్.

❖ ❖ ❖

"మైగాడ్! నువ్వా.....?" కళ్లు పెద్దవి చేసి అందామె.

"ఎస్ – నేనే! ఐ లవ్ యూ మహరాణీ!"

ఆమె వేగంగా కదలబోయింది.

అతడు అడ్డంగా నిలబడ్డాడు.

"చూడు! ఏ క్షణం నిన్ను చూశానో, ఆ క్షణంలోనే అర్థమైంది. నాకు... నిన్ను కాకుండా వేరే స్త్రీని గురించి ఆలోచించడం అసంభవమని. నీ గురించిన జ్ఞాపకాలన్నీ దూరంగా పారద్రోలటంకోసం పిచ్చాసుపత్రికి వెళ్ళి నా మెదడుకి కరెంట్ షాక్ ఇప్పించుకున్నాను. లాభం లేకపోయింది దానివల్ల. ఆ క్షణం కూడా నీవే జ్ఞాపకం వచ్చావు. నా ప్రేమ నవపారిజాతం లాంటిది" అన్నాడు విశ్వసౌరభ్.

"ప్రేమ అనేది వన్‌వే ట్రాఫిక్ లాంటిది కాకూడదు." ఆమె కంఠం కదిలింది. "రెండు వైపుల నుండి మనసులు కలిస్తేనే అది ప్రేమ. అంతేగాని నీవొక్కడివే ప్రేమిస్తే ఆ ప్రేమ రైలు పట్టాల్లాంటిది. చెప్పానుగా ఈ ప్రేమ, పెళ్ళి లాంటివి నా ఒంటికి పడవని..."

అతడు ఓ క్షణం ఆగి, బిగ్గరగా నవ్వాడు.

"నాలో ప్రేమ కలగటానికి కారణం నీవే. నాతో ఫ్రెండ్‌గా వుంటూ నాకు చాలా దగ్గర దానివన్న భావం కలిగించావు. నేను ఏ పని చేస్తున్నా సమర్థించేదానివి. అదంతా ఒక ఎత్తు కాగా, పిక్నిక్‌లో 'నీవే నా రోమియోవి' అని అందరిముందే చెప్పావ్! ఇవన్నీ చాలవా నాలో ప్రేమని రగిలించడానికి? అవన్నీ చాలవా నాలో ప్రేమని మండించటానికి...."

"ఒకే క్లాసులో వున్నప్పుడు కొలీగ్స్‌తో కొద్దిగా చనువుగా వుండవచ్చు. దానిని ప్రేమగా అర్థం చేసుకుంటే అది నా తప్పా? పిక్నిక్‌లో తప్పనిసరిగా అందరి బలవంతంచేత 'నీవే నా రోమియో'వని చెప్పాను. చెప్పిన తర్వాత అదంతా కాకతాళీయమని, సీరియస్‌గా తీసుకోవద్దని చెప్పాను. సో... నీలో 'ప్రేమ'ని రగిలించడంలో నా తప్పులేదు."

"కాకతాళీయంగా చేసినా, ఉద్దేశపూర్వకంగా చేసిన తప్పు తప్పే" అతడి కంఠం స్థిరంగా కదిలింది. "నాలో ప్రేమని రగిలించటానికి ఎన్ని సాకులు చెప్పినా కారణం మీరే! అసలు రోజూ మిమ్మల్ని చూడకపోతే నాకు నిద్రపట్టడం లేదు. దయచేసి కనీసం రోజుకొక్కసారయినా మిమ్మల్ని చూసే భాగ్యం కలిగించండి. ఈ దీనుడిని కరుణించండి."

అతను దగ్గరకు వస్తూనే వున్నాడు.

ఆమె రెండడుగులు వెనక్కి వేసి "దయచేసి ఇక్కడ్నుంచి వెళ్ళిపోండి. మీరు ఇంటలిజెంట్ స్టూడెంటని నాకు గౌరవం! అలాంటి మీమీద అభిమానాన్ని పోగొట్టు కోకండి. రోజూ క్లాస్‌లో మీరు నావంక లాస్ట్ బెంచ్‌లో తదేకంగా చూస్తున్నా, క్లాస్‌లో మిగతా వారంతా నవ్వుకుంటున్నా పళ్ల బిగువున భరిస్తున్నాను. ఇంకెప్పుడూ ఇలా దొంగతనంగా ఇళ్లల్లోకి రాకండి. వెళ్లిపోండి" అన్నది.

"ఎందుకు వెళ్లిపోవాలి? మీరు ప్రధానమంత్రి కూతురన్న విషయం తెలియకుండా దాచి పెట్టటానికా?" వ్యంగ్యం అతనిలో.

ప్చ్! ఎవరికీ తెలియని విషయం ఇతనికి తెలిసింది. ఇన్నాళ్లూ ఎంతో రహస్యంగా వుంచిన రహస్యం బయటకు పోదుకదా?

ఆలోచనల్నుంచి తేరుకొని చూసింది.

అతను దగ్గరకు వస్తూనే వున్నాడు ఆమెకోసం.

ఆమెకేం చెయ్యాలో అర్థంకావటం లేదు.

ఒకటి... రెండు... క్షణాలు గడుస్తున్నాయి. అతనికి, ఆమెకు మధ్య మూడు అడుగుల దూరం వుంది.

"మర్యాదగా ఇక్కడ్నుంచి వెళ్ళిపో. లేకపోతే పోలీసుల్ని పిలిపించాల్సి వుంటుంది."

"పిలిపించు..." అతని కంఠంలో ధీమా. "వాళ్లు మహా అయితే నాలుగు లాఠీ దెబ్బలు వడ్డిస్తారు. అంతకంటే ఏం చేయగలరు? నీ ప్రేమ ముందు ఆ లాఠీ దెబ్బలు ఎంత నా ప్రేమమూర్తీ?"

అతడు ముందుకు వస్తూనే వున్నాడు. ఇంకా రెండు అడుగలే వున్నాయి ఇద్దరి మధ్య.

ఆమె సునిశిత మెదడు ఆలోచిస్తూనే వుంది. ఆ పరిస్థితి నుండి ఎలా తప్పించు కోవాలా అని.

రీజన్... అనాలసిస్... కామన్‌సెన్స్... డెసిషన్!

క్షణంలో పదోవంతు!

అంతే! మరుక్షణం ఆమె అడుగులు గాలికంటే వేగంగా కదిలాయి కదులుతూనే అతడిని ఒడుపుగా తప్పించుకుంటూ ఆ బెడ్‌రూమ్ పక్కనే వున్న మరో రూమ్‌లోకి గెంతాయి. గెంతుతూనే ఆమె చేతులు మెషిన్ల కంటే వేగంగా కదిలి, ఆ గది తలుపుల్ని మెరుపు వేగంతో గడియవేశాయి.

జరిగిందేమిటో గ్రహించడానికి పదిసెకన్లు పట్టాయి అతనికి. షాక్ అతనికది! ఆఖరి నిమిషంలో అందినట్టే అంది తప్పించుకున్న భావన!

ఏం చెయ్యాలో అర్థంకాని వేదన!

అతనికి పిచ్చెక్కిపోతోంది,

ఒకటి... రెండు... క్షణాలు గడుస్తున్నాయి.

అప్పుడు ఓ నిర్ణయానికి వచ్చిన అతడు దిగ్గున లేచాడు. లేచి మరుక్షణం ఆమె తలుపు గడియపెట్టుకున్న గది ముందుకొచ్చాడు.

"సౌగంధికా! ప్లీజ్ ఓపెన్ ది డోర్... ప్లీజ్ ఓపెన్ ది డోర్ నిన్నేం చేయను నేను." తలుపుమీద గట్టిగా తడుతూ లోపలున్న ఆమెను పిలిచాడు.

"సౌగంధికా! ప్లీజ్ ఓపెన్ ది డోర్... పిలుస్తూ వున్నాడతను. పిలుస్తున్నాడనటం కంటే అరుస్తున్నాడనటం సమంజసంగా వుంటుంది.

క్షణాలు నిమిషాలుగా మారిపోతున్నాయి.

అయినా ఎలాంటి రెస్పాన్స్ లేదామె దగ్గర నుండి... నిశ్శబ్దమే సమాధానం అన్నట్లుగా.

ఆ నిశ్శబ్దం మనసులో చొరబడి, అణువణువుని దహించివేస్తున్నట్లుగా అతని కళ్లు ఎర్రగా నిప్పు కణాల్లా మండుతున్నాయి. పెదాలు అదిరిపడుతున్నాయి. భయంకరమైన ఉద్విగ్నత ఆవరించుకున్నట్లుగా.

అప్పుడు పడింది అతని దృష్టి – దూరంగా గోడకు తగిలించిన రైఫిల్‌మీద. మరుక్షణం దానిని చేతిలోకి తీసుకొని పరీక్షించాడు. రైఫిల్‌కి ముందే తూటా ఫిక్స్‌చేసి వుంది. మరుక్షణం సామ, దాన, దండోపాయాల్లో చివరిది ప్రయత్నించటానికన్నట్లుగా అతడి పిడికిళ్లు ఆ రైఫిల్ చుట్టూ బలంగా బిగుసుకున్నాయి.

బయట ఆకాశం పగిలిన చప్పుడు.

"సౌగంధికా! చివరిసారిగా అడుగుతున్నాను. తలుపు తీస్తావా, లేకపోతే నన్ను నేను కాల్చుకుని ఆత్మహత్య చేసుకోమంటావా? పదే పది నిమిషాలు టైము ఇస్తున్నాను. ఏదో ఒకటి నిర్ణయించుకో."

హాలు గోడలు ప్రతిధ్వనించేలా గొంతుచించుకుంటూ వెలువడ్డాయా మాటలు అతనినుండి.

గోడ గడియారం గంటలు కొట్టడం ప్రారంభించిందప్పుడే! ఒకటి... రెండు... మూడు... పదిగంటలు కొట్టి ఆగిపోయిది.

ఒక్కో నిమిషం నెమ్మదిగా కరిగిపోతోంది.

10.01, 10.02, 10.03

బయట వర్షం హోరుమంటూనే వుంది. పెనుగాలికి విండోరెక్కలు ముందుకీ, వెనక్కీ కొట్టుకుంటూనే వున్నాయి. లోపల గదిలో వున్న ఆమె ఉద్విగ్నత నరనరాన. అతడు మొండివాడు. ప్రేమ పిచ్చి ముదిరిపోయింది. ప్రేమ పిచ్చితో దేనికైనా తెగిస్తాడు. కాని... పిచ్చివాడి చేతిలో రాయిలా ఆ రైఫిల్ వుంది అతని చేతిలో. ఎలా?

10.04, 10.05

బయట వర్షం చెవులు చిల్లులు పడేలా పడుతోంది.

10.06

ఓ నిశ్చయానికి వచ్చినట్లుగా ఆమె చేతిలోకి హోమ్‌ఫోన్ తీసుకుంది.

10.07, 10.08

గడియారం కేసే చూస్తున్నాడు అతను టెన్షన్‌తో. ఇచ్చిన డెడ్‌లైన్ దగ్గిరపడుతోంది.

ఆమె నుండ ఎలాంటి రెస్పాన్స్ లేదు. ఇంకా కేవలం రెండు నిమిషాలే వున్నాయి.

క్షణాలు కదులుతున్నాయి.

10.08, 40

ఆమె నుండి ఎలాంటి ప్రతిస్పందనా లేదు. మూసుకున్న తలుపులు అలాగే వున్నాయి తెరుచుకోవడం ఏమాత్రం ఇష్టంలేనట్లుగా.

10.09

ఇంకా నిమిషం మాత్రమే వుంది గడువుకి.

సరిగ్గా అప్పుడు...

పోయాయి లైట్లు అక్కడ. చీకటి... చిక్కటి చీకటి... అతనికి ఏం చేయాలో తోచలేదు.

చేతిలోని రేడియం వాచ్‌ని చూశాడు. టైమ్ పది గంటల తొమ్మిది నిమిషాల నలభై సెకండ్లు అయ్యింది.

ఆమెనుండి రెస్పాన్స్ రాదని అర్ధమయ్యిందా చీకట్లో. అంతే.. డెడ్‌లైన్‌కి ఇంకా ఐదు సెకండ్లు వున్నాయనగానే అతను రైఫిల్‌మొనని తన కంఠానికి ఆనించుకున్నాడు. సరిగ్గా అప్పుడు...

మెరుపు వేగంతో లైట్లు రావడం, ఆ వెలుతురు భరించలేక ఓ క్షణం కళ్లు మూసుకున్నాడు.

కళ్లు తెరిచిన మరుక్షణం అతనిచేతిలో రైఫిల్ దూరంగా పడిపోవడం, ఏం జరిగిందా అని అదిరిపాటుతో చూసిన అతని చుట్టూ సెక్యూరిటీగార్డులు తుపాకులను అతనిమీదకు సూటిగా ఎక్కుపెట్టడం చాలా వేగంగా జరిగిపోయాయి.

నిశ్చేష్టత.... దిగ్భ్రాంతి అతనిలో.

అతనింకా ఆ స్థితిలో వుండగానే సౌగంధిక గది తలుపులు తెరుచుకున్నాయి.

"నాకు తెలుసు నీలాంటి మొండివాళ్ళని దారికి ఎలా తేవాలో!" అందుకే హోమ్‌ఫోన్‌లో మా సెక్యూరిటీతో మాట్లాడాను. ఎవరో కాలేజీ రోమియో లోపలికి వచ్చాడని. ఫలితం... బ్లాక్‌క్యాట్ కమెండోలు లైట్లు తీసెయ్యడం, చప్పుడు కాకుండా రావడం, నిన్ను చుట్టుముట్టడం జరిగిపోయాయి...."

ఒక్కో క్షణం నెమ్మదిగా నత్తనడకలా కదులుతోంది... అతనిని షాక్ గురిచేస్తూ.

ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా ఆమె తన బ్లాక్‌క్యాట్ కమెండోస్ కేసి తిరిగింది.

"నాకు తెలియదు మీరు ఏం చేస్తారో, ఇతడు జీవితంలో తిరిగి నన్ను వేధించకూడదు. తిరిగి ఈ ఇంటిలో అడుగుపెట్టకూడదు. ఇప్పటికే నేను చాలా విసిగిపోయాను..."

"అలాగే యువర్ మెజస్టీ...." బ్లాక్‌క్యాట్ కమెండోలు విశ్వసౌరభ్ రెక్కపట్టుకొని ఈడ్చుకొని పోబోయారు.

"అన్నట్లు ఇంకో విషయం..." ఆమె గొంతు కదిలింది. "ఇతగాడి నోటంట నేను ప్రధాని కూతురు అన్న విషయం ఎప్పుడూ బయటపడకూడదు. ఎలా డీల్ చేస్తారో మీ ఇష్టం...."

ఆమె నిట్టూర్చి వెనకకు తిరిగింది.

❖ ❖ ❖

ఈ సంఘటనకి సరిగ్గా గంట తర్వాత....

రెండు పెదాలు చిట్లి నాలుగుపళ్లు రాలి, నోరంతా ముద్ద ముద్దగా ఉబుకుతున్న రక్తం, తల పగిలి నేలను తడుపుతూ రక్తం, కుడికన్ను పూర్తిగా వాచిపోయి పడివున్నాడు అతడు యూనివర్శిటీ ముందు.

మళ్ళీ పొరబాటున కూడా ఆమె వెంట పడకూడదని, ఆమె ప్రధాని కూతురన్న విషయం బయటపెడితే అతని ప్రాణాలు గాలిలో కల్సిపోతాయని వార్నింగ్ ఇచ్చి జీప్‌లో అతడిని తెచ్చి ఆ కాలేజీ ముందు బస్తాని విసిరేసినట్లుగా విసిరేసి వెళ్లిపోయారు.

వర్షంలో తడుస్తూ వున్న అతడికి ఎదురుగా ఎత్తుగా యూనివర్శిటీ బిల్డింగ్ కన్పిస్తోంది.

*ఒంటిమీదున్న రక్తం ఆ వర్షపు చినుకుల్తో కలిసిపోయి వర్షపు తాలూకూ మెరుపు లతో పరావర్తనం చెందుతోంది. ఆ సరస్వతీపుత్రుడిని జాలిగా చూస్తోంది యూనివర్శిటీ బిల్డింగ్.*

అతడి కళ్ళల్లోని నీళ్లు వర్షపు చినుకులతో కల్సిపోతున్నాయి. గుండెల్లో బాధ కన్నీళ్ళ రూపంలో బయటికొస్తుండగా స్పృహతప్పి పోయాడు ఆ రాత్రంతా.

***"ప్రేమ మనిషిని బతికిస్తుంది. పరిస్థితులు ఎదురు తిరిగితే అదే ప్రేమ అతని జీవితానికి చరమగీతం పాడుతుంది". ప్రముఖ ఆంగ్ల రచయిత అండర్సన్.***

# 10

రెండు నెలలు పట్టాయి అతనికి దెబ్బలు మానిపోవడానికి. ఆ రెండు నెలలు అతడిలో చాలా మార్పుని తీసుకొచ్చాయి.

నిర్లిప్తత అతడి అణువణువుని కమ్మేసింది. సౌగంధిక మీద ప్రేమతోబాటు అదోలాంటి 'కసి'కూడా ఏర్పడిపోయింది. ఆ రోజు ఆమె బ్లాక్ క్యాట్ కమెండోలు కొట్టిన దెబ్బలకు అతడికి ఆమె రాజరిక వ్యవస్థ మీద పగపేరుకుంది. కానీ చేసేదిలేక నిర్లిప్తతతో కాలం గడపసాగాడు.

ఆ రోజు... ఎప్పటిలా స్టూడెంట్సంతా చేతిలో పుస్తకాలతో కాలేజికేసి నడుస్తున్నారు.

కాలేజీ మెట్లు ఎక్కుతున్నాడు యుద్ధవీర్.

అప్పుడే గబగబా జీపు దిగన సౌగంధిక క్లాసుకి టైమ్ అయిపోతుందేమోనన్న టెన్షన్‌తో పరుగు పరుగున కదిలింది. ఆమెకు ఇరుపక్కలా సెక్యూరిటీ గార్డులు ఆమెకు దారితీస్తూ ముందుగా వెళుతున్న వారిని పక్కకు తప్పుకొమ్మని అరుస్తున్నారు.

యుద్ధ్‌వీర్ చేతిలో బుక్స్‌తో ఆఖరిమెట్టు ఎక్కబోతున్నాడు సరిగ్గా అప్పుడే....

సెక్యూరిటీ గార్డులు యుద్ధ్‌వీర్‌ని పక్కకి తోసేసి "సాలే.... భాజు హటో... హటో" అని పక్కకు నెట్టారు. ఆ విసురుకు చేతిలోని పుస్తకాలు కిందపడగా, యుద్ధ్‌వీర్ బ్యాలన్స్ తప్పి మెట్లమీద పడ్డాడు. అతని చేయి, కాలు గీసుకుపోయాయి ఆ రాపిడికి.

అంతే! మరుక్షణం కోపం అవధులు దాటగా యుద్ధ్‌వీర్ లేచాడు. గబగబా ముందుకు జంప్‌చేసి ఓ సెక్యూరిటీగార్డు చొక్కా పట్టుకొని ఆ చెంపా, ఈ చెంపా వాయించాడు. అప్పుడు అక్కడ నిశ్శబ్దం పేరుకుంది. అంతా నిశ్చేష్టులై చూస్తుండిపోయారు. జరిగిన సంఘటన చూసి పక్కనే వున్న సెక్యూరిటీగార్డు యుద్ధ్‌వీర్ మీదకు రాబోయాడు.

"ఆగు బే! ఈ కాలేజీ మీ బాబు ఏమన్నా కట్టించాడా! మీ స్వంతం అయినట్లు స్టూడెంట్స్‌ని పురుగుల్లా విదిలిస్తున్నారు" అంటూ యుద్ధ్‌వీర్ అతడిమీదకు దూసుకు పోయాడు. జరిగిన గొడవ విని సౌగంధిక తిరిగి వెనక్కి వచ్చేసింది.

అదే సమయంలో యుద్ధ్‌వీర్‌తో చెంపదెబ్బలు తిన్న సెక్యూరిటీగార్డు లేచి "బాడ్‌కోవ్" అంటూ యుద్ధ్‌వీర్‌ని తుపాకీ బాయ్‌నెట్‌తో కొట్టాడు.

"అబ్బా!" తల పట్టుకొని కూర్చుండిపోయాడు యుద్ధ్‌వీర్. జరిగిన గలభాకి కాంపస్‌లో స్టూడెంట్స్ అంతా అక్కడ గుమిగూడారు.

అప్పుడు లేచాడు యుద్ధ్‌వీర్ మెరుపువేగంతో అంత బాధలోనూ. ఆ సెక్యూరిటీగార్డు చేతిలోని తుపాకీ తన చేతిలోకి తీసుకొని అతనిని ఎడాపెడా బాదేశాడు. అంతటితో ఆగకుండా అతనిపక్కనే వున్న సెక్యూరిటీ గార్డుని కూడా కొట్టాడు.

"బాడ్‌కోవ్ ఎవర్రా? మీరా నేనా? అసలు కాలేజీ కాంపౌండ్‌లోకి మిమ్మల్ని ఎవర్రా అడుగుపెట్టమంది? ఇక్కడ స్టూడెంట్స్‌కేగాని సెక్యూరిటీకి, ఇతరులకు చోటులేదు. ఇంకోసారి ఈ కాంపౌండ్‌లో పోలీసులుగాని, సెక్యూరిటీగాని అడగుపెడ్తే మక్కెలు విరగ గొడతాను... జాగ్రత్త" అన్నాడు ఆవేశంగా.

సరిగ్గా అదే సమయంలో... దూరంనుంచి, ఓ స్టూడెంట్ తమ సహచరులను కొట్టటం చూసి గబగబా జీప్‌దిగి చేతిలోని తుపాకులతో పరిగెత్తుకు వచ్చారు మిగతా సెక్యూరిటీవాళ్ళు. వారి చేతిలోని రైఫిల్స్ యుద్ధ్‌వీర్ కేసి గురిపెట్టబడి వున్నాయి. ఏక్షణంలోనైనా పేలటానికి సిద్ధంగా.

అక్కడ చీమ చిటుక్కుమంటే వినబడేటంత నిశ్శబ్దం విన్పించింది.

"ఏం చేస్త్రా్రా మీరు! ఈ కాలేజీకి రిప్రెజెంటేటివ్‌ని. నాకు ఏదైనా జరిగితే మొత్తం కాలేజీ మీ ఎముకల్లో సున్నం లేకుండా చితకబాదుతారు తెలుసా?" ఆవేశంగా కదలబోయాడు యుద్ధ్‌వీర్.

బదులుగా ఓ తుపాకీగుండు అతడి చెవులపక్కనుంచి దూసుకుపోయింది.

నిశ్చేష్టుడయిపోయాడు యుద్ధ్‌వీర్. ఆ సెక్యూరిటీవాళ్ళు కఠినులని విన్నాడు. కానీ ఇలా మాట్లాడితే ప్రాణాలు తీయగలరని అతడికి తెలియదు.

ఆ దృశ్యాన్ని చూస్తున్న స్టూడెంట్స్ నరనరాల్లో భయం పాతుకుపోయింది. ఒక్కరంటే ఒక్కరూ ముందుకు రాలేదు. సౌరభ్‌లోనూ దిగ్భ్రాంతి.

యుద్ధ్‌వీర్ ఆ సెక్యూరిటీ స్టాఫ్‌కేసి కదలబోయాడు రెట్టించిన కోపంతో. ఇంకో తుపాకీ గుండు వెంట్రుకవాసిలో అతడి పక్కనుంచి దూసుకుపోయింది.

అంతా చూస్తున్న సౌరభ్‌కి అర్థమైంది ఆ సెక్యూరిటీ స్టాఫ్ పాషాణ హృదయులని, యుద్ధ్‌వీర్ ఏమాత్రం ఇంకా ముందుకు కదిలినా తూటా అతడి శరీరాన్ని తూట్లు తూట్లు పొడుస్తాయని.

క్షణాలు కదులుతున్నాయి ఆ ఉద్రిక్తతలోనే.

యుద్ధ్‌వీర్ ఆవేశంగా ముందుకు కదలబోయాడు "ఇవాళ నేనో మీరో తేలిపోవాలి" అంటూ.

ఇంకొక్కక్షణం! ఆ క్షణంలో తుపాకీగుండ్లు అతని శరీరాన్ని జల్లెడలా చేసేవే! కానీ – అప్పుడు జరిగిందది. సౌరభ్ గబగబా పరిగెత్తుకుంటూ ఆవేశంతో ముందుకు కదులుతున్న అతడ్ని ఆపుతూ అరిచాడు అసంకల్పిత చర్యలా.

"వీర్! ముందుకు కదలొద్దు! సౌగంధిక మామూలు అమ్మాయి కాదు. మనదేశ ప్రధాని కూతురు. ఆ సెక్యూరిటీగార్డులు కూడా ప్రధానిచేత ఏర్పాటు చేయబడ్డవారే. నిన్ను నామరూపాలు లేకుండా చేస్తారు... జాగ్రత్త...."

అప్పుడక్కడ గాలికూడా స్తంభించిపోయింది. స్టూడెంట్స్ చెవుల్లో విశ్వసౌరభ్ మాటలు గింగురెత్తి మోగుతున్నాయి. అందరిలోనూ ఆశ్చర్యం... విభ్రాంతి... ఉద్రిక్తత... దిగ్భ్రాంతి కలగలిపిన భావాలు. మైగాడ్! ఇన్నాళ్ళూ ఎవరో నవాబు కూతురన్న ఆ బురఖాసుందరి ప్రధాని కూతురా?

అంతా నిశ్చేష్టతతో వుండగానే సౌగంధిక మొహంలో రౌద్రం నిప్పులు కక్కుతున్నట్లుగా విశ్వసౌరభ్ కేసే చూస్తున్నాయి ఆమె చూపులు. ఒక్కో అడుగూ వేస్తూ మెట్లు దిగి ఆమె విశ్వసౌరభ్ దగ్గరకు వచ్చింది.

చుట్టూ వున్న స్టూడెంట్స్, సెక్యూరిటీగార్డులు అంతా ఉద్వేగంగా ఆమెకేసే చూస్తున్నారు.

"నీవు... నీవు..." ఆమె కంఠం వణికింది. "ఇన్నాళ్ళూ దేనినైతే నేను కాపాడుకొస్తున్నానో దాన్ని నీవు అందరికీ బహిర్గతపరిచావు.

నేను ఫలానా అని తెలియకుండా స్వేచ్ఛగా, హాయిగా ఇక్కడ చదువుకుంటున్నాను. సాఫీగా సాగుతున్న నా జీవితంలో చిచ్చుపెట్టావు. దాంతో నీ ఉనికి అందరికీ తెలిసి పోయింది.

ఇప్పటిదాకా నీవంటే నాకు కొద్దిగా గౌరవం వుండేది. ఈ క్షణం నుంచి మనిద్దరం ప్రథమ శత్రువులం... నా ఉనికిని పదిమందికి కావాలని యింతమందిలో వెల్లడిచేసిన నిన్ను నా జీవితంలో క్షమించలేను... ఐ హేట్ యూ..."

అంటూ తన బురఖాని తీసేసి గిరాటు వేసి క్లాసులోకి వెళ్ళిపోయింది.

*అప్పుడు ఆమె మాటలు పాముబుసల్లా వున్నాయి. కాటేసేముందు పాము అలాగే బుసకొడుతుంది.*

# 11

కాలం! దానికున్న మహత్యం అపారం! అది ఆనందాన్ని తీసుకు రాగలదు, దుః ఖాల్ని పోగొట్టగలదు.

కాలంతో మనిషి ఎదుగుతాడు. విజ్ఞానాన్ని సముపార్జించుకుంటాడు. వ్యక్తిత్వాన్ని పెంపొందించుకుంటాడు. నేడు జరిగిన సంఘటనల్ని నిన్నటకి నెట్టి, నిన్నటిని మొన్నటికి నెట్టి, మొన్నటిని అంతకుముందు రోజుకీ నెట్టి, ఆయా సంఘటనల్ని మరిచిపోయేలా చెయ్యగలిగేది టైమ్!

కాలం! కొన్ని సమస్యల్ని పరిష్కరించాల్సింది కాలమే! జస్ట్ టైమ్! ఎవ్రీథింగ్ నీడ్స్ సమ్ టైమ్! 'టైమ్' కాలం గడుస్తోంది బరువుగా....

విశ్వసౌరభ్ దుఃఖాన్ని తనలోకి తీసుకుంటూ.

❖ ❖ ❖

రోజులు... నెలలు... సంవత్సరాలు చకచకా స్పీడ్‌గా గడిచిపోతున్నాయి.

సౌగంధిక మాత్రం ఆ రోజునుండి సౌరభ్‌తో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. తన ఉనికిన బయటపెట్టి, తన స్వేచ్ఛని హరింపజేసిన అతని పట్ల నిర్లిప్తతగా వుండేది. అసలు అతడు ఎవరో, అక్కడ లేనట్లుగా ముభావంగా వ్యవహరించేది. పట్టించుకోక పోవడం... జస్ట్ 'ఇగ్నోరెన్స్' అంతే.

ఒక మనిషిమీద ఆగ్రహం వస్తే తిట్టడం వేరు! కొట్టడం వేరు! కానీ మనిషి ఉనికే పట్టించుకోకపోవడం దారుణమైన శిక్ష!

అదే విశ్వసౌరభ్ మనసుని కోసేస్తుంది. ఆ నిర్లిప్తతే అతడి మెదడుని తినేస్తోంది. ఆమె తన రైఫిల్‌తో కాల్చేసినా బాగుండేది. కానీ ఆ మౌనం ఏమిటి? తనని ఇలా శిక్షిస్తుందేమిటి?

ఆ తర్వాత ఎన్నోసార్లు ఆమెకు ఎదురుగా వెళ్లి క్షమించమని అడిగాడు. ఆమె అసలు అతను అక్కడ లేనట్లుగా అక్కడ్నుంచి వెళ్లిపోయేది.

మిగతా స్టూడెంట్స్ పట్ల మాత్రం ఆమె ప్రవర్తన చాలా మామూలుగా ఉండేది. మానవత్వపు పాలు ఆమెలో ఎక్కువ. తన క్లాస్‌మేట్స్ ఎంత దిగువస్థాయికి చెందినవారైనా, తేలిగ్గా స్నేహం కలిపేసుకుంటుంది. ప్రధాని అమ్మాయి అని ఎవరయినా దూరంగా వెళితే వూరుకోదు.

లంచ్ టైమ్‌లో కూడా తన బాక్స్ తెచ్చుకొని అందరితోనూ కూర్చొని భోంచేసేది. తన బాక్స్‌లోని స్పెషల్ ఐటమ్స్ వారికికూడా పంచేది.

ఒకసారి ఇద్దరు పేద విద్యార్థులు డబ్బులేక ఫీజు కట్టకపోతే వారి పేర్లు నోటీస్ బోర్డులో చూసి ఆమే వారి తరుపున ఫీజు కట్టింది. తన క్లాసులో ఇళ్లు దూరమైపోయినవారికి తన జీప్‌లో లిఫ్ట్ యిచ్చేది. అలా క్లాసులో ఎవరికే కష్టం వచ్చినా తలలో నాలికలా వుండేది.

కాలం... అలా కదిలి... కదిలి... వాళ్ళ ఫైనలియర్ ఎగ్జామ్స్ రాసే దాకా వచ్చింది. అంతకుముందే విశ్వసౌరభ్, సౌగంధిక, యుద్ధ్‌వీర్‌లు ఐ.ఎ.ఎస్. పరీక్షలు కూడా రాశారు. (డిగ్రీ ఆఖరు సంవత్సరంలో వుండగానే ఐఎఎస్ రాయవచ్చు)

ఆ రోజే ఎం.బి.బి.ఎస్. ఆఖరి పరీక్ష. ఆ పరీక్ష అయ్యాక ఓ చిన్న ఫంక్షన్ అరేంజ్ చేశారు జూనియర్స్.

విద్యార్థులతో, ప్రొఫెసర్స్‌తో కళకళలాడుతోంది సభ. విశ్వసౌరభ్, యుద్ధ్‌వీర్‌లు మందు వరసలో కూర్చున్నారు. సౌగంధిక లేడీస్ బెంచీలవైపు కూర్చుంది.

ముందుగా ప్రిన్సిపాల్ లేచి ప్రసంగించారు.

"మైడియర్ స్టూడెంట్స్! ఈరోజు మనకు సుదినమో, చెడుదినమో అర్థం కావటంలేదు.

ఒకవైపు పరీక్షలు అయిపోయి వైద్యపట్టాని తీసుకోబోతున్నారన్న ఆనందం. ఇంకోవైపు వీళ్ళు రేపట్నుంచి ఇంక కాలేజీలో కన్పించరన్న వాస్తవం నా గుండెల్ని కదిలిస్తోంది. అఫ్‌కోర్స్... ఇంకా ఆరునెలలు హౌస్ సర్జన్సీషిప్ వుంది. అది కేవలం హాస్పిటల్‌లో ట్రైనింగ్‌లాంటిది. ఆ కోర్సుని ఇండియాలో ఎక్కడైనా పూర్తి చెయ్యవచ్చు ననుకోండి.

ఏది ఏమైనా... విశ్వసౌరభ్, సౌగంధిక, యుద్ధ్‌వీర్ లాంటి మేధావుల్ని రేపట్నుంచి మనం చూడలేమన్న వాస్తవం నన్ను కోసేస్తోంది. విశ్వసౌరభ్ – ఎప్పటికైనా నోబుల్‌ప్రైజ్

అందుకుంటాడు. సౌగంధిక ప్రధాని కూతురైనా గర్వంలేకుండా ఈ కాలేజీలో అణిగిమణిగి చక్కగా చదువుకొని గోల్డ్‌మెడల్‌ని అందుకుంది.

ఇక యుద్ధ్‌వీర్... ఈ ఐదేళ్ళు క్లాస్ రిప్రజెంటేటివ్ పదవిని చాలా చక్కగా నిర్వహించాడు. అతని దేశభక్తి శంకింపరానిది. అలాంటి ఈ ముగ్గురూ భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తెస్తారని ఆశిస్తూ వారిని అభినందిస్తూ సెలవు తీసుకుంటున్నాను..."

చప్పట్లు మారుమోగాయి అక్కడ.

"ఇప్పుడు..." సభాధ్యక్షుడి కంఠం కదిలింది. "మెరిట్ స్టూడెంట్ విశ్వసౌరభ్ మాట్లాడతారు..."

అతను లేచి వేదికముందున్న మైక్‌ని అందుకున్నాడు.

"నా జీవితధ్యేయం... ప్రేమని పొందడమే... పేరుకు ఐ.ఏ.ఎస్. పరీక్ష కూడా రాసినా నాకు కావాల్సింది ప్రేమ. నేనొక ప్రేమ పిపాసిని లక్ష్యం నిరంతరం ప్రేమని అన్వేషించడమే. నాకు కావాల్సింది డిగ్రీలు, నోబుల్ ప్రైజులు కాదు. ప్రేమ.

ఆ ప్రేమ ఓ తీయని కల. నా విషయంలో అది పెరిగి విరిగిన అల. మళ్ళీ ఆ ప్రేమ నాపట్ల తిరిగి పుష్పించేదాకా నిరంతం అన్వేషిస్తూ వుంటాను... అన్వేషిస్తూ వుంటాను..."

అతడు డయాస్ దిగిపోయేదాకా చప్పట్లు మిన్నంటుతూనే వున్నాయి.

"ఇప్పుడు ... మన ప్రియ ప్రధాని కూతురు సౌగంధిక మాట్లాడుతారు..."

ఆమె కదిలింది నావలా. ఆమె ముఖం భావరహితంగా వుంది. వినయంగా ఆమెకు చోటు ఇస్తూ పక్కకు తప్పుకున్నాడు ప్రిన్సిపాల్.

ఆమె మైక్‌ని ముందుకు తీసుకుంది.

"డియర్ ఫ్రెండ్స్..." ఆమె కంఠం గండుకోయిలలా భాసిస్తుండగా అప్పుడు జరిగింది.

దూరంగా నుండి ఆందోళనగా నలుగురు బ్లాక్ క్యాట్ కమెండోలు తన దగ్గరున్న వ్యాకీ టాకీలతో, సెల్యులార్ ఫోన్లతో ఆమె వద్దకు వేగంతో పరిగెత్తుకు రావడం, ఆమెతో చిన్నగా ఏదో చెప్పడం. ఆమె ముఖం ఆందోళనకరంగా పాలిపోవడం చకచకా జరిగిపోయాయి. ఏం జరిగిందో అర్థంకాక అంతా తెల్లబోయి చూస్తుండిపోయారు.

ఆమె ముఖంలో కన్నీళ్ళు జలజల రాలసాగాయి. అంత స్థితిలోనూ ఆమె మైక్‌ని చేతిలోకి తీసుకొని *"డియర్ ఫ్రెండ్స్! ఇప్పుడే అందిన వార్త... మా నాన్నగారైన ప్రధాని మహంతి ఎక్కిన విమానం ఢిల్లీలో 'క్రాష్' అయ్యింది. నాన్నగారికి సీరియస్‌గా వుందట.*

*నన్ను వెంటనే బయలుదేరిరమ్మన్నారు. నేను వెళుతున్నాను. ఏది ఏమైనా ఇంతకాలం నన్ను ఆదరించిన మీకు నా కృతజ్ఞతాభివందనాలు..... థాంక్స్ ఇక వుంటాను" అని వెంటనే డయాస్ దిగింది.*

అందరి మొహాల్లోనూ ఆందోళన, ఉద్వేగం, దిగ్భ్రాంతి, షాక్ కన్పిస్తున్నాయి.

డయాస్ కిందికి దిగిన ఆమె ముందు నలుగురు, వెనకాల నలుగురు బ్లాక్‌క్యాట్ కమెండోస్ అనుసరిస్తుండగా అక్కడే వున్న జీప్ ఎక్కింది. మరుక్షణం జీపు వేగంగా కదిలింది... సైరన్ మ్రోగిస్తూ.

❖ ❖ ❖

బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో అప్పటికప్పుడు ఏర్పాటుచేసిన స్పెషల్ ఫ్లయిట్‌లో ఆమె ఎక్కింది.

విచారం వాయువేగంతో పైకి లేచింది.

ఆమె కళ్లనిండా నీళ్లు – ఆ నీళ్ళ మధ్య తండ్రి రూపం గుర్తొస్తోంది.

తనకూ, ఆయనకూ అభిప్రాయాలు కలవవు. అయినా తామిద్దరూ మంచి స్నేహితులు. తన మాటని ఆయన ఎప్పుడూ కాదనరు. తనకు మిగిలింది ఆయన. ఆయనకు వున్నది తానొక్కతే! అలాంటిది ఆయన ఇప్పుడు చావు బతుకుల్లో వుండటం... ఓహ్ ఇటీజ్ రియల్లీ హారిబుల్!

దుఃఖాన్ని కంట్రోలు చేసుకోలేకపోతోంది.

అప్పుడు ఆమెకు గుర్తొచ్చింది తండ్రితో తాను ఢిల్లీలో వున్నప్పుడు ఓ సంఘటన.

❖ ❖ ❖

సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం...

న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ రోడ్డుమీద వేగంగా కదుల్తోంది ప్రధాని మహంతి కారు. పక్కనే పదహారేళ్ళ కూతురు సౌగంధిక.

స్టీరింగ్ ఆ అమ్మాయి చేతిలో వుంది. టీనేజ్‌లో పరవళ్ళు తొక్కుతున్న అమ్మాయి కాబట్టి కారు కూడా మెరుపు వేగంతో కదుల్తోంది.

కంప్యూటరైజ్‌డ్ కారు అది. స్టీరింగ్ ముందున్న కంప్యూటర్ స్క్రీన్‌లో... ఆ కారుకు ముందూ వెనకాల వున్న వాహనాలు, వాటి దూరం, కారుకు మైలు దూరం ముందున్న గుంటలు, ట్రాఫిక్ సిగ్నల్స్, డైవర్షన్ తీసుకోవాల్సిన విధానం.... చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ కారుని ఫాలో అవుతూ వెనకాల ప్రధాని సెక్యూరిటీ జీపులు వస్తున్నాయి.

"డాడీ!" చిలిపి వేగంతో కదిలింది టీనేజ్ కూతరు కంఠం "ఇంకో నాలుగు రోజుల్లో నా పుట్టిన రోజు కదా! ఏం బహుమతి ఇస్తున్నారు?"

మహంతి చిరునవ్వుతో చూశాడు. ఇరవై ఒకటవ శతాబ్దపు నవీన పోకడకు ప్రతిరూపంగా వున్న చిలిపి కూతురంటే అతనికి ప్రాణం. భార్య పోయిన దగ్గర్నుంచి తనకు మిగిలిన ఏకైక ఆస్తి ఆమె.

ఆ అమ్మాయి చిలిపితనం వర్ణించాలటే మాటలు చాలవు. ఢిల్లీలో చదువుతున్న కాలేజీలో అందరితో క్లోజ్‌గా మూవ్ అవుతుంది. క్లాసులో ఆకతాయి అబ్బాయిల్ని ఏడిపిస్తుంది. తన ముందున్న అమ్మాయి జడ కత్తిరిస్తుంది. ఆ అమ్మాయి పుస్తకాల్లో ఎవరో అబ్బాయి రాసినట్లుగా 'ఐ లవ్ యూ' అని రాస్తుంది. లెక్చరర్స్ పాఠం చెబుతున్నప్పుడు పిల్లి కూతలు కూస్తుంది. వాళ్ళకు నిక్‌నేమ్స్ పెడుతుంది.

తన రక్షణ నిమిత్తం వచ్చిన బ్లాక్ క్యాట్ కమెండోల కళ్లు కప్పి కాలేజీ టైమ్‌లో మార్నింగ్‌షోలు చూస్తుంది. క్లాసులో పాఠాలు చెప్పకుండా నిద్రపోయే బోటనీ లెక్చరర్ జాకెట్లో తేళ్ళు, పురుగులు వదులుతుంది. ప్రిన్సిపాల్ రూమ్‌లోకి దొంగతనంగా ప్రవేశించి ఆవిడ లంచ్‌కోసం తెచ్చుకున్న టిఫిన్ తినేస్తుంది. మొత్తంమీద ఆ అమ్మాయి అల్లరితో ఆ కాలేజీ యావత్తు ఉత్సాహం పరవళ్ళు తొక్కుతున్నట్లుంటుంది.

ఆ అమ్మాయి ఎంత అల్లరిదైనా తెలివైనది. క్లాసులో ఎప్పుడూ ఫస్ట్ లేక సెకండ్ ర్యాంక్ ఆమెదే. మానవత్వపు పాలు కూడా ఆమెకు ఎక్కువ. తన క్లాస్‌మేట్స్ ఎంత దిగువస్థాయిలో వున్నా తేలిగ్గా స్నేహం కలిపేసుకుంటుంది. ప్రధాని అమ్మాయి అని ఎవరైనా దూరంగా వెళ్తే వూరుకోదు.

ఆ అమ్మాయి దృష్టిలో న్యాయం అందరికీ ఒకటే. ఓసారి ఫిజిక్స్ లెక్చరర్ ఆమె ప్రధాని కూతురు అన్న అభిమానంతో ఓ రెండు మార్కులు ఎక్కువేసి ఆమెకే క్లాస్ ఫస్ట్ ఇచ్చింది. అయితే ఆ అమ్మాయి తన పేపర్‌ని తీసుకెళ్లి ప్రిన్స్‌పాల్‌కి లెక్చరర్ మీద కంప్లయింట్ ఇచ్చింది. ఆ సంఘటనతో ఇంకెవరూ ఆమెకు ఎక్కువ మార్కులు ఇవ్వటంగాని, ఇతర సదుపాయాలు సమకూర్చటం గాని చేయలేదు.

"డాడీ!"

"ఊఁ" ఆలోచనల్లో మునిగిన ప్రధానిలో కదలిక.

"ఇంకో మూడు రోజుల్లో నా పుట్టిన రోజు...."

మరోసారి గుర్తుచేస్తున్నట్లుగా కదిలాయి ఆమె లేత పెదాలు.

"ఐ నో మైడియర్ బేబీ!"

"వెల్! మరి గిఫ్ట్ ఏం ఇస్తున్నారు?" టర్నింగ్‌లో యాక్సిలేటర్‌మీద కాలిని తీయకుండానే కంట్రోలు చేస్తూ అంది.

"అదే ఆలోచిస్తున్నాను. నీవు చెప్పు ఏం ఇవ్వమంటావు?"

కారు జమీనపూర్ దాటుతోంది వేగంగా.

ఒక్కక్షణం ఆ అమ్మాయి కళ్ళు ప్రధాని ఆరోగ్యవంతమైన పచ్చటి చెంపలమీద ప్రసరించాయి. మరుక్షణం స్టీరింగ్‌ని కంట్రోల్ చేస్తూ, మరో చేత్తో ప్రధాని బుగ్గమీద తన లేత పెదాలతో ముద్ర వేసింది.

"ఐ లవ్ యూ డాడీ! అన్నట్టూ మీకో విషయం తెలుసా? వయసులో వున్నప్పుడు ఓ యువకుడికి ఈ ప్రపంచంలో అత్యంత ప్రియమయినది ఏమిటో తెలుసా? భార్య వెచ్చటి ముద్దు.

అదే కాస్త వయసు వచ్చాక ప్రియమైనది ఏమిటో తెలుసా? టీనేజ్ కూతురు ముద్దు... యామై కరెక్ట్ డాడీ?" ఎనలేని చిలిపితనం ఆమెలో తన పనిని సమర్థించు కోవటం కోసం.

కూతురు చిలిపి మాటలకు సంతోషిస్తూనే కంప్యూటర్ స్క్రీన్‌కేసి చూశాడు మహంతి. మరుక్షణం నిశ్చేష్టత ఆవరించింది అతనిలో.

"మైగాడ్! ఏరి సెక్యూరిటి స్టాఫ్?"

ఆమెలో కొంటెదనం –

"మరి నా డ్రైవింగ్ అంటే ఏమిటనుకన్నావ్ డాడీ! నా చాకచక్యంతో వాళ్ళని ఎప్పుడో తప్పించేశాను... మన ప్రైవసీకి అడ్డురాకుండా."

ప్రధాని మౌనంగా వుండిపోయాడు. పరవళ్ళు తొక్కుతూ ఆనకట్టని దాచెయ్యాలని ప్రయత్నించే అలల్ని ఆపడం ఎవరితనం? కారు... ఆమె పదహారేళ్ల అమ్మాయి చేతిలో బందీని అన్నట్లుగా తన మానాన తాను పోతూనే వుంది.

"అన్నట్లు నా బర్త్‌డే గిఫ్ట్ ఏం ఇస్తారో చెప్పరేం? ఒక చేతితో స్టీరింగ్‌ని సర్రున కోస్తూ అందామె. శంఖంలాంటి ఆమె మెడలో సన్నని బంగారు గొలుసు ఆమె శరీరం రంగులో కలిసిపోయి మెరుస్తోంది.

సరిగ్గా అప్పుడు... కంప్యూటర్‌లో డేంజర్ బెల్ శబ్దం చేసింది చిన్నగా.

మరుక్షణం మహంతి కంఠం కదిలింది –

"అది సర్లే గాని .... ముందు యాక్సిలేటర్ మీద నుంచి కాలు తీసేయ్ లేకపోతే నీకు బర్త్‌డే గిఫ్ట్ ఇవ్వడానికి మనిద్దరం మిగలం."

"అబ్బో! ఏమో అనుకున్నాను. ప్రైమ్‌మినిస్టర్ గారికి మాటలు బాగానే వచ్చే" యాక్సిలేటర్ మీదనుంచి కాలు తొలగిస్తూ అంది.

"ఇప్పుడు స్టీరింగ్ నా చేతికి ఇవ్వు, నీ పుట్టినరోజు బహుమతి ఏమిటో చూపిస్తాను" అన్నాడు.

ఆ అమ్మాయి కారుని స్లోగా పార్క్ చేసింది ఓ పక్కన. మహంతి డ్రైవింగ్ సీటులోకి మారాడు.

కారు కదిలింది. క్షణాలు గడుస్తున్నాయి. కారుతోపాటు ప్రయాణంచేసి చివరకు జమునా నది ఒడ్డున ఆగింది.

కారులోంచి దిగుతూ ఎదురుగా వున్న సరస్సుకేసి చూపించాడు మహంతి. ఆమె కళ్లు అటుకేసి కదిలాయి. ఎండలో ధగధగా మెరుస్తూ సరస్సు మధ్యలో ఓ రాజప్రసాదం. ఆ మెరుపుముందు సూర్యుడు వెలసిబోయినట్లనిపిస్తోంది.

మహంతి ఒడ్డుకేసి కదిలి, సిద్ధంగా వున్న ఓ మోటారు బోటులో ఎక్కాడు. ఆమె అనుసరించింది.

మోటారులాంచీ వేగంగా కదిలింది నీళ్లను చీల్చుకుంటూ.... రాజప్రాసాదంలా వున్న ఆ భవంతికేసి.

సరిగ్గా రెండు నిముషాల్లో ఆ భవంతి ముందున్నారు ప్రధాని, ఆమె. వాళ్ల చుట్టూ నీళ్లు ప్రవహిస్తున్నాయి ఉరకలువేస్తూ. ఆ నీటిని చూస్తూ లోపలికి ప్రవేశించింది ఆమె. ప్రవేశిస్తూనే నిశ్చేష్టురాలై నిల్చుండి పోయిందామె.

ఎదురుగా ఎటు చూసినా అద్దాలు... ఆ అద్దాల్లో తమ ప్రతిబింబాలు, మధురంగా సంగీతం విన్పించే వాల్‌క్లాక్... ఇరవై నాలుగు గంటలూ సేవకు సిద్ధం అన్నట్లు నిలబడున్న రోబోట్లు, సిటీలో ఏ మూల ఏం జరిగినా కనిపించే క్లోజ్‌డ్ సర్క్యూట్ టీవీలు, బటన్ నొక్కగానే తాము కోరుకున్న మేకప్‌తో తమ ప్రతిబింబాన్ని స్క్రీన్ మీద కన్పింపజేసే కంప్యూటర్లూ.... వీడియోగేమ్ మెషిన్‌లూ.... ఓహ్! ఇరవయ్యొకటవ శతాబ్దపు భూలోకమా లేక స్వర్గమా!

ఆమె విభ్రాంతితో చూస్తూ వుండగానే, మహంతి కంఠం కదిలింది.

"అలనాడు షాజహాన్ తన భార్యకోసం తాజ్‌మహల్ కట్టించాడు. ఇంకో చక్రవర్తి భాగ్యనగరాన్ని నిర్మించాడు తన అర్ధాంగికోసం. నాకు భార్య లేదు. ఒకే ఒక కూతురు తప్ప. ఆ కూతురికోసం ఈ భవంతిని ఏరి కోరి కట్టించాను. నా తదనంతరం నా ముద్దుల కూతురు నా సింహాసనాన్ని అధిరోహించి ఈ భవంతి నుండే తన పరిపాలనా కార్యక్రమాల్ని నిర్వహించాలని నా ప్రగాఢ కోరిక."

అప్పుడు కదిలిపోయిందామె జీవితంలో మొట్టమొదటిసారిగా కంటి చుట్టూ నీటిపొర పేరుకోగా, ఓ టెర్రరిస్టు జరిపిన కాల్పుల్లో తనూ, డాడీ తప్పించుకోగా అమ్మ బలయి పోయింది. ఆ రోజు నుంచి... ఇప్పటిదాకా మళ్లీ పెళ్లి చేసుకోకుండా తనని కంటికి రెప్పలాగా చూసుకున్నాడు డాడీ. ఎంతోమంది దేశవిదేశీయులు తమ పిల్లని ఆఫర్ చేసినా పెళ్లిమాటే తలపెట్టవద్దని తిరస్కరించాడు తండ్రి. అలాంటి డాడీ ఎంతమందికి వుంటారు? క్షణాలు గడుస్తున్నాయి... ఆమె ఆలోచనలతో.

సరిగ్గా పదో క్షణంలో కదిలిందామె ఓ నిశ్చయానికి వచ్చినట్లుగా.

"డాడీ! మీరిచ్చిన గిఫ్ట్ అపూర్వం, అద్భుతం ఐ రియల్లీ అడ్మైర్ ఇట్. కానీ... నేను రాజకీయాల్లోకి రాలేను డాడీ. ఐ హేట్ ది పాలిటిక్స్! నాకు స్వేచ్ఛగా, ప్రశాంతంగా బతకాలనిపిస్తోంది డాడీ. ఈ ఒక్క విషయంలో నన్ను క్షమించండి డాడీ,"

ఆ మాటలు విని నిశ్చేష్టుడిలా చూస్తుండిపోయాడు. మహంతి కూతరివైపు తన చెవుల్ని తనే నమ్మలేనట్లుగా, మరుక్షణం కదిలిందతని కంఠం ఆ షాక్ నుంచి తేరుకుంటూ–

"చూడు బేబీ! ప్రధాని పదవిని మించిన ఉన్నత పదవి ఇంకొకటి లేదు కదా! నా తర్వాత నీవే ప్రధాని పదవిని అధిష్టించాలని నా కోరిక" అన్నారు మహంతి.

"ఊహూ! నన్ను మాట్లాడనీయండి డాడీ! నాకు స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆడుతూ పాడుతూ సీతాకోకచిలుకలా ఎగిరిపోతూ వుండాలని నా కోరిక. ఈ రాచరికపు దాస్యశృంఖలాలని తెంచుకుని పారిపోవాలనిపిస్తోంది. ఒకసారి ఆలోచించండి డాడీ! మనం నిజంగా ఆనందంగా వున్నామా! ప్రతిక్షణం వందమంది తుపాకులతో కాపలా!

మనం తిండి తినాలన్నా, బయటికి వెళ్లాలన్నా, ఆఖరికి స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టాలన్నా వారు మన వెనకాలే కాపలా!

ఇదంతా చూస్తుంటే దేశాన్ని పరిపాలించే అత్యున్నత అధికార భవనంలో వున్నట్లు లేదు. పెద్ద జైల్లో వున్నట్లుగా అన్పిస్తోంది.

నిజం చెప్పాలంటే జైలులో వున్న ఖైదీలే నయం. తోటివారితో ఆడుతూ పాడుతూ కొంతవరకు స్వేచ్ఛగా వుంటారు. కానీ మనం... ప్రతిక్షణం టెన్షన్‌కి గురికావాలి. ఆఖరికి ప్రెస్ రిపోర్టర్స్ ముందు కూడా సహజంగా నవ్వు రాకపోయినా మొహాన పులుముకోవాల్సి వస్తోంది. రాజరికపు డిగ్నిటీని మెయిన్‌టెయిన్ చేయటానికి. అందుకే ఐ హేట్ సిస్టమ్! ఐ హేట్ దిస్ బ్లడీ పాలిటిక్స్! నాకు స్వేచ్ఛగా చదువుకుని పెళ్ళి చేసుకుని పిల్లా పాపలతో కలకాలం ఆనందంగా వుండాలని వుంది కానీ ఇలా బతుకొక యుగంగా, బందిఖానాలో బతకడం నాకిష్టంలేదు."

“అయితే నీ నర్ణయం మారదా?”

“ఊహూ! మారదు. ప్రస్తుతం నేను చేస్తున్న ప్లస్ టూ అయిపోగానే మెడిసిన్‌లో జాయిన్ అవుతాను. అయితే ప్రధాని కూతురుగా అందరూ గుర్తుపట్టేటట్టు కాదు. ఎవరో అనామకురాలిగా వెళ్లి యూనివర్శిటీలో స్వేచ్ఛగా, హాయిగా గడిపేస్తాను....”

“ఎలా గడుపుతావు? నీ ఫోటో అన్ని పేపర్లలో వచ్చింది కదా! ప్రజలు నిన్ను చూస్తేనే గుర్తు పట్టేస్తారు” అన్నారాయన.

“నిజమే! కానీ దానికి ఓ ప్రత్యామ్నాయం ఆలోచించాను. నేనెవరో తెలియకుండా బురఖా వేసుకుంటాను. పైగా ఢిల్లీ యూనివర్శిటీలో చదవను. అమ్మ స్వస్థలం అయిన ఆంధ్రప్రదేశ్‌లో ఈ పాలిటిక్స్‌కి దూరంగా వెళ్ళి చదువుకుంటాను...”

నోటమాట రానట్లుగా విస్మయంగా చూస్తుండిపోయాడు మహంతి ఆమెకేసి.

ఓ పదినిమిషాలు గడిచాక నిట్టూర్చి –

“సరే నీ ఇష్టం బేబీ! నీవు ఎంతవరకు చదువుకుంటానంటే అంత వరకు చదువుకో. నీకు కావాల్సిన సర్వసౌకర్యాలు ఏర్పాటుచేస్తాను. నీ మనసు బాధపెట్టటం నాకు అసలు ఇష్టంలేదు. నీ ఇష్టం వచ్చినట్లే చెయ్యి” అంటూ అక్కడ్నుంచి వెళ్లిపోయాడాయన భారమైన హృదయంతో.

❖ ❖ ❖

బోయింగ్ 737 న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుని సమీపించడంతో గతం తాలూకు ఆలోచనల్నుంచి ఈ లోకంలోకి వచ్చింది సౌగంధిక. ప్రయాణీకులు ఒక్కొక్కరూ దిగుతున్నారు సామానులు చేతిలో పట్టుకుని.

భారంగా సూట్‌కుస్‌ని చేతిలోకి తీసుకుంది ఆమె. ఆమె కళ్లు జ్యోతుల్లా వెలుగుతున్నాయి.

విమానం ఆఖరిమెట్టు దిగుతుండగా ఒక్కసారిగా రిపోర్టర్ల కెమెరాలు ఆమెకేసి ఫ్లాష్‌లు తళుక్కుమన్నాయి. ఆమె అవేం పట్టించుకునే స్థితిలో లేదు. తన సూట్‌కేస్‌ని తీసుకుని లాంజ్‌లోకి నడిచింది.

సరిగ్గా అప్పుడు... త్రివర్ణపతాకం వున్న ఓ అధికార వాహనం వచ్చి ఆమె ముందు నిలడింది. సెక్యూరిటీగార్డులు, బ్లాక్ కమెండోస్ వేయి కన్నులతో వాచ్ చేస్తుండగా కారు కదిలింది.

దారి పొడవునా బారులు తీరి వున్నారు జనాలు. అందరి మొహాల్లో దిగులు, విచారం గూడు కట్టుకున్నట్లున్నాయి. తమ ప్రియతమ నాయకుడికి జరిగిన ఆపదకు విలపిస్తున్నట్లున్నాయి వారి వదనాలు.

కొందరైతే రోడ్డుమీదే బిగ్గరగా ఏడుస్తూ గుండెలు బాదుకుంటున్నారు.

దాదాపు ఐదు సంవత్సరాలనుంచి కంటికి రెప్పవాల్చకుండా దేశాన్ని ఓ ఉన్నత స్థాయికి తీసుకొచ్చాడు మహంతి. అతడు ప్రధాని కాకముందు దేశ పరిస్థితి దారుణంగా వుంది. శాంతిభద్రతలు లోపించి మతకలహాలు పెచ్చురేగిపోయాయి. నిరుద్యోగసమస్య విపరీతంగా పెరిగిపోయి దేశ ఆర్థికపరిస్థితి దారుణంగా వుంది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అధికారానికి వచ్చాడు మహంతి.

పదవిలోకి వస్తూనే కఠిన చర్యలు తీసుకొన్నాడు. ఫలితంగా మతకలహాలు అదుపులోకి వచ్చాయి. శాంతికపోతం స్వేచ్ఛగా రెక్కలు విప్పుకుని ఎగిరింది. చెదిరిపోయిన ఆర్థిక పరిస్థితి బాగుపడింది. దాంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

అందుకే ప్రజలు మహంతిని అంతగా అభిమానించడం! అతనికి జరిగిన ప్రమాదం తమ కుటుంబానికే జరిగినట్లు తల్లడిల్లిపోయారు.

ఆమె ఆలోచనల్ని సర్రున కోస్తూ కారు ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ముందు ఆగింది. మెరుపు వేగంతో డోర్ తెరిచారు కమెండోలు. ఆమె ఒక్క ఉదుటున లోపలికి పరిగెత్తింది.

ఆమెను చూస్తూనే పేషంట్లు, డాక్టర్లు కారిడార్ పక్కకు తప్పుకున్నారు... దారి ఇస్తూ.

తడబడే గుండెలతో ఆమె ఇంటెన్సివ్ కేర్ యూనిట్ డోర్ తెరుచుకుని లోపలికి వెళ్లింది.

అప్పటికే మహంతి కొన ఊపిరితో వున్నాడు.

మరణశయ్య మీదున్న అతని కనురెప్పలు బరువుగా కదిలాయి... కూతురుకేసి.

ఒక్క ఉదుటున తండ్రిని కౌగలించుకుని బావురుమంటూ ఏడ్చింది సౌగంధిక.

దట్టంగా అలముకున్న నల్లటి మబ్బుల్లోంచి ఒక్కొక్క చినుకు నెమ్మదిగా కిందికి జారసాగింది.

ఎన్నో సంవత్సరాలు తనతో కష్టసుఖాలు పంచుకున్న తండ్రి... తల్లిపోయిన దగ్గర్నుంచి ఇంకో తల్లి తనని సరిగ్గా చూస్తుందో లేదోనని తనకోసం పెళ్లి చేసుకోకుండా త్యాగం చేసిన తండ్రి... తన మాట కాదనలేక తనని అజ్ఞాతంగా కాలేజీలో చదివించిన తండ్రి... దేశ ప్రజలకు ప్రీతికరమైన ప్రధాని ... ఇప్పుడు మరణం అంచున వున్నాడు. ఆకాశంలోంచి ఓ దేవుడు నిర్దయగా ఓ బాణంతో

కొట్టినట్లుగా విలవిలలాడుతూ ఆఖరి క్షణాలలో వున్నాడు.

ఒక్కసారిగా బరస్ట్ అయ్యిందామె తండ్రిని చుట్టుకుంటూ. కొద్దిగా ముందుకు వంగి కూతురిని ఆప్యాయంగా ముద్దు పెట్టుకున్నాడు మహంతి.

ఆమె కళ్లనుంచి కన్నీళ్లు విరామం లేకుండా ధారాపాతంగా కారుతూనే వున్నాయి.

అప్పుడు పెగిలింది అతని కంఠం.

"బేబీ! ఈ లోకానికీ నాకూ సెలవు అయ్యిందమ్మా! అందుకే వెళ్లిపోతున్నాను... వెళ్లే ముందు నన్ను ఒకే ఒక బాధ మెలిపెడుతోంది. నా ప్రజలకు ఎన్నో ఆశలు పెట్టాను. వాగ్దానాలు చేశాను. ఆ ఆశలు తీరకుండానే వెళుతున్నానమ్మా..."

"డాడీ...!" షాక్ తిన్నట్లుగా అంది ఆమె.

"బేబీ! ఈ చివరి క్షణాలలో నాకొక వాగ్దానం చేస్తావా?" అన్నాడు మహంతి.

కళ్లు పెద్దవిచేసి చూసింది. "చెప్పండి డాడీ! మీరేం చెయ్యమంటే అది చేస్తాను."

ఆయాసంగా కదిలింది మహంతి కంఠం.

"నేను పోయాక ఈ దేశం ముక్కలవుతుందమ్మా! నా తర్వాత పదవిని ఆక్రమించుకుని దేశాన్ని మాఫియా పాలు చేయాలని కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. అందుకే... అందుకే..."

ఆయాసంవల్ల ఆగిపోయాడు మహంతి.

"చెప్పండి డాడీ! అందుకని... ఏం చెయ్యాలి?" టెన్షన్‌తో కదిలింది సౌగంధిక గొంతు.

"నా తర్వాత నీవే ఈ దేశానికి ప్రధానమంత్రివి కావాలి." నెమ్మదిగా అన్నారాయన.

ఎక్కడో వల్కనో పగిలిన చప్పుడు.

ఇంకెక్కడో ఓ శతఘ్ని మెదడు పొరల్ని చీల్చిన సవ్వడి ఆమెలో ఆసహ్యమన్న విషయం నాకు తెలుసు. అయినా నేను పోయాక నా సంఖ్య మారాలిప్రజలు ఆనాథలు కాకూడదు. నీవైతే ఇక్కడ అన్ని వర్గాలు, ప్రజలూ ఆమోదిస్తారు. లేకపోతే దేశం ముక్కలు చెక్కలవుతుంది. చెప్పమ్మా ఈ ప్రజలకోసం నా ఆఖరి కోరక తీరుస్తానని...

అంతే కాదు! నీ ఈ ప్రయత్నంలో ప్రేమ, పెళ్ళిలాంటి వాటికి అతీతంగా వుండాలి. ఈ భవబంధాలు ఏవీ లేనప్పుడే నీవు స్వేచ్ఛగా ప్రజలను జనరంజకంగా పరిపాలించ గలవు.... చెప్పు నీవు సైతం పెళ్లిలాంటి బందిఖానా వదిలి దేశానికే అంకితం అవుతానని..." ఊపిరి పీల్చలేకపోయాడు మహంతి.

మహా అయితే ఇంకో పది సెకన్‌లు. ఆ తర్వాత తండ్రి ఈ లోకంలో వుండడు. ఆయన ఆత్మని సంతృప్తితో ఈ లోకంనుండి వెళ్ళనీ! ఆలోచనలు ఆమెలో. ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా అతని చేతిలో వాగ్దానం చేసింది శిరసావహిస్తున్నట్లుగా.

"థాంక్స్ బేబీ" సంతృప్తి మహంతి కంఠంలో.

అంతే! అవే అతని ఆఖరి మాటలు.

మరుక్షణం తల పక్కకి వాలిపోయింది.

చూపులు శూన్యంలోకి చూస్తుండిపోయాయి... నిశ్చలంగా, చలనరహితంగా.

అప్పటిదాకా అక్కడ కదులుతున్న గాలి ఆ దృశ్యం చూడలేనట్లుగా స్తంభించి పోయింది.

షాక్ తిన్నట్లుగా కళ్లు పెద్దవి చేసిచూసింది తండ్రిని. ఒక్క క్షణం. ఆమె కదిలింది తండ్రివైపు. మృత్యువు ఒడిలో సేద తీరుతున్న అతని కనురెప్పలను కిందికి దించుతూ, సున్నితంగా నుదుటిమీద తన పెదాల్తో స్పృశించిందామె.

బయట వర్షం క్రమంగా పెద్దదవుతోంది.

స్తంభించిన గాలి తిరిగి చలనం సంతరించుకుంటూ వర్షానికి తోడవుతోంది. నిర్లిప్తంగా, ఉద్వేగరహితంగా అతనికేసి చూస్తూండిపోయిందామె.

# 12

*"భారతదేశం నా మాతృభూమి. ఈ దేశం సర్వసౌఖ్యంకోసం, అభివృద్ధికోసం పాటుపడతాను.."* విశాలమైన రాష్ట్రపతి భవన్‌లో భారత అధ్యక్షుడి కంఠం గంభీరంగా ధ్వనిస్తోంది. *ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న ఆమె పెదాలు కదులుతున్నాయి ఆ మాటలను అనుకరిస్తూ.*

విలేకరుల కెమెరాలు కదులుతున్నాయి వేగంగా. దూరదర్శన్ ఆ దృశ్యాన్ని తనలో నిక్షిప్తం చేసుకుంటోంది... దేశం నలుమూలలకు చేరవేస్తూ.

ప్రపంచంలోనే అతి చిన్న వయసులో దేశప్రధాని బాధ్యతలను చేపట్టిన ఆమెవైపు అబ్బురంగా చూస్తున్నారు ఎం.పీలు. ఆమె నిల్చున్న తీరు ఓ పట్టపురాణి ఠీవిగా నిలబడినట్లుంది. ఆకాశంలోంచి ఇంద్రధనస్సు అనే వారధి ద్వారా భూమిమీదకు అడుగు పెట్టిన అప్సరసలా వుందామె. ఆమె ముఖంలో పవిత్రత మెరిసిపోతోంది. ఆమె మాట్లాడుతుంటే గాయని ఎవరో గుసగుసలాడుతున్నట్లుగా వుంది.

ప్రమాణస్వీకారం ముగిసింది. బిలబిలమంటూ లేచారు ఆసీనులైన వారంతా.

ఆమె బయటికి నడిచింది. ఆఖరి మెట్టు దిగుతుండగా ఒక్కసారిగా సైనిక కవాతు ప్రారంభమయ్యింది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లు తమ సైన్యాలతో ఆమె ముందుకు వచ్చి సెల్యూట్ కొట్టారు.

చుట్టూ బ్యాండ్‌మేళం ధ్వనులు మిన్నంటగా ఆమె సైనికవందనం స్వీకరించింది చిరునవ్వుతో. ఆ తర్వాత ఆమె తిరిగి రాష్ట్రపతితో సమావేశమై తన మంత్రిమండలి జాబితాను సమర్పించింది. దాన్ని చూస్తూనే రాష్ట్రపతి భృకుటి ముడిపడింది. ఆశ్చర్యంగా ఆయన నోరు పెదద్దదయింది.

దేశ ఆర్థికశాఖని ఢిల్లీ యూనివర్సిటీలోని ప్రముఖ ఎకనామిక్స్ ప్రొఫెసర్ రాధేశ్యాంకి ఇచ్చింది. రక్షణశాఖని ఛీఫ్ ఆర్మీ కమాండర్ మజుందార్‌కి, హోమ్‌శాఖని ఆ సంవత్సరం ఐఏఎస్‌లో మెరిట్ వచ్చిన యువకుడు రమేష్‌చంద్రకి, వైద్యశాఖని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో పేరుపొందిన డాక్టర్ సోమరాజుకి ఇవ్వబడింది. మిగతా పదవులలో కూడా తొంభైశాతం దేశంలో వివిధ రంగాలలో నిష్ణాతులైనవారికే ఇవ్వబడ్డాయి. కేవలం ఇద్దరు రాజకీయ నాయకులు మాత్రమే ఆ జాబితాలో వున్నారు. అదీ వారి సచ్చరితులని పేరుబడ్డవారు మాత్రమే!

రాష్ట్రపతి నోటివెంట వెలువడుతున్న ఒక్కొక్క పేరు వింటూనే అక్కడ వున్న ఎంపీల ముఖాలు వెలవెలబోయాయి.

క్షణాలు గడుస్తున్నాయి... అక్కడ.

ఎంపీల ఫీలింగ్స్‌తో సంబంధం లేనట్లు ఒక్కొక్క మంత్రితో ప్రమాణస్వీకారం చేయిస్తున్నారు రాష్ట్రపతి.

ప్రమాణస్వీకారం తతంగం ముగిశాక పార్టీ శ్రేయోభిలాషి, కురువృద్ధుడు అయిన త్రిపాఠిని కలుసుకుంది. ఆయనే పార్టీ కమిటీకి అధ్యక్షుడు.

"స్వాగతం! స్వాగతం తల్లీ! మీ నాన్నగారు పోయిన తర్వాత దేశం కకావికలమై పోతుందనుకున్నారు. కానీ... నీ రాకతో దేశంలో రామరాజ్యం వచ్చినట్లునిపిస్తోంది. ఆ తండ్రికి తగ్గ కూతరువి తల్లీ నీవు. ఇప్పుడే టీవీలో మంత్రిమండలి జాబితా చూశాను.

దేశ ఆర్థికపరిస్థితి క్షుణ్ణంగా తెలిసిన ఓ ప్రొఫెసర్‌కి ఆ ఆర్థిక శాఖని ఇవ్వడం నీ తెలివితేటలకు నిదర్శనం. అలాగే ఓ ప్రముఖ డాక్టర్‌కి వైద్యశాఖని, ఐఏఎస్‌లో ఫస్టొచ్చినవారిని హోమ్‌శాఖలో నియమించడం నీ తెలివితేటలకు నిదర్శనం.

పైగా హత్యా రాజకీయాల్లో వున్నవారిని, వివిధ స్కాంలలో చిక్కుకున్నవారిని అసలే దరికి చేరనీయకపోవడం చాలా మంచి పద్ధతి.

అఫ్‌కోర్స్! నీవు ఎన్నుకున్న మంత్రులంతా ఎంపీలు కానప్పటికీ ఆరునెలల్లో వారు ఏదో ఒక నియోజకవర్గం నుంచో గెలిస్తే లేదా రాజ్యసభలో నామినేటడ్ అయివుంటే చాలు. ఏది ఏమైనా స్వాతంత్రం వచ్చిన తర్వాత ఇంత సాహసోపేతమైన చర్య ఎవరూ తీసుకోలేదు. నిజంగా నీవు గొప్పదానివి తల్లీ..."

సౌగంధిక వినయంగా వంగి ఆయన కాళ్ళకు నమస్కారం పెట్టింది. ఆమెను లేవదీసి నుదుటన ముద్దుపెట్టుకున్నారు ఆయన.

"తల్లీ! ఇంతకాలం మీ నాన్నగారి బలవంతంవల్ల పార్టీ కమిటీ అధ్యక్షపదవిని మోశాను. సాధారణంగా పార్లమెంటరీ పార్టీ, పార్టీ కమటీ పదవికి ఒకే వ్యక్తి అధ్యక్షుడుగా వుండొచ్చు. కాబట్టి పార్టీ కమిటీ పదవి నుండి నాకు సెలవు ప్రసాదించు తల్లీ...."

సౌగంధిక కంఠం కదిలింది అక్కడ.

"రాజకీయాలలో అ,ఆలు కూడా రాని చిన్నపిల్లని నేను. ఈ దేశపు ప్రధానమంత్రి పదవిని నేను చేపట్టటంకోసం కనీస వయస్సు 21 సంవత్సరాలుగా పార్లమెంటులో చట్టంచేశారు. నాన్నగారూ, మీరు రాజకీయాలలో తల పండినవారు. స్వాతంత్ర్యం వచ్చినప్పట్నుంచి మీరు రాజకీయాల్లో వుండి వివిధ పదవులను అలంకరించారు. అలాంటి మీ అనుభవం, సలహాలు, నాకూ, ఈ దేశానికీ చాలా అవసరం. నాన్నగారి తర్వాత నాకు మిగిలివున్న శ్రేయోభిలాషి మీరే. అందుకే ఈ పార్టీ కమిటీ అధ్యక్షపదవికి మీరే అన్నివిధాలా అర్హులు. ఆ పదవిలో మీరు వుండి నాకు మీ అమూల్య సలహాలు సదా అందిస్తారని ఆశిస్తాను."

త్రిపాఠి కళ్లల్లో నీళ్లు నిండాయి. ఈ రోజుల్లో ప్రధానమంత్రి కాగానే పార్టీ పగ్గాలు కూడా చేతపట్టుకోవడానికి అస్మదీయులలో కుక్కల్లాగా కాట్లాడుకునే రాజకీయనాయకుడికి, ఈమెకి ఎంత తేడా? దేశానికి ఇలాంటి యంగ్ బ్లడ్ కావాలి.

"అలాగే తల్లీ! నీకు ఏ సమస్య వచ్చినా నన్ను సంప్రదించవచ్చు. యూ ఆర్ ఆల్వేస్ వెల్‌కమ్..."

"థాంక్స్" అంటూ మరోసారి ఆయనకు నమస్కరించి తన అధికార వాహనాన్ని సమీపించింది.

ముందు నాలుగు జీపులు, వెనకాల నాలుగు కార్లతో బ్లాక్‌క్యాట్ కమెండోలు ఆమెని అప్రమత్తంగా వాచ్ చేస్తుండగా ఆమె కంటెస్సా కారు కదిలింది.

"నెక్స్‌ట్ ఐటం ఏమిటి ముకుందం?" పర్సనల్ సెక్రటరీని అడిగిందామె కార్లోనే.

"ప్రెస్ కాన్ఫరెన్స్ మేడమ్! ప్రధాని అయిన వెంటనే ప్రెస్‌ని కలుసుకోవడం ఆనవాయితీ మేడమ్" డైరీలోని షెడ్యూల్‌ని చూసి చెప్పాడు.

సౌగంధిక పెదాలమీద చిరునవ్వు కదలాడింది. జీవితంలో తానెదుర్కొనబోయే మొదటి ప్రెస్ కాన్ఫరెన్స్ ఇది. నూతన ప్రధాని కదాని ప్రతి విలేకరీ వేయి కన్నులతో తనని కనిపెడుతూంటాడు.

కారు ప్రైమ్‌మినిస్టర్ ఆఫీసుముందు ఆగింది. అప్పటికే ప్రెస్ రూంలో గుంపులు గుంపులుగా గుమిగూడారు న్యూస్ రిపోర్టర్లు, ఫొటోగ్రాఫర్లు, దూరదర్శన్ మరియు ప్రైవేటు ఛానళ్ల సిబ్బంది.

సౌగంధిక ప్రెస్‌రూంలో అడుగుపెట్టింది. మరుక్షణం ఆమెమీద కెమెరా ఫ్లాష్‌లు విరామం లేకుండా మెరిశాయి. పెదవులమీద మల్లెపూవులాంటి చిరునవ్వు చిందిస్తూ విలేఖరులకేసి చూసింది.

గుండ్రటి అందమైన ముఖం, లేత గులాబీరంగు శరీరం, తెల్లటి చీర జాకెట్టు, పాల నురగలావున్న నుదుటిమీద ఎర్రటిబొట్టు, జడలో మల్లెపూలు... అప్పుడే రెక్కలు విప్పిన తెల్లటి కాంతి శాంతికపోతంలా వుందామె. కళ్లల్లో తొణికసలాడే విజ్ఞానం, ఎదుటివారిని కొద్దిగా భయపెడుతోంది.

ఆమెని చూస్తూనే అక్కడున్న వారంతా దిగ్భ్రాంతికి లోనయ్యారు. నూతన ప్రధాని ఓ అందమైన అమ్మాయి అని తెలుసుకానీ, మరీ ఇంత అద్భుత సౌందర్యరాశి అని తెలీదు.

ఒక్కక్షణం దిగ్భ్రాంతి నుండి తేరుకున్న విలేఖరులు మరుక్షణం తమ ప్రశ్నలను సుడిగాలుల్లా ఆమె మీదకు వదిలారు.

ఆమె కంఠం కదిలింది.

ఆమె మాట్లాడుతుంటే గండుకోయిల కూసినట్లుగా, నవ్వుతుంటే ఆలయం బయట గాలి గంటలు మోగినట్లుగా వుంది.

ఆమె ఎక్కడా తడబడకుండా వాళ్లు అడిగిన ప్రశ్నలకు స్పష్టంగా, సూటిగా, స్వచ్ఛమైన ఇంగ్లీషులో జవాబులు చెప్పసాగింది.

క్షణాలు గడుస్తున్నాయి.

అప్పుడు వెలువడిందా ప్రశ్న "ఇండియా టుమారో" విలేఖరి నుండి:

"ప్రజలెన్నుకున్న వారినికాక వివిధ రంగాల్లోని ప్రముఖులు, విద్యావేత్తలను మీ మంత్రిమండలిలోకి తీసుకోవడంలో మీ ఆంతర్యం ఏమిటి?"

"బూజుపట్టిన సంప్రదాయాలకు స్వస్తి చెప్పి, వేలిముద్రల సంస్కృతిని దూరంగా తరిమికొట్టడం..." మెరుపు వేగంగా వచ్చిందామె నుంచి జవాబు.

"అంటే ఇకనుండి మీ మంత్రిమండలిలో అంతా వాళ్ళే వుంటారా? కానీ... ఇది రాజ్యాంగాన్ని లిఖించిన పెద్దల కాల నిర్ణయానికి వ్యతిరేకం కాదా?"

సౌగంధిక కంఠం వేగంగా కదిలిందా విలేఖరికేసి.

"కాలాన్ని బట్టి మార్పులు సంతరించుకుంటాయి. నాడు.. ఏనుగు తొండంతో పూలహారం పట్టుకొని, రాజభటులు వెంటరాగా రాజపురవీధుల్లో తిరుగుతుంది. ప్రజల్లో ఒకర్ని రాజును చేయాలి. ప్రజలంతా ఎదురెళతారు. అంతమందిలో ఆ ఏనుగు ఒకడ్ని ఎన్నుకొని అతని మెడలో పూలహారం వేస్తుంది. అప్పటివరకూ జనాల్లో ఒకడైన వ్యక్తి హఠాత్తుగా ఏనుగు పుణ్యమాని రాజై, తన ఇష్టారాజ్యంగా ఆ ప్రజల్ని శాసిస్తాడు, పాలిస్తాడు. ఇది నాడు కాశీమజలీ కథలో ప్రజాస్వామ్యం!

కానీ... నేడు... చిన్నప్పుడు సరిగ్గా చదువుకోక ఎమ్మెల్యేగా లేక ఎంపీలుగా మారి ప్రజల్ని పరిపాలిద్దామనుకుంటున్నారు. దేశంలోని మొత్తం ఎన్ని రాష్ట్రాలున్నాయో, కంప్యూటరంటే అదేదో రేడియోలాంటి పరికరమేమో అనుకునే కొందరు కొన్ని లక్షలమందికి ప్రజాప్రతినిధులు కావడం మన భారతీయులు చేసుకున్న ఖర్మఫలం.

అందుకే ఈ వ్యవస్థని కాలానుగుణంగా మార్చాలనే నేను ఈ చిన్న ప్రయోగం చేశాను. నిజానికి నేను మంత్రులుగా తీసుకున్న వారిని రాజ్యసభద్వారా నామినేట్ చేయించవచ్చు. కానీ నేను అలా చేయించను. ఆరునెలల లోపు వారిని ప్రజలచేత ప్రజలెన్నుకున్న నిజమైన ప్రజాప్రతినిధులుగా లోక్‌సభకి ఎన్నిక చేయించాలని నా అభిమతం...."

రాజకీయాలు ఆమెకు కొత్త అనుకున్నారు కానీ, ఆమెకు ఆ రంగంలో కూడా అనుభవం వున్నట్లుగా మాట్లాడడంతో విస్మయం చెందారు.

ఈసారి ప్రశ్న 'టైమ్స్ ఆఫ్ ఢిల్లీ' విలేఖరి నుండి వచ్చింది:

"మీరు ఈ పదవిలోకి వచ్చిన సందర్భంలో ఎదుర్కొనవల్సిన మొదటి సమస్య – దేశ ఆర్థికపరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా వుంది. ఈ సమస్యకి పరిష్కారం – ?"

అతని ప్రశ్న పూర్తికాకుండానే కంఠం వేగంగా కదిలింది.

"వ్యయంమీద పన్ను విధిస్తున్నాము. ఇకనుండి ఆదాయం ఒక పరిమితి దాటినవారు తను ఖర్చుపెట్టే ప్రతి పైసాకి రసీదు తీసుకొని పన్ను కట్టాల్సి వుంటుంది. దీనివల్ల విపరీతంగా పెరిగిపోతున్న బ్లాక్‌మనీని చాలావరకు అరికట్టవచ్చు.

ఇంకో ముఖ్యమైన చర్య ఏమిటంటే – మిలటరీమీద పెట్టే ఖర్చు సగానికి సగం తగ్గిస్తున్నాను. మన భారతీయ ఆర్థిక వ్యవస్థలో మిలటరీకి బడ్జెట్‌లో నలభైశాతం వరకూ ఖర్చుపెడుతున్నాము. దానిని సగానికి సగం తగ్గిస్తే, ఎన్నో కోట్లు ఆదా అయి సామాన్య ప్రజల జీవన ప్రమాణం పెరుగుతంది" అని చెప్పింది సౌగంధిక.

చప్పట్లు మారుమోగాయి అక్కడ. ఆ చప్పట్ల హోరులోంచి దూసుకొచ్చింది 'ఈ రోజు' విలేఖరి కంఠం.

"అది సరైన పరిష్కారం కాదు ప్రైమ్‌మినిస్టర్! మిలటరీ ఖర్చు తగ్గిస్తే మన సైన్యం బలహీనమవుతుంది. ఫలితంగా శత్రుదేశాలవారు మన దేశం మీదకు తేలికగా దండెత్తవచ్చు...."

ఆమె చిరునవ్వుతో చూసింది అతని వైపు.

"చాలా మంచి ప్రశ్న అడిగారు! మిలటరీమీద ఖర్చు తగ్గిస్తే దానిని అవకాశంగా తీసుకొని పక్కదేశాలవారు రెచ్చిపోవచ్చు. దానికి ఓ పరిష్కారం ఆలోచించాను.

ఇకనుండి మనదేశాన్ని మనమే కాపాడుకోవాలి. అందుకే... ఇక నుండి ఏడవ తరగతి నుండి డిగ్రీస్థాయిదాకా 'దేశరక్షణ–పద్ధతులు' అంటూ ఓ సబ్జెక్టుని ప్రారంభిస్తు న్నాము. ఆ సబ్జెక్టులో రైఫిల్ షూటింగ్స్, కొండల్ని అవలీలగా ఎక్కడం, ఆకాశంలోని విమానం నుండి శత్రుసైన్యాల ఉనికి, దాడులు చేయడంలాంటి మిలటరీ శిక్షణా పద్ధతులు వుంటాయి.

ప్రతి వ్యక్తీ ఆ సబ్జెక్టులో తప్పనిసరిగా ఉత్తీర్ణుడు కావాల్సిందే. అలా ప్రతి వ్యక్తీ తనకు తానుగా ఈ దేశాన్ని రక్షించుకోవాలి. యుద్ధం వచ్చినప్పుడు దేశంలో ప్రతి పౌరుడూ యుద్ధవీరుడిగా చెలరేగిపోవాలి.

అసలు నా ఉద్దేశంలో... ఇన్ని కోట్ల భారతీయుల ప్రతినిధులుగా కొన్ని వేలమంది సైనికులు ఎక్కడో కొండల్లో, అడవుల్లో చలిలో ఎందుకు మగ్గిపోవాలి?

దేశ సరిహద్దులో ఎండకు ఎండి, వానకి తడుస్తూ వాళ్లలా కష్టపడుతుంటే, ఇక్కడ మనం కడుపులో చల్ల కదలకుండా కూర్చోడం ఎంతో దారుణం. కొన్నింటిని కావాలనుకుంటే మిగతావాటిని వదులుకోవాలి. మెరుగయిన జీవన ప్రమాణం కావలంటే ప్రజలు త్యాగాలు చేయాల్సివుంటుంది...."

"ఎక్సలెంట్ ఐడియా" ఉద్వేగాన్ని ఆపుకోలేనట్లుగా అరిచిందో విలేఖరి. మిగతావారు ఆమెకేసి విభ్రాంతిగా చూస్తూ టేప్ రికార్డుల్లో ఆమె మాటలను నిక్షిప్తం చేసుకుంటున్నారు.

ఈసారి ప్రశ్న దూరదర్శన్ విలేఖరి నుండి దూసుకొచ్చింది:

"మేడమ్! దేశంలో విదేశీయుల పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు కదా! మరి దానివల్ల స్వదేశీ ప్రజలు నష్టపోరా?"

"సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం ఈస్ట్ఇండియా కంపెనీవారు భారతదేశంలో వ్యాపారం చేసుకుంటామని వచ్చి దేశం మొత్తం ఆక్రమించారు.... ఇప్పుడు మళ్లీ కంపెనీల్లో పెట్టుబడి పెడతాం అంటూ క్రమక్రమంగా అన్ని కంపెనీలనూ స్వాధీనం చేసుకొని తిరిగి దేశాన్ని ఆక్రమించుకుంటారేమోనన్న భయం ప్రజల్లో, ప్రతిపక్షాల్లో వుంది కానీ... ఆ భయానికి అర్థం లేదు.

భారతీయ కంపెనీల్లో వారి వాటా 30 శాతం మించడానికి వీల్లేదని సీలింగ్ విధించాము. అంతేకాక, మనవారిలో కూడా పోటీతత్వం పెంచి, వారి ఉత్పత్తులకు ధీటుగా మనవారు కూడా వస్తువులను తయారు చేయాలన్న ఉద్దేశంతో విదేశీ పెట్టుబడులను, దిగుమతులను ప్రోత్సహిస్తున్నాము.

ఇప్పటివరకూ తాము ఎలాంటి నాసిరకం సరుకులు తయారు చేసినా, ఏం కొనక చస్తారా లాంటి పాత చింతకాయ పచ్చడి భావాలకు స్వస్తి చెప్పి ఇకనుండి విదేశీయులతో పోటీపడి నాణ్యతగల వస్తువలను మన పారిశ్రామికాధిపతులు తయారు చెయ్యాల్సి వుంటుంది. అసలు మనం తయారుచేసే వస్తువులు ఎలా వుండాలంటే – వాటి నాణ్యత చూసి విదేశీయులే భయపడేటట్లు వుండాలి. ఈ వస్తువులు తమ దేశాన్ని ఎక్కడ ఆక్రమిస్తాయోనని.

ఏది ఏమైనా వ్యాపారస్తులలో కాంపిటీటివ్ స్పిరిట్‌ని పెంచడానికి, ప్రజలకు నాణ్యతగల వస్తువులందించి, వారి జీవనప్రమాణాన్ని పెంచడానికి మేము ఈ చర్య తీసుకోక తప్పదు.”

కొందరు వ్యక్తులు ఎందుకంత గొప్పవారుగా పరిగణించబడతారో అప్పుడు అర్థమయిందా విలేఖరులకు. సన్నగా, సుతారంగా, నిరాడంబరంగా పుత్తడి బొమ్మలా స్వచ్ఛంగా మెరిసిపోతున్న ఆమెకేసి టీవీ కెమెరాలు వేగంగా కదులుతున్నాయి.

ఆఖరి ప్రశ్న ‘స్టార్ టీవీ’ విలేఖరి నుండి వచ్చింది:

“ప్రస్తుతం భారతదేశ జనాభా విపరీతంగా పెరిగిపోతోంది కదా! ఇంకా కొన్నాళ్ళలో చైనాను కూడా అధిగమించి, ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశంగా నమోదు చేసుకోబోతోంది. ఈ జనాభా సమస్యని మీరు ఎలా పరిష్కరిస్తారు?”

“నిజానికి ఈ సమస్య ప్రజల మనోభావాలపై, ఇష్టా ఇష్టాలపై, కొన్ని మతాల సంప్రదాయాలపై ఆధారపడుతుంది. రాజ్యాంగం ప్రకారం ప్రతి మనిషికి తన ఇష్టం వచ్చినట్లుగానే నడుచుకునే హక్కు వుంది. వారి స్వాతంత్ర్యాన్ని ఎవరూ కాదనలేరు. అయితే ‘చిన్న కుటుంబం ముద్దు’ అన్న విషయం వారంతట వారే తెలుసుకోవాలి.

పోతే – మా వంతు బాధ్యతగా ప్రభుత్వ ఉద్యోగాలకు అభ్యర్థులను తీసుకునే ముందు – ఒకరు లేదా ఇద్దరు కంటే ఎక్కువ సంతానం వుండకూడదు అని ముందుగా అగ్రిమెంట్ తీసుకుంటాం.

ఆ పరిధి దాటితే ఉద్యోగాల నుండి వారిని డిస్మిస్ చేసే అధికారం మాకుంది అనేటట్లు లిఖితపూర్వక పత్రం తీసుకుంటాం. అంతేకాదు – వివాహం చేసుకునే

సమయంలో కనీస వయస్సుని ఇక నుండి 25 సంవత్సరాలకు పెంచుతున్నాం. అందుకనుగుణంగా అతి త్వరలో పార్లమెంటులతో శాసనాన్ని ప్రవేశపెట్టబోతున్నాం.

"ఇంకా నయం" కదిలింది ఢిల్లీ విలేఖరి కంఠం, "ఇంతకు ముందు ఓ కుటుంబ నియంత్రణ శాఖామంత్రి ఈ అధిక జనాభాకు పరిష్కారం. దేశంలో వ్యభిచారాన్ని ప్రోత్సహించడమే అన్నాడు మేడమ్..."

మరుక్షణం నవ్వులు పువ్వులై అక్కడ విరజిమ్మబడ్డాయి. ప్రెస్ కాన్ఫరెన్స్ ముగిసింది.

అంతా లేచారు. విలేఖర్లు మాట్లాడుకుంటూ కారిడార్ వైపు కదిలారు.

"షీ ఈజ్ రియల్లీ గ్రేట్! ఇన్ని సబ్జెక్టులతో అంత అథారిటీని నేను ఇంతవరకూ ఏ ప్రధానిలోనూ చూడలేదు."

"నిజమే! ఈమె కూడా త్వరలోనే ఓ ఇందిరాగాంధీ, అంగ్‌సాన్‌సూకీ, చంద్రికలా చరిత్రపుటల్లో నిలిచిపోతుంది."

"అసలామె ఐఏఎస్ పాసవటంవల్లనే పాలనా విషయాలపై పూర్తి పరిజ్ఞానం వుంది,"

"నిజమే! రియల్లీ షీ హేజ్ క్రియేటెడ్ రికార్డ్ ఇన్ ఇండియన్ హిస్టరీ....."

## 13

కాలం గడుస్తూనే వుంది.

దేశం ఆమె పాలనతో నెమ్మదిగా రెక్కలు విప్పుకొని ముందుకు వెళుతోంది. అవినీతి క్రమక్రమంగా అంతరించిపోతోంది. శాంతికపోతాలు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. సంఘ విద్రోహులు కనుమరుగైపోతున్నారు.

పత్రికలు రకరకాల శీర్షికలతో ఆమె పాలనమీద సంపాదకీయాలు, వార్తలు ప్రచురిస్తున్నాయి.

### ప్రధాని చేతిలో అవినీతి రూపుమాపే ఆయుధం

న్యూఢిల్లీ, 14 మార్చి : దేశంలో ఏ వ్యక్తి అయినా అవినీతికి పాల్పడ్డా, కల్తీ పదార్థాలు అమ్మినా, లంచం తీసుకున్నా, వారిని కఠినంగా శిక్షించడమే కాకుండా, వారి ఆస్తి జాతీయం చేయబడుతుందని ప్రధానమంత్రి ప్రకటించారు.

ఒకసారి పట్టుబడ్డాక ఆస్తి మొత్తం ప్రభుత్వం స్వాధీనంలోకి తీసుకుంటుందన్న భయంతో ఇక నుండి అవినీతి తగ్గుముఖం పట్టవచ్చని ప్రముఖ మానసిక శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

ప్రతిపక్షాలు కూడా ఈ చర్య చాలా సమంజసంగా వుందని ఇప్పటి వరకూ ఎవరూ అమలుపర్చలేదని ప్రశంసించాయి.

## తాగుడు, లాటరీ, వ్యభిచారం నిషేధం

న్యూఢిల్లీ, 19 ఆగస్ట్ : దేశంలో పూర్తి మద్యపాన నిషేధం విధిస్తున్నట్లుగా ప్రధాని ప్రకటించారు. ఇకనుండి బార్‌లు, క్లబ్‌లు మూసివేయబడతాయి. దాంతోపాటు సింగిల్ లాటరీలు, గుర్రపు పందాలను నిషేధించారు. అలాగే ఏ వ్యక్తి అయినా వ్యభిచారం చేస్తూ పట్టుబడితే, ఆ స్త్రీతో పాటు విటుడిని కూడా అరెస్ట్‌చేసి ప్రాసిక్యూట్ చేయడానికి ప్రభుత్వానికి అన్ని అధికారాలు వుంటాయి.

లోక్‌సభలో అధికార పార్టీ పూర్తి మెజారిటీ వున్నందున పై వాటిని నిషేధిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు వెంటనే ఆమోదం పొందింది.

## ప్రముఖ ప్రతిపక్ష నాయకుడు మంత్రివర్గంలో చేరిక

న్యూఢిల్లీ, 29 డిశంబరు : సచ్చరితుడు, నీతిమంతుడని పేరు పొందిన ప్రముఖ ప్రతిపక్ష నాయకుడు శ్రీ సుందరరామయ్యని తన మంత్రి మండలిలో చేరమని ప్రధాని ఆహ్వానించారు.

శ్రీ సుందరరామయ్య రైల్వేశాఖకి మంత్రిగా వున్నప్పుడు, మద్రాసులో జరిగిన రైళ్ళ ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేసిన విషయము విదితమే. ఆ తర్వాత ఎవరెన్ని విజ్ఞప్తులు చేసినా ఆయన మంత్రిత్వ పదవిలో చేరలేదు.

అలాంటిది ప్రస్తుతం సౌగంధిక మంత్రిమండలిలో చేరుతున్నాననీ, ఆమెను చూస్తుంటే తన కూతురన్న భావం కలుగుతుందన్నదని, ఆమె అందిస్తున్న పరిపాలన చూస్తుంటే రామరాజ్యం గుర్తొస్తోందని ఆయన చెప్పారు. తన స్వంత పార్టీలో వుంటూనే ఆయన మానవవనరుల మంత్రిత్వ శాఖని నిర్వహిస్తారు.

దేశచరిత్రలో ఇప్పటివరకూ ఓ ప్రతిపక్ష నాయకుడు అధికారపార్టీ మంత్రి మండలిలో చేరడం ఇదే మొదటిసారని అభిజ్ఞ వర్గాలు పేర్కొంటున్నాయి.

## పాకిస్తాన్‌కు ప్రధాని షాక్

న్యూఢిల్లీ, 25 ఏప్రిల్ : నిన్న సరిహద్దుల్లో ఎప్పటిలాగే పాక్ సైన్యం భారతసైన్యాన్ని కవ్వించింది. వరుసగా ఆరు రౌండ్లు కాల్పులు కొనసాగించింది. ఈ విషయం తెలుసుకున్న సౌగంధిక వెంటనే భారత వైమానిక దళాన్ని పాక్‌లోని జనంలేని ఓ ప్రాంతంపైన దాడి చేయమని ఆజ్ఞాపించింది.

ఫలితంగా ఆ ప్రాంతంలో బాంబులువేసి భయభ్రాంతుల్ని చేసింది వైమానికదళం. ఈ దాడితో పాక్ బిక్కచచ్చిపోయింది.

మరోసారి కనుక కవ్వింపు చర్యలకు పాల్పడితే, ఈసారి ఏకంగా భారతసైన్యం పాక్‌ని ఆక్రమించుకుంటుందని హెచ్చరించింది ప్రధాని.

సౌగంధికకు, ఇతర ప్రధానులకు చాలా తేడా వుందని తెలుసుకున్న పాక్ ప్రభుత్వం ప్రధానికి క్షమాపణ చెప్పింది. ఇక నుండి తమ దేశం భారత్‌వైపు కన్నెత్తి కూడ చూడదని భయపడుతూ ప్రధాని ఆఫీస్‌కి పాక్ ప్రభుత్వం ఫాక్స్ పంపించింది.

అలా అలా భారతదేశ చరిత్రలో ఆమె ఓ క్రొత్త అధ్యాయాన్ని తెరిచింది. సరికొత్త విప్లవాన్ని సృష్టించింది. అలనాటి మహారాణి ప్రజలను పరిపాలించడానికి, భూలోకానికి దిగివచ్చిందా అన్పించేది. లేదా భగవంతుడు ఈ దేశాన్ని పాలించడానికి ఓ అప్సరసని దివినుండి భువికి పంపించాడేమో నన్పించేది.

ఆమెపట్ల ప్రజలకు రానురాను అభిమానం పెరగసాగింది. ఆ గౌరవం, అభిమానం ఆమె పదవి వల్ల వచ్చినవి కావు. అందులో అసలైన భక్తి వుంది. నిజమైన ప్రేమాభిమానాలు వున్నాయి.

కారణం... ఆమె అందం, చదువు, తెలివితేటలు వీటితోపాటు 'గ్రేస్'.

**అందం :** ఆమెకు సాటివచ్చే స్త్రీ మరెక్కడా లేదని దేశప్రజలకు తెలుసు. అంతెందుకు! నెల క్రితం ఆమె బ్రిటన్ వెళ్ళింది. 'ప్రపంచ అందాల పోటీ' కి చీఫ్ గెస్ట్‌గా. ప్రపంచదేశాల నుండి వచ్చిన రకరకాల సుందరాంగులుకూడా ఆమె అందం ధాటికి నిరుత్తరులయ్యారు. అమే గనుక ఆ పోటీలో పాల్గొంటే తిరుగులేకుండా 'మిస్ వరల్డ్'గా ఎన్నికయ్యేదని చెవులు కొరుక్కున్నారు జడ్జీలు.

**చదువు :** డా॥ సౌగంధిక, ఎం.బి.బి.యస్ (గోల్డ్ మెడలిస్ట్) ఐ.ఏ.ఎస్. (ఇండియా ఫస్ట్) ఎం.బి.బి.యస్. యూనివర్శిటీ ఫస్ట్ వచ్చి ప్రాక్టీస్ చేయకుండా వదిలేసింది. ఐఏఎస్ పాసయ్యి సర్వీసులో చేరకుండా వదిలేసింది.

**తెలివితేటలు :** ఆమె తన మేధాశక్తితో ఫోర్త్ జనరేషన్ కంప్యూటర్‌ని సైతం క్షణంలో ఓడించగలదు. ఏ దేశపు బోర్డర్ ఎక్కడుందో, అది ఎక్కడదాకా విస్తరించి వుందో దగ్గర్నుంచి ఓ సామాన్య యుడీసీ ఉద్యోగికి ఎంత జీతం వస్తుందో ఆమె తడుముకోకుండా చెప్పగలదు. ఆమె తెలివితేటలకు ముప్ఫై సంవత్సరాల అనుభవం వున్న రాజకీయ నాయకులే విస్మయులైపోయారు.

వీటి అన్నింటికంటే ముఖ్యమైనది 'గ్రేస్'. చాలా మందిలో వుండనిది ఆమెలో వుంది. ఆమె ఏ పనిచేసినా డిగ్నిఫైడ్‌గా వుంటుంది.

స్టెతస్కోపు పట్టుకుంటే అచ్చమైన డాక్టర్‌లా, నల్లకోటు వేసుకుంటే లాయర్‌లా, కుషన్‌చెయిర్‌లో కూర్చుంటే ఓ పెద్ద బిజినెస్ మేగ్నెట్‌లా, ప్రధాని కుర్చీలో కూర్చుంటే ఓ పరిపాలనాదక్షతగల నాయకురాలుగా వుంటుంది. అది చాలామందిలా తెచ్చిపెట్టుకున్నది కాదు. స్వాభావికంగా వచ్చింది.

ఒక్క మాటలో చెప్పాలంటే...

భారతదేశ ప్రజలకు ఆదర్శం ఆమె. ప్రతి తండ్రీ ఆమెలాంటి బంగారు కూతరుంటే ఎంత బాగుండునోనని, యువకులు ఆమెలాంటి కలల రాణి తమ స్వంతమవుతుంటే ఎంత అదృష్టమోనని భావించేవారు.

ఇక యువతుల విషయానికొస్తే... హఠాత్తుగా దేవుడు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మంటే వాళ్లు ఏమంటారంటే?

“సౌగంధిక అంతటిదానిని కావాలి. అంతకంటే ఎక్కువ దీవెనని మేము కోరుకోము” అంటారు.

ఫలితంగా దేశం త్వరితగతిలో ముందుకు దూసుకెళుతోంది ఆమె నాయకత్వంలో.

# 14

ఢిల్లీ నగరం మధ్యనున్న పదంతుస్తుల బిల్డింగ్ అది. అక్కడ సూదిపడితే శబ్దం వినిపించేంత నిశ్శబ్దంగా వుంది.

ఆ గదిలో గాలికూడా ఒక రకమైన ఉద్రిక్తతని సంతరించుకుంది.

ఆ రోజు మార్చి 15

ఆంగ్ల సాహిత్యంలో, రోమన్ చరిత్రలో విశేష ప్రాధాన్యత ఏర్పరచుకున్న రోజది. ఆ రోజునే రోమన్ సైన్యాధికారి జూలియస్ సీజర్ సర్వసభ్య సమావేశంలో హత్య చేయబడింది. అటువంటి సమావేశమే మళ్ళీ జరుగుతోంది.

జరగబోతున్న ఘోరాన్ని చూడలేక కాబోలు ఆ గదిలోని గాలి చల్లబడి బరువెక్కి కదలలేకుండా వుంది.

అయితే ఆ సమావేశానికి హాజరవుతున్నది, అధ్యక్షస్థానం అలంకరిస్తున్నది ‘బాస్’.

ఎప్పుడూ నిర్ణీత సమయానికి విచ్చేసే ‘బాస్’ ఆ రోజున రాలేదు. కానీ వస్తున్నట్లు సమాచారం అందింది. మిగిలిన సభ్యులంతా ముందుగానే సమావేశానికి విచ్చేశారు.

సభ్యులందరికి వారి వారి బ్రాండ్స్ డ్రింక్స్ సర్వ్ చేయబడ్డాయి. అంతటా ఉత్కంఠత నెలకొంది.

ఆ ఉత్కంఠతతలోనే సమావేశ స్థలానికి వచ్చాడు. 'బాస్'. అంతా లేచి నిలబడ్డారు గౌరవసూచకంగా.

రౌండ్‌టేబుల్ ముందు, తనకు నిర్ధేశింపబడిన కుర్చీలో కూర్చున్నారు.

సభ్యులందరి మొహాలు వాడిపోయి వున్నాయి.

తలపైకెత్తి 'యు' షేప్ టేబుల్ చుట్టూ కూర్చొని వున్న వారివైపు చూసి పల్చగా నవ్వాడు బాస్. ఆ నవ్వు వెనక కళ్ళలో కదిలిన మసక తెరని ఎవరూ గమనించలేదు.

"నాకు తెలుసు మీలో ఏర్పడిన అసంతృప్తికి కారణం. సౌగంధిక ప్రధాని కావటంవల్లే మీ జీవితంలో అనూహ్య మార్పులు సంభవించాయి. నిజమే, రాజకీయాలు, మాఫియా, వేర్వేరు కావు. రెండూ ఒక్కటే. ఆమె ప్రధాని కావటంతోటే మన వ్యాపారాలు దెబ్బతిన్నాయి. వ్యభిచారం, తాగుడు, మత్తుపదార్థాలు పూర్తిగా బంద్ అయ్యాయి..."

"అంతే కాదు..." ఆవేశంగా కదిలిందో సభ్యుడి కంఠం. "ఎన్నికల్లో ఎంతో డబ్బు తగలేసి ఎం.పీ.లు అయ్యాము. ఇంటింటికీ వెళ్ళి ఓట్లు అడుక్కున్నాం. విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెట్టాం. సారా సముద్రంలా పొంగి పొరలింది. ఇవన్నీ ఎందుకు చేశాం? గెలిస్తే మంత్రి పదవి వస్తుంది. ఆ డబ్బుతో పోయినవన్నీ రాబట్టుకోవాలని. అవునా?"

"అవును." కోరస్‌గా కదిలాయి కొన్ని కంఠాలు.

"కానీ ఏం జరిగింది? మహంతి హయాంలో మంత్రి పదవులు వచ్చాయి. కానీ సౌగంధిక హయాంలో అవన్నీ తుడిచిపెట్టుకుని పోయాయి. పాతికేళ్ళుగా రాజకీయాల్లో వుంటున్న మనల్ని కాదని, ఆ పిల్లకాకి ఐయ్యే యస్, ఐపియస్, ప్రొఫెసర్లని ఆ పదవుల్లో నియమించింది. దిసీజ్ అబ్సర్డ్...."

ఇంకో సభ్యుడు వెంటనే అందుకున్నాడు.

"మహంతి కనీసం కొన్నింటిని చూసీ చూడనట్లుగా వుండేవాడు. కానీ ఈ ఆడ ప్రైమ్‌మినిస్టర్ వల్ల అన్నీ సమస్యలే. మనం తుమ్మినా, దగ్గినా, ఆఖరికి ఊపిరి పీల్చినా ఆమెకే కావాలి. మొన్నటికి మొన్న మా బామ్మరిది ఏదో రేప్ కేస్‌లో ఇరుక్కొని వుంటే, విడిపిద్దామని పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాను. ఆ విషయం తెలిసి ప్రైమ్‌మినిస్టర్ నన్ను పిలిపించింది. ప్రజా ప్రతినిధులుగా మంచి పనులు చేయాలే గానీ ఇలా రేపిస్టులకు, దోపిడీదార్లకు సపోర్ట్ చేయకూడదని వార్నింగ్ ఇచ్చింది...."

"అంతేనా...! మొన్న నేను వ్యభిచారగృహం నిర్వహిస్తున్నానని రైడింగ్‌లో తెలుసుకుని నన్ను ఏకంగా పార్టీనుండే సస్పెండ్ చేసింది..." ఇంకో ఎం.పీ. బోరుమన్నాడు.

'బాస్' కళ్ల నీలం విరుగుతోంది ఎర్రగా. రెక్కలకింద కోపం గడ్డ కట్టేలోపే కంఠం సరిచేసుకున్నాడు.

"ఇవన్నీ చాలా చిన్న విషయాలు! వీటికంటే దారుణమైన విషయం ఇంకోటుంది. తన పార్టీ ఎం.పీల గత చరిత్రలు తవ్వి చూడమంటూ సి.బి.ఐ.ని ఆదేశించింది. ఎం.పీ. అన్నాక ప్రతివాడికీ ఏదో ఒక క్రిమినల్ చరిత్ర వుంటుంది..."

ఒక్క క్షణం ఆగి తిరిగి కదిలింది అతడి కంఠం. "నేరగాళ్ళకు, స్కామ్‌లో చిక్కుకున్న వారికి ఇలా ఏమాత్రం క్రిమినల్ హిస్టరీ వున్నా వారందరినీ పార్టీ నుండి బహిష్కరించేందుకు, జైలుకు పంపించేందుకు ఆమె సన్నాహాలు చేస్తోంది.

దాంతో 99 శాతం ఎం.పీ.లు పార్టీ నుండి బయటికి వస్తారు. ఆ స్థానాల్లో తన విద్యాధిక మంత్రులను, దేశంలో సచ్చరిత గలవారిని పార్టీకి ఎన్నిక చేయించాలని ఆమె మనోగతం..."

"మైగాడ్!" షాక్ తగిలినట్లుగా అదిరిపడ్డారు ఎం.పీ.లు.

"ఇది దారుణం..."

"అది మనిషి కాదు... మన పాలిట రాక్షసి..."

"దానిని చంపాలి...."

"దీనిని ఆపాలి..."

ఇలా రకరకాలుగా కలకలం ఏర్పడింది అక్కడ. ఆ పరిస్థితి అందరినీ ఇరకాటంలో పడేసింది. జరగబోతున్నది జీర్ణంకాక పిచ్చెక్కినట్లు చూస్తూండిపోయారు.

అప్పుడు నవ్వాడు 'బాస్'.

"మనపై కత్తికట్టిన దానిని బతకనివ్వడు ఈ 'బాస్'. మనల్ని తక్కువగా అంచనా వేయడంవల్ల వచ్చిన ముప్పు యిది. ఈ పరిస్థితి నుండి మనం బయటపడాలంటే ఒకే ఒక దారుంది...."

అందరిలో దిగ్భ్రాంతి, ఉద్వేగం, నరాల్ని తెంచేసేంతటి ఉద్రిక్తత.

ఆ ఉద్రిక్తతలోనే కదిలింది 'బాస్' కంఠం అక్కడ.

"ఆ దారి–సౌగంధికని లేపెయ్యడం. ఆమెని లేపేసి పైనున్న మహంతిని కలుసుకునే ఏర్పాట్లు చేస్తున్నాను..."అంటూ సౌగంధికని ఎలా చంపాలో వివరించాడు.

ఆ ప్లాన్ విన్న సభ్యులు మొహాలు చెమటతో తడిసిపోయాయి.

"అద్భుతం... ఆమెని త్వరగా లేపెయ్యండి. జీవితంలో మీకు రుణపడి వుంటాను" ఓ సభ్యుడు 'బాస్' పాదాలమీద పడిపోయాడు.

"నిజమే! ఈ ప్లాన్ దెబ్బతో అసలు మనమీద ఎవరికీ అనుమానం రాదు" అన్నాడు ఇంకో సభ్యుడు.

సమావేశం ముగిసింది.

అంతా లేచి నిలబడ్డారు. 'బాస్'తో షేక్‌హ్యాండ్ ఇచ్చి ఒక్కొక్కరు బయటికి నడిచారు.

ఆకాశం ఉరిమింది బయట.

ప్రతిగా ఓ మేఘం గర్జించింది.

బాస్ పెదవుల మీద మెరిసిందో విషపు నవ్వు.

## 15

సరిగ్గా అదే రోజు –

తన గదిలో వచ్చిన పోస్ట్‌ని చూస్తున్న ప్రధాని సౌగంధిక భృకుటి ముడిపడింది.

కారణం – ఆ కవర్‌మీద ఫ్రమ్ అడ్రస్ 'విశ్వసౌరభ్, హైద్రాబాద్' అని వుంది.

ఒక్కక్షణం...

ఆ కవర్‌ని చింపాయి ఆమె చేతివేళ్లు. మరుక్షణం అందులోంచి ఓ కాగితం బయటపడింది.

**మిస్ ప్రైమ్‌మినిస్టర్!**

*నా పేరు విశ్వసౌరభ్! నన్ను, నాప్రేమని మీరు గుర్తించడానికి నిరాకరించిన ఓ డాక్టర్‌ని. నా అభిమానాన్ని, ఆత్మీయతని ఓ గడ్డిపరకలా తీసి పారేసిన మీ కాలేజీ సహచరుడిని. నా బీదతనాన్ని ఆసరాగా తీసుకొని నా ప్రేమని తృణప్రాయంగా తిరస్కరించిన ఓ మామూలు మనిషిని. అలాంటి ఈ మామూలు మనిషి ఏం చేయబోతున్నాడో తెలుసా?*

*దేశం మొత్తాన్ని ప్రేమమయం చేయబోతున్నాడు. నేను కనిపెట్టిన 'లవ్ ఫార్ములా' వల్ల మనుషులు ఒకరినొకరు ఆకర్షించుకుంటారు.*

*ఇనుముని మాగ్నెట్ ఎలా ఆకర్షిస్తుందో అలా మనుషులు పరస్పరం ఆకర్షణకు లోనవుతారు. ఎదుటి మనిషిమీద ఎంత వ్యతిరేక భావమున్నా, నా 'లవ్ ఫార్ములా' దెబ్బకు ప్రేమ పుట్టాల్సిందే.*

*నేను ఒక మనిషికి నా 'లవ్ ఫార్ములా' డోసు ఒకటి ఇస్తే చాలు. అతన్నుంచి ఆ ప్రేమ జబ్బు గాలిలోని తరంగాల ద్వారా ఇంకో మనిషికి అంటుకుంటుంది.*

*ఆ మనిషి నుంచి ఇంకో మనిషికి, అతన్నుంచి మరో వ్యక్తికి... అలా మొత్తం భరతఖండమంతా ఆడా మగా తేడా లేకుండా ఈ ప్రేమ ఫార్ములా ఆకర్షణతో పనీ–పాటలు మానేసి నిర్వీర్యమైపోతుంది.*

*ఎంతో సస్యశ్యామలమైన ఈ దేశం త్వరలోనే నా 'ప్రేమ ఫార్ములా' మహత్యంతో ఎందుకూ పనికిరాకుండా పోతుంది. ఇంతకాలానికి విదేశీయుల దృష్టిలో భారతదేశానికున్న పవిత్రత పోతుంది.*

*ఇంత భయంకరమైన పరిస్థితిని సృష్టించబోతున్న నన్ను ఉన్మాది అనుకుంటున్నారు కదూ? అఫ్‌కోర్స్! ఐయామ్ మ్యాడ్... మే బి ఐయామ్ ఇన్‌సేన్. ఆ లవ్ ఫార్ములాని భయంకరమైన 'ఫెరమోన్స్'ని ఉపయోగించి తయారుచేశాను. 'ఫెరమోన్స్' గురించి తెలియకపోతే లైబ్రరీలో వున్న సైన్స్ మ్యాగజైన్స్ చూడు.*

*ఇదంతా ఎందుకు చేస్తున్నానో తెలుసా? నా ప్రేమని, నా అభిమానాన్ని తృణప్రాయంగా తిరస్కరించి నీ సెక్యూరిటీ స్టాఫ్‌తో నన్ను కుక్కని కొట్టినట్లుగా కొట్టించిన నీకు నా శక్తి సామర్థ్యాలేమిటో చూపించడానికి. నేను బీదవాడిని, స్కాలర్‌షిప్‌తో చదివి పైకి వచ్చినవాడినని మీకు నామీద తేలికభావం వుంది. నాకు ఆస్తి-అంతస్తులు లేవని మీకు హేళనగా వుంది. నాకు ఘనమైన వంశ ప్రతిష్ఠలు లేవని మీకు నేనంటే హీనమయిన భావముంది కదూ?*

*అందుకే... అందుకే ఇప్పుడు నేను 'ప్రేమ ఫార్ములా'ని కనిపెట్టి మీ మీద పగ తీర్చుకోబోతున్నాను. ఇది మామూలు పగ కాదు. దేశాన్ని మొత్తం దహించివేసే ప్రతీకారం.*

*ఇప్పుడు చూస్తాను మీ రాచరికపు వ్యవస్థ దీనిని ఎలా ఎదుర్కొంటుందో! భారతదేశం నలుమూలలా విస్తరించివున్న మీ అధికారం ఈ సాదా సీదా పౌరుడిని ఎలా ఎదుర్కొంటుందో చూస్తాను.*

*మీరు, మీ ప్రభుత్వపు సైన్యం ఎంతమంద వచ్చినా ఈ సామాన్యుడిని పట్టుకోలేరు. ఇది ఓ రాచరికపు వ్యవస్థకూ... ఓ సామాన్యుడికీ మధ్య జరుగుతున్న పోరాటం. అందుకే చూస్తాను మీ ఆస్తీ, అంతస్తులు, పరువు, మర్యాదలు, మందీ మార్బలం, సైన్యం నా సవాలుని ఎలా ఎదుర్కొంటాయో!*

*వేదాల ఘోషలో పవిత్రమయిన ఈ వేదభూమిలో గాంధీలు, నెహ్రూలు, తిలక్‌లు, అలీన సమావేశాలు, జనగణమణలు, వందేమాతరాలు, శాంతికపోతాలు, శ్రీహరికోటలు, ఇన్‌సాట్‌లు... ఏవీ ఎవరినీ ఆపలేవు. మీ సి.బి.ఐ.,రా, ఇంటిలిజెన్స్ బ్యూరో, మిలటరీ నన్నేమీ చేయలేవు.*

*ఇంతకాలం నాలో అంతర్గతంగా ఆవేదనని బయటకు రానీయకుండా నా గుండెకు సైలెన్సర్‌ని అమర్చుకున్నాను. ఇక నా వల్ల కాదు ఈ గుండె తాలూకూ సైలెన్సర్‌ని భరించటం.*

అందుకే... మీ మీద కసి. నన్ను ఉన్మాదిగా మార్చి మీ వ్యవస్థ మీద ప్రతీకారం. నా ప్రేమని తృణీకరిస్తే నేను కొంతవరకు సహించేవాడిని. కానీ మీ సైనికులు నన్ను కుక్కని కొట్టినట్లు బాదారు. ఓ పశువుని హింసలు పెట్టినట్లు పెట్టి, చెత్తకుండీలో పడేశారు. ఆ చెత్త కుండీ తాలూకు దుర్గంధం నా మొహాన్ని తడుపుతుంటే మెరిసింది నా మెదడులో ప్రతీకార వాంఛ. నా కసి తీర్చుకోవడానికి నాకింతకంటే మార్గం కనిపించటంలేదు ప్రైమ్‌మినిస్టర్!

అయితే నా ప్రయోగాన్ని యావత్ భారతదేశంమీద ప్రయోగించే ముందు రేపే సాయంత్రం ఢిల్లీలోని 'లవర్స్ పార్క్'లో ముందుగా ఓ యువకుడిమీద ప్రయోగిస్తున్నాను. ఆ యువకుడి నుండి నా 'లవ్ ఫార్ములా' మొత్తం లవర్స్ పార్కుని ఎలా స్వాధీనంలోకి తీసుకుంటుందో మీకే తెలుస్తుంది... ఇది కేవలం ట్రయల్ మాత్రమే! నా ప్రేమ ఫార్ములాని మీరు విశ్వసించడం కోసమే ఈ చిన్న ప్రయోగం చేస్తున్నాను.

దట్సాల్ ప్రైమ్‌మినిస్టర్... నా ప్రేమ తిరస్కారానికి ప్రతీకారంగా వెలువడిన నా 'లవ్ ఫార్ములా' బారినుండి మీరెలా ఎదుర్కొంటారో చూడాలని సరదాగా వుంది. ఓ యువకుడి అంతులేని వేదనలో.. కసిలో... ఆగ్రహంలో ప్రపంచాన్నే భస్మీపటలం చేయాలన్న తలంపుతో వెలువడిన ఈ ఫార్ములా పనితీరు రేపు సాయంత్రం నుండి మీకు అర్థమవుతుంది. దట్సాల్!

మీ ప్రేమ నిరాదరణకు గురైన

ఓ అభాగ్యుడు

సౌరభ్.... విశ్వసౌరభ్!

❖ ❖ ❖

'లవ్ ఫార్ములా' ప్రధాని సౌగంధిక భృకుటి ముడిపడింది. అసలది సాధ్యమేనా? లేక తన దృష్టిని అతని మీదకు మళ్ళించేందుకు విశ్వసౌరభ్ ఆడిన నాటకమా? 'ఫెరమోన్స్' సహాయంతో ఆ ఫార్ములాని తయారుచేశానంటున్నాడు. పైగా ఆ ఫార్ములాతో దేశం మొత్తం ప్రేమ జ్వరాన్ని నింపుతానంటున్నాడు. అది సాధ్యమేనా?

ఏది ఏమైనా కాలేజీలో వున్నప్పుడే అతడు లాబ్స్‌లో ఏవేవో ప్రయోగాలు చేస్తూండేవాడు. అతడిని తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు. ముందుగా అసలు 'ఫెరమోన్స్' ఏమిటో, అవి ఎలా పనిచేస్తాయో కనుక్కోవాలి. తర్వాత మిగతా విషయాలు ఆలోచించవచ్చు.

ఆమెలో కదులుతున్న ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెడుతూ ఇంటర్‌కమ్ వినిపించింది.

"మేడమ్! ప్రొఫెసర్ భరద్వాజగారు వచ్చారు" పర్సనల్ సెక్రటరీ గొంతు వినిపించింది.

"లోపలికి పంపు."

రిసీవర్ పెట్టేస్తూ కుర్చీలో వెనక్కి వాలింది కొద్దిక్షణాల్లో తన ఛాంబర్‌లో అడుగుపెట్టబోయే ప్రొఫెసర్ భరద్వాజకోసం వెయిట్‌చేస్తూ.

సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యులర్ బయాలజీకి డైరక్టర్ ప్రొఫెసర్ భరద్వాజ. దేశంలో రకరకాల బాక్టీరియా, వాయువులపై రీసెర్చి చేయడానికి కేంద్రప్రభుత్వంచేత ఏర్పాటు చేయబడింది. సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ. ఆ సంస్థ డైరక్టర్ అయిన ప్రొఫెసర్ భరద్వాజ 'ఫెరమోన్స్'మీద ఎంతో రీసెర్చి చేశారు. దేశంలోని వివిధ సైన్స్ మ్యాగజైన్స్‌లో ఆయన రాసిన ఆర్టికల్స్ గైడ్‌లైన్స్‌గా చోటుచేసుకున్నాయి.

డోరు నెట్టుకుంటూ లోపలికి అడుగుపెట్టాడు ప్రొఫెసర్ భరద్వాజ.

"సారీ ఫర్ ది ట్రబుల్..." కుర్చీలోంచి పైకి లేస్తూ భరద్వాజవైపు చెయ్యి చాస్తూ అందామె.

"ఫర్వాలేదు. ఇంతకూ ఏమిటి విషయం?" కూర్చుంటూ అడిగాడు ప్రొఫెసర్ భరద్వాజ.

ఒక్కక్షణం నిశ్శబ్దం.

తర్వాత నెమ్మదిగా కదిలిందామె కంఠం –

"ఫరమోన్స్ గురించి మీకు తెలుసుకదా?"

దిగ్భ్రాంతిగా చూశాడామెవైపు.

ఫెరమోన్స్! సృష్టిలో ఆడా మగల నడుమ పరస్పరం లైంగికాకర్షణని కలిగించే వాసన సంకేతాలనే 'ఫెరమోన్స్' అంటారు. జర్మన్ జీవ రసాయన శాస్త్రవేత్త అడాల్ఫ్ బుటెనాన్డ్ ఈ ఫెరమోన్స్ ఉనికిని ప్రంచానికి చాటిచెప్పాడు.

తన పరిశోధనలకు ఆయన పట్టుపురుగులను ఎంచుకున్నాడు. వాటి నుండి 12 మిల్లీ గ్రాముల స్వచ్ఛమైన ఫెరమోన్‌ని తీయగలిగాడు. ఆ కాస్త ఫెరమోను ఎంత శక్తివంతమయినదంటే... ఆ ఫెరమోను బిందువుని 1 మిల్లీ లీటరు గల నీటిలోవేసి, ఆ జలాన్ని మగ పట్టుపురుగుల చేరువులో వుంచగానే, అవన్నీ విపరీత కామోద్దీపన పొంది తుళ్ళుతూ, పడుతూ మన్మథతాపంతో వెంపర్లాడిపోయాయి. ఆ ఆడవాసన ఎంత మరులుగొలుపుతుందీ అంటే – ఎక్కడో మైలుదూరాన వున్న ఆడపురుగని మగపురుగులు వెతుక్కుంటూ వచ్చాయి. అప్పట్నించి ఇతర కీటకజాతుల్లో కూడా ఫెరమోన్లని గుర్తించారు.

ఈ విషయంలో కృషిచేసిన జర్మన్ సైంటిస్ట్‌కి 1939లో నోబెల్ ప్రైజ్ వచ్చింది. ఈ ప్రయోగాన్నే జర్మన్ నియంత హిట్లర్ ప్రపంచాన్ని నాశనం చేయటానికి ఉపయోగించాలనుకున్నాడు! కానీ ఈలోపు కొన్ని కారణాలవల్ల అది వీలుకాకపోవడంవల్ల ఆ ప్రయోగానికి చరమగీతం పడింది.

ఆలోచనలనుండి తేరుకుంటూ ప్రధానికేసి చూశాడు ప్రొఫెసర్ భరద్వాజ.

"ఫెరమోన్ సహాయంతో స్త్రీలను పురుషులు ఆకర్షించడం జరుగుతుందా?"

"జరుగుతుంది.. కాకపోతే దీని వెనకాల ఓ అత్యద్భుత బ్రెయిన్‌గల వ్యక్తి వుంటే...."

కొద్దిగా విస్మయం చోటుచేసుకుంది ఆమెలో.

"మైగాడ్! అదెలా సాధ్యం ప్రొఫెసర్?"

"దేరిజ్ నథింగ్ టు సర్‌ప్రయిజ్ మిస్ ప్రైమ్‌మినిస్టర్! ఇప్పటివరకూ ఫెరమోన్స్‌ని కేవలం జంతుశాస్త్రంలోనే ఉపయోగించారు. పశు సంపదని వృద్ధిచేయటానికి, కొన్ని అరుదైన జంతువులు నశించిపోకుండా వుండటానికి ఈ ఫెరమోన్స్‌ని ఉపయోగించారు. కానీ... ఇప్పటివరకూ మనుషులమీద వీటిని ప్రయోగించలేదు.

కారణం... జర్మన్ సైంటిస్ట్ బుటెనాన్‌డ్ ఫార్ములా మనుషులలో ఎలా వీటిని ప్రయోగించాలో తెలియజేయలేదు. అలాంటిది... అతడి ఫార్ములాని ఆధారంగా చేసుకొని ఓ అత్యద్భుత బ్రెయిన్‌గల వ్యక్తి మాత్రమే ఆ ఫార్ములాని డెవలప్‌చేసి, మనుషుల మీదకు ప్రయోగించవచ్చు."

"ఇది... ఇదెలా సాధ్యం? మనుషులకు, జంతువులకు తేడా వుంది కదా! వశీకరణంలాంటి కనికట్టు విద్యలు మీరు నమ్ముతారా....? ఆదుర్దా ఆమెలో.

"వశీకరణ కనికట్టులాంటి విద్యలు కావు ఆ 'ఫెరమోన్స్!' వశీకరణం, కనికట్టు అంతా బూటకం. బలహీన మనుషులమీద కొంతమంది ఆడే నాటకం.

కానీ.... ఈ ఫెరమోన్స్ 'సైన్స్'కి సంబంధించినది. సైన్స్‌కి, మూఢనమ్మకాలకు చాలా తేడా వుంది.

సైన్స్ ధాటికి ఏదయినా సాధ్యమే! మీరన్నారే జంతువులకు, మనకు తేడా వుందని– కానీ డార్విన్ సిద్ధాంతం ప్రకారం మనిషి కోతి నుంచే వచ్చాడు కదా! ఆ ఫెరమోన్స్‌ని కీటకజాతుల్లోనే కాకుండా, పందిలాంటి జంతువుల్లోనూ శాస్త్రవేత్తలు గుర్తించగలిగారు.

మానవ పరిణామక్రమంలో పందికి (కూర్మావతారం) మానవుడికి చాలా దగ్గర బంధం కనుక మానవుల్లోనూ ఫెరమోన్స్‌ని కనిపెట్టవచ్చు. ముందే చెప్పాగా అత్యద్భుత బ్రెయిన్‌గల వ్యక్తి గనుక జర్మన్ సైంటిస్ట్ బుటెనాన్‌డ్ ఫార్ములాని జాగ్రత్తగా పరిశీలించి

లాబ్‌లో చాలారోజులు రీసెర్చిచేస్తే, తప్పక మానవుల్లోనూ సెక్స్ ఆకర్షణని కలిగించే ఫెరమోన్స్‌ని కనిపెట్టవచ్చుని. అదేమి అసాధ్యం కాదు!

సైన్స్ తల్చుకుంటే ఏదైనా జరగవచ్చు. మనిషి నుంచి మనిషిని పోలిన మనుషులను పుట్టించే 'క్లోనింగ్' కంటే అసాధ్యమైనది కాదుకదా ఈ ఫెరమోన్స్‌ని మానవులపై ప్రయోగించడం."

"అసలు.... అసలు ఈ ఫెరమోన్స్ మనుషులమీద ఎలా పనిచేస్తాయి?" విస్మయం ఆమెలో.

"మన శరీరంలో కొన్ని రకాల గ్రంధులు వుంటాయి. ఈ గ్రంధుల్లోంచి రకరకాల కెమికల్స్ విడుదలవుతాయి. మొదటి దశలో 'ఆక్సోటోనిన్' అనే కెమికల్ మెదడులో తయారై ఎదుటివారు మనకు పరిచయస్తులేనన్న భావం కలుగజేస్తుంది.

రెండవది ఆకర్షణ. ఈ దశలో ఫినైతిథిలామైన్ అనే కెమికల్ వల్లే మనసు ఉత్తేజం చెందుతుంది. డోపామైన్, నోరిఫైన్ ఫ్రైన్ అనే న్యూరోకెమికల్స్ వల్ల మనసు తేలిపోతున్న భావన కల్గుతుంది. మనిషి భావావేశానికి లోనవుతాడు.

మూడవదశ – అనుబంధం లేదా సాహచర్యం కోరుకోవడం. ఈ దశలో మత్తుపదార్థాలను పోలిన ఎండోర్‌ఫైన్స్ మెదడులోకి వెళ్లడంవల్ల తీవ్రమైన వాంఛ రగులుకుంటుంది.

నాల్గవది – ఎలాగైనా కోరిక తీర్చుకోవాలనుకోవడం. ఇది మెదడులోని పిట్యూటరీ గ్లాండ్‌లోంచి స్రవించే 'ఆక్సిటోసిన్' అనే కెమికల్‌వల్ల సంభవిస్తుంది.

అలా ఈ నాలుగు కెమికల్స్‌ని కలిపి, ఇంతకుముందు చెప్పిన జర్మన్ సైంటిస్ట్ కనిపెట్టిన పట్టుపురుగుల నుండి తీయబడిన ఫెరమోన్స్‌తో పాటు ఇంకొన్ని కెమికల్ ఎలిమెంట్స్ కలిపితే మనుషులు సైతం విపరీతమైన కామోద్దీపనకు గురవుతారు."

ఓ క్షణం ఆగి గొంతు సవరించుకొని తిరిగి మాట్లాడసాగాడు భరద్వాజ.

"ఆ విధంగా తయారుచేయబడిన 'లవ్ ఫార్ములా' ఎంత శక్తివంతమైనదంటే – దానిని కేవలం ఒక డోసు ఒక మనిషికి ఇస్తే చాలు. ఆ మనిషి నుండి ఇంకో మనిషికి గాలిలోని తరంగాల్లా కంటికి కన్పించకుండా వేగంగా వ్యాపించిపోతుంది. కేవలం నెల రోజుల వ్యవధి చాలు... గాలి ద్వారా ఆ 'ప్రేమ వ్యాధి' ప్రపంచం మొత్తం పాకడానికి!

ఆ వ్యాధి సోకినవారు ఎదుటిమనిషికోసం లైంగికపరంగా కలవటానికి గింగుర్లుపడిపోతారు. ఎదుటి మనిషిమీద ఎంత అసహ్యం వున్నా, అసలు ఎంత కంట్రోల్ చేసుకుందామన్నా వీలుకాదు. అంత శక్తివంతమైనదా లవ్ ఫార్ములా. ఎటొచ్చీ ఇంతకాలం

వాటిని తయారుచేయకపోవడం మరో హిట్లర్ పుట్టకపోవడమే! ఒక ప్లేగువ్యాధి, ఒక ఎయిడ్స్, ఒక ఎర్రజ్వరం – ఇవేవీ ఆ ప్రేమవ్యాధి ముందు పనికిరావు.

కాకపోతే మిగతా జబ్బుల్లా 'ప్రేమజబ్బు' మరణాలకు దారితీయదు.

"జస్ట్.... ప్రపంచమంతా సృష్టి కార్యంలోకి దిగిపోయినట్లుగా వుంటుంది. ఒక మగనుండి ఆడకు, ఆడనుండి మగకు అలా వ్యాపిస్తూనే పోతుందా... వ్యాధి...."

"మైగాడ్...." షాక్‌తో అప్రయత్నంగా కదిలిందామె కంఠం.

ఒక్క క్షణం –

"దానికి మందులేదా?" గొంతుని అతి కష్టంమీద పెగిలిస్తూ అడిగిందామె.

"ఇంతవరకు దానికి విరుగుడు మందు లేదు. ఎవరూ కనిపెట్టలేదు. ఎందుకంటే ఫార్ములా తెలియదు కాబట్టి. ఒకవేళ దానిని గనుక కనిపెట్టాలి అనుకుంటే ఎవరైతే ఆ ప్రేమవ్యాధిని కనిపెట్టారో వారే విరుగుడు మందుని కనిపెట్టగలుగుతారు. దట్సాల్..." అని ముగించాడాయన.

నోటమాట రానట్లుగా అలాగే నిశ్చేష్టురాలై చూస్తూ వుండిపోయిందామె.

ఆమె స్థితి చూసి కదిలింది ప్రొఫెసర్ గొంతు.

"కాకపోతే ఆ వ్యాధిని కంట్రోలు చేయవచ్చు. ఆ వ్యాధికి విరుగుడు మందు లేకపోయినా ఆ వ్యాధి వ్యాప్తిచెందకుండా నిరోధించవచ్చు. వ్యాధి సోకిన వ్యక్తి ఇంటిని లేదా పట్టణాన్ని బ్యాన్‌చేసి, అక్కడ్నుంచి బయటికి, బయటనుండి లోపలికి పూర్తిగా రాకపోకలు స్తంభింపచేయాలి. అప్పుడు మాత్రమే ఆ వ్యాధి మిగతా వ్యక్తులకుగానీ, ప్రదేశాలకుగానీ వ్యాప్తి చెందదు...." అన్నాడు ప్రొఫెసర్ భరద్వాజ.

కొద్దిక్షణాలపాటు వాళ్లమధ్య నిశ్శబ్దం చోటుచేసుకుంది... మాటలు కొరవడ్డట్లుగా.

ఇక తనక్కడ వుండి చేసేదేంలేదని అర్థం కావడంతో, కుర్చీలోంచి పైకి లేచి ప్రధానితో మరోసారి కరచాలనం చేసి వెళ్ళిపోయాడు ప్రొఫెసర్ భరద్వాజ.

టేబుల్ దగ్గరనుండి కదిలి కిటికీ దగ్గరకు వచ్చి నిల్చుందామె.

విశాలమైన నగరం, పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు, అపార్ట్‌మెంటులు... వీధుల్నిండా కిటకిటలాడుతున్న జనం... వీళ్ళంతా ఆ 'ప్రేమ వ్యాధి' బారినపడితే? మైగాడ్! తన ప్రేమకోసం ఇన్నాళ్ళూ కష్టపడి ఇలాంటి ఫార్ములానా విశ్వసౌరభ్ కనిపెట్టింది? హిట్లర్ తర్వాత ఇటువంటి దారుణానికి దిగిన విశ్వసౌరభ్‌ని ఎలా పట్టుకోవాలి? అతన్ని ఎలా కన్విన్స్ చేయాలి ఫార్ములా ప్రయోగించకుండా?

తర్వాత ఆలోచించలేదామె. కారణం... ఆమెకు తెలుసు విశ్వసౌరభ్ ఎంత మొండివాడో. అలాంటి వాడిని టాకిల్ చేయడం చాలా కష్టం.

నెమ్మదిగా ఊపిరి వదులుతూ అలాగే నిలబడిపోయింది అక్కడే. ఆకాశంలో *నల్లటి మబ్బులు క్రమక్రమంగా చోటుచేసుకుంటున్నాయి రాబోతున్న ప్రళయానికి నాందిగా.*

# 16

ఆ హాల్లో నిశ్శబ్దం ఘనీభవించిన మంచుముద్దలా వుంది. అక్కడున్న అందరి మొహాల్లోనూ ఉద్రిక్తత నెలకొని వుంది. వాళ్ల చూపులన్నీ ప్రధానమంత్రిమీదే కేంద్రీకరించి వున్నాయి. ఒక్కో క్షణం నెమ్మదిగా నిశ్శబ్దంతో కరిగిపోతోంది.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ మంద్రస్థాయిలో కదిలింది ప్రధానమంత్రి సౌగంధిక కంఠం.

"డియర్ ఫ్రెండ్స్!"

పొడుగాటి టేబుల్ చుట్టూ కూర్చొనున్న సి.బి.ఐ., ఇంటెలిజెన్స్, మిలటరీ ఇంటెలిజెన్స్, లవర్స్ పార్క్ సిటీ మేయర్ తలెత్తి చూశారు.

"గత పన్నెండు గంటలుగా ఏం జరుగుతోందో ఇక్కడున్న అందరికీ తెలుసు.

నిజానికి ఊహకు అందనంత వేగంగా జరిగిపోతున్నాయి సంఘటనలు.

మొదట్లో లవర్స్ పార్క్‌లో ఇద్దరు వ్యక్తులతో మొదలైందా అంటురోగం. ఇద్దరు ఇంకో పదిమందిని ఆకర్షించారు. కంటికి కన్పించని గాలి ద్వారా ఆ రోగం చాలా సులభంగా ఎదుటి వ్యక్తి శరీరంలోకి పాకిపోతుంది. ఫలితం... ఆ వ్యక్తి తప్పనిసరిగా ఆకర్షణలో పడిపోతాడు. ఎంత వద్దనుకున్నా ఆ మైకంలో జారిపోక తప్పదు..." అంటూ కొద్ది క్షణాలు ఆగిందామె.

"మైగాడ్" అప్రయత్నంగా ఉచ్చరించాయి కొన్ని పెదాలు ఆమె మాటలు విని.

"ఎస్! ఇటీజ్ ట్రూ" మళ్లీ వేగంగా కదిలింది ప్రైమ్‌మినిస్టర్ కంఠం. లాటూర్‌లో ఎలుకలనుండి సంక్రమించిన వ్యాధి విషయం మీకు గుర్తుండే వుంటుంది. కానీ... ఆ వ్యాధికి మందు వుంది. దీనికి లేదు..."

"కానీ... ఎలుకల వ్యాధిని ఓ సంపన్న దేశమో లేక మన పొరుగు దేశమో తయారుచేసి ఎలుకలలో ప్రవేశ పెట్టి మన దేశంలో వదిలారనుకుంటున్నారు" అన్నాడు ఐ.బి.ఛీఫ్ రాజేష్ యాదవ్.

"కారణాలు ఏవైనా గతం గురించి చర్చించి వివాదాల్లోకి దిగడంవల్ల ప్రయోజనం లేదు. ప్రస్తుతానికి వద్దాం. అలా ఇద్దరితో లవర్ సిటీలో మొదలైన ఆ వ్యాధి మరో

పదిమందికి సంక్రమించింది. ఆ పదిమందినుంచి ఇంకో యాభై మందికి... ఆ యాభై నుండి రెండువందల మంది... అలా లవర్ సిటీ మొత్తం ఆ ప్రేమ మైకంలో మునిగిపోయారు."

ఒక్క క్షణం నిశ్శబ్దం తాండవించింది అక్కడ.

తిరిగి ప్రధానమంత్రి కంఠం కదిలింది.

"ఇది అక్కడతో ఆగేటట్లు లేదు. లవర్స్ సిటీనుండి రాష్ట్రం మొత్తం, ఆ రాష్ట్రం నుండి ఇంకో రాష్ట్రానికి, ఫలితంగా దేశమంతా పాకిపోతుంది.

ఇదంతా ఓ సైంటిస్ట్ చేస్తున్న నిర్వాకం. తనని, తన ప్రేమని ఓ అమ్మాయి నిరాకరించిందన్న కోపంతో ఒళ్లు తెలియని ఆవేశంతో ఈ పనికి ఒడిగట్టాడు. కేవలం తన ప్రేమకోసం ఒక వ్యక్తి... మొత్తం భారతావనిని అతలాకుతలం చేయబోతున్నాడు..."

"అతన్ని వెంటనే అరెస్ట్ చేస్తే మేడమ్?" అన్నాడు సి.బి.ఐ. ఛీఫ్ నరేంద్రసింగ్.

"అది సాధ్యపడే విషయం కాదు. మనం పట్టుకుంటామని తెలిసే అతడు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. పైగా మారువేషంలో సంచరిస్తుండవచ్చు."

"పోనీ అతగాడి లవర్‌ని పట్టుకొని మనం ఒప్పిస్తే?" ఇంతకూ అతగాడి లవర్ ఎవరో?"

ఇబ్బందిగా కదిలింది సౌగంధిక. వెంటనే తన భావాలను కప్పిపుచ్చుకుంటూ అందామె–

"అది జరిగే విషయం కాదు. భారతదేశంలో ప్రతి ఒక్కరికి కొన్ని హక్కులున్నాయి.

వాక్స్వాతంత్ర్యం, తన కిష్టమైన వృత్తిని ఎన్నుకోవటం, తనకిష్టం వచ్చిన వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకోవటంలాంటి హక్కులున్నాయి.

కాబట్టి ఎవరినీ ప్రేమించమనే హక్కు మనకు లేదు. అదీగాక జరగాల్సిన నష్టం ఎలాగూ జరిగిపోయింది. ఇప్పుడు చేయాల్సిందల్లా ఆ లవర్ సిటీనుండి ఆ వ్యాధి మిగతా సిటీస్‌కు పాకకుండా చేయడమే. దానికి ఏం చెయ్యాలో చెప్పండి..."

"ఐడియా" ఉద్వేగంగా అరిచాడు మిలటరీ ఇంటెలిజెన్స్ ఛీఫ్ సౌందర్యరాజన్. "లవర్స్ పార్కు బార్డర్స్ క్లోజ్‌చేస్తే సరిపోతుంది. ఐ మీన్... లవర్స్ పార్కునుండి బస్సు, రైలు, ప్రయాణాలు రూట్స్ నన్నింటినీ మూసేస్తాం. దాంతో లవర్స్ పార్కులోంచి ప్రజలు బయటకు అడుగు పెట్టలేరు..."

లవర్స్ సిటీ మేయర్ లేచాడు. "ఏమిటీ నా సిటీ పార్కు బార్డర్స్‌ని క్లోజ్ చేస్తారా? అదెలా సంభవం?"

"సాధ్యపడుతుంది" తాపీగా కదిలింది సౌందర్యరాజన్ కంఠం.

"ఈ క్షణంనుంచి లవర్స్ పార్కులోంచి ఏ వ్యక్తినీ బయటకు వెళ్ళనీయం. బయటకు వెళ్ళే అన్ని దారులను మూసేస్తాం."

"నో... అప్పుడు అందరిలో అనుమానాలు పొడసూపుతాయి. ఏదో జరగరానిది జరిగిందన్న భావం బలపడుతుంది. పైగా లవర్స్ సిటీ టూరిస్ట్ ప్లేస్. మన ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ ఆదాయం విదేశీయుల రాకపోకల మీద ఆధారపడి వుంటుంది.

ఒకసారి పరిస్థితి గనుక విచ్ఛిన్నమైతే మళ్లీ ఎప్పటికీ బాగుపడదు. మైండిట్..." ఒకింత ఆవేశంతో అన్నాడు మేయర్.

అప్పుడు కదిలింది మెరుపువేగంతో ప్రధానమంత్రి కంఠం. "మీరు చెప్పింది నిజమే. కానీ ఆ వ్యాధి కనుక బయటపడి, దాని ధాటికి విదేశీయులు కూడా అట్రాక్ట్ అయితే పరిస్థితి ఇంకా దారుణంగా వుంటుంది. దాంతో ఒక్క లవర్స్ సిటీకి మాత్రమే కాదు, భారతదేశంలో ఏ ప్రాంతానికి అడుగుపెట్టడానికి సాహసించరు వాళ్ళు...."

"యూ ఆర్ సెంట్ పర్సెంట్ కరెక్ట్ మేడమ్? అదృష్టవశాత్తు ప్రస్తుతం టూరిస్ట్ సీజన్ కాదు, కాబట్టి విదేశీయులు ఎవరూ లవర్స్ సిటీలో లేరు. ఈ పరిస్థితిని టాకిల్ చేయాలంటే లవర్స్ సిటీ బార్డర్స్‌ని మూసివేయాలి" అన్నాడు ఇంటెలిజెన్స్ చీఫ్ డేవిడ్ ప్రేమ్‌రాజ్.

"ఓకే అంతా బాగానే వుంది. కానీ..." అంటూ మేయర్ గొంతు కదిలింది.

"ఇలా సిటీని బ్లాక్ చేయటం గురించి కారణం ఇక్కడున్న ప్రజలకు ఏమని చెప్తారు?"

ఒక్కక్షణం. అప్పుడు కదిలింది సి.బి.ఐ. ఛీఫ్ కంఠం.

"భూకంపం రాబోతుందని చెపితే సరిపోతుంది."

"అదే మంచిది. ఆ ప్రేమవ్యాధి విషయంలో ప్రజలు భయభ్రాంతులకు లోను కాకుండా వుండాలంటే దాన్ని రహస్యంగా వుంచటం మంచిది" అన్నాడు 'రా' డైరక్టర్ సోమేశ్వర్.

"కానీ ... కొద్దిగా తటపటాయింపు ప్రధానిలో.

ఏమిటన్నట్లుగా ప్రశ్నార్థకంగా కదిలాయ్ ప్రధానివైపు అందరి చూపులు. "నిజమే! భూకంపం అనగానే జనం పారిపోయి కొంతకాలం తర్వాత తిరిగివస్తారు కదా! అప్పుడయినా వాళ్ళకు నిజం తెలుస్తుంది కదా..." కదిలింది ప్రధాని కంఠం.

"కొన్ని పనులు చేయాలంటే దాపరికం తప్పదు మేడమ్!" నిజం తెలిసి సంఘ విద్రోహశక్తులు చెలరేగకుండా ప్రజల శ్రేయస్సుకొరకే అలా ప్రకటించక తప్పటం లేదు అని భవిష్యత్తులో ప్రజలకు మనం నచ్చచెప్పాలి" అన్నాడు సి.బి.ఐ. ఛీఫ్ నరేంద్రసింగ్.

"ఓ.కే అగ్రీడ్! యూ కెన్ ప్రొసీడ్...." అంటూ గ్రీన్‌సిగ్నల్ యిచ్చింది సౌగంధిక.

"ఆ లవర్స్ పార్క్ బార్డర్స్ క్లోజ్ చేయటంతోపాటే మనం ఇంకో పనిచేయాలి మేడమ్! ఆ లవ్ ఫార్ములాని ప్రయోగించిన సైంటిస్ట్‌ని పట్టించిన వారికి లక్ష రూపాయలు బహుమతి ప్రకటిస్తే బావుంటుంది" అన్నాడు సి.బి.ఐ. ఛీఫ్.

"నిజమే మేడమ్! దానివల్ల అతడు భవిష్యత్‌లో మరిన్ని అనర్థాలకు దారితీయకుండా అరికట్టవచ్చు" అన్నాడు 'రా' డైరెక్టర్ సోమేశ్వర్.

తటపటాయించింది సౌగంధిక ఒక్కక్షణం.

నిజమే! విశ్వసౌరభ్‌ని పట్టిస్తే మంచిది. కానీ అతడిని ప్రజల దృష్టిలో దోషిని చేయటం బాగుంటుందా? ఒకనాటి తన సహచరుడు... ఈనాడు దేశంలో ఇంతమంది వ్యాధికి కారణం అవుతున్నాడు.

కేవలం తన ప్రేమ ఫలించలేదన్న ఒకే ఒక కారణంతో లక్షలాది ప్రజలను ఆ వ్యాధికి బలిచేయడం న్యాయమా? దేశం, ప్రజలు తనకు ముఖ్యం. అందుకు అతడిని దోషిగా నిలబెట్టినా తప్పులేదు.

ఓ నిర్ణయానికి వచ్చిన ఆమె కంఠం కదిలింది.

"ఓకే ప్రొసీడ్" అంటూ.

సమావేశం ముగిసింది. అంతా బయటకు వచ్చారు.

ఆకాశంలో నల్లటి మబ్బులు చోటు చేసుకుంటున్నాయి రాబోతున్న ప్రళయానికి నాందిగా.

❖ ❖ ❖

మరో గంటలో – సి.బి.ఐ. చీఫ్ తయారుచేసిన ఆ ప్రకటనకి ఆమె ఆమోద ముద్ర పడింది.

ఆ ప్రకటన ఇలా వుంది –

**ఈ మనిషి మీరు కన్పిస్తే వెంటనే పట్టించండి.**

ఈ ఫోటోలో కనిపిస్తున్నతని పేరు విశ్వసౌరభ్. ఇతడు రక్షణ రహస్యాలు దొంగిలించాడు. ఇతడు మీకు కన్పిస్తే వెంటనే పోలీసులకి తెలియజేయండి. ఇతడిని

పట్టించినవారికి, లేదా ఇతడి గురించి సమాచారం అందించిన వారికి ప్రభుత్వం లక్ష రూపాయలు బహుమానంగా ఇస్తుంది".

మరో గంటలో లవర్స్ సిటీలోకి అన్ని రాకపోకలు ఆగిపోయాయి.

❖ ❖ ❖

ప్రపంచంలో ఏ నేరస్థుడికోసం పోలీసులు, గూఢచారి వర్గాలు అంతతీవ్రంగా వేటాడి వుండవు. ఏ నేరస్తుడైనా కొద్దిమంది ప్రాణాలు మాత్రమే తీయగలడు... కానీ.. కొన్ని లక్షలమందికి ప్రేమజ్వరాన్ని వెదజల్లగల నేరస్తుడు ప్రపంచ చరిత్రలో ఎక్కడా లేడు. అలాంటి అసాధారణ పరిణామం మొదటిసారిగా చోటుచేసుకుందా రోజున.

ఒక్కో నిమిషం కరిగిపోతోంది.

ఒక్కో గంట గడిచిపోతోంది.

దేశవ్యాప్తంగా గాలింపు జరుగుతోంది సౌరభ్ కోసం.

క్షణాలు నిముషాలుగా...

నిమిషాలు గంటలుగా మారిపోతున్నాయి.

కానీ.... విశ్వసౌరభ్ ఆచూకీ తెలిపే చిన్న ఆధారం కూడా దొరకలేదు.

# 17

సరిగ్గా అదే సమయంలో.... ఢిల్లీ, చాందినీచౌక్‌లో మూడంతస్తుల భవనంలో వున్న ఓ ఫ్లాట్‌లో.... టీవీ ఆన్ చేశాడు సౌరభ్.

మరుక్షణంలోనే అనౌన్సర్ గొంతు ఆ గదిలో ప్రతిధ్వనించింది.

"ఈ ఫోటోలో వున్న యువకుడు ప్రధాని ఆఫీసు నుండి చాలా విలువైన రక్షణ సమాచారం దొంగిలించాడు. ఇతడిని పట్టిచ్చినవారికి లేదా ఆచూకీ తెలియచేసిన వారికి లక్ష రూపాయలు బహుమతి ఇవ్వబడును."

పక్కనే సౌరభ్ ఫోటో ఫ్లాష్ చేసుంది.

తన జీవితంలో అంత షాక్ ఎప్పుడూ తినలేదు అతడు. ఊపిరి పీల్చడం కూడా మర్చిపోయినట్లుగా నిశ్చేష్టుడై అలాగే నిల్చుండిపోయాడు. రక్తంతో ముంచినట్లుగా ఎర్రబడ్డ అతడి కళ్ళముందు సౌగంధిక వేయి రూపాలతో నర్తిస్తోంది.

ప్రియబాంధవీ! ఆఖరికి తనని ఓ దొంగగా, దేశద్రోహిగా చిత్రీకరించావా? నమ్మశక్యంగా లేదు. ఒక కల అబద్ధమై... మనసు వికలమై, శకలమై విలపించి గుండె పగిలిన భావన అతనిలో.

కంపిస్తున్న శరీరాన్ని అదుపులో పెట్టుకోవడం కోసం పక్కనే వున్న టేబుల్ మీద చేతులాన్చాడు, కొద్దిక్షణాల పాటు అలాగే నిలబడి నెమ్మదిగా నిట్టూర్చాడు. ఆ నిట్టూర్పులో ... అంతులేని వేదన... కసి... ప్రపంచాన్ని భస్మీపటలం చేయాలన్నంత భయంకరమైన ఆగ్రహం... ఆ ఆగ్రహంలోనే అతడి చేతులు పేపర్‌ని, పెన్‌ని అందుకున్నాయి.

**"మిస్ ప్రైమ్‌మినిస్టర్,**

ఐయ్యేయస్, డాక్టర్ కోర్స్ ప్యాసయి ఎంతో ఉన్నతస్థానంలో వుండాల్సిన నన్ను ఈ రోజు చేయని నేరానికి దేశప్రజల దృష్టిలో నేరస్థుడిగా నిలబెట్టావు. నిన్ను గాఢంగా ప్రేమించిన నేరానికి అందరిముందు దోషిగా నిలబెట్టావు.

నేను లవర్స్ సిటీలో ఫార్ములాని ప్రయోగించాను. నీవు నా ప్రేమని గుర్తించలేదన్న నిరాశతో ఆ ప్రయత్నానికి ఒడిగట్టాను. కానీ నీవు... నన్ను దోషిగా చేశావు. నీవు, నీ సైన్యం నన్ను పట్టుకోలేక పిరికితనంతో ఈ దారుణానికి ఒడిగట్టారు.

నీవు చాలా గొప్పదానివనుకుంటున్నావేమో! యం.బి.బి.యస్.లో నాకంటే ఒక్కమార్కు ఎక్కువ సంపాదించి యూనివర్సిటీ ఫస్ట్ వచ్చానని చంకలు గుద్దుకుంటున్నా వేమో!... కానీ... నీ మీద ప్రేమతో యూనివర్సిటీ ఫస్ట్ రావాల్సిన నేను చేతులారా దానిని జారవిడిచాను. ఎలాగో తెలుసా?

పరీక్షలో నీకు ఫస్ట్ మార్కు రావాలనే నేను 'ఓలాన్ థియరీ - ఎఫెక్ట్' అన్న ప్రశ్నకు జవాబు రాయక ఐదు మార్కులు పోగొట్టుకున్నాను. అదే ప్రశ్నకు జవాబుని క్లాసురూములో లెక్చరర్ అడిగినప్పుడు నేను చెప్పినప్పుడు నీవూ అభినందిస్తున్నట్లుగా చప్పట్లు కొట్టావు గుర్తుందా?

ఇదంతా ఎందుకు చేశానో తెలుసా? నీవు నా దానివని. యూనివర్సిటీ ఫస్ట్ రాకపోతే నీవెక్కడ బాధపడతావోనని అలా చేశాను. నేనేది చేసినా నీ సుఖం కోసమే ప్రియా!

నీకు బాధ కలిగితే నా కళ్ల వెంట నీళ్లు వస్తాయి. నీవు కాస్త నడిస్తే నీ కాళ్లు ఎక్కడ నొప్పి పుడతాయో అన్న బాధ నాకు. నీకు ఎండ తగిలితే ఎక్కడ కందిపోతావోనని అన్న అపురూపం నాకు.

మెడిసిన్‌లో ఐదేళ్ళు నీ తనువులో తనువై, నీ మాటలో పాటనై, నీ అడుగులో జతనై బతికిన ఈ చెలికాడిపైన ఇలాంటి ముద్రనా వేయించేది? దేశంలో అత్యున్నత పదవిలో వున్నానన్న అహంకారంతోనేనా ఈ పేద వాడి మీద అభాండాలు సృష్టించావు? తుదకు ఆ పేదవాడి కోపమే ఆగ్రహంగా మారి దేశాన్ని నాశనం చెయ్యబోతోంది.

ఇప్పుడు నేను ఏం చెయ్యబోతున్నానో తెలుసా? భారతదేశంలో అన్ని నగరాల్లో నా ఫార్ములాని ప్రయోగించబోతున్నాను. కేవలం పది రోజులే గడువు అందుకు. ఆ తర్వాత దేశం యావత్తూ నా ప్రేమ మత్తులో వుండాల్సిందే.

ప్రపంచ పటంలో భారతదేశపు పరువు మంటగలుస్తుంది. వేద భూమి, కర్మభూమి అని రొమ్ము విరుచుకునే మేధావుల గుండెలు పగిలేలా, నా దేశపు స్త్రీ పరాయి మగాడ్ని కన్నెత్తి చూడదని దేశదేశాలూ సగర్వంగా చాటుకునే పుణ్యమూర్తుల కడుపు చెరువయ్యేలా, ప్రపంచ దేశాల ముందు భారతదేశం పరువు గంగపాలయ్యేటట్లు చేస్తాను.

కేవలం ఒక్క లవర్స్ పార్క్‌లో నేను ఫార్ములా ప్రయోగిస్తేనే నీవు, నీ అనుచరగణాలు అల్లాడిపోతూ సిటీ బార్డర్స్ క్లోజ్ చేశారే! అలాంటిది... దేశంలో అన్ని పట్టణాలలో, నగరాలలో నా ఫార్ములా ప్రయోగిస్తే ఊపిరి పీల్చుకోగలవా నీవు? అప్పుడు ఏ భగవంతుడు కాపాడగలడు ఈ దేశాన్ని? ప్రపంచంలో ఏ సైంటిస్ట్ ఆపగలడు ఈ విపత్తుని?

చెప్పండీ నా ఈ ప్రశ్నకు జవాబు? ఎవరికైనా సహనం ఓ స్థాయి దాకానే ఉంటుంది. ఆ స్థాయి దాటితే అది ఆగ్రహంగా మారి దహించి వేస్తుంది. పిల్లిని గదిలో వేసి కొడితే, అది తిరగబడుతుంది. కాటెయ్యదు కదాని వానపాముని చితకబాదితే, అది బలాన్ని సంతరించుకుని ఎదురు తిరుగుతుంది. ఇక్కడ జరిగిందదే.

నా ప్రేమని నిరాకరించావు. పోనీ లెమ్మని వూరుకుంటే నీ సెక్యూరిటీతో నన్ను చిత్రహింసకు గురిచేశావు. దానికీ సహించి ఊరుకుంటే ఆఖరికి నన్ను దేశద్రోహిగా, జాతికి ఎసరు పెట్టిన నేరస్థుడిగా ముద్ర వేశావు. ఇదిమటుకు క్షమించరాని నేరం. నీ పైన ఎంత ప్రేమున్నా దీనికి మటుకు నేను వూరుకోను.

అందుకే... ఈ దేశ ప్రజలకు, ప్రెస్ రిపోర్టర్లకు, అన్ని టీవీ ఛానళ్లకూ ప్రెస్ నోట్ పంపిస్తున్నాను. నేను ప్రేమిస్తున్నది నిన్నేనని నీవు నిరాకరిస్తే ఈ దారుణానికి ఒడిగట్టానని తెలియజేస్తున్నాను. నా ప్రేమదేవత ప్రధానేనని, ఆమె నా ప్రేమని తిరస్కరిస్తేనే ఇలా సైకోపాత్‌లా తయారయ్యానని తెలియజేస్తున్నాను.

పాపం... ఇప్పటివరకూ నీ అనుచరగణాలకు కూడా తెలియకుండా మేనేజ్ చేశావు. నేను ప్రేమించిన అమ్మాయి ఎవరో తెలియకుండా, ఇప్పుడు... అందరికీ తెలిశాక చూడాలి ఫలితం. దాంతో దేశం ముఖ్యమో నీ పంతం ముఖ్యమో ప్రజలకు అర్థమవుతుంది... నీ గుట్టు ఇప్పుడు రట్టవుతుంది. దాంతో ఈ దేశపు 'అభివృద్ధి'ని ఇంత దాకా తీసుకొచ్చిన నీ గొప్పతనం ప్రజలకు అర్థమవుతుంది.

ఇప్పుడు నిర్ణయించుకో... దేశ నాశనాన్ని కోరుకుంటావో? నా ప్రేమని ఆమోదిస్తావో?

అప్పటిదాకా దేశంలో జరుగుతున్న ఈ తమాషా చూస్తూ ఆనందించే –

నీ విశ్వసౌరభ్

❖ ❖ ❖

"లవ్ ఫీవర్ వ్యాధికి మూలకారకుడైన విశ్వసౌరభ్ ప్రేయసి ప్రధాని సౌగంధిక".

ఈ వార్త జాతీయస్థాయిలో పెద్ద చర్చనీయాంశమైంది. దేశంలోని ప్రస్తుత విధ్వంసానికి కారకుడైన విశ్వసౌరభ్ ప్రేమించింది తమ ప్రధానినేనన్న విషయం వింటూనే నిర్ఘాంతపోయారు ప్రజలు. అసలు అది సంభవమేనా అన్న విస్మయంలోకి జారిపోయారు. పత్రికలు, టీ.వీ. ఛానల్స్ ఈ అంశానికి విశేష ప్రచారాన్ని ఇచ్చాయి. వివిధ దేశాల నుండి జాతీయ పత్రికలు తమ ప్రతినిధుల్ని పంపాయి.

దేశం దేశమంతా గగ్గోలెత్తిపోయింది. అసలు ఈ పరిస్థితి దేశ ప్రధాని ఎలా ఎదుర్కొంటుందోనని ప్రజలు చెవులు కొరుక్కోసాగారు.

ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని పాలకపక్షంపై దుమ్మెత్తిపోయడానికి రంగం సిద్ధం చేసుకుంటే, పాలక పక్షంలోని అసమ్మతివాదులు రాజకీయలబ్ది పొందడానికి ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా నోరు విప్పని రాష్ట్రపతి కూడా ప్రధానిని రెండుసార్లు కలిసి దేశ పరిస్థితి గురించి ఆందోళన వెలిబుచ్చారు.

ప్రజలలోని వివిధ వర్గాలవారు ఈ సంఘటనపై నిరసన వెళ్లగక్కటానికి రంగం సిద్ధం చేసుకున్నారు. విద్యార్థులు విశ్వసౌరభ్‌కి మద్దతుగా దేశంలోని కాలేజీలన్నీ ఒకరోజు బంద్ జరపాలన్న పిలుపునివ్వగా, మహిళా సమాజాలు మాత్రం ప్రధాని సౌగంధికకే తమ మద్దతుని కొనసాగించాయి.

ప్రజలలో కూడ ఈ సంఘటనపై భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. కొంతమంది, దేవతలాంటి ప్రధాని సౌగంధికపైన ఈగ వాలినివ్వమని, ఆమె ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క మెట్టుకూడా దిగిరావద్దని విజ్ఞప్తులు చేయగా, మిగతా ప్రజలు మాత్రం ఏకీభవించలేదు. దేశంలో జరుగుతున్న ఘోరానికి ఆమె బాధ్యత వహించాలని, ఆమె విశ్వసౌరభ్ ప్రేమని అర్థం చేసుకుని అంగీకరించి దేశాన్ని కాపాడాలని ధర్నాలు, నిరసన ప్రదర్శనలకు పూనుకున్నారు.

ఒక ప్రళయప్రభంజనంలా ప్రజలు, సంఘసేవకలు, మేధావులు ఈ సంఘటనకు చలించారు. వారి అనుకూల, నిరసన ధ్వనుల్తో ఊరు ఊరు, రాష్ట్రం, రాష్ట్రం, దేశం దేశమంతా హోరెత్తింది. ఏం జరుగుతుందా అన్న టెన్షన్‌తో పౌరజీవనం స్తంభించి పోయింది. అలా ప్రజలు, పత్రికల, మేధావుల పదఘట్టనతో దేశం దద్దరిల్లిపోసాగింది.

# 18

"అసలు మనుషులు ఇలా చేస్తారని దీనికంతటికి కారణం 'సౌరభ్' అని కలలో కూడా అనుకోలేదు." సౌగంధిక అంది.

నిట్టూర్చాడు త్రిపాఠి.

ఇద్దరూ పార్టీ కార్యాలయంలో కూర్చున్నారు. దేశానికి సంభవించిన ముఖ్య సమస్యని ఆయనకు చెప్పి, ఆయన సలహా తీసుకుందామని సమావేశమైంది. తాను తీసుకోబోయే ప్రతిచర్యని తన తండ్రిలాంటివాడైన త్రిపాఠికి చెప్పడం ఆమెకు అలవాటు. తన శ్రేయోభిలాషి అయిన ఆయన సలహాలను తీసుకోవడం ఆమెకు ఆనవాయితీ. తిరిగి కదిలింది సౌగంధిక కంఠం.

"ఇప్పుడు ఏం చెయ్యాలో అర్థం కావటం లేదు. నాకెప్పుడూ ఈ ప్రేమల మీద నమ్మకం లేదంకుల్! ప్రేమనేది ఒక ట్రాష్, పరిపక్వతలేని వాళ్లే ప్రేమలో దిగుతారని అనుకునేదానిని. ఇటు చూస్తే వన్‌వే ట్రాఫిక్ ప్రేమని ప్రదర్శిస్తూ విశ్వసౌరభ్, అటుచూస్తే రాజకీయాల్లో వున్నంత వరకూ ప్రేమ, పెళ్లిలాంటి వాటికి దూరంగా వుంటానని చనిపోయిన నాన్నకు ఇచ్చిన మాటే గుర్తొస్తున్నాయి. ఈ రెండింటి మధ్య దేశం ఏమై పోతుందోనన్న దిగులు..."

సానుభూతిగా చూశాడు త్రిపాఠి. చాలా చిన్న వయసులో ఆమె ప్రధాని అయ్యింది. అవుతూనే దేశంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశవిదేశాలలో ప్రఖ్యాతి గాంచింది. కానీ ఈ సమస్య ముంచుకొచ్చి ఆమెకు నిద్రాహారాలు లేకుండా చేస్తోంది.

ప్రధాని అన్న వాడికి సమస్యలు వుంటాయి. కానీ ఇది మరీ పరిష్కారం లేని సమస్య!

ఏమాత్రం అటూ ఇటూ అయితే ఏ నోళ్ళతో ఆమెను పొగిడారో, అదే నోళ్ళతో ఆమెపైన విమర్శలు, ఆగ్రహాలు రగులుకుంటాయి.

క్షణాలు గడుస్తున్నాయి ఆయన ఆలోచనలతో.

అప్పుడు విడివడింది ఆయన గొంతు ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా. "ఒకే ఒక మార్గం కనిపిస్తోంది. అతడిని ఆ ఫార్ములా ఇంకా మిగతా ప్రదేశాలలో ప్రకటించకుండా ఓ పనిచేస్తే పోతుంది.

చిన్న చిన్న స్కూళ్ల పిల్లలతో, వృద్ధులతో, రకరకాల బ్యానర్స్‌తో ఆ ఫార్ములాని ఇకముందు ప్రకటించవద్దని ఊరేగింపులతో, బహిరంగ సభల్లో విశ్వసౌరభ్‌ని వేడు

కుంటారు. వారి వేడుకోళ్లు విశ్వసౌరభ్ మనస్సుని ఏ కొద్దిగానైనా కదిలించగలవని మా ఆశ..."

"కాని విశ్వసౌరభ్ వింటాడా?" దిగ్భ్రాంతి ఆమెలో.

"విన్నా వినకపోయినా అంతకుమించి ప్రస్తుతం దారి కనిపించటం లేదుకదా."

ఒక్క క్షణం తర్వాత నెమ్మదిగా తలూపిందామె ఏకీభవిస్తున్నట్లుగా. ఆమె అతని కాళ్ళకు వంగి నమస్కరించి – "మీరు చెప్పినట్లే చేస్తాను. నన్ను ఆశీర్వదించండి అంకుల్..." అంది.

త్రిపాఠి ఆమె భుజాలు పట్టుకుని లేపాడు.

"భగవంతుడు నిన్ను చల్లగా చూడుగాక. మహంతి కూతురుగా ఈ దేశాన్ని పదికాలాలపాటు సస్యశ్యామలంగా పాలించుగాక..."

# 19

సరిగ్గా అదే సమయంలో – లాహోర్ పట్టణానికి దూరంగా వున్న పాక్ గూఢచారి భవనంలో సందడిగా వుంది. ఆ భవనంలో ఓ మూల మహామ్మద్ జిన్నా ఫోటో తగిలించబడి వుంది. ఇంకో మూల భుట్టో, జియా ఫోటోలు తగిలించి వున్నాయి.

"విశ్వసౌరభ్ ఆ ఫార్ములా కనిపెట్టాడు సార్."

ఓ బాంబులా పేలిందా గదిలో ఆ వార్త. "మైగాడ్! నిజమా" దిగ్గున లేచాడు ఐఎస్ఐ ప్రెసిడెంట్.

"అవును సార్! నేను స్వయంగా చూశాను సార్! తనని, తన ప్రేమని సౌగంధిక నిరాకరించిందన్న కోపంతో మొత్తం భారతదేశాన్ని నాశనం చేయడానికి అతను పూనుకున్నాడు. అందుకు శాంపిల్‌గా ముందుగా ఆ ఫార్ములాని లవర్ సిటీలో ప్రయోగించాడు..." ఉద్వేగంగా అన్నాడు సలీం.

"శభాష్! చాలా కొత్త విషయాలు కనిపెట్టావ్?" అంటూ తన పక్కనే వున్న సూట్‌కేస్‌లోంచి నోట్ల కట్టలు తీసి సలీంవైపు విసిరేశాడు.

సలీం ఆ బహుమతిని స్వీకరించి నిష్క్రమించాడు.

ఐఎస్ఐ ప్రెసిడెంట్‌లో ఆలోచనలు. ఎవరైనా సైంటిస్ట్ కొత్త విషయాల మీద రీసెర్చి జరుపుతున్నప్పుడు తాను తన ఏజంట్‌లలో ఒకరికి పనివాడి వేషం వేసి అక్కడకు పంపిస్తాడు. వీలుంటే ఆ ఫార్ములాని సంగ్రహించడానికి ప్రయత్నాలు చేస్తారు.

అలా 'మునీర్ అహమ్మద్ ఖాన్' అనే న్యూక్లియర్ సైంటిస్ట్ అమెరికాలో అడుగుపెట్టి, ఓ న్యూక్లియర్ సంస్థలో చేరి అక్కడ్నుంచి ఉర్దూ భాషలో అణురహస్యాలు పాకిస్తాన్‌కి చేరవేశాడు. అతని చలవవల్లనే పాకిస్తాన్ అణుబాంబు తయారుచేసింది.

అప్పట్నుంచి దేశవిదేశాలలో అందరి సైంటిస్టుల దగ్గరా తన ఏజెంట్లని పనివాళ్ళ వేషంలో పంపడం తనకు అలవాటయ్యింది.

అదే నేడు తనకు ఫలితాన్ని ఇచ్చింది. సలీంని ఇండియాలోని సౌరభ్ లాబ్‌లో పనివాడిలా వేషం వేయించి సమాచారాన్ని లాగించింది.

అతనికి తెలుసు రోజు రోజుకు పాక్‌లో అనిశ్చిత పరిస్థితులు ఏర్పడుతున్నాయని దేశ ఆర్థిక పరిస్థితి క్షీణించింది. శాంతిభద్రతలు లోపించాయి. కరువు కాటకాలు జనాల్ని పీడిస్తున్నాయి. తిండి, బట్ట, ఇళ్లులాంటి కనీస అవసరాలు ఏర్పాటు చేయలేని ప్రభుత్వం ఎందుకంటూ ఇప్పటికే వూరేగింపులు, బంద్‌లు జరుగుతున్నాయి. ప్రతిపక్షాలు నోరు పారేసుకుంటున్నాయి. పత్రికలు గోల పెడుతున్నాయి.

దీనికి తోడు ఇండియా పరిస్థితులు అద్భుతంగా సెట్ అయ్యాయి.

ప్రధాని సౌగంధిక అడుగుపెడుతూనే నవభారత నిర్మాణానికి పూనుకుంది. ఆర్థిక సంస్కరణలు ఖచ్చితంగా అమలు పర్చడం వల్ల విదేశీయుల డబ్బు ఆ దేశంలో కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతోంది. ఫలితంగా పాకిస్తాన్‌వైపు చూసే విదేశీయులే లేకపోయారు. దానికి తోడు సౌగంధిక ప్రవేశపెట్టిన ఇతర పరిపాలనా సంస్కరణలు అందరికీ ఆదర్శప్రాయమైనాయి.

తన పక్క దేశం ఓ డైనమిక్ ప్రైమ్‌మినిస్టర్ చేతిలో రోజు రోజుకూ శక్తి పుంజుకుంటుంటే, తమ దేశం ఇంకా చీకటిలోనే మగ్గిపోవటం వారు జీర్ణించుకోలేక పోతున్నారు.

ఇలాంటి సమయంలో ఏదో ఒకటి చేయాలి. లేకపోతే తన మనుగడ కష్టం.

మరుక్షణం అతడు చేతిలోకి ఫోన్‌ని తీసుకున్నాడు. ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా ఓ నెంబర్‌కి డయల్ చేశాడు.

అవతల నుండి రిసీవర్ ఎత్తిన శబ్దం.

"మాఫియా డాన్ రతన్ డాన్ ఎక్కడున్నాడో నాకు వెంటనే తెలియజెయ్యండి..."

ఆ తర్వాత పనులు చకచకా జరిగిపోయాయి.

# 20

గతుకులు లేని రోడ్డు మీద సర్రున దూసుకుపోతోంది కారు. చుట్టూ వున్న ఎత్తైన వృక్షాలు ఆమెకు స్వాగతం పలుకుతున్నాయి.

ఎప్పుడూ బిజీ షెడ్యూల్‌తో నిండి వున్న ఆమె ప్రోగ్రామ్‌లో సాయంకాలం ఓ గంట కారు డ్రైవింగ్ కోసం కేటాయిస్తుంటుంది. తానే స్వయంగా కారుని డ్రైవింగ్ చేస్తూ ఊరు చివరి దాకా వెళ్ళి వస్తుండడం ఆమెకు ఇష్టమైన హాబీ.

ఆమె చేతిలోని కారు మామూలు కారు కాదు! కంప్యూటరైజ్డ్ కారు. నూతన సాంకేతిక ప్రమాణాలతో కూడివున్న ఆ కారుని తన కోసం ఇటలీ నుండి దిగుమతి చేసుకుంది.

కారు సాఫీగా దూసుకుపోతోంది. మైక్రో ప్రాసెసర్లన్నీ అనవసరమైన కుదుపులను ముందే ఫిల్టర్ చేస్తున్నందున స్టీరింగ్ చేయటం చాలా తేలికగా వుంది. కారు ఊరి పొలిమేరలను సమీపిస్తోంది, ఆమె కార్లోని డిజిటల్ క్లాక్ ఆన్ చేసింది. ఆ రోజు వాతావరణం ఎలా వుంటుందో, వెళుతున్న రోడ్డు మీద ట్రాఫిక్ ఎలా వుందో ఆ క్లాక్ రేడియో వివరించింది..

హఠాత్తుగా డాష్‌బోర్డుపై లైట్లు వెలిగాయి. 'ఎటువైపు వెళ్ళాలి?' అని ప్రశ్నించాయి లైట్లు.

ఆమె 'లెఫ్ట్' అన్న బటన్‌ని ప్రెస్ చేసింది. వెంటనే 'ఆ రోడ్డు మీద ఏదో యాక్సిడెంట్ జరిగింది. రోడ్డు క్లోజ్ అయ్యింది' అని జవాబు వచ్చింది.

ఆమె కార్లోని ఆటోగైడ్‌ని ఆన్‌చేసింది. అది ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచించింది. ఆ రోడ్డులో వెళితే పది నిమిషాల సమయం మిగులుతుందని చెప్పింది. ఆమె వెంటనే 'ఓకే' అన్న బటన్ ప్రెస్ చేసింది. కారు ప్రయాణం సాగిస్తూనే వుంది.

క్షణాలు గడుస్తూనే వున్నాయి... ఆమె ఆలోచనలతో. ఆమెకు తండ్రి గుర్తొచ్చాడు. ఓ నన్ను తీర్చిదిద్దిన దైవమా! ఈ రోజు నేను ఈ దేశంలో అత్యున్నత స్థానంలో వున్నానంటే అది నీవు పరిచిన గొడుగు గొప్పతనమే. కానీ నేను చేసిందేమీ లేదు. ఓ తండ్రీ! నీవు నన్ను ఆఖరి మెట్టు దాకా తీసుకెళ్ళి, ఏదో పని వున్నట్లు వెళ్ళిపోయావు. ఇప్పుడు ఆ మెట్టు మీద నాకు నేనై పెరుగుతాను. ఈ దేశపు మురికి రాజకీయాలు నాకు వద్దు. కుళ్ళిపోయిన ఈ వ్యవస్థ నాకొద్దు. ఒక పేదవాడి ఆకలి తీర్చేందుకు వేయి చేతులతో కృషి చేస్తాను. పేదా–గొప్పాలేని సమసమాజం కోసం పాటుపడతాను.

నీవు వెలిగించిన దీపాన్ని కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా ఒక్క దానినై వ్యాపించి, నీ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలబెడతాను. అందుకోసం నేను నీకు వాగ్దానం చేసినట్లుగా ప్రేమ, పెళ్లి లాంటి వాటికి దూరంగా వుంటాను.'

కారు ఆమె చేతిలో బందీని అన్నట్లుగా తన దారిన తాను పోతూనే వుంది. ఆకాశంలో సూర్యుడు క్రమక్రమాన అదృశ్యమవుతున్నాడు.

దూరంగా మేఘాలచాటున చంద్రుడు అప్పుడప్పుడే లేవడానికి ప్రయత్నిస్తున్నాడు.

కారులో కూర్చున్న ఆమె ఆ సమయంలో ఓ అద్భుత సౌందర్యరాశిలా వుంది. తెల్లటి చీర... తెల్లజాకెట్... జడలో మల్లెపూలతో ఆమె ఆకాశంలో నుండి భూమికి పుష్పక విమానం ద్వారా ప్రయాణిస్తున్న అప్సరసలా వుంది.

ఆలోచనల్లో మునిగిపోయిన ఆమె హఠాత్తుగా తేరుకుంది. అప్పుడు గుర్తొచ్చాడు ఆమెకు విశ్వసౌరభ్.

తన ప్రేమ సౌరభంతో భారతదేశం మొత్తాన్ని ప్రేమమయం చేద్దామనుకుంటు న్నాడు, తన ఒక్క ప్రేమ ఫలించలేదన్న ఆగ్రహంతో మొత్తం భారతావనిని ధ్వంసం చేద్దామనుకున్నాడు ఆ సైంటిస్ట్. అతని ప్రేమ వ్యక్తి గతం కాగా, పగ విశ్వసనీయం.

అతనంటే తనకెప్పుడూ అభిమానమే. క్లాసులో ఫస్ట్ వస్తూ, లెక్చరర్స్ అడిగిన ప్రశ్నలకు కంప్యూటర్‌లా సమాధానాలు చెప్పే అతనంటే తనకే కాదు, మెడిసిన్‌లో జాయిన్ అయిన ప్రతి స్టూడెంట్ దగ్గర్నుంచి ప్రిన్సిపాల్ దాకా అభిమానమే. ఇండియాలోని అతి తక్కువ జీనియస్‌లలో ఒకరిగా అతడి పేరు తనతో పాటు కాలేజీలో మారుమోగేది.

అలాంటి అతనంటే తనకూ అభిమానం వుండడంలో తప్పు లేదు. అయితే అభిమానం వేరు, ప్రేమ వేరు. తన అభిమానాన్ని ప్రేమగా అర్థం చేసుకోవడం తప్పు. ప్రేమనేది వన్‌వే(ట్రాఫిక్ కాదని, రెండువైపులా వుంటేనే ప్రేమని తెలుసుకోకపోవడం అతని తప్పు. పైగా తనని ప్రేమించలేదన్న కసితో దుష్టప్రణాళికని కనిపెట్టడంలో ఇంకో తప్పు.

ఆ ఫార్ములాని ప్రజల మీద ప్రయోగించడం ఇంకా దారుణమైన తప్పు. అతనిని ఎలాగైనా దారిలోకి తీసుకురావాలి. లేకపోతే భావితరాలు తనని క్షమించవు. తనవల్లే దేశం నాశనమైపోయిందని, తన మూలానే దేశ ప్రజలు వింత వ్యాధితో ధ్వంసమయ్యారని చరిత్రకారులు ఘోషిస్తారు. అలాంటి నిందని తాను భరించలేదు. సరిగ్గా అప్పుడు ... కంప్యూటర్‌లో డేంజర్ బెల్ శబ్దం చేసింది.

ఆలోచనల్లో మునిగిపోయిన సౌగంధిక ఒక్కసారిగా వులిక్కిపడింది.

ఎప్పటినుంచి వస్తుందోకానీ తన కారు వెంటనే వస్తుందో అంబాసిడర్. ఆలోచనలలో నుండి తేరుకుంటూ, స్టీరింగ్ సర్రున ఎడమపక్క రోడ్డు వైపు కోసింది సౌగంధిక. ఆశ్చర్యం! ఆ కారు కూడా అటే తిరిగింది. అర్థమైంది ఆమెకు. ఆ కారు కావాలనే తనని ఫాలో అవుతోందని... 'ఇంతకూ ఎవరిదా కారు? ఎందుకు ఫాలో అవుతున్నారు?'

ఆమె ఆలోచనలో వుండగానే మెరుపువేగంతో జరిగిందది.

ఆ కారు విండోలోంచి ఓ చెయ్యి బయటికి రావడం, ఆ చేతిలో రివాల్వర్ రావడం, ఆ రివాల్వర్‌లోంచి ఓ బుల్లెట్ రిలీజయి ఆమె కారు వైపుకు దూసుకురావడం చకచకా జరిగిపోయాయి.

క్షణంలో వెయ్యోవంతు...

జరుగుతున్నదేమిటో గ్రహించిన ఆమె చేతిలో స్టీరింగ్ చకచకా మెలికలు తిరగసాగింది.

బుల్లెట్ ప్రూఫ్ కారు కాబట్టి వారేం చేయలేరు–టైర్లు పేల్చడం మినహా! అది జరిగేలోపే తాను ఎదురుదాడి చేయాలి. వెంటనే ఆమె చేతి వేళ్ళు కదిలి డాష్ బోర్డుమీదున్న ఓ బటన్‌ని నొక్కాయి. అప్పుడు దూసుకొచ్చాయి ఇనుప ప్లేట్లు బాయ్‌నెట్ నుంచి దూసుకొస్తూనే అవి కారు టైర్లకు అడ్డంగా ఫిక్స్ అయిపోయాయి. బుల్లెట్స్ ఆ ఇనుప ప్లేట్స్‌కి తగిలి కిందకు పడిపోతున్నాయి.

రెండు కార్లూ గాలిని సర్రున కోస్తూ, గంటకు ఎనభై కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నాయి.

ఆమె చేతిలో స్టీరింగ్ విరామం లేకుండా తిరుగుతూనే వుంది. కింద కాళ్ళు అందుకనుగుణంగా క్లచ్, యాక్సిలేటర్స్ మీద కదులుతూనే వున్నాయి.

ఒకటి... రెండు... మూడు...

సరిగ్గా నాలుగో క్షణంలో ఆమె చేయి తిరిగి కీ బోర్డుమీదున్న బటన్స్‌మీద కదిలింది.

ఒక బటన్ నొక్కగానే ఆమె కారుకి బాయ్‌నెట్ నుండి ఓ రాడ్ దూసుకొచ్చింది. ఎలక్ట్రానిక్ యుగంలో మానవుడు నిర్మించిన ఆధునికమైన కారుకి నమూనా ఆ కారు. వాస్తవానికి అది రాడ్ కాదు. CALICOM-10 CARBINE. దాని బ్యారెల్ 16 అంగుళాలు వుంటుంది. దానిలో100 స్మోక్ బాంబ్స్ లోడ్ చేయవచ్చు. దానిని ఆపరేట్ చేస్తే చాలు ఈ 100 స్మోక్ బాంబ్స్ అరకిలోమీటరు దూరం వరకు వెదజల్లబడతాయి. అవి వాతావరణానికి ఎక్స్‌పోజ్ అయిన మరుక్షణం దట్టమైన గ్యాస్‌ని వెదజల్లుతాయి.

అదే జరిగింది ఇక్కడ. ప్రత్యర్థులు వూహించని విషయమది. కారు నడుపుతూ కృత్రిమమైన పొగ సృష్టించి అయోమయంలో పడేయటం ఇప్పటివరకూ వారికి అనుభవంలోకి రాని విషయం.

ఆ పొగలో ఎవరెటు వెళుతున్నారో తెలియని పరిస్థితి.

అక్కడ దాదాపుగా యుద్ధ వాతావరణం సాక్షాత్కరించింది. ఆ పొగ విడివడటానికి దాదాపుగా అరగంటసేపు పట్టింది. అప్పటికే ఆమె కారు గమ్యస్థానం చేరుకుంది. సఫ్దర్‌జంగ్ రోడ్డులోని తన నివాసంవైపు వెళుతున్న ఆమె పెదవులమీద వెలిసిందో చిరునవ్వు. శత్రువుని ఏమార్చి వచ్చినపుడు కలిగే చిరునవ్వది.

వేడిగా వున్న షవర్ బాత్ నీళ్ళు ఆమె మీద వెచ్చగా జారుతున్నాయి.

కారు డ్రైవింగ్ అయ్యాక వేడినీళ్ళతో స్నానంచేయటం ఆమెకు అలవాటు. బాత్‌రూమ్‌లో ప్రతి అంగుళం బంగారం పరిచినట్లుంది. ఎయిర్ కండిషన్డ్ రూమేమో ఏదో దివ్య సుగంధాన్ని వెదజల్లుతోంది. నిలువెత్తు మిర్రర్, విశాలమైన బాత్‌టబ్, టబ్‌పైనున్న హాట్‌వాటర్ షవర్స్, మెత్తటి మొజాయిక్ ఫ్లోర్.

ఎదురుగా అద్దంలో కనిపిస్తున్న తన ప్రతిబింబంవైపు అలాగే నిలిచిపోయాయి ఆమె చూపులు.

ఒక్క క్షణం

వేడినీళ్ళు ఒంటిమీద పడుతుండగా ఆమెలో కొద్దిపాటి ఉత్తేజం... కొద్దిగా ఉద్వేగం కూడా. పరవశంతో కళ్ళు మూసుకుని పాడసాగింది నెమ్మదిగా.

"ఆకులో ఆకునై
పువ్వులో పువ్వునై
కొమ్మలో కొమ్మనై
నునులేత రెమ్మనై
ఇచ్చటనే ఎటులైనా ఆగిపోనా...."

ఆమె పాటకు లయబద్ధంగా నగిషీతో చెక్కినట్టున్న కాళ్లు కదులుతున్నాయి. ఆ కాళ్ళకి బంధించి వున్న వెండి పట్టీలు ఫ్లోరోసెంట్ కాంతిలో చమక్, చమక్‌మని కదులుతున్నాయి. ఆమె అందాన్ని చూసి ఆ గదిలోని ఫ్లోరోసెంట్ తాలూకు వెలుతురు సైతం స్తంభించిపోయి కళ్లప్పగించి చూస్తోంది.

గంటక్రితం తనమీద హత్యాప్రయత్నం జరిగిందని, తాను తప్పించుకు వచ్చానని ఆమెకు అసలు గుర్తుకు రావటం లేదు. రాజకీయాలలో అటువంటివి మామూలేనని,

టెన్షన్‌కి గురయితే మరింత మానసిక వేదనేనని ఆమెకు తెలుసు. అందుకే అటువంటివి ఎక్కడికక్కడ వదిలేసి మామూలు కార్యక్రమాల్లోకి వెళ్లిపోతుంటుంది.

రాజకీయాలలో ప్రవేశించిన ఆరు నెలలకు ఆమె అలాంటి ఆటుపోటులకు మానసికంగా సిద్ధపడింది. ఒక సమస్య సమసిపోతే, మరొక సమస్య ముంచుకు వస్తుందని ఆమెకు తెలుసు. తెలుసు కాబట్టే విశ్వసౌరభ్ సమస్యని కూడా పక్కకి నెట్టి తన రొటీన్ ప్రోగ్రామ్‌లో నిమగ్నురాలవుతోంది. కాకపోతే సమస్య మరీ పెద్దదయి దేశానికి, ప్రజలకు విఘాతం కలిగినప్పుడే ఆమె వాటి గురించి ఆలోచిస్తుంది.

కందిరీగల్లా చుట్టుముట్టిన ఆలోచనలనుండి బయటపడుతుండగా ఫోన్‌మోగింది. బాత్‌టబ్ పక్కనే వున్న ఫోన్‌ని అందుకుంది. అన్‌లిస్టెడ్ నెంబర్ అది. చాలా తక్కువమందికి తెలుసా నెంబర్.

"హలో...." ఆమె కంఠం సుమధురంగా కదిలింది.

"హలో! పాపం హత్యాప్రయత్నం నుండి తప్పించుకొచ్చానని సంబరపడు తున్నావేమో! ఈసారి మటుకు నీవు తప్పక ఛస్తావ్... త్వరలో చావుకోసం ఎదురుచూడు" కసిగా ధ్వనించింది ఆ కంఠం.

"ఎవరు నీవు?"

"నేను ఎవరినయితే నీకెందుకు? నీ మృత్యు ముహూర్తం కోసం ఎదురుచూసుకో" క్లిక్ మంది రిసీవర్.

సౌగంధికలో ఆలోచనలు. ఎవరితను? ఎవరు తనను చంపబోతున్నది? మామూలుగా అయితే అలాంటి ఫోన్లని తాను లెక్కచేసేది కాదు. కానీ అన్‌లిస్ట్‌డ్ నెంబర్‌కి వచ్చిందీ ఫోన్.

చాలా ముఖ్యమైన వారికి తప్ప బయటివారికి తెలియదా నెంబర్. అంటే-తనపై హత్యాయత్నం చేసింది తనకు బాగా సన్నిహితులయిన వారన్నమాట...

ఎవరువాళ్లు? తనని చంపితే వారికి కలిగే ప్రయోజనం ఏమిటి?

అన్నీ ప్రశ్నలే! జవాబులేని ప్రశ్నలే!!

## 21

"మైగాడ్..."

తన జీవితంలో అంత షాక్ ఎప్పుడూ తినలేదు సౌగంధిక. తన శరీరంలో కలిగిన కంపన ఆమెకు స్పష్టంగా తెలుస్తూనే వుంది. సాఫీగా వెళుతున్న ఓడని వున్నట్లుండి తుఫాన్ కెరటం బలంగా 'ఢీ' కొని ఎత్తి గిరాటువేసిన ఫీలింగ్ ఆమెలో.

విశ్వసౌరభ్ కాలేజీలో ఒకనాటి స్నేహితుడు. నేడు ఎంత పని చేశాడు? తనని... ప్రేమని నిరాకరించానన్న వంకతో లవర్స్ పార్క్‌లో ఓ చిన్న ప్రయోగంతో మొదలుపెట్టి, ఇప్పుడు దేశం మొత్తం నాశనం చేయబోతున్నాడు.

అదంతా ఒక ఎత్తుకాగా, దేశప్రజలు దృష్టిలో తనే అతని ప్రేయసి అన్న గుట్టుని రట్టుచేశాడు. ఇప్పుడు తాను ప్రజలకు ముఖం ఎలా చూపాలి? దేశంలోని ఇంత వినాశకరానికి కారణం అయిన తనని ప్రజలు క్షమిస్తారా?

ఇంతకాలం తననో దేవతలా ఆరాధించిన ప్రజలు, ఇకనుండి తనని 'ఛీ' కొట్టరా? తమని ఉద్ధరించిన ప్రత్యక్ష దైవమని తలచే జనం ఇకనుండి తన ముఖంమీద ఉమ్మివేయరా?

ఒక్కో నిముషం నిశ్శబ్దంగా కరిగిపోతోంది.

భయంకరమైన నిర్వేదం ఆమెలో.

'అయిపోయింది! అంతా అయిపోయింది! తన జీవితం నదిలో పడ్డ నావలా అయిపోయింది. రేపటినుంచి పేపర్లు, ఛానల్ టీ.వీ.లు తన గురించి కథలు కథలుగా ప్రచారం చేస్తాయి. ఫలితం ప్రజల దృష్టిలో తాను దోషిగా మిగిలిపోతుంది.

క్షణాలు గడుస్తూనే వున్నాయి.

ఎంత ఆలోచించినా బయటేపడే మార్గం కనిపించటంలేదు. రెండే రెండు దారులు తప్ప.

అవి...

ఒకటి... విశ్వసౌరభ్ ప్రేమకి లొంగిపోవటం.

రెండు... ప్రధాని పదవికి 'రాజీనామా' చేయటం.

అంతే! అంతకు మించి మరో దారి లేదని స్పష్టంగా అర్థమవుతోందామెకు.

విశ్వసౌరభ్ ప్రేమకి లొంగిపోవటం తనకు ఇష్టంలేదు. తన మనసుకి విరుద్ధంగా జరిగే పని అది. అలా చేసేకంటే 'రాజీనామా' చేయడం మంచిది. కానీ... ఒక ఉపద్రవం ముంచుకొచ్చినప్పుడు బయపడి రాజీనామా చేసిందనే అపవాదు ప్రజల మెదడులో నాటుకుంటుంది. దేశ విదేశాల్లో తనకున్న పేరు ప్రఖ్యాతులు తన రాజీనామా దెబ్బతో తుడిచిపెట్టుకొనిపోతాయి. తరతరాలుగా తమ వంశీయులు ప్రజల్లో తెచ్చుకున్న పేరు ప్రతిష్ఠలు తనతో అంతమవుతాయి.

తన స్వయంకృతంవల్ల దేశాన్ని నాశనం చేశానని రేపు తమ మనుమళ్ళు, మునిమనుమళ్లు తిట్టుకుంటారు. మహంతి వంశం తన కూతురువల్లే అంతం అయిందని చరిత్రకారులు పుస్తకాల్లో ఉద్ఘాటిస్తారు. ఎలా! ఎలా ఈ పరిస్థితిని ఎదుర్కోవడం?

నిర్ణయానిర్ణయాల మధ్య ఊగిసలాడుతూందామె మనస్సు ఆఖరి ప్రయత్నం చేస్తున్నట్లుగా.

చదరంగంలో పావుల్ని కదిలిస్తున్న ప్రపంచ ఛాంపియన్‌లా పరిస్థితిని అంచనా వేస్తోంది.

విశ్వసౌరభ్ మొండివాడు. మొండివాడు రాజుకన్నా బలవంతుడు అన్నట్లుగా తన మంకుపట్టు వదలడు. అలాంటి వాడిని లొంగదీయడం ఆ భగవంతుడివల్లా కాదు. మరి ఎటువైపు నుండి నరుక్కురావాలి కొమ్మని?

ఒకటి.... రెండు... మూడు...

క్షణాలు గడుస్తున్నాయి ఆమె ఆలోచనతో.

సరిగ్గా నాలుగో క్షణంలో ఆమె మెదడు తళుక్కుమన్నట్లుగా స్ట్రయిక్ అయ్యిందో ఊహ.

ఆ ఊహకు మూలం.. యుద్ధ్‌వీర్. ఒకనాటి తన మరో సహచరుడు. తనతో, విశ్వసౌరభ్‌తో పాటు సమానంగా పోటీపడ్డ నాటి సహచరుడు అతను.

అతడిని రంగంలోకి రప్పించాలి. ఫలితంగా కథ తిరిగి తమ ముగ్గురి మధ్యే మళ్లీ మలుపులు తిరుగుతుంది. ఇన్ని సంవత్సరాల తర్వాత మళ్లీ యుద్ధ్‌వీర్‌ని తాను తిరిగి రంగంలోకి రప్పించబోతోంది. ఇంతకూ అతను ఎక్కడున్నాడో ప్రస్తుతం?

❖ ❖ ❖

సరిగ్గా పది నిముషాల తర్వాత–

గబగబా పరిగెత్తుకు వచ్చాడు పర్సనల్ సెక్రెటరీ ముకుందం లెటర్ ప్యాడ్, పెన్ను పట్టుకుని.

ఆమె కంఠం కదలింది ఓ నిశ్చయానికి వచ్చినట్లుగా.

"ముందుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్ళి యుద్ధ్‌వీర్ ఎక్కడున్నాడో ఆచూకీ నాకు తెలియపర్చండి..."

"అలాగే మేడమ్..." వినయంగా తన లెటర్ ప్యాడ్‌లో నోట్ చేసుకున్నాడు ముకుందం.

"రెండోది...." ఆమె కంఠం కదిలింది అక్కడ. "ప్రధాని రేపు సాయంత్రం దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు అని దూరదర్శన్ ద్వారా ప్రజలకు అనౌన్స్ చేయండి..."

"ఓ.కే. మేడమ్".

"నౌ యు కెన్ గో..."

ముకుందం గబగబా వెళ్ళిపోయాడు తనకిచ్చిన విధులను నిర్వర్తించడానికి.

# రెండవ భాగం

సరిగ్గా అదే సమయంలో... అండమాన్ నికోబార్ దీవుల్లో సముద్రం పక్కనే చెక్కలతో కట్టిన గుడిసెలోంచి బయటకి వచ్చాడు అతడు.

అతడి కళ్ళు ఎర్రగా మెరుస్తున్నాయి. నిద్రపోయి చాలా రోజులయినట్లుగా. అతని ఒంటి మీద రకరకాల గాయాలు, మచ్చలు సూచిస్తున్నాయి. అతనికి గతంలో ఏదో భయంకరమైన ఫ్లాష్‌బ్యాక్ వున్నట్లుగా.

అతడు... యుద్ధవీర్.

ఆరు నెలలయింది అతడు అక్కడ అడుగుపెట్టి. అడుగుపెట్టిన దగ్గర నుంచి అడవిలో దొరికే కాయలు, పండ్లతో కడుపు నింపుకుంటూ అక్కడే వున్న సముద్రంలో స్నానం చేస్తూ గడుపుతున్నాడు.

అతడు అనేక యుద్ధాల్లో పాల్గొన్నాడని, శరీరాన్ని తూట్లు పొడిచే తుపాకీ గుళ్ల నుంచి అనుక్షణం పోరాడి బయటపడ్డాడని చాలా తక్కువ మందికి తెలుసు.

అతడు డాక్టర్ కోర్స్ చదివాడని, దేశంలోని అత్యున్నత సర్వీస్ ఐ.ఎ.ఎస్. పాసయ్యాడని, ఆ తర్వాత మిలటరీ ఇంటెలిజెన్స్‌లో స్పెషల్ ఆఫీసర్‌గా అపాయింట్ అయ్యాడని కూడా చాలా తక్కువమందికి తెలుసు. ఆరు నెలల క్రితం వరకూ అతడు మిలటరీ ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌గా వుండేవాడు. ఓ సంఘటనవల్ల అతడు బయటికి రావాల్సి వచ్చింది.

అతడు బయటికి రావడానికి కారణం.... రతన్ డాన్. దేశంలో వున్న మాఫియా ముఠాలన్నింటికీ బాస్ అతడు. హత్యలు చేయడం బఠాణీలు తిన్నంత తేలిక అతనికి. మానభంగాలు చేయడం గోలీకాయలు ఆడినంత సులభం అతనికి. చట్టసభలో దాదాపు సగం మంది ఎం.పీ.ల సపోర్ట్ వుంది అతనికి.

ఓ రోజు...

అతడి ప్రధాన అనుచరుడు బెంజిమన్, ఇంకొందరు కలసి ఓ దారుణ కృత్యానికి పాల్పడ్డాడు. ఢిల్లీలోని ఓ చర్చిలోకి జొరబడి నలుగురు క్రిస్టియన్ నన్స్ (సన్యాసినులు)ని బలవంతంగా ఎత్తుకొచ్చి దారుణంగా రేప్ చేశారు. ఆ రేప్ చేయడంలో జరిగిన హింసకి ఆ నలుగురు క్రైస్తవ సన్యాసినులు చనిపోయారు.

జరిగిన ఘోరాన్ని విని దేశం గగ్గోలెత్తిపోయింది. పత్రికలు రకరకాలుగా ఆ కథనాన్ని ఫోటోలతో సహా ప్రచురించాయి. ప్రతిపక్షాలు ధర్నాలు మొదలుపెట్టాయి. దేశంలో క్రిస్టియన్ సంఘాలన్నీ కలిసి రోమ్ నగరంలోని పోప్ దగ్గరకు బయలుదేరి జరిగిన దారుణాన్ని వివరించాయి. రోమ్ మతాధికారి పోప్ ఆందోళన వ్యక్తపరిచాడు.

ఆ చనిపోయిన నలుగురు నన్స్‌లో ఒకామె అన్నయ్య యుద్ధ్‌వీర్. తన చెల్లెలు 'రేప్'కి గురయి మరణించిందన్న వార్త అతన్ని పిచ్చెక్కించింది. అతని తండ్రి శవం కూడా గుమ్మంముందే ఎదురయ్యింది.

అసలు విషయం ఏమిటంటే... కూతురు మరణానికి కారకులైన వారిని అరెస్ట్ చేయమని పోలీస్ రిపోర్ట్ ఇచ్చాడా తండ్రి. అంతేకాదు. రకరకాల మహిళా సమాజాల వారిని, పత్రికల వారిని కలిసి జరిగిన అన్యాయానికి ప్రతిఫలంగా మాఫియా కింగ్ రతన్‌డాన్‌ని ఉరికంబం ఎక్కించమంటూ విజ్ఞప్తి చేశాడు.

అంతే! సరిగ్గా మూడు రోజుల తర్వాత అతడి తండ్రి శవం ముక్కలు ముక్కలుగా కనిపించింది.

ఆ శవం పక్కనే చిన్న చీటీ వుంది.

అందులో....

'రతన్‌డాన్‌ని ఎదుర్కొంటే ఎవరికైనా ఇదే గతి పడుతుంది' అని వుంది.

ఆ చీటీ చూసిన అతని రక్తం సలసల కాగింది. చిన్నప్పటి నుంచి ప్రాపంచిక సుఖాలన్నింటినీ పరిత్యజించి, ప్రభువు నీడలో బతుకుతూ దీనజనుల్ని కాపాడే తన చెల్లిని, అదేమి అన్యాయమంటూ ఘోషించిన తండ్రిని చంపటం కంటే అమానుషం మరొకటి లేదనిపించింది.

వెంటనే ఆ చీటి పట్టుకుని రాష్ట్రంలోని ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లాడు.

తన జీవితం దీనజనులకు, అనాథలకే అంకితం కావాలన్న ఆకాంక్షతో క్రైస్తవ సన్యాసిగా మారిన తన చెల్లెల్ని, తండ్రిని చంపిన హంతకులను పట్టుకోవాల్సిందిగా అతడు ముఖ్యమంత్రిని కోరాడు.

సరిగ్గా వారం తర్వాత అతడు ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లాడు తన సంగతి ఏమైందో తెలుసుకోవటానికి.

అప్పుడు....

చీఫ్ మినిస్టర్ అతడు పొరబడ్డాడని, ఆ సమయంలో రతన్‌డాన్ గానీ, అతని అనుచరుడు బెంజిమన్‌గానీ ఆ సమయంలో దేశంలోనేలేరని చెప్పాడు. అంతే! యుద్ధ్‌వీర్‌లో ఆవేశం కట్టలుతెంచుకుంది. అక్కడే వున్న ఓ తల్వార్‌తో ముఖ్యమంత్రిని చంపబోయాడు. అయితే ఆ తల్వార్ ముఖ్యమంత్రిని చంపలేదుగానీ కాళ్ళూ చేతులు నరికేసింది.

అతడు ముఖ్యమంత్రి మీద హత్యా ప్రయత్నం చేయబోయాడన్న వార్త రాష్ట్రమంతా దావానలంలా వ్యాపించింది. యుద్ధంలో శత్రువుల్ని నరికి అత్యున్నత అవార్డ్ అయిన

పరమ వీరచక్ర అవార్డ్‌ని స్వీకరించిన అతడు అంత ఘోరం చేశాడంటే ఎవరూ నమ్మలేకపోయారు. వాళ్లందరి కళ్లముందు పాక్–భారత యుద్ధం కదలాడింది.

ఓసారి సరిహద్దులో పాక్ భారత సైనికులను రెచ్చగొట్టింది. రైఫిళ్ళతో కాల్పులు జరపటం, ఆకాశంలోంచి సరిహద్దు ప్రాంతాల్లో బాంబుదాడులు జరగడం చేసింది. ఆ చర్యకు అప్రతిభులయ్యారు భారత సైనికులు, దాదాపు మూడోసారి పాక్‌తో యుద్ధం వచ్చినట్లేనని భావించారంతా.

కానీ....అప్పుడు యుద్ధ్‌వీర్ యుద్ధం అవసరంలేదని చెప్పి భారత్– పాక్ సరిహద్దు రేఖైన రెడ్‌క్లిఫ్ రేఖ దాటి శత్రుదేశంలోకి ప్రవేశించాడు. అతడు ప్రదర్శించిన పరాక్రమానికి పాక్ సైనికులు చెల్లాచెదురయ్యారు. ఉగ్రసింహంలా అతడు ప్రదర్శించిన ధైర్యసాహసాలకు శత్రుదేశం గుండెలు బేజారైపోయాయి.

వటుడు ఇంతింతై అన్నట్లుగా బోర్డర్‌లో శత్రువులను తరిమికొట్టి, చివరకు పాక్ దేశంలోకి ప్రవేశించి కనిపించినవారిని కనిపించినట్లే పిట్టల్ని కాల్చినట్లు కాల్చి చంపాడు. మళ్లీ సరిహద్దులో పిచ్చి పనులు చేస్తే పాక్ సైన్యంలో ఒక్క సైనికుడు కూడా మిగలడని ప్రతిజ్ఞ చేశాడు.

అప్పుడు కురిశాయి భారత్‌లో అతడిపైన ప్రశంసలు వెల్లువలు. ఎక్కడ చూసినా అతని గురించి పొగడ్తలే. రేడియోలో, టీవీలో, వార్తా పత్రికల్లో అతడు చూసిన ధైర్యసాహసాల గురించి కథలు కథలుగా వివరించారు. అత్యున్నతమైన అవార్డ్ అయిన పరమవీరచక్రతో అతడిని సత్కరించారు. అంతేకాదు – మిలటరీ ఇంటెలిజెన్స్‌లో అత్యున్నత పదవి అయిన 'చీఫ్ ఆఫ్ మిలటరీ ఇంటెలిజెన్స్' పదవిలో అతన్ని నియమించారు.

అలా యుద్ధంలో శత్రువుల్ని నరికి అత్యున్నత అవార్డ్‌ని అందుకున్న అతడు చీఫ్ మినిస్టర్‌ని చంపబోయాడంటే ఎవరూ నమ్మలేకపోయారు. అతని యుద్ధ పరాక్రమాలు కథలు కథలుగా చెప్పుకున్న సైనికులు నిశ్చేష్టులైపోయారు.

వెంటనే ప్రభుత్వం కళ్లు తెరిచింది. యుద్ధ్‌వీర్‌ని అరెస్టు చేయమని సి.బి.ఐ.కి పూర్తి అధికారాలు యిచ్చింది. కానీ యుద్ధ్‌వీర్ ఆచూకీ ఎక్కడా దొరకలేదు.

దొరికినా – దొరికినట్లే సి.బి.ఐ. కళ్లల్లో కారం కొట్టి తప్పించుకుపోయేవాడు.

యుద్ధ్‌వీర్ దృష్టంతా తన చెల్లిని, తండ్రిని చంపిన దుర్మార్గుల మీద వుంది. ఒక గొప్ప సైనికుడు విజయమో, వీరస్వర్గమో తేల్చుకోవడం కోసం అన్నట్లుగా అజ్ఞాతంగా వుండి నేరస్తుల కోసం వల వేశాడు.

మరో రెండు రోజుల తర్వాత... ఇండియా అండర్ వరల్డ్ మొత్తం వెతికి బెంజిమన్ అనుచరుల జాడ సంపాదించాడు. మరో రెండు రోజుల్లో ఆ నలుగుర్లో యిద్దరి శవాలు యమునానది డ్రయినేజీలో తేలుతూ కనిపించాయి.

ఇంకో నాలుగు రోజుల తర్వాత బాంబే రెడ్‌లైట్ ఏరియాలో అమ్మాయిలతో కులుకుతున్న మరో ఇద్దరిని కూడా చిత్రహింసలు పెట్టి చంపేశాడు.

ఆ శవాల్ని చూసిన వ్యభిచారిణులు భళ్లున వాంతి చేసుకుని పిచ్చి వాళ్లయి పోయారు.

ఆ తర్వాత కథ ఊహించని విధంగా నడిచింది. చంపబడ్డ అనుచరుల ద్వారా యుద్ధ్‌వీర్ బెంజిమన్ ఆచూకీ తెలుసుకోగలిగాడు.

అప్పుడు యుద్ధ్‌వీర్ అతని బట్టలు వూడదీసి, అతన్ని నగ్నంగా బొంబాయి నగర మంతా నడిపిస్తూ, అతని చేతివేళ్లని, కాలివేళ్ళని చెట్లు కత్తిరించే కత్తెరతో నిర్దాక్షిణ్యంగా కత్తిరించాడు.

తన చెల్లిని మానభంగం చేయడానికి కారణమైన అతన్ని నిర్ధాక్షిణ్యంగా బాంబే సిటీ చివర నడిబొడ్డులో నిలబెట్టి ఉరితీశాడు. ఆ సంఘటనని ఆ రోజు కనీసం రెండు వేల మంది జనం చూసి వుంటారు.

అంతే! జరిగింది తెలుసుకున్న మాఫియాకింగ్ రతన్‌డాన్ జీవితంలో మొట్టమొదటి సారిగా భయంతో వణికిపోయాడు. ఎక్కడో మిలటరీలో వుండే యుద్ధ్‌వీర్ సిటీలోకి అడుగు పెడతాడని, మనుషులను ముక్కలు ముక్కలుగా నరుకుతాడని అనుకుంటే అతడు యుద్ధ్‌వీర్ కన్నతండ్రిని స్వయంగా చంపేవాడు కాదు.

ఎన్నో హత్యలూ, మానభంగాలూ తేలికగా చేసిన అతను ఆ క్షణం టెర్రర్‌తో బిగుసుకుపోయాడు.

బతికుంటే బలుసాకు తినొచ్చని వెంటనే దుబాయ్‌కి పారిపోయాడు. ఈలోపు యుద్ధ్‌వీర్ సి.బి.ఐ. ఇన్స్‌పెక్టర్లకు దొరికిపోవడం, అధికారులంతా సమావేశమై అతడిని మార్షల్ కోర్టు ముందు నిలబెట్టడం, విచారణ జరపడం చకచకా జరిగిపోయాయి.

"ఎందుకు చేశావ్?" చట్టాన్ని ఎందుకు చేతిలోకి తీసుకున్నావ్. ఐ.పి.ఎస్. ట్రైనింగ్‌లో నీ శక్తి సామర్థ్యాలు చూసి నిన్ను నేరుగా మిలటరీలోకి తీసుకున్నాము. అలాంటిది ఇన్ని దారుణాలు ఎందుకు చేశావ్?" జడ్జి అడిగాడు.

"పోలీసుల దగ్గర్నుంచి ప్రెసిడెంట్ దాకా అందరూ గాజులు తొడుక్కుని కూర్చున్నారు. సో... ఐ వాంట్ టు కిల్ దట్ బాస్టర్డ్స్..." యుద్ధ్‌వీర్ సమాధానం. ఆ విధంగా విచారణ కొద్దిగంటలు కొనసాగింది.

నిజానికి యుద్ధ్‌వీర్ చేసిన పనికి కొన్ని నెలల శిక్ష విధించాలి, కానీ గతంలో అతను దేశానికి చేసిన సేవలను, అతనికి లభించిన పరమవీరచక్ర అవార్డుని దృష్టిలో వుంచుకుని అతన్ని శిక్షించకుండా వదిలేశారు.

అయితే అతన్ని ఉద్యోగానికి రాజీనామా చేయమని కోరింది మార్షల్ కోర్టు.

అప్పట్నుంచి అతడు ఈ ప్రపంచం మీద, చుట్టూ వున్న మనుషుల మీద కసితో దూరంగా వెళ్ళిపోయాడు. చిన్నప్పటినుంచి చుట్టూ వున్న ప్రజల మీద, సమాజం మీద సున్నితమైన భావాలు పెంచుకుని సేవచేయాలని డాక్టర్, ఐ.ఎ.ఎస్. కోర్సులు చదివిన అతడు జరిగిన సంఘటనలతో ఈ లోకమంటేనే కసి, ఈ ప్రపంచమంటేనే అణువణువునా అసహ్యం, ఈ ప్రజల మీద ఏవగింపు కలిగి నాగరిక ప్రపంచం నుండి తప్పుకొని దూరంగా... అండమాన్ నికోబార్‌లో నిర్లిప్తంగా, నిర్వేదంగా బ్రతుకుతున్నాడు.

అదీ యుద్ధ్‌వీర్ చరిత్ర.

❖ ❖ ❖

“మీ శత్రువైన రతన్ డాన్‌ని దుబాయ్ నుండి ఇండియాకు రప్పించే ఏర్పాట్లు నేను చేస్తాను. అందుకు మీరు నాకు చేయాల్సిన సహాయాలు రెండు. ఒకటి. విశ్వసౌరభ్‌తో మాట్లాడి అతడు తిరిగి ప్రయోగాలకు పాల్పడకుండా కన్విన్స్ చేయటం.

రెండు – నా పైన హత్యాప్రయత్నాలు చేస్తున్నదెవరో, వాటి వెనకాలున్న అసలైన వ్యక్తిని కనుక్కోవటం” సౌగంధిక కంఠం కదిలింది.

విభ్రాంతిగా చూస్తున్నాడు యుద్ధ్‌వీర్ ఆమె వంకే. ఒకనాటి తమ కాలేజీ బురఖా సుందరి ఎంతగా ఎదిగింది? ఓ మామూలు అమ్మాయిగా కాలేజీకి రావటం, ఆ తర్వాత ప్రైమ్‌మినిస్టర్ కూతురుగా రూపాంతరం చెందటం, అక్కడ్నుంచి సువిశాల భారతదేశానికి లేడీ ప్రైమ్‌మినిస్టర్ కావడం ఆశ్చర్యంగా వుంది. అదంతా ఒక ఎత్తు కాగా, ఎక్కడో అండమాన్ నికోబార్ దీవుల్లో వుంటున్న తన ఆచూకీ కనుక్కుని తనని పిలిపించడం నమ్మశక్యం కాని విధంగా ఉంది.

అదంతా అలా వుండనీ, ఒకనాటి తమ కాలేజీ మిత్రుడు విశ్వసౌరభ్ ఆమెనే ప్రేమించడం, ఆమెకోసం దేశం యావత్తూ ప్రయోగాలకు పాల్పడటం... ఓహ్ ఇటీజ్ రియల్లీ అన్‌బిలీవబుల్ ఎక్స్‌పీరియన్స్!

ఓ గంట క్రితమే ప్రధాని సంతకంతో ఓ సర్క్యులర్ జారీఅయింది. అందులో దేశానికి ముంచుకొచ్చిన ప్రేమవ్యాధి ప్రమాదం గురించి, ఇన్‌ఛార్జిగా యుద్ధ్‌వీర్‌ని నియమించామని, అతనేమడిగినా ఎలాంటి ప్రశ్నలూ వెయ్యకుండా అతనికి సహకరించాలని

సి.బి.ఐ., రా., ఐ.బి., మిలిటరీ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంటులకు ప్రధాని ఆదేశం' అని వుంది.

ఎక్కడో అడవుల్లో వున్న తనని పిలిపించి, జాయింట్ ఇంటెలిజెన్స్ స్టీరింగ్ కమిటీ ఇన్‌ఛార్జిగా నియమించటం యుద్ధ్‌వీర్‌కి ఇంకా దిగ్భ్రాంతిగా వుంది.

తెలివైనవాడు ఎక్కువసేపు ఆలోచిస్తూ కాలయాపన చేయడు. వెంటనే రంగంలోకి దిగుతాడు. అదే చేశాడు ఇక్కడ యుద్ధ్‌వీర్.

విశ్వసౌరభ్‌ని తాను కలుసుకొని కన్విన్స్ చేయాలంటే అతని ఆచూకీ తనకి తెలియదు. పోనీ అతడు తనని కలుసుకుంటాడా అంటే అతని మీద అరెస్ట్ వారెంట్ రిలీజ్ చేసి వుంది. అందుకే అతడు అజ్ఞాతంలో వుండిపోయాడు. మరి ఇప్పుడేం చేయాలి?

అప్పుడు స్ట్రయిక్ అయ్యిందా ఐడియా అతనికి! వెంటనే కార్యరంగంలోకి దూకాడు.

సరిగ్గా నాలుగు గంటల్లో...

నగరం నలువైపులా రకరకాల పోస్టర్స్ అంటించబడ్డాయి. ఆ పోస్టర్స్‌లో మ్యాటర్ ఇలా రాసి వుంది.

*విశ్వసౌరభ్!*

*నేను ఒకనాటి నీ ఫ్రెండ్ యుద్ధ్‌వీర్‌ని. నీవెక్కడున్నా నాకు ఫోన్ చెయ్యి. ఏ పబ్లిక్ బూత్‌లో నుండి అయినా ఫోన్ చేస్తే నీకు ఎలాంటి రిస్క్ లేదు కదా! నీతో అర్జంట్‌గా మాట్లాడాలి. నా ఫోన్ నెంబర్ 1121134111.*

*– నీ మిత్రుడు యుద్ధ్‌వీర్*

# 22

గణగణమంటూ మ్రోగింది ఫోన్.

"హలో! యుద్ధ్‌వీర్ స్పీకింగ్!"

"ఫ్రెండ్! నేను విశ్వసౌరభ్‌ని. ఎలా వున్నావు? బాగున్నావా? చాలాకాలం తర్వాత నీ గొంతు వినటం ఆనందంగా వుంది."

ఒక్క క్షణం మాటలు కొరవడినట్లుగా అలాగే వుండిపోయాడు యుద్ధ్‌వీర్. ఎనభై కోట్ల ప్రజలను చిత్తం వచ్చినట్లుగా ఆడించగల తన సైంటిస్ట్ మిత్రుడు తన మాట మన్నించి వెంటనే ఫోన్ చేయటం అతనిలో వున్న ఉత్తమ సంస్కారానికి నిదర్శనం.

ఉద్వేగం నుండి తేరుకుంటూ కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం.

"సౌరభ్! ఒకప్పుడు మనం ముగ్గురం సమ ఉజ్జీలం. అలాంటిది మన మధ్య స్నేహబాంధవ్యాలు వుండాలేగానీ ఇలా కక్షలూ, ద్వేషాలూ వుండకూడదు".

"ఓహ్..." మెరుపువేగంతో దూసుకొచ్చాయి రిసీవర్‌లోంచి పదాలు. "అలనాడు పాండవ కౌరవ యుద్ధానికి దూతని పంపినట్లుగా మా ఇద్దరి మధ్య సంధికి నిన్ను పంపించిందా మన మిత్రురాలు?"

ఆ గొంతులోని వ్యంగ్యాన్ని పట్టించుకోనట్లుగా కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం. "అది కాదు సౌరభ్! మీకూ మీకూ మధ్య ఎన్నయినా వుండవచ్చు గానీ మధ్యలో సామాన్య ప్రజలేం చేశారు? నీ ద్వేషానికి ఏ పాపం ఎరుగని సామాన్య ప్రజలు బలికావాలా?

"సామాన్య ప్రజలు...." హూంకరించాడు విశ్వసౌరభ్. "అలనాడు మీ చెల్లెల్ని, తండ్రిని దుండగులు చంపినప్పుడు సామాన్య ప్రజలు ఏం చేశారు? అంతా చోద్యం చూస్తూండిపోయారుగానీ ఒక్కరైనా ధైర్యం చేసి నీకు సపోర్ట్‌గా నిలబడ్డారా? అలాంటి సామాన్య ప్రజలకు తల్లి కదా మన సౌగంధిక. తన దేశ ప్రజలను, జన్మభూమిని ఎలా కాపాడుకుంటుందో చూద్దాం! అయినా ఆమెకూ, నాకూ ఇప్పుడు ఏ బంధం వుందని నేను ఊరుకోవాలి?"

"ఆమె భారతమాత బిడ్డ కాబట్టి, నీవు కూడా ఆ భారతమాత బిడ్డవు కాబట్టి..."

"యుద్ధ్‌వీర్! ఇంత జరిగినా నీకు దేశం మీద, ప్రజల మీద మమకారం పోలేదు. ఐ రియల్లీ పిటీ యూ! ఎన్నెన్నో ఆశలతో ఆమె మీద ప్రేమ పెంచుకున్నాను. ఓ దేవతలా ఆమెని ఆరాధించాను. కానీ చివరకు ఆమె ఏం చేసింది? నన్ను ఓ దొంగగా, జాతికి ద్రోహం చేసిన టెర్రరిస్ట్‌లా నా ఫోటోని పేపర్లో వేసి, పట్టిచ్చినవారికి బహుమానం అంటూ ప్రకటించింది. అలాంటి భారతమాత బిడ్డకు నేను సాయం చేయాలా?"

"ప్రేమ ఎప్పుడూ త్యాగాన్ని కోరుతుంది. మరి నీ ప్రియురాలి కోసం ఆ మాత్రం త్యాగం చేయలేవా?"

అవతలవైపు నుండి పదాలు వేగంగా దూసుకొచ్చాయి. "డియర్ ఫ్రెండ్! చిన్నప్పటినుండి నాకు నేను ఏదీ కోరుకోలేదు. నాకు అమ్మా-నాన్నలు లేరు, అతికష్టంతో స్కాలర్‌షిప్‌తో చదువుకున్నాను. బతుకు కష్టాలలో నలిగి ఎన్నో రాత్రులు ఏడ్చాను.

'ఏడవకు, ఏడవకు, ఏడిస్తే నీ కళ్లు నీలాలు కారు. పాలైనా కారవే బంగారు కండ్లు' అంటూ కన్నీళ్లు తుడిచే అదృష్టానికి నోచుకోక బ్రతికాను.

అలాంటిది ఇప్పుడు జీవితంలో ఒకే ఒక కోరిక నాకు! అది.... ఆమె ప్రేమని పొందటం. ఆమె కోసం వర్షంలో తడిశాను. ఎండలో ఎండాను. ఆఖరికి ఆమె సెక్యూరిటీ స్టాఫ్ చేత చిత్రహింసకు గురయ్యాను. ఎంతో ఉన్నత పదవిలో వుండాల్సిన నేను ఆమె ప్రాపకం వల్ల జాతికి ద్రోహం చేసిన ద్రోహిలా నిలబడ్డాను. ఇదంతా త్యాగం కాదా? ఇంతకుమించి త్యాగం చేయటం ఏ మనిషికైనా సాధ్యపడుతుందా?"

అతడు చెప్పిన ప్రతిదీ లాజిక్‌గా వుంది. అతన్ని ఎలా దారికి తీసుకురావాలో అర్థం కాలేదు యుద్ధ్‌వీర్‌కి. ఎలాగో తేరుకుని గొంతు కదలించాడు.

"విశ్వసౌరభ్! ఆమె రాచరికపు కన్య! తరతరాల నుండి వాళ్లూ, వాళ్ల వంశీయులు రాజకుటుంబానికి చెందినవారు, పైపెచ్చు ఇప్పుడు ఆమె దేశానికి ప్రధానమంత్రి. మనం సామాన్యులం. మనకు, ఆమెకు చాలా తేడా వుంది అన్నింట్లో. ఆమెతో మనకెందుకు చెప్పు?"

మెరుపువేగంతో దూసుకొచ్చింది జవాబు అవతలివైపు నుండి. "నేను ప్రేమించినపుడు ఆమె మామూలు అమ్మాయి. అసలామె ముఖం ఎలా వుంటుందో తెలియకుండా బురఖా వేసుకున్నప్పట్నుంచే నేను ఆమెని ప్రేమించాను. నేను ప్రేమించినప్పుడు ఆమె రాజకుమారి కాదు, ప్రధాని అసలే కాదు. కాలక్రమేణా పరిస్థితులు ఆమెని ప్రధానమంత్రిని చేశాయి.

ఇప్పుడు చెప్పు... ఆమె బురఖాలో వున్నప్పుడు ఆమె ముఖం ఎలా వుంటుందో తెలియకుండా లవ్ చేసిన నా ప్రేమని నిజమైనది కాదా? కేవలం ఆమె కదలికలను, నడవడికను, యాక్టివ్‌నెస్‌ని చూసి ప్రేమించిన నా ప్రేమ పవిత్రమైనది కాదా?"

ఏం మాట్లాడాలో అర్థం గాక మిన్నకుండిన యుద్ధ్‌వీర్ కంఠం తిరిగి కదిలింది ఫోన్‌లో.

"విశ్వసౌరభ్! నా మాట విను. సైన్స్‌ని విశ్వమానవ శ్రేయస్సు కోసం ఉపయోగించుకోవాలి గాని ఇలా మానవాళి విధ్వంసానికి కాదు! ఇప్పటికయినా నీ ప్రయోగాలు మానేసెయ్. ప్రతిఫలంగా నీకు ఉపప్రధాన మంత్రి పదవిని ఇస్తుంది సౌగంధిక. అప్పుడు ఆమె, నీవు కలిసి దేశాన్ని సస్యశ్యామలంగా పరిపాలించు..."

అతని మాటలు పూర్తికాకుండానే రిసీవర్‌లోంచి అలలు అలలుగా దూసుకొచ్చాయి మాటలు.

"అలనాడు దుర్యోధనుడి దగ్గరకు శ్రీకృష్ణుడు రాయబారిగా వెళ్లి కేవలం ఐదు ఊళ్ళు ఇచ్చేయ్ పాండవులకు అన్నాడట. అలా వుంది నీవు నాకు తాయిలం ఆశపెట్టిన పద్ధతి!

నాకు నిజంగా డబ్బు మీద, అధికారం మీద వ్యామోహం వుంటే నా ఫార్ములాని ఏ ఇతర దేశానికో అమ్మేసి, కోట్లు గడించేవాడిని. ఒకే ఒక ఆశయం కోసం పాటు పడుతున్నాను. కేవలం నా ఊపిరిలో ఊపిరైన 'ప్రేమ' కోసమే నా ఈ ప్రయత్నం. నేను అనుకున్న దానికోసం నా ప్రాణాలైనా ధారపోస్తాను.."

ఆగిపోయాడు గొంతులోంచి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేనట్లుగా విశ్వసౌరభ్.

"విశ్వా! ప్లీజ్ కూల్‌డౌన్... ప్లీజ్ కూల్‌డౌన్... అంతగా ఆవేశపడకు..."

"ఇది ఆవేశం కాదు - నా గుండెగదులను చీల్చుకొస్తున్న మాటలు ఇవి! ఓకే వీర్! నేను నా ప్రయోగాన్ని విరమించుకుంటాను. అందుకు ప్రతిఫలంగా ఆమె ఒక పని చేయాలి. ఏమిటో తెలుసా? దూరదర్శన్‌లో 'విశ్వసౌరభ్!... ఐ లవ్ యూ... నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని చెప్పమను. ఆమె నన్ను పెళ్ళి చేసుకోవాల్సిన అవసరం లేదు. కేవలం నన్ను ప్రేమిస్తున్నానన్న విషయం చెప్తే చాలు. ఈ నిర్భాగ్యుడి గుండెకి ఈ ఒక్కమాట చాలు. నా చిన్ని జీవితానికి ఆ ఒక్కమాట ఎడారిలో వేయి ఒయాసిస్సుల లాంటిది!

ఆ ఒక్క మాట కోసమే ఇన్నాళ్ళు చూస్తున్నాను. ఆ ఒక్కమాట ఆమె నోట్లోంచి వస్తే చాలు... నేను తృప్తిగా ఆఖరి శ్వాస విడుస్తాను".

విపరీతంగా కదలిపోయాడు యుద్ధ్‌వీర్ అతని మాటలకు. "ఫ్రెండ్ నీ ప్రేమ అపూర్వం! ఆమె పట్ల నీకున్న ప్రేమ నిజంగా అభినందనీయం. ఒక ఆశయం కోసం పోరాడే నీ ప్రేమ నిజంగా అద్భుతం. ఒక లైలా... మజ్నూ, ఒక రోమియో -జూలియట్, ఒక పార్వతి-దేవదాస్‌లా నీ ప్రేమ కూడా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగింది. భావితరాల వారు నీ ప్రేమని పాఠ్యగ్రంథంలా చదివేరోజు వస్తుంది..."

"థాంక్స్ యుద్ధ్‌వీర్! ఈ ప్రపంచంలో నన్ను, నా ప్రేమని అర్థం చేసుకున్నందుకు నా కళ్లు ఆనందభాష్పాలతో చెమరుస్తున్నాయి."

"ఈ క్షణం నుండి మనం విరుద్ధ వర్గాలకు చెందినవారమైనా నీపట్ల నాకెప్పుడూ స్నేహభావం వెల్లివిరుస్తూనే వుంటుంది.

విశ్వసౌరభ్! నీవు నమ్ముకున్న సిద్ధాంతం కోసం నీవు ప్రయాణిస్తూ వున్నావు. నా కమిట్‌మెంట్ కోసం నేను పాటుపడతాను. ఏది ఏమైనా ఈ నీ ప్రయత్నంలో నీవు విజయం సాధించాలని మనసారా కోరుకుంటున్నాను. విష్ యూ ఆల్ ది బెస్ట్...."

"నీకు కూడా ఆల్ ది బెస్ట్ యుద్ధ్‌వీర్! సెలవ్ మరి..."

మరుక్షణం రిసీవర్ క్లిక్‌మంది.

## 23

టీవీల్లో, రేడియో్లో స్పెషల్ బులెటిన్ ప్రసారమైంది. కొద్దిక్షణాల్లో ప్రధానమంత్రి అతి ముఖ్యమైన ప్రకటన చేయబోతున్నారంటూ. మరో గంట తర్వాత టీవీ స్క్రీన్ మీద కనిపించింది ప్రధాని మొహం.

ఆమె పెదాల్లోంచి విడివడ్డ మాటలు శబ్దరూపం సంతరించుకుంటూ దేశమంతటా ప్రతిధ్వనించడం మొదలుపెట్టాయి.

"చాలా చిన్న వయసులో ప్రధానినయ్యాను. నిజానికి ప్రధాని పదవిని నేనెప్పుడూ ఆశించలేదు. ఇదొక ఉక్కు పంజరం. ఎప్పుడూ 'జడ్' సెక్యూరిటీతో స్వేచ్ఛ అనే పదానికి అర్థం తెలియనట్లుగా వుంటుంది. ఒకసారి ఆ ఉక్కు పంజరంలో చిక్కుకున్నాక తిరిగి బయటకు రావటం దాదాపు అసాధ్యం. అలాంటి ప్రధాని పదవిని నేను కలలో కూడా ఆశించలేదు.

సరిగ్గా ఇరవై మూడు సంవత్సరాల క్రితం ఆ రాచరికపు కుటుంబమనే బంది ఖానాలో జన్మించాను. జీవితంలో అన్నీ అనుభవించే అదృష్టం అందరికీ వుండదు కదా అన్న నిర్లిప్తతతోనే జీవితం వెళ్లబుచ్చసాగాను.

ఆ జీవనంలోనే ఎలాగైనా నా ఉనికి ప్రజలకు తెలీకుండా స్వేచ్ఛగా బతకాలన్న కోరిక బలీయమైంది. ఆఖరికి ఓ రోజు మా నాన్నగారిని ఒప్పించి, ఆంధ్రప్రదేశ్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో మెడిసిన్ కోర్సులో జాయిన్ అయ్యాను. అప్పటికే పేపర్లలో నా ఫోటో వచ్చినందున జనం నన్ను గుర్తుపట్టకుండా బురఖా ధరించి ముస్లిం అమ్మాయిలా పాత్ర ధరించి యూనివర్సిటీలో చేరాను.

అక్కడ్నుంచి మారిపోయింది జీవితం. స్వేచ్ఛగా ఆడుతూ, పాడుతూ ప్రశాంత జీవనాన్ని గడిపే నాకు తారసిల్లాడు విశ్వసౌరభ్. తెలివైనవాడూ, సహచరుడు కావటంతో అతడిని ఓ స్నేహితుడిలా ట్రీట్ చేసేదాన్ని. కానీ అతడు అదే కోణంలో నన్ను చూడక, ప్రేమ ప్రేమంటూ వెంటబడ్డాడు.

నా కోసం చేయని పనిలేదు. వర్షంలో తడిసి, చలికి వణికి, ఎండకు ఎండి కృశించిపోయాడు. నాకు ఈ ప్రేమ, లవ్ లాంటి పదాలంటే ఎలర్జీ. అందుకే అతడి ప్రేమకు ఎప్పుడూ బదులు పలకలేదు.

కానీ...అతడు మాత్రం నన్ను వదలక నా చుట్టూ తిరుగుతూ ఆఖరికి ఓ రాత్రి మా ఇంటికి దొంగలా వచ్చి నా అసలు ఉనికి తెలుసుకున్నాడు.

అంతటితో ఊరుకున్నాడా?

లేదు! కాలేజీ మొత్తం నేను 'పలానా' అని తెలిసేటట్లు చేశాడు. చిన్నప్పట్నుంచి నేను దేనిని వాంఛించానో దానినే నాశనం చేశాడు. నా స్వేచ్ఛని బద్దలుకొట్టాడు. ఫలితం... తిరిగి 'జెడ్' సెక్యూరిటీ ఉక్కు పంజరం లాంటి జీవితం సంభవించాయి.

అంతటితో ఆగిందా? మా నాన్నగారు మహంతి చనిపోతూ నా దగ్గర మాట తీసుకున్నారు. ఈ దేశాన్ని, ప్రజలను కాపాడే బాధ్యతని సక్రమంగా నిర్వర్తించాలని ఆయన మరణశాసనం చేశారు.

ప్రజలకు సక్రమమైన పరిపాలన అందించాలంటే ప్రేమ, పెళ్లిలాంటి వాటికి దూరంగా ఉండాలని మరణశయ్య మీద మాట తీసుకున్నారు. ఆయన ప్రజలకు చేసిన వాగ్దానాలను, ఆశయాలను నెరవేర్చటానికి నేను తగిన వ్యక్తినని, దేశానికి ప్రధానై, ప్రజలకు సేవచేస్తానని నాచేత వాగ్దానం చేయించుకున్నారు.

ఇప్పుడు చెప్పండి. ... నాకై నేను ఏనాడన్నా పదవుల కోసం ఆశ పడ్డానా? ఈ రాచరిక జీవితం నుండి ఎంతో దూరం ఎగిరే పావురంలా పారిపోవాలనుకున్న నాకు విధి ఎప్పుడూ అనుకూలించలేదు. ఈ బందిఖానా శృంఖలాలు తెంచుకోవాలని ఎంత ప్రయత్నించినా తిరిగి అదే బందిఖానాలోకి నెట్టబడ్డాను.

సరే... ఎలాగో పదవిలోకి వచ్చిన నేను చేసేది లేక రాత్రింబవళ్లు పరిపాలన మీదే దృష్టిని కేంద్రీకరించాను. ఒకసారి బాధ్యతని స్వీకరించాక దానిని పరిపూర్ణంగా నిర్వర్తించడం మన ప్రధాన కర్తవ్యం. నామీదే ఆధారపడ్డ ఎనభై కోట్ల ప్రజల సంక్షేమం కోసం రాత్రింబవళ్ళు శ్రమిస్తూ వున్న నాకు ఎదురయ్యిందో సవాల్ విశ్వసౌరభ్ నుండి.

తనని, తన ప్రేమని నిరాకరించినందుకు ప్రతీకారంగా లవర్స్ పార్కులో తన ప్రేమ ఫార్ములాని ప్రయోగిస్తున్నానని, ఈ ప్రపంచంలో ఏ శక్తీ తనని ఆపలేదని ప్రకటించాడు. ఫలితం లవర్స్ సిటీలో ఒక్కొక్కరూ ఆ లవ్ ఫార్ములా తాకిడికి బలైపోసాగారు.

అలా సైన్స్ ముసుగులో మానవజాతి ఉనికికే ప్రమాదం తెచ్చిపెట్టాడు విశ్వసౌరభ్. ఇప్పుడు చెప్పండి! నేనేం చెయ్యాలో! అతగాడి బెదిరింపులకు లొంగి నాకంటూ ఓ వ్యక్తిత్వం లేకుండా 'ఐ లవ్‌యూ' అనమంటారా? నాకూ ఓ హృదయం ఉంది. నాకూ ఓ మనసుంది. నేనూ ఓ మనిషినే కదా!

ప్రతివాడూ నా ఫోటో జేబులో పెట్టుకొని 'ఐలవ్‌యూ' అంటే స్పందించడానికి నేను మైనపు బొమ్మని కాదు కదా! ఇవాళ ఇతను తన ప్రేమ కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. అతని కోరిక ప్రకారం అతని ప్రేమని మన్నిస్తే, రేపు ఇంకొకరు ఇంకో ఫార్ములాతో బ్లాక్‌మెయిల్ చేయరని నమ్మకం ఏమిటి?

ఐదేళ్ల క్రితం ఓ న్యూక్లియర్ సైంటిస్టు ఆటంబాంబుని తయారుచేసి న్యూఢిల్లీ నగరం మీద ప్రయోగిస్తానని ప్రజల్నెంతగా భయభ్రాంతుల్ని చేశాడో మీకు తెలుసు. మళ్లీ ఇప్పుడు ఈ విశ్వసౌరభ్ ... ఇలా ఎంతకాలం ఈ రకమైన వేధింపులకు భయపడాలి?

అదంతా అలా వుండనిద్దాం! మరణశయ్య మీద నా తండ్రి నాదగ్గర మాట తీసుకున్నాడు. నేను జీవితాంతం ప్రజల సేవలో గడుపుతూ అవివాహితగానే మిగిలిపోతానని. అటు తండ్రి మాట కాదనలా? ఓకే! మీ కోసం, దేశం కోసం విశ్వసౌరభ్ ప్రేమని

అంగీకరిస్తే చనిపోయిన నా తండ్రి ఆత్మ నన్ను క్షమిస్తుందా? ఆయన ప్రజలకిచ్చిన వాగ్దానాలను, ఆశయాలను ఎవరు నెరవేరుస్తారు?

ఒకపక్క నా దేశం, నా ప్రజలు – ఇంకోపక్క నా తండ్రికిచ్చిన మాట – ఈ రెండింటి మధ్య ఈ విశాలమైన భవనంలో నేను ఎంత రంపపుకోతని అనుభవిస్తున్నానో ఎవరికీ తెలియదు.

నాకీ పదవి, అధికారంమీద మమకారాలు లేవు. ఈ క్షణమే నేను రాజీనామా చేయగలను. కానీ... దేశానికి సంభవించిన అన్ని క్లిష్ట సమస్యలని పూర్తిచేయలేక ప్రధాని సౌగంధిక పదవి నుండి దిగిపోయిందనే మచ్చ తరతరాలుగా మా వంశాన్ని చీల్చుకు తింటుంది. ఎంతో నమ్మకంతో నా మీద ఈ బరువు బాధ్యతల్ని వుంచిన నాన్నగారి ఆత్మ ఎంత క్షోభిస్తుందో నాకు తెలుసు. అందుకే ఈ సమస్యకి పరిష్కారం లభించగానే నేను ఈ పదవి నుండి పక్కకు తొలగిపోతాను.

కాబట్టి విజ్ఞులైన ప్రజలారా! ఎంతసేపూ ప్రధాని ఏం చెయ్యటంలేదు అంటూ అపవాదులు సృష్టించకండి. ఈ సమస్యని నా వైపు నుండి ఆలోచించండి! నా స్థానంలో మీరుంటే ఏం చేస్తారో ఒక్కసారి ఆలోచించండి! అప్పుడు నేను ఎలాంటి పరిస్థితుల్లో చిక్కుకున్నానో మీకు అర్థమవుతుంది.

ఇక ఉంటాను, జైహింద్.

– మీ ప్రధాని"

# 24

ఆ మర్నాడు ఓ సంచలన వార్త వెల్లడైంది.

అది....

*'ఆ రోజు సాయంత్రం దేశంలో అన్ని ప్రైవేట్ ఛానల్స్‌లో విశ్వసౌరభ్ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నాడు'* అని.

ఆ వార్త వెలువడుతూనే దేశమంతటా సంచలనం.... కలవరం... కలకలం...

ప్రధానమంత్రి ఆఫీసు నుండి కేబినెట్ సెక్రటరీ ఛానల్స్‌కి ఫోన్ చేశాడు. అసలు విశ్వసౌరభ్ ఇంటర్వ్యూ వారికెలా లభించిందో, అతని ఆచూకీ ఎక్కడో తెలియపరచాలని లేకపోతే టీవీ లైసెన్స్ క్యాన్సిల్ చేయటంతోపాటు చట్టరీత్యా ప్రాసిక్యూట్ చేయాల్సి వస్తుందని హెచ్చరించాడు. ఆ హెచ్చరికకు అంతా ఒకే విధంగా ప్రతిస్పందించారు.

అసలు తమకు విశ్వసౌరభ్ ఆచూకీ తెలియదనీ, కొరియర్ సర్వీస్‌లో ఓ క్యాసెట్ అందిందని, దానిని విప్పి చూస్తే విశ్వసౌరభ్ ప్రజానీకాన్ని ఉద్దేశించి మాట్లాడాడని,

దానిని తమ టీవీ ద్వారా టెలికాస్ట్ చేయమని అతని సంతకంతో కూడిన లెటర్ ఉందని, అందుకే తాము ఆ సాయంత్రం దానిని టెలికాస్ట్ చేస్తున్నామని, ఇందులో ఏమైనా అభ్యంతరాలుంటే నిరభ్యంతరంగా కోర్టుకు వెళ్ళవచ్చని ప్రత్యుత్తరం ఇచ్చారు.

చేసేది లేక కేబినెట్ సెక్రటరీ క్రెడిల్ చేశాడు.

సాయంత్రం ఆరుగంటలు.

దేశంలోని జనమంతా టీవీలకు అతక్కుపోయారు. చిన్నపిల్లల దగ్గర్నుంచి వృద్ధుల దాకా కళ్లన్నీ టీవీల కేసి అప్పగించారు.

అన్ని ప్రైవేట్ టీవీలలో సమయం ఆరుగంటలు అయినట్లుగా డిజిటల్ వాచ్‌లు చూపించాయి.

అప్పుడు కనిపించాడు టీవీ తెర మీద.

విశ్వసౌరభ్!

వారలా చూస్తూ వుండగానే కదిలింది తెర మీద విశ్వసౌరభ్ కంఠం గంభీరంగా.

"భారతదేశం నా మాతృభూమి. భారతీయులైన మీరంతా నా సహోదరులు. అలాంటి నా సహోదరులకు శిరస్సు వంచి వినమ్రతతో నమస్కరిస్తున్నాను."

నోట మాట రానట్లుగా ఉద్వేగంగా చూస్తున్నారంతా. అతడి పరిచయ వాక్యాలకు గుండె కదిలిపోగా ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టి చూస్తున్నారు.

తిరిగి కదిలింది సౌరభ్ కంఠం.

"గత కొంతకాలంగా మీరంతా నేనో సైకోపాత్‌నని, దేశాన్ని ఆపదలోకి తీసుకెళ్లే క్రిమినల్‌గా భావిస్తున్నారని నాకు తెలుసు. అంతే కాదు – నిన్న దూరదర్శన్‌లో ప్రధాని సౌగంధిక ప్రసంగిస్తూ – దేశానికి సంభవించిన విపత్తులో తన తప్పేమీ లేదని, అంతా నాదేనని ఆరోపించింది. ఆ ఆరోపణని తిప్పికొట్టడానికే నేను స్వయంగా వీడియో కెమేరాని ముందుంచుకుని మాట్లాడి, ఆ క్యాసెట్లని దేశంలో అన్ని ప్రైవేట్ ఛానల్స్‌కి పంపడం జరిగింది.

నాకు కాస్త ప్రపంచం తెలిసేటప్పటికే తండ్రి కేన్సర్‌తో చనిపోయాడు. ఆ దుఃఖంతో, నా తల్లి స్పృహలో లేనట్లుగా పడి వుండేది. తండ్రి లేకపోవడం, ఉన్న తల్లి కూడా స్పృహలో లేకుండా పట్టించుకోక పోవడం నన్ను నిరంతర విషాదానికి గురిచేశాయి.

మా బీదతనం నుండి తప్పుకోవడానికి నేను ఎన్నో పనులు చేశాను. ప్రొద్దున్నే పేపర్లు ఇంటింటికి వేయడం దగ్గర్నుంచి నా కంటే పెద్ద తరగతుల వారి టెక్స్ట్ పుస్తకాలు తీసుకుని వారికే ట్యూషన్లు చెప్పడం వరకు ఎంతో శ్రమించేవాడిని. కానీ నా తల్లి

మాత్రం మామూలు మనిషి కాలేదు. పై పెచ్చు ఓ రోజు స్పృహ తెలియక రోడ్డు మీద ఓ లారీకింద పడి మరణించింది. దాంతో మానసికంగానే కాకుండా భౌతికంగా కూడా ఒంటరివాడిని అయిపోయాను.

ఆ ఒంటరితనంలోనే ఏదో కసి, ఏదొకటి చేయాలనే తాపాత్రయం. ఆ కసిలోనే ఇంటర్ దాకా కాలేజీ ఫస్ట్ వచ్చాను. ఆ తర్వాత మెడిసిన్ ఎంట్రన్స్ రాయడం, స్టేట్ ఫస్ట్ రావడం, ఉస్మానియా యూనివర్సిటీలో చేరడం జరిగాయి.

అప్పుడు సంభవించిందా అద్భుతం!

అజంతా ఎల్లోరా కొండల్లో ఒక శిల్పం ప్రాణం పోసుకొచ్చి అక్కడ నిల్చుందా అనిపించింది. చందమామలో ఓ ముక్క విడిపోయి భూమ్మీద పరావర్తనం చెంది ఓ అద్భుత సౌందర్యరాశిలా ప్రాణం పోసుకుందా అన్పించింది. పురాణాల కథల్లో రాజకుమారి మాయమై ఆ కాలేజీలో సాక్షాత్కరించిందా అనిపించింది.

ఆ రూపం... సౌగంధిక.

శిలల్ని సైతం కరిగించే ఆమె మాటలు, చేష్టలు ఏదో లోకంలోంచి దిగొచ్చిన ఓ అద్భుతమూర్తి ఒడిలో సేద తీరుతున్న ఫీలింగ్ నాలో.

అప్పటివరకూ జీవితంలో నేనేం మిస్సయ్యానో నాకు తెలిసింది. అమ్మచేతి చల్లదనం, నాన్న అనురాగం, మమత ఇవన్నీ నాకు అపరిచితం. నా హృదయాన్ని సేదతీర్చే ఓ హస్తం కావాలి. ఓ చల్లని మాట కావాలి. ఆర్ద్రత నిండిన ఆత్మీయత కావాలి. ఈ ప్రపంచంలో నేను ఎంత ఒంటరిగా బతుకుతున్నానో ఆమెని చూశాకే అర్థమైంది.

ఫలితం... నేను ఆమెని ప్రేమించసాగాను.

ఆమెకోసం నేను చేయని పనిలేదు. ఆమెకోసం వర్షంలో తడిశాను. ఎండకు ఎండాను. చలికి వణికాను. ఆమెకోసం రోజుల తరబడి తిండి మానేశాను. కానీ.... ఆమె మటుకు నన్ను కరుణించలేదు.

నేను మాత్రం ఆమెని ప్రేమించటం మానలేదు. ఇవాళ కాకపోయినా రేపైనా ఆమె మనస్సు మారకపోతుందా అన్న ఆశతో ఓ రోజు దొంగతనంగా ఆమె ఇంట్లోకి ప్రవేశించాను. ఆమె సెక్యూరిటీ స్టాఫ్‌చేత చిత్రహింసలు అనుభవించాను.

అప్పుడు తెలిసింది... ఆమె ప్రధాని కూతురు అని. అయినా నా ప్రేమ చెక్కు చెదరలేదు. ఆమె యూనివర్శిటీ ఫస్ట్ రావటంకోసం కావాలనే ఓ జవాబు తప్పు రాశాను. ఆమె కళ్లల్లో నిరాశ భరించలేను.

కానీ... నన్ను, నా ప్రేమని ఆమె గుర్తించలేదు పైపెచ్చు ఆమె ప్రధాని అయ్యింది. ఆమెని కల్సుకోవటానికి న్యూఢిల్లీ వెళ్ళాను. ఆమె నుండి కనీసం లోపలికి రమ్మని ఆహ్వానం కూడా రాలేదు.

బలవంతంగా గోడదూకి ఆమెని చూద్దామని ప్రయత్నించిన నన్ను కుక్కని కొట్టినట్లు కొట్టి రోడ్డుమీద పడవేశారు సెక్యూరిటీస్టాఫ్. ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు ప్రధానిని ఏదో చెయ్యబోయాడన్న మిషతో. తిరిగి పోలీసులు నన్ను చిత్రహింసకు గురిచేసేటప్పుడు పెద్దగా గొంతు చినిగిపోయేలా అరిచాను. “నేనేం నేరం చేశాను?” అంటూ. నా ప్రశ్నకు ఎవరూ సమాధానం ఇవ్వలేదు మరింతగా నామీద స్వైర విహారం చేశారు తప్ప.

అంతే! నాలో అంతులేని వేదన...

ఆ వేదన కాస్తా కసి... ఆ కసి కాస్తా ఆగ్రహంగా మారి ఈ దేశాన్ని, ఈ రాచరికపు వ్యవస్థని నాశనం చేయాలన్న పట్టుదల పెంచింది.

ఆ కసిలోంచే నెలల తరబడి, ఆలోచించగా ఆలోచించగా స్ఫురించింది ఓ ఐడియా. ఆ ఐడియాకి తుదిరూపమే... ప్రస్తుత లవ్ ఫార్ములా ఆవిర్భావం” అంటూ ఆపాడు విశ్వసౌరభ్.

“నన్ను, నా ఉనికిని ఆమె అనుక్షణం గుర్తించేలా చేయాలనుకున్నాను. నన్ను, నా ప్రేమని తృణప్రాయంలా తిరస్కరించిన ఆమెకి నేనేమిటో చూపించాలనుకున్నాను. ఓ సాధారణ పౌరుడు ఈ దేశాన్ని, ఈ వ్యవస్థని ఎలా భయభ్రాంతుల్ని చేయగలడో నిరూపించాలనుకున్నాను. ఫలితమే... ఆ లవ్ ఫార్ములా ప్రయోగం.

ఈ రోజు.... ప్రతిక్షణం ఆ ఫార్ములాబారినుండి ఎలా ప్రజల్ని రక్షించాలని ఆలోచనే ఆమెకు. ప్రతి నిముషం తననీస్థితికి తీసుకొచ్చిన నన్ను  ఎలా లొంగదీసుకోవాలన్న తలంపే ఆమెకు.

అంటే ఓ రకంగా ఆమె అహంభావంమీద దెబ్బ కొట్టాను. వీడు సామాన్యుడు, వీడు నన్నేం చేస్తాడులే అన్న ఆమె అహంకారంమీద దెబ్బకొట్టాను. దేశంలో నన్ను మించిన వారు లేరు. ఎవరేం చేయగలరు అనుకున్న ఆమె గర్వంమీద విజయం సాధించాను.

ఇదంతా మీకు టీ.వీ.ద్వారా ఎందుకు చెపుతున్నానంటే – నిన్న టీ.వీ.లో ఆమె చెప్పిందంతా విని నన్ను అపార్థం చేసుకోకుండా నావైపు నుండి, నా కోణంనుండి ఆలోచిస్తారని, ప్రేమించడం తప్పుకాదని, అభిమానించడం నేరం కాదని మీకందరికీ తెలుసు. అలాంటిది నేను ఆమెని మనస్ఫూర్తిగా ప్రేమిస్తే, ఆమె నాకిచ్చిన బహుమానం – ఛీదరింపులు, తన్నులు చిత్రహింసలు, ఆఖరికి దేశద్రోహి అన్న కీర్తి.

ఆమె గురించి ఆలోచించి, ఆలోచించి నిద్రాహారాలు మానేసి, మానసిక వేదనకు గురవ్వటంతో నాకు ‘డయాబెటిస్’ వచ్చింది. కానీ ఆమెమీద కోపంలేదు. ఈ ‘చక్కెర

వ్యాధి' ఆమె ప్రేమతో ఇచ్చిన బహుమతిగా భావించి ఆనందిస్తుంటాను. మామూలుగా నా ఉనికే గుర్తించని ఆమె నాకు బహుమతిగా ఏమీ ఇవ్వదు. అలాంటది అసంకల్పితంలా వచ్చిన ఈ అందమైన బహుమతిని జీవితాంతం నా ప్రేమమయి ఇచ్చిన తీపి జ్ఞాపకంగా దాచుకుంటాను.

ఈ సందర్భంలో నాకు ఠాగూరు రచించిన 'గీతాంజలి' గుర్తొస్తోంది.

"నీ మెడలో నలంకరించిన పుష్పమాలలో....

ఈ పేద పుష్పానికి స్థానముండకపోవచ్చును....

నీవు నన్ను దగ్గరకు తీసుకోకపోయినా నీ మౌనంతోనే

నా హృదయాన్ని నింపుకొని ఎలాగో జీవిస్తాను...."

ఇక మాటలు రాక ఆగిపోయాడు విశ్వసౌరభ్ కళ్లనిండా నీళ్లు నిండగా, గొంతు బొంగురుపోయి –

అతనివైపే చూస్తున్న జనాలు చలించిపోయారు. ఆమె ప్రేమకోసం అతడు పడిన తపన, వేదన వారి హృదయాల్ని కదిలిస్తున్నాయి. అతడు మాట్లాడిన ప్రతి పదంలోని లాజిక్ వారిని స్పృశిస్తోంది.

తిరిగి స్క్రీన్‌మీద అతడి కంఠం కదిలింది.

"ఆమె ఒక్కమాట... ఆమెనుండి ఒక ఓదార్పు కోసం ఎదురుచూసి అలిసిపోయాను. చరిత్రకారులంటారు ఈ ప్రపంచంలో లైలా–మజ్ను, రోమియో–జూలియట్, పార్వతి–దేవదాస్‌ల ప్రేమ చాలా గొప్పదని, కానీ వారికంటే నా ప్రేమ ఇంకా గొప్పది. జూలియట్ – రోమియోని ప్రేమించకముందే ఇంకో అమ్మాయిని ప్రేమించి తిరస్కరించబడ్డాడు. ఈ సత్యం ఎంతమందికి తెలుసు.

దేవదాస్ అయితే పార్వతి వున్నంతకాలం ఆమెని పట్టించుకోక తేలిగ్గా తీసుకుని, ఆమె పెళ్లికాగానే వెంటపడ్డాడు. పెళ్ళి అయిన అమ్మాయికోసం వెంటపడటం మంచిదేనా? ఒకసారి ఆలోచించండి.

ప్రియురాలి మొహం ఎలా వుంటుందో కూడా తెలియకపోయినా, బురఖా వేసుకున్నా, కేవలం ఆమె వ్యక్తిత్వం, హావభావాలు, ఆధారంగా ప్రేమించిన నా ప్రేమ స్వచ్ఛమైనది కాదా? ఆ ప్రియురాలి కోసం చిత్రహింసలు అనుభవించి, ఆఖరికి దేశద్రోహిగా చిత్రీకరించినా, ఇంకా ఆమెనే ప్రేమిస్తున్న నా ప్రేమలోని నిజాయితీని ఎవరైనా శంకించగలరా? ఆఖరికి ప్రేమకోసం దేశం మొత్తాన్ని – వీలైతే విశ్వం మొత్తాన్ని ప్రేమమయంగా మార్చటానికి సిద్ధపడ్డ ఈ ప్రేమికుడి ప్రేమ తీవ్రతని ఎవరైనా కాదనగలరా?

ఇప్పుడు చెప్పండి! ఈ ప్రపంచంలో నా ప్రేమకంటే స్వచ్ఛమైన ప్రేమ వుందా? నా ఆరాధనకంటే గొప్పది ఏమైనా వుందా? నా అభిమానాన్ని మించిన శక్తివంతమైనది ఏదన్నా వుందా?

ఇంత జరిగినా ఇప్పటికీ సౌగంధిక అంటే నాకిష్టం. నా ప్రేమ ఎంత తీవ్రమైనదో తెలుసుకోవాలంటే ఎవరైనా గుండెని మైక్రోస్కోపు కిందపెడితే, అది లబ్‌డబ్ బదులు సౌగంధిక, సౌగంధిక అంటూ వేయి రూపాలతో నర్తిస్తుంది. ఇప్పటికీ ఆమె బాధపడితే, నా కళ్లవెంట నీళ్లు వస్తాయి.

ఆమె కాస్త నడిస్తే ఎక్కడ కాళ్లు నొప్పి పుడుతాయోనని, ఆమెకు కాస్త సుస్తీ చేస్తే ఎక్కడ కందిపోతుందోనన్న అపురూపం నాకు. ఆమె ఒక ఆకాశదేవత కాగా నేను నేలమీదున్న ఓ సామాన్య మానవుడిని.

ఆకాశంలో వున్న ఆ రాజకుమారి ఓ మేఘంలా భూమ్మీదకు వచ్చి నన్ను కలుసుకోవాలని నా ఆకాంక్ష. కాకపోతే నా ఉనికిని ఆమె గుర్తించడంకోసం ఈ ఫార్ములాని ప్రయోగించాను తప్ప ఆమెను బాధపెట్టడం కాదు! మీలాంటి విజ్ఞులైన ప్రజల్ని నాశనం చేయడం నా ఉద్దేశ్యం అసలే కాదు!

ఈ సందర్భంలో మీరు నన్నో ప్రశ్న అడగవచ్చు. 'మరి ప్రజల్ని నాశనం చేయటానికి కాకపోతే లవర్స్ పార్కులో ఎందుకు ఫార్ములా ప్రదర్శించావ్? ఇప్పటికే ఆ వ్యాధి బారినపడ్డ ప్రజల గతి ఏమిటి?' అని.

ప్రతి సమస్యకూ ఓ పరిష్కారం తప్పకుంటుంది. శాస్త్రజ్ఞులు తాము కనిపెట్టే వస్తువులుగానీ, పరికరాలుగానీ వినాశనానికి కారణమైతే, వాటికి అరికట్టటానికి ఇంకో విరుగుడు కనిపెడతారు. అదే విధంగా నేను కనిపెట్టిన లవ్ ఫార్ములాకి 'మందు' వుంది. లవ్‌ఫార్ములా బారిన పడ్డవారికి ఆ మందు ఓడోస్ ఇస్తే చాలు లక్షణాలన్నీ మటుమాయమవుతాయి. ఇటీవలే రీసెర్చిచేసా ఆ మందుని కనిపెట్టాను.

నేనూ మనిషినే! నాకు హృదయముంది. నేనూ మానవత్వం గల మనిషినే. అందుకే లవ్ ఫార్ములాకి విరుగుడుమందు కనిపెట్టాకే నా ఫార్ములాని దేశంమీద ప్రయోగించాను. ఇప్పటికైనా మీకు అర్థమైందనుకుంటాను ఈ సౌరభ్ ద్రోహికాదని. ఇప్పటికైనా మీరు గ్రహించారనుకుంటాను. ఈ ప్రేమ పిపాసి జాతికి వినాశకారి కాదని.

సౌగంధిక నా ప్రేమని అంగీకరించగానే నేను విరుగుడు మందుని బయటపెట్టి అందరిని రక్షిస్తాను ఆమె నోట 'ఐ లవ్ యూ సౌరభ్' అన్న మాటలు చాలు నేనే

స్వయంగా విరుగుడు మందుని కూడా ఆమెకే అందజేస్తాను. అంతవరకూ నాకూ, ఆమెకూ, ఆఖరికి మీకూ ఈ ఉద్రిక్తత తప్పదు.

ఇక వుంటాను. సదా మీ సహకారం ఆశిస్తూ –

మీ సౌరభ్

# 25

లవర్స్ పార్కు!

సుమారు రెండువేల ఎకరాల విస్తీర్ణంతో దేశంలోనే అతి సుందరమైన ఉద్యానవనంలా పేరుగాంచింది. చుట్టూ అందమయిన అశకవనాలతో, మధ్యలో చిన్నపాటి సరస్సుతో, హంసతల్పాలవంటి పడవలతో, అద్భుత ప్రపంచంలా వుంటుంది. ప్రేమికులకు స్వర్గధామంలా వుండే ఆ పార్కులో గడపడానికి గదులు వుంటాయి. భారతదేశాన్ని సందర్శించే విదేశీయులు ఆ పార్కుని చూడకుండా వెళ్లరు.

అంతటి ప్రాముఖ్యత వుంది కాబట్టే తన ఫార్ములాని ఆ పార్కులో ప్రయోగించాడు విశ్వసౌరభ్.

ఫలితం... ఎప్పుడూ ప్రశాంతంగా, ఎంతో నిర్మలంగా వుండే పార్కులో ప్రస్తుతం కలకలం నెలకొని వుంది. అందరి మొహాల్లోను కలవరం, విచారం, ఉద్రిక్తత, ఉద్వేగం, దిగ్భ్రాంతి కనిపిస్తున్నాయి.

"ఈ సిటీలో నేను యాభై ఏళ్ల నుండి వుంటున్నాను గానీ ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. పార్కులోకెవరూ రాకూడదు. పార్కు బయటికి ఎవరూ వెళ్లకూడదు ప్చ్... ఇటీజ్... హారిబుల్...."

"నిజమే... అయినా ఆ సైంటిస్ట్‌కి మనమే దొరికామా? దొరక్క దొరక్క ఈ పార్కులోనే ప్రయోగం మొదలుపెట్టాలా?"

"దొంగ వెధవ! వాడు నా చేతికి దొరకనీ గొంతు నులిమి చంపేస్తా! అసలు వాడెవడో మనకు తెలీదు. మనం ఎవరో వాడికి తెలీదు. అయినా పగ ఎందుకు అర్థం కావటంలేదు..."

"అయినా ఈ సిటీ మేయర్‌కి తలకాయ లేదు. ముఖ్యమైన వారిని పంపించేయవచ్చు కదా!

ఇంకో రెండు రోజుల్లో నాకు మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్ వుంది. సైంటిస్టుగాడివల్ల నా చదువు కాస్తా నాశనమయ్యేటట్లుంది...."

“అసలు నేను ఏదో కాస్త గాలి పీల్చుకుందామని పార్కుకి వచ్చాను. అంతే ఎరక్కపోయి ఇరుక్కుపోయాను...” నిస్పృహ ఆ కంఠంలో.

“ఏమిటో పరిస్థితి అస్సలు బాగాలేదు. హెలికాప్టర్ నుండి ఇక్కడ పడే ఆహార పొట్లాలతో ఎంతకాలం కడుపునింపుకోవాలో అర్థంకావడం లేదు....”

“రాత్రిపూట పరిస్థితి మరీ ఘోరం. ఏ పామో, పురుగో కరుస్తుందేమోనని భయంగా వుంది...”

ఇవన్నీ నడివయసువారి మాటలు కాగా యువకుల మనోభవాలు ఇంకో విధంగా వున్నాయి.

ఓ పదహారేళ్ళ అమ్మాయి, ఓ ఇరవై ఏళ్ళ అబ్బాయి, ఓ పొదదగ్గర వున్నారు.

“ఇంతకుముందు చెయ్యేస్తే విసిరికొట్టేదానివి. ఇప్పుడు నీవే అడ్వాన్స్ అవుతున్నావ్. అంతా ఆ ‘లవ్ ఫార్ములా’ మహత్యం...”

ఆ అమ్మాయి ఏం మాట్లాడకుండా తమకంగా అతడ్ని అల్లుకుపోయింది.

సరిగ్గా అప్పుడే ఏదో చప్పుడవటంతో ఇద్దరూ ఈ లోకంలోకి వచ్చారు. ఎదురుగా... గారపట్టిన పళ్ళతో మాసిపోయిన గడ్డంతో వెకిలిగా నవ్వుతూ కనిపించాడో యువకుడు.

అతడ్ని చూస్తూనే గుర్తుపట్టింది ఆ అమ్మాయి.

తమ వీధిలో అల్లరిగా తిరిగే రౌడీ యువకుడు.

అతడ్ని చూస్తే తనకు అసహ్యం! వీధిలో తాను వెళ్తుంటే కుక్కలా చూస్తూ చొంగ కార్చుకునేవాడు. ఎప్పుడు చూసినా గుట్కా నములుతూ, అగ్గిపుల్లతో పళ్ళని గుచ్చుకుంటూ వుండే అతడంటే తనకు విపరీతమైన ఏహ్యత. అలాంటివాడు ఇక్కడ....

క్షణాలు గడుస్తున్నాయి.

ఆమెలో ఏవేవో మార్పులు కలగసాగాయి.

అదేమిటి తనకు ఇప్పుడు అతడ్ని చూస్తూ అసహ్యం కలగడంలేదే? అతడ్ని చూస్తేనే అప్పట్లో ముఖాన కాండ్రించి ఉమ్మి వేయాలనిపిపించేది.

ఇప్పుడు ఎవరో ఫ్రెండ్‌లా అనిపిస్తున్నాడేమిటి? చూసీ చూసీ అలవాటయి ఫర్వాలేదనిపిస్తున్నాడా? అతడిమీద తనకు ఇష్టం కలుగుతున్నదేమిటి? అతనిపై తనకు మోహం పెరుగుతున్నదేమిటి?

ఆ గడ్డం రౌడీ తన దగ్గరకు వచ్చాడు. ఆమెతో కూడా వున్న యువకుడు అడ్డగించ బోయాడు. అదేం పట్టించుకోనట్లుగా రౌడీ ఆమెని దగ్గరకు తీసుకున్నాడు. ఆమె వివశురాలై అలాగే వుండిపోయింది.

కలో, నిజమో అర్థంకానట్లుగా చూస్తుండిపోయాడా యువకుడు. తన ప్రియురాలు ఒక మృగంలాంటి మనిషిపట్ల ఆకర్షితురాలవటం అతనికి షాక్‌లా వుంది. ఈలోపు ఆమె కూడా గడ్డం రౌడీని ముద్దు పెట్టుకుంది. రౌడీ ఆమెని పెనవేసుకున్నాడు.

దటీజ్ లవ్‌ఫార్ములా! ఆ ఫార్ములాకు రంగు, అందం, ఒడ్డూ పొడుగూ, మంచి చెడూలాంటి పరిమితులు ఏమీలేవు. ఎలాంటివారైనా సరే ఆ కనిపించని తరంగాలకు లొంగిపోవాల్సిందే!

❖ ❖ ❖

సరిగ్గా అదే సమయంలో –

పార్కుకు ఇంకోవైపు – జీన్స్ ప్యాంటూ, టీషర్టూ, నార్త్ స్టార్ బూట్లు వేసుకున్న ప్రవీణ్ ఎదురుగా వున్న అమెరికన్ జంటని చూస్తున్నాడు.

ఆ జంటలో అతడు మోకాలుదాకా నిక్కరు, టీషర్టు వేసుకోగా, ఆమె నైటీలాంటిది వేసుకుంది. అందులోంచి ఆమె తెల్లని చేతులు, కాళ్లు మెరుస్తున్నాయి.

ప్రవీణ్‌కి అమ్మాయిలపిచ్చి జాస్తి. దొరికనప్పుడల్లా ఓ పిట్టని కొట్టుకొని ఆ పార్క్‌కి వచ్చి ఆనందిస్తాడు! ఆ రోజూ అలాగే వచ్చాడు. లవర్స్‌పార్క్‌లోనే ఓ అమ్మాయిని పట్టుకొని పని కానిచ్చుకుందామన్న ధ్యాసలో వుండగా, ఉన్నట్టుండి లవర్స్‌పార్క్‌లోంచి బయటికి రాకపోకలు నిషేధించారు. దాంతో అతడు లోపలే బందీగా వుండిపోయాడు.

అతడికి విదేశీయులు అంటే ఇష్టంలేదు. అందుకే ఫ్రెండ్సంతా ఫారిన్ బ్లూఫిలిమ్స్ చూస్తే, అతడు ఇండియన్ బ్లూఫిలిమ్స్‌ని ఇష్టపడతాడు. ఫారిన్ అమ్మాయిలంతా అతనికి ముసలివాళ్లలా, వృద్ధకన్యల్లా కనిపిస్తారు. పైగా ఫారినర్స్‌తో సంపర్కం పెట్టుకుంటే ఎయిడ్స్ వస్తుందేమోనన్న భయం.

కానీ ఈ రోజు... అతనికి ఆ అమెరికన్ మహిళను చూస్తుంటే అయిష్టత కలగడం లేదు. కొరుక్కొని తినాలనిపిస్తోంది. కసితీరా సలపాలనిపిస్తోంది. ఆమెలోంచి ఏవేవో కిరణాలు తనలో జొరబడుతున్న కొలదీ, ఆమె మీద మోహం అధికం కాసాగింది.

ఇక వుండబట్టలేక, ఆమె దగ్గరకెళ్ళి "దూ యూ వాంట్ సెక్స్ విత్ మీ?" అనడిగాడు.

ఆమె నమ్మకం కుదరనట్లుగా చూసింది. ఇండియాలోని అబ్బాయిలు, అమ్మాయిలు చాలా బిడియస్తులని ఆమెకు తెలుసు. ఇండియా తమ దేశంలా స్వేచ్ఛాయుత దేశంలా తయారవ్వాలంటే ఇంకో వందేళ్లు పడుతుందని ఆమె అనుకునేది. అలాంటిది తనంతటా తానే ఓ యువకుడు ముందుకొచ్చి గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం ఆమెకు ఆశ్చర్యంగా వుంది.

వెంటనే అతనితోపాటు ఆమే కూడా వెళ్లింది ఓ పొద పక్కకు. మరుక్షణం వారి కదలికలకు అనుగునంగా ఆ పొద కదలసాగింది.

అప్పుడు కదిలాడు అక్కడే వున్న అమెరికన్ యువకుడు. అతడు కూడా వారితో కలిసిపోయాడు. పొద మరింత వేగంగా కదలసాగింది.

ఆ తర్వాత... అది స్వేచ్ఛా ప్రణయం... మనుషుల్లోని పర్వర్షన్‌కి రెక్కలు వచ్చి... వాళ్ల ముగ్గురిలా మారి కాట్లాడుకున్నారు.

❖ ❖ ❖

అదే సమయంలో ఇంకోచోట -

డెబ్భై సంవత్సరాల పరంధామ్‌కి మనస్సంతా అస్పష్టంగా వుంది. ఏదో కాలక్షేపం కోసం లవర్స్ పార్క్‌కి వచ్చాడా సాయంత్రం.

అంతే! పైనున్న హెలికాప్టర్ నుండి మైకులో అనౌన్స్‌మెంట్ వెలువడింది. లవర్స్ పార్కులోంచి ఎవరూ బయటకు వెళ్ళకూడదని, కావాల్సిన ఆహార పదార్థాలు నేరుగా సప్లయ్ చేస్తామని ప్రకటన వెలువడింది.

అప్పట్నుంచి చేసేది లేక తన దురదృష్టానికి చింతిస్తూ అలాగే కూర్చుండిపోయాడు.

అమ్మాయిలు కనిపిస్తేచాలు తిరిగి యవ్వనంలోకి అడుగుపెట్టినట్లయింది. తన భార్య వసుంధర చనిపోయిన దగ్గర్నుంచి తనలో ఆ తీపిగుర్తులు మాయమయ్యాయి. దానికి తోడు వయసు తెచ్చిన వార్ధక్యం తనలోని కోరికలను అంతం చేసింది.

అప్పట్నుంచి కృష్ణా-రామా అనుకుంటూ భగవద్గీత, రామాయణం చదువుతూ కాలక్షేపం చేస్తూ, తీరిక సమయాలలో ఆ పార్కుకు వచ్చి కూర్చోవడం ఆనవాయితీగా మారింది.

అలాంటిది... తిరిగి తన శరీరంలో ఏవేవో కోరికలు చిగురిస్తున్నాయి. ఇప్పుడు ఈ పార్కులో ఏ అమ్మాయిని చూసినా, ప్రేమించాలనిపిస్తోంది. కామించాలనిపిస్తోంది. తిరిగి పాతికేళ్ల యువకుడిగా మారి అందులోని మజాని అనుభవించాలనిపిస్తోంది. ఎంత కంట్రోల్ చేసుకుందామనుకున్నా, సాధ్యం కావటం లేదు. ఆయనకేం అర్థం కావటం లేదు. తాను ఓ పిచ్చివాడా? లేకపోతే ఈ వయసులో ప్రేమ పులకింతలు ఏమిటి? తన మెదడులో ఏదైనా లోపముందా?

ఆలోచనల్లో ఉండగానే అక్కడికి ఓ టీనేజ్ అమ్మాయి వచ్చింది. తన మనుమరాలు వయసున్న ఆ అమ్మాయిని చూస్తూనే అతని శరీరంలో ఏదో అలజడి మొదలయ్యింది. సీతాకోకచిలుకలా మారి ఆమె మీద వాలిపోదామా అనిపించింది.

ఆ అమ్మాయి ఆయనని చూసి నవ్వింది.

ఏదో అజ్ఞాతశక్తి శాసిస్తున్నట్లుగా ఆయన ఆ అమ్మాయికేసి కదిలాడు.

ఆ అమ్మాయి ఆయన చేయి పట్టుకొని ఆప్యాయంగా ముద్దుపెట్టుకుంది. చాలాకాలం తర్వాత పొందిన ఆ ముద్దు ఓ అందమైన అనుభూతిలా వుంది. ఊహించని బహుమతది ఆయనకు.

ఆ తర్వాత వారిద్దరూ ప్రేమికుల్లా మారిపోయారు.

❖ ❖ ❖

అదే పార్కులో ఇంకోచోట– ముప్ఫై సంవత్సరాల కళ్యాణికి అస్పష్టంగా వుంది. ఇంట్లో అక్క కొడుకులు చేస్తున్న అల్లరి భరించలేక పరీక్షల కోసం చదువుకుందామని ఆమె లవర్స్ పార్క్‌కి వచ్చింది.

సహజంగా పురుషద్వేషి ఆమె. పదహారేళ్ల వయసులో ఆమె ఓ యువకుడి గాలానికి చిక్కుకుంది. ఫలితంగా కడుపు బుసబుసపొంగటంతో అబార్షన్ చేయించుకుంది. అప్పట్నుంచి ఆమెకి పురుషులన్నా, పురుషజాతన్నా అసహ్యం. బుద్ధి వున్న ఆడది పెళ్లే చేసుకోకూడదు. తనకు బుద్ధి వుంది. అందుకే అవివాహితలా మిగిలిపోయింది. అలాంటి ఆమె ఆ పార్క్‌లో అడుగుపెట్టిన దగ్గర్నుంచి ఏదోలా వుంది.

ఎదురుగా సరస్సు దగ్గర నిలబడి నీళ్లలోకి గులకరాళ్లు విసురుతున్న ఆ యువకుడు అప్పుడప్పుడూ ఆమెవైపు చూస్తున్నాడు ప్రేమగా.

నిండైన విగ్రహం, ఆరడగుల ఎత్తు, కోలమొహం, కళ్లు మిలమిల మెరుస్తున్నాయి. సూదంటురాయిలా ఎదుటివ్యక్తి చూపుల్ని లాగేసుకుంటున్నాయి.

ఆ కళ్ల నుండి చూపు తిప్పుకోవడం కష్టం.

"కమాన్ డియర్.... కమాన్...." అంటూ చేయి అందించాడతను.

అతడెవరో ఆమెకు తెలియదు. ఎక్కడ్నుంచి వచ్చాడో అంతకంటే తెలియదు. తెలుసుకునే ప్రయత్నం చేయడంలేదామె. అతని చేయి ఆసరాగా పట్టుకొని లేచింది. ఆమె మనసు ఆమె స్వాధీనంలో లేదు. ఏమీ ఆలోచించే స్థితిలో కూడా లేదు. పైకిలేచిన ఆమె చేతులు అతన్ని చుట్టుముట్టాయి... తమకంగా..

ఎత్తయిన ఆమె గుండెలు అతని శరీరాన్ని స్పృశిస్తున్నాయి. ఆమె పెదవులు అతన్ని అందుకుంటున్నాయి పిచ్చిగా. కరిగిపోయే ప్రతిక్షణం వివశుల్ని చేస్తోంది వారిని. నగ్నంగా మారిన శరీరాలు నీళ్లల్లో చేపపిల్లలా కదులుతుంటే కాలం స్తంభించింది వాళ్ల మధ్య.

ఆ దృశ్యాలన్నింటినీ చూస్తున్న లవర్స్‌పార్క్ ఏమీ ఎరగని నంగనాచిలా వుండిపోయింది.

❖ ❖ ❖

లవర్స్ పార్క్ బయట – గజానికొక పోలీస్ చొప్పున ఎక్స్‌రే చూపులతో కాపలా కాస్తున్నారు. మిలటరీ సైనికులు చుట్టూ జల్లెడలా శోధిస్తున్నారు ఎవరూ బయటికి రాకుండా.

పై నుండి హెలికాప్టర్ విరామం లేకుండా ఆహార పొట్లాలు లవర్స్ పార్క్‌లోకి జారవేస్తోంది.

రాత్రి పన్నెండైంది.

అప్పుడు జరిగిందా సంఘటన వేగంగా.

ముందుగా రెండు జీవులు వేగంగా రావడం, వస్తూనే అందులోని మనుషుల చేతులు వారి కోటు జేబుల్లో కదలడం, కదులుతూనే గ్రైనెడ్ లాంచర్స్‌ని బయటికి తీయడం, తీస్తూనే రెట్టించిన వేగంతో వాటిని లవర్స్ పార్క్ వైపు విసరడం జరిగిపోయాయి.

అప్పుడు ... ఆ లాంచర్ తాకిడికి లవర్స్‌పార్క్ గోడలు ఆరడుగుల ఎత్తున ఎగిరి కిందపడ్డాయి.

ఆ లాంచర్స్ శబ్దానికి ఆ సిటీ మొత్తం అట్టుడికిపోయింది. నిద్రపోతున్న పౌరులు హఠాత్తుగా మేల్కొన్నారు. గబగబా ఇళ్లని వదిలి బయటికి పరుగెత్తాడు భయంతో. పసిపిల్లలు గుక్కపెట్టి ఏడవసాగారు. గుండె జబ్బువున్న నలుగురైదుగురు వున్న ఫళాన గుండాగి చనిపోయారు.

అంతా కలకలం... కోలాహలం... అరుపులు...

ఆ హడావుడిలోంచి తేరుకొని చూశారు పోలీస్ మిలటరీ... అప్పటికే దుండుగులు పారిపోయారు.

వెంటనే తేరుకుంటూ అరిచాడు పోలీస్ ఇన్స్‌పెక్టర్ –

“కమాన్ క్విక్! వాళ్ల సంగతి తర్వాత చూద్దాం. ఇప్పుడు ఈ లవర్స్‌పార్క్‌లోంచి ఎవరూ తప్పించుకోకుండా చూడండి...”

మరుక్షణం పోలీసులు, సైనికులు రైఫిల్స్ ఎత్తి లవర్స్‌పార్క్ వైపు గురిపెట్టారు.

ఓ పది నిముషాల తర్వాత అక్కడ అడుగుపెట్టారు కూలీలులు, కాంట్రాక్టర్.

ఇన్స్‌పెక్టర్ ఆదేశం మేరకు తిరిగి అక్కడ గోడకట్టడం మొదలుపెట్టారు.

**కానీ...**

**ఆ సమయంలో...**

**వారికి తెలీదు... ఆ చీకట్లో ఆ లవర్స్ పార్క్ నుంచి ఓ జంట పారిపోయి సిటీలోకి ప్రవేశించారని...**

# 26

ప్రధాని పర్సనల్ ఛాంబర్.

ఆ గదిలో ప్రధాని, కేబినెట్ సెక్రటరీ, యుద్ధ్‌వీర్, త్రిపాఠి, సి.బి.ఐ. రా., ఐ.బి., చీఫ్‌లు వున్నారు.

వారి ముందున్న వీడియో ప్రొజెక్టర్‌లో ఉపగ్రహం తీసిన దృశ్యాలు ప్రదర్శింప బడుతున్నాయి. ఆ దారుణ దృశ్యాలను చూస్తున్న వారిలో నిశ్చేష్టత.... 'మైగాడ్! ఒక వావీవరస లేదు. ఇష్టం వచ్చినట్టుగా ప్రవర్తిస్తున్నారు. అందరి శరీరాలను, మెదడులను ప్రభావితం చేసింది" అన్నాడు కేబినెట్ సెక్రటరీ.

ఎవరూ మాట్లాడలేదు, అంతా ఇంకా షాక్‌లోనే వున్నారు. ఆ షాక్ నుండి తేరుకోకముందే ప్రధాని పర్సనల్ సెక్రటరీ వచ్చి "మేడమ్! విశ్వసౌరభ్ నుంచి ఫాక్స్ మెసేజ్ వచ్చింది" అంటూ అందించాడు.

"డియర్ ప్రైమ్‌మినిస్టర్.

లవర్స్ పార్కులోని 'ఎఫెక్టుతో నా ఫార్ములా పనితనం మీకీపాటికి అర్థమై వుంటుంది.

రేపే నా ఫార్ములాని ఆధ్యాత్మికానికి నెలవైన పాండిచ్చేరిలో ప్రయోగిస్తున్నాను. ఆ తర్వాత రెండు రోజులకు మరో సిటీలో ప్రయోగిస్తాను.

ఇప్పటికైనా నా కోరికని మన్నించారా సరే, లేకపోతే యావత్ భారతదేశం లవర్స్‌పార్కులా మారిపోతుంది... దట్సాల్.

– మీ విశ్వసౌరభ్"

"మైగాడ్! దిసీజ్ ఇన్ సిన్' ఆమె కంఠం మోగింది అక్కడ ఆందోళనగా.

"అవును మేడమ్. మామూలు సిటీలో ఫార్ములా ప్రయోగించటం వేరు. పవిత్ర పావనమైన అరవిందో ఆశ్రమం ఈ ఫార్ములాతో కలుషితమవడం వేరు. ప్రపంచంలోనే పాండిచ్చేరిలోని అరవిందో ఆశ్రమానికి ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుంది. అలాంటి పవిత్ర ప్రదేశాన్ని విశ్వసౌరభ్ తన ప్రయోగానికి అనువుగా మార్చుకొనటం అతని పిచ్చితనానికి నిదర్శనం" అన్నాడు కేబినెట్ సెక్రటరీ.

"ఇందులో పిచ్చితనం ఏముంది?" యుద్ధ్‌వీర్ కంఠం కదిలింది. "కావాలనే విశ్వసౌరభ్ ఆ ప్రదేశాన్ని ఎన్నుకున్నాడు. ప్రపంచ దృష్టి మన మీద మరల్చటానికే అతడు ఆ పనిచేశాడు. లవర్స్ సిటీలాంటి ఎన్ని ప్రదేశాలపై ఫార్ములా ప్రయోగించినా మనం నిమ్మకు నీరెత్తి కూర్చున్నామని ఈ పనికి ఒడిగట్టాడు".

"కావచ్చు" చప్పున పలికింది ప్రధాని కంఠం. "ఏది ఏమైనా పగసాధింపు చర్యలతో ఇలా ఆధ్యాత్మిక ప్రజల మీద దండెత్తడం చాలా తప్పు. అరవిందో ఆశ్రమంలో ఎక్కువగా యాభై సంవత్సరాల పైవారే వుంటారు. మనం అడిగిన ప్రతి చెట్టు, పుట్ట గురించి, ఆఖరికి సతీసావిత్రి కథను కూడా వారు ఆధ్యాత్మిక రూపంలో రసరమ్యంగా వర్ణిస్తారు. అలాంటి పుణ్యమూర్తుల జోలికి వెళ్లడం అమానుషం."

సరిగ్గా అదే మసయంలో పరుగు పరుగున అక్కడకు వచ్చాడు ప్రధాని పర్సనల్ సెక్రటరీ రాజన్.

"మేడమ్! లవర్స్‌పార్క్ మీద బాంబుదాడి జరిగిందట. ఇప్పుడే ఫోన్‌లో సమాచారం అందింది."

షాక్ మీద షాక్ దాని వెనకాల మరొకటి తగిలినట్టుగా మ్రాన్పడిపోయారంతా. అందరి తలల్లోనూ ఒకే ఒక ఆలోచన. 'లవర్స్‌పార్క్ మీద బాంబుదాడి జరిపింది ఎవరు?"

"గోరుచుట్టుపై రోకలిపోటు అన్నట్లుగా అసలే విశ్వసౌరభ్‌తో కుస్తీ పడుతుంటే, మధ్యలో ఈ బాంబు దాడి ఏమిటి? అంతా అయోమయంగా వుంది" అంది సౌగంధిక.

"అసలు నా అనుమానం ఆ బాంబు దాడి చేసింది విశ్వసౌరభ్ అనుకుంటాను మేడమ్" సి.బి.ఐ. ఛీఫ్ గొంతు కదిలింది.

"ఇంపాజిబుల్! విశ్వసౌరభ్ అలా ఎందుకు చేస్తాడు?" అన్నాడు యుద్ధ్‌వీర్.

"వెరీ సింపుల్! ఆ పార్కులోంచి జనాలు పారిపోయి ఆ జబ్బుని మిగతావారికి అంటించడానికి" అన్నాడు సి.బి.ఐ. ఛీఫ్.

"నెవర్! విశ్వసౌరభ్ అలా చేసి వుండడు. అలా చేసేవాడైతే మొత్తం సిటీ మీదే ఫార్ములాని ప్రయోగించేవాడు కదా."

యుద్ధ్‌వీర్ మాటల్లోని లాజిక్ అందరి మెదడులను స్పృశిస్తోంది. నిజమే విశ్వసౌరభ్‌కి ఆ అవసరం లేదు. మరెవ్వరు? అందరిలో ప్రశ్న.

ఆ నిశ్శబ్దంలో తిరిగి కదిలింది యుద్ధవీర్ కంఠం అక్కడ. "అసలు నా ఉద్దేశ్యం ఎవరో టెర్రరిస్టు ముఠా ఆ పని చేసి వుండవచ్చు".

"టెర్రరిస్టులు ఎందుకు చేస్తారలా?" కదిలింది 'రా' చీఫ్. కంఠం అక్కడ.

"ఈ దేశాన్ని, ప్రభుత్వాన్ని ప్రజల దృష్టిలో అల్లరిపాలు చేయడానికి."

ఒకటి... రెండు.. క్షణాలు కదులుతున్నాయక్కడ.

అప్పుడు పలికింది ప్రధాని ఉద్వేగంగా. "ఇక్కడ ప్రశ్న – ఆ పని చేసింది ఎవరన్నది కాదు. ఎంతమంది ఆ పార్కు నుండి తప్పించుకుపోయారన్నది."

మౌనంగా వుండిపోయారంతా.

ఆమె మాటల్లోని రీజనింగ్ నూటికి నూరుపాళ్లు కరక్టేనన్న వాస్తవం వాళ్ళని స్పృశిస్తోంది.

వారి ఆలోచనల్ని చీల్చుతూ అన్నాడు యుద్ధ్‌వీర్.

"ఆ విషయం నేను కనుక్కుంటాను. అంతేకాదు – లవర్సుపార్కు మీద బాంబుదాడి వెనుకున్నది ఎవరో కూడా నేను కనుక్కుంటాను."

"వెరీ గుడ్! యూ కెన్ ప్రొసీడ్! మరి రేపు పాండిచ్చేరిలో జరగబోయే ప్రయోగం విషయం ఏం చేద్దాం?" అంది సౌగంధిక.

నిశ్శబ్దం అక్కడ. ఏం చేయాలో ఎవరికీ అర్థం కావటం లేదు. అప్పుడు తిరిగి కదిలింది యుద్ధవీర్ కంఠం.

"ఆ విషయం కూడా నాకు వదిలేయండి. తిరిగి విశ్వసౌరభ్‌ని ఫోన్ ద్వారా కలిసి, అతని ద్వారా నేను ప్రయత్నం చేస్తాను."

"విశ్వసౌరభ్ మీ మాట వింటాడా?" వ్యంగ్యంగా కేబినెట్ సెక్రటరీ, యుద్ధ్‌వీర్‌కీ ప్రధాని అంతగా ప్రాముఖ్యతని ఇవ్వడం అతనికి నచ్చలేదు.

ఆ ప్రశ్నతో అందరి తలలు యుద్ధ్‌వీర్‌కేసి తిరిగాయి.

"విన్నా, వినకపోయినా ప్రయత్నం చేస్తే తప్పులేదు కదా!" కటువుగా అన్నాడు యుద్ధవీర్.

ఏం మాట్లాడాలో అర్థం కాక తల దించుకున్నాడు కేబినెట్ సెక్రటరీ.

"వెల్ సెడ్ యుద్ధ్‌వీర్! మన ప్రయత్నం మనం చేయటంతో తప్పు లేదు. యూ కెన్ డూ యువర్ బెస్ట్..." తలూపుతూ అంది ప్రధాని సౌగంధిక.

మీటింగ్ ముగిసింది. అంతా లేచారు డోరు తెరవటానికి. యుద్ధ్‌వీర్ నాబ్ మీద చెయ్యి వెయ్యబోయేటప్పుడు, వెనక నుండి ప్రధాని గొంతు వినిపించింది.

"యుద్ధ్‌వీర్..." అంటూ.

ప్రధాని వైపు తల తిప్పాడు యుద్ధ్‌వీర్.

"మే గాడ్ బ్లెస్ యూ! విష్‌యూ ఆల్ ది బెస్ట్ యుద్ధ్‌వీర్..." అన్నదామె.

"థాంక్స్ మేడమ్" అంటూ బయటకు అడుగుపెట్టాడతను.

❖ ❖ ❖

తన ఆఫీసులో అడుగు పెడుతూనే యాక్షన్‌లోకి దిగిపోయాడు యుద్ధ్‌వీర్. ముందుగా ఫోన్ చేతిలోకి తీసుకొని రింగ్ చేశాడు జయంత్ నెంబరుకి. జయంత్... ఇంటలిజెన్స్ బ్యూరో (ఐ.బి.) ఇన్‌ఫార్మర్.

నిమిషం తర్వాత లవర్స్ సిటీలో జయంత్ లైన్‌లోకి వచ్చాడు. అప్పుడు కదలింది అతని గొంతు.

"జయంత్! లవర్సుపార్కుపై బాంబు దాడికి ముఖ్యకారకుడు ఎవరో నాకు కావాలి."

"అలాగే సర్."

క్షణాలు నిమిషాలుగా మారుతున్నాయి. సరిగ్గా అర్ధగంట తర్వాత ఫోన్ మోగింది.

రిసీవర్‌లోంచి జయంత్ గొంతు అలలు అలలుగా యుద్ధ్‌వీర్ చెవులను తాకింది.

"ఆ బాంబు దాడికి కారణం... రతన్ డాన్. ఇన్నాళ్లూ అజ్ఞాతంగా వున్న అతను ఎనిమిది నెలల క్రితం ఇండియాలో అడుగుపెట్టాడు. అడుగు పెడుతూనే బాంబే, ఉత్తర ప్రదేశ్‌లో మతకలహాలు రేపాడు.

ఆ తర్వాత ఇన్నాళ్లకు ఈ బాంబుదాడిలో తేలింది అతడి హస్తం. అయితే అతడు ఈ పని ఎందుకు చేశాడో, ఎవరికోసం చేశాడో తెలియటం లేదు.

అప్పుడి ముఠాలోనే మన కోసం పనిచేస్తున్న మన ఐ.బి. సీక్రెట్ ఏజెంట్ ద్వారా బయటపడిందీ విషయం."

యుద్ధవీర్ చెవులు వినడం మానేశాయి. జయంత్ చెబుతున్న మిగతా మాటలను.

"ర.....త.....న్......డా.......న్......."

అప్పుడు అతడు పెట్టిన కేకకు ఆ పరిసరాలన్నీ కదిలిపోయాయి. ఆకాశం చీలినట్లు అతడు పెట్టిన ఆ గర్జన సింహగర్జనలా వుంది.

'ర.....త.....న్......డా.......న్........ తన చెల్లెలు, తండ్రి మరణానికి కారకుడైన వ్యక్తి ఇండియాలో వున్నాడు. తను మిలటరీ ఇంటిలిజెన్స్ నుండి బయటకు రావడానికి కారకుడైన వ్యక్తి లవర్స్ సిటీలోనే వున్నాడు. ఇన్నాళ్లూ ఏ వ్యక్తి కోసమైతే తాను రాత్రింబవళ్లు నిద్రాహారాలు లేకుండా వెదుకుతున్నాడో ఆ వ్యక్తి ఇప్పుడు తనకు అందుబాటులో వున్నాడు.'

అతడి కళ్లు మంకెనపువ్వుల్లా వున్నాయి. అతడి కళ్లకే మండించే శక్తి వుంటే ఎదురుగా వున్న ప్రతివస్తువు భగ్గున కాలిపోయేది.

మరుక్షణం అతడి శరీరం కదిలింది ఓ స్థిరమైన నిశ్చయానికి వచ్చినట్లుగా.

ఫోన్‌ని చేతిలోకి తీసుకుని ఇంటర్‌కమ్‌లో బటన్ నొక్కాడు. సెక్రటరీ లైన్‌లోకి వచ్చాడు.

"నేను వెంటనే లవర్స్ సిటీలోకి బయలుదేరాలి. దానికి తగిన ఏర్పాట్లు చెయ్యండి..."

"అలాగే సర్!"

"నేను అక్కడకు వెళుతున్న విషయం చాలా సీక్రెట్‌గా వుంచాలి. నీకు, నాకు తప్ప మూడో వ్యక్తికి ఏమాత్రం తెలియకూడదు..."

"ఎస్ సార్!"

"ఇంకో విషయం. విశ్వసౌరభ్‌ని నేను ఫోన్ ద్వారా కలుసుకోవాలనుకుంటున్నానని సిటీలో బోర్డింగ్స్ ద్వారా, టీ.వీ.లో అనౌన్స్‌మెంట్స్ ద్వారా ప్రకటించండి. వాటిలో నా ఫోన్ నెంబర్ ఇవ్వండి...."

"వెంటనే చేస్తాను సార్...."

"గో అహెడ్" ఫోన్ క్లిక్‌మంది.

# 27

ఫోన్ గణగణ మోగింది.

విసురుగా కదిలింది యుద్ధ్‌వీర్ చేయి రిసీవర్ వైపు.

"హలో యుద్ధ్‌వీర్ హియరింగ్..."

"హలో యుద్ధవీర్! నేను సౌరభ్‌ని..."

ఒక్క క్షణం వడివడిగా కొట్టుకుంది యుద్ధ్‌వీర్ గుండె. మరుక్షణం తేరుకుంటూ కదిలిందతని కంఠం.

"డియర్ ఫ్రెండ్ సౌరభ్! బాగున్నావా?"

"చాలా బాగున్నాను! చెప్పు యుద్ధ్‌వీర్ ఎందుకు ఫోన్ చేయమన్నావో..."

"ఏం లేదు సౌరభ్! నిన్ను పలకరించాలని..."

మెరుపువేగంతో దూసుకొచ్చాయి అవతల్నుంచి పదాలు. "శుష్క పదాలు కనిపెట్టు యుద్ధవీర్! నీకేం కావాలో ఆ విషయం చెప్పు..."

గతుక్కుమన్నాడు యుద్ధ్‌వీర్. తన మిత్రుడు మామూలు వ్యక్తికాదు! గోల్డ్‌మెడలిస్ట్... అలాంటి వాడితో లేనిపోని భేషజాలు నటించడం వేస్ట్! అందుకే డైరెక్ట్‌గా సంభాషణలోకి దిగడం బెస్ట్!

"సౌరభ్! నీవు చేస్తున్న పని ఏం బాగోలేదు ఫ్రెండ్! పవిత్రతకు వేదాలకు మారు పేరైన 'పాండిచ్చేరి' పైన నీవు పగబట్టిన విధానం సమంజసంగా లేదు.."

"సమంజసం..." గట్టిగా నవ్వాడు సౌరభ్ అవతలి వైపు నుండి "మీ ప్రధాని చేస్తున్న పనుల్తో పోలిస్తే నాది సమంజసమో, అసమంజసమో నీకే తెలుస్తుంది.."

"అది కాదు సౌరభ్! ఒక్కసారి ఆలోచించు, సౌగంధిక ఆందోళనగా వుందీ విషయంలో..."

"ఓహ్! ఇదంతా ఆవిడగారి రాయబారమన్నమాట! అలనాడు కుంతీదేవి తన కుమారులను రక్షించుకోవడానికి శత్రుపక్షానికి చెందిన కర్ణుడిని తన కుమారులను ప్రాణభిక్ష పెట్టమని అడిగిందట. అలా తన బిడ్డలైన ప్రజలను కాపాడుకోవటానికి ఈ తల్లి రక్షణ కోసం నిన్ను పంపించిందన్న మాట..."

"నో ... ఈ విషయంలో మటుకు ఆమె నన్ను పంపించలేదు. నేనే ఎలాగైనా నీ మనసు మారుస్తానని కాన్ఫరెన్స్ మీటింగ్‌లో చెప్పాను.."

అవతల్నుంచి నిశ్శబ్దం... నిశ్శబ్దం...

ఆ నిశ్శబ్దంలోంచి కదిలింది యుద్ధ్‌వీర్ గొంతు అతన్ని మరింత కన్విన్స్ చేయడానికన్నట్లుగా.

"సౌరభ్! విదేశీయుల దృష్టిలో భారతదేశానికి వున్న ఒకే ఒక ప్లస్ పాయింట్ – ఇక్కడ పవిత్రత, వివాహబంధంపై నమ్మకం, ఆధ్యాత్మిక పరిపూర్ణత! అలాంటి బలమైన సంబంధాలపై దెబ్బకొడితే ఇక విదేశీయుల దృష్టిలో మన విలువ ఏముంటుంది?"

ఒక్కసారిగా అవతలివైపు నుండి గొంతు గాద్గదమైంది దుఃఖం వచ్చినట్లుగా.

"ఏమైంది సౌరభ్?" ఆందోళనగా కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం.

"ఏం కాలేదు" గొంతులోని దుఃఖాన్ని ఆపుకుంటూ కదిలింది – "ఎంతసేపూ ఆమె బాధ, దేశం ఆందోళన తప్ప ఈ అభాగ్యుడి కష్టాన్ని ఎవరు పట్టించుకుంటున్నారన్న వ్యధ నా గుండెను కోసేస్తోంది.

ఆమె పదవి చల్లగుండాలి. ప్రజల దృష్టిలో దేవతలా వుండాలి కానీ ఇక్కడ నేను ఒంటరిగా... ఆఖరికి స్వేచ్ఛగా బయటికి తిరగలేక రంపపు కోత అనుభవిస్తుంటే, చిన్నపాటి సానుభూతికి కూడా నోచుకోక దుర్భర పరిస్థితుల్లో జీవచ్ఛవంలా..." ఆ పైన మాటలు పూర్తిచేయలేక ఆగిపోయాడు అతను.

"సౌరభ్ డోంట్ ఎక్సయిట్... డోంట్ బరస్ట్... ప్లీజ్ నా మాట విను...."

"వద్దు వీర్! ఇక చెప్పొద్దు. ఒకప్పుడు మన ముగ్గురం స్నేహితులం! ఈ రోజు మీరిద్దరూ ఒకటై నామీద దాడి మొదలుపెట్టారు. దానికి దేశం, ప్రజలు లాంటి పదాలతో ముసుగు కప్పుకుని ఆత్మవంచన చేసుకుంటున్నారు. వీర్! ఒకసారి కాలేజీలో నీవు నన్ను

రక్షించావు. ఆ కృతజ్ఞత నా నరనరాల్లో ఇంకా జీర్ణిస్తూనే వుంది. అందుకే నీకు వాగ్దానం చేస్తున్నాను. నేను నా ప్రయోగాన్ని 'పాండిచ్చేరి' మీద కాకుండా కేరళలోని 'త్రివేంద్రం' మీద ప్రయోగిస్తున్నాను..."

"థాంక్స్ సౌరభ్!.... థాంక్స్! నా కృతజ్ఞతని ఇంతకంటే గొప్పగా ఎలా వెలిబుచ్చాలో తెలియడం లేదు...."

"థాంక్స్ అవసరం లేదు. ఎవరూ ఎవరికీ రుణపడడం నాకిష్టం లేదు. ఇంతటితో నీ రుణం తీర్చుకున్నాను. ఇంకెప్పుడూ నన్ను ఇబ్బంది పెట్టవద్దు, మిత్ర సంబంధాలన్నీ వ్యాపార సంబంధాలే అన్న నానుడిని నిజం చెయ్యొద్దు..."

"అది కాదు సౌరభ్! నీవు నన్ను అపార్థం ..."

అతని మాటలు పూర్తికాకుండానే విసురుగా కదిలింది సౌరభ్ గొంతు. "నీ కోరిక నెరవేరింది కదా! దట్సాల్ ...ఇంక వుంటాను..." ఫోన్ క్లిక్‌మంది.

# 28

"మైగాడ్!"

లక్ష ఓల్టుల ఎలక్ట్రిక్ షాక్ ఒక్కసారిగా తన శరీరంలోకి ప్రవేశించినట్లుగా ఎగిరి పడ్డాడు రతన్ డాన్.

తన జీవితంలో అంత షాక్ ఎప్పుడూ తినలేదు అతడు. జరిగిన సంఘటనలు అతణ్ణి అంతగా దిగ్భ్రాంతికి గురిచేశాయి. యుద్ధ్‌వీర్ తిరిగి అన్ని సంవత్సరాల తర్వాత ... నాగరిక ప్రపంచంలో అడుగుపెడతాడని అతడు కలలో కూడా అనుకోలేదు.

అనుకునుంటే దుబాయ్ నుంచి భారతదేశంలోకి తాను అసలు అడుగుపెట్టేవాడు కాదు.

పాక్ ప్రెసిడెంట్ తనని దుబాయ్ నుండి ప్రత్యేకంగా పిలిపించాడు. ఇండియాలో జరిగే ఆ ఫార్ములాని మరింత విస్తరించే ప్రయత్నంలో లవర్స్ పార్క్ గోడలను పగలగొట్టమని ఆజ్ఞాపించాడు.

అలా చేస్తే ఆ రోగం అందరికీ తేలిగ్గా సోకుతుందని, అందువల్ల ప్రపంచం దృష్టిలో భారతదేశం విలువ జీరో అవుతుందని తలచి తనని పంపించాడు.

యుద్ధ్‌వీర్ ఈ నాగరిక ప్రపంచంలో లేడని, ఎక్కడో దూరంగా వున్న అడవుల్లో వున్నాడని, అందువల్ల తనకు ప్రమాదం లేదని భావించాడు.

కానీ అతడు ఇలా తలవని తలంపుగా రంగంలోకి అడుగుపెడతాడని అసలు వూహించలేదు. జరిగిందంతా ఓ పీడకలని, తిరిగి ఆ భయంకర మృగం తనకంట పడదని భావించాడు.

అలాంటిది... మళ్లీ... ఇప్పుడు... ఇక్కడ....

తన శరీరంలో పేరుకున్న చెమట అతడికి స్పష్టంగా తెలుస్తోంది. ఏ వ్యక్తి పేరు చెబితే తాను కలలో సైతం భయంతో నిల్చుంటాడో, ఏ వ్యక్తి కనిపిస్తే తన నోట్లో ఆహారం సైతం భళ్లున కక్కుకుంటాడో ఆ వ్యక్తి ఇప్పుడు తనని వెంటాడడం కోసం లవర్ సిటీలో అడుగుపెట్టాడు. అడుగుపెడుతూనే తాను ఈ సిటీ నుండి గతంలోలా తప్పించుకోకుండా వుండేందుకు సిటీ బార్డర్స్ అన్నీ సీల్ చేయమని జాయింట్ స్టీరింగు కమిటీ ఛైర్మన్ హోదాలో ఆర్డర్స్ పాస్ చేశాడు. అంటే – ఈ సిటీలో తనని బందీని చేశాడు.

ఈ ప్రపంచంలోని చీకటి సామ్రాజ్యానికి అధిపతి తను. ఈ ప్రపంచంలోని సైన్యం లోని అధికారులలో రారాజులాంటి వాడతను. అలాంటి సమాంతర శక్తులు 'ఢీ' కొంటె ఎవరికో ఒకరికి ఈ భూమ్మీద నూకలు చెల్లిపోక తప్పదు. ఈ చావు తనకే రాసిపెట్టి వుండవచ్చు బహుశా! ఎందుకంటే – యుద్ధవీర్ అన్నింటినీ తెగించినవాడు. మొండివాడు. కనుకనే తన అనుచరుల్ని ముక్కలు ముక్కలుగా నరికేశాడు.

అలాంటి.... అతని బారి నుండి తప్పించుకోవడం ఎలా? ఎలా? ఎలా? తలలోని రక్తనాళాలు సైతం తెగిపోయేలా ఆలోచిస్తున్నాడు రతన్‌డాన్.

సరిగ్గా అప్పుడు... ఫెళఫెళ ఆర్భాటాలతో పెద్ద శబ్దం వినిపించింది. ఒక్కసారిగా వెయ్యి బాంబులు పేలినట్లుగా ఆ సిటీ అంతా దడదడలాడింది. భూమి ఒక్కసారిగా కంపించింది. ఆకాశమంతా అగ్నితో మండిపోయినట్లుగా ఎర్రటి మంటలు భగభగమండు తున్నాయి. ఏం జరిగిందో అర్థం కాక ఒక్కసారిగా బాల్కనీ దగ్గరకు పరుగెత్తాడు.

దూరంగా రతన్ డాన్ మనుషులు ప్రాణభయంతో, వెర్రిగా, పిచ్చిగా కేకలు పెడుతూ పరిగెత్తుతున్నారు. వారి శరీరాల నుండి రక్తం ప్రవహిస్తోంది బాంబుదాడితో.

రతన్‌డాన్ కళ్లు ఆ నగరం నడిబొడ్డున వున్న గోడ మీద అక్షరాలకేసి తిరిగాయి దిగ్భ్రాంతిగా. అక్కడ తెల్లటి గోడల మీద రక్తంలో ముంచి రాసినట్లుగా వున్న అక్షరాలు వుండంగా అతడి మస్తిష్కంలోకి ప్రవేశించాయి.

రతన్ డాన్,

నా చెల్లెలు, తండ్రి మరణానికి ప్రతీకారంగా ఇన్నాళ్లు తర్వాత తిరిగి నిన్ను వెంటాడి వెంటాడి చంపబోతున్నాను. పిరికిపందలా సిటీలో ఎంతకాలం దాగగలవు? అంతేకాదు... లవర్స్ పార్క్ మీద బాంబు విసిరిన నీ ఏకైక తమ్ముడు ప్రస్తుతం... నీ ఇంట్లోనే నీ బెడ్‌రూమ్ మీద శవమై పడున్నాడు, పోయి తనివితీరా చూసుకో.

ఇకపోతే నీ మరణానికై ఎదురుచూస్తూండు. దట్సాల్! – యుద్ధవీర్

ఒక ఇనుపచైన్ సర్రున దూసుకొచ్చి ముఖాన్ని బలంగా కొట్టినట్లుగా కదిలిపోయాడు రతన్ డాన్.

'మైగాడ్! తన తమ్ముడు తన ఇంట్లో శవమై వున్నాడా?' ఆ ఆలోచన కదలగానే మెరుపువేగంతో కదిలాడు. తన ఇంటిని సమీపిస్తూనే అదిరిపడే గుండెలతో బెడ్‌రూమ్ తలుపునెట్టాడు రతన్ డాన్.

అంతే! భళ్లున వాంతి చేసుకున్నాడు రతన్ డాన్. కడుపు చేతబట్టుకొని కిందపడి పోయాడు.

అక్కడ....... అక్కడ....

నేల మీద తెల్లటి పెయింట్‌తో భారతదేశం చిత్రపటం చిత్రించి వుంది. ఆ మ్యాప్‌లో మతకలహాలు జరిగిన బాంబే, మీరట్, హైదరాబాద్ లాంటి ప్రదేశాలు రక్తంతో గుర్తించబడి వున్నాయి.

'బాంబే' అన్న ప్రదేశంలో రతన్ డాన్ సోదరుడి రెండు కళ్లు పెకలించబడి వున్నాయి. 'మీరట్' అని గుర్తుపెట్టి వున్న ప్రాంతంలో అతడి కాళ్లూ – చేతులూ నరికేసి వున్నాయి. మిగతా ప్రదేశాలలో కూడా ఇతర అవయవాలు కోసి పెట్టుబడి వున్నాయి.

ఆ భారతదేశ చిత్రపటానికి కొంచెం దూరంలో శవంలోని మొండెం దేశానికి నమస్కరిస్తున్నట్లుంది.. చేసిన తప్పుకు పశ్చాత్తాపంగా.

ఆ బీభత్స దృశ్యాన్ని చూడలేనట్లుగా తల తిప్పుకున్నాడు రతన్ డాన్. అతడి గుండెలోని రక్తం గొంతులోకి ఎగజిమ్మినట్లయింది. 'యూ ఆర్ గ్రేట్ యుద్ధ్‌వీర్! నా జీవిత కాలంలో నీలాంటి గొప్పవాడిని చూడలేదు. చీకటి ప్రపంచంలోని సామ్రాజ్యానికి అధిపతినైన నా కళ్లు బైర్లు కమ్మేటట్లు చేశావు. నేను ఈ సిటీ నుండి ఎటూ తప్పించు కోకుండా అన్ని దారులు మూసేశావు. ఆఖరికి నా స్వంత తమ్ముడినే చంపి మాతృదేశం మీద నీకున్న దేశభక్తిని చాటుకున్నావు. నా జోహార్లు యుద్ధ్‌వీర్!"

రతన్ డాన్ నెమ్మదిగా కదిలాడు. మిగలిన అనుచరులను దగ్గరకు పిలిచాడు. చనిపోయిన తన సోదరుడికి అంత్యక్రియలు జరపమని ఆజ్ఞాపించాడు.

అంతా అతనివైపే చూస్తున్నారు. ఆ నిశ్శబ్దాన్ని బద్దలుకొడుతూ కదిలింది అతని కంఠం.

"ఇప్పుడు మనం తిరిగి ఆపరేషన్‌లోకి దిగుతున్నాం. ఈ క్షణం నుండి యుద్ధ్‌వీర్ మనకు ప్రథమ శత్రువు. విజయమో, వీరస్వర్గమో తేల్చుకోవటానికి తిరిగి పోరాటానికి సిద్ధమవుదాం."

ఓ క్షణం ఆగి తిరిగి కదిలింది అతడి కంఠం.

"అయితే మనలోనే ఎవరో శత్రువులు వున్నారు. మన రహస్యాలను బయటికి చేరవేస్తున్నారు. ఎందుకంటే అసలు నేను ఈ లవర్స్ సిటీలోకి అడుగుపెట్టిన విషయం యుద్ధ్‌వీర్‌కి ఎలా తెలిసింది. అందుకే వారిని కనిపెట్టే విషయమై నేనొక పద్ధతిని అవలంబించాను..."

అప్పుడొచ్చాడు ఓ అనుచరుడు చేతిలో ఓ చిన్న వస్తువును పట్టుకొని.

"ఇదేంటో తెలుసా? చిన్న ఆడియో క్యాసెట్! దీనిని మీ బూట్లు నాడా కింద పెట్టాను. దాంతో మీరు ఎవరెవరితో ఏం మాట్లాడుతున్నారో ఈ క్యాసెట్ ద్వారా నాకు తెలుస్తాయి..." అంటూ దానిన ఇమినీ టేప్ రికార్డర్‌లో వుంచి ఆన్ చేశాడు.

అంతే! పావుగంట క్రితమే రతన్ డాన్ ఎక్కడున్నాడో యుద్ధ్‌వీర్‌కీ తెలుపుతూ అందులో మాటలు వినిపించసాగాయి.

అంతే! ఎదురుగా వున్న అనుచరులతో ఇద్దరి మొహాలు చెమటతో తడిసిపోవడం ప్రారంభమయ్యాయి. వాళ్లిద్దరూ శంకర్, సాగర్‌లు.

యుద్ధ్‌వీర్‌కి రతన్ డాన్ ఆచూకీ ఎప్పటికప్పుడు తెలిపే సీక్రెట్ ఏజెంట్స్ వాళ్లు. ఆ ఇద్దరికీ ఒకరివైపు మరొకరు చూసుకునే ధైర్యం లేక అలాగే చిత్తరువుల్లా నిలబడ్డారు. మృత్యువే తమ ముందు నిలబడి వున్నట్లుగా వుంది వారికి.

అప్పుడు నవ్వాడు రతన్ డాన్ తెరలు తెరలుగా.

నవ్వి అన్నాడు – "నా పేరు డాన్! మీరు పీల్చే గాలి బరువుని, విడిచిపెట్టే గాలి ఉష్ణోగ్రతని కూడా లెక్కకట్టి చెప్పగలను. మీరు రహస్యంగా మాట్లాడుతున్నది టేప్ చేయించి, మీకే వినిపించిన నేను మీ కోటు జేబుల్లో కూడా బాంబ్స్ పెట్టించాను. నేను రిమోట్ కంట్రోల్ ఆపరేట్ చేశానంటే మీరిద్దరూ ఆనవాలు లేకుండాపోతారు. కానీ... ఆ పని చేయను. వెళ్లండి... బుద్ధిగా మీ యుద్ధ్‌వీర్ దగ్గరకు వెళ్లి మీ ఉద్యోగాలు మీరు చేసుకోండి."

ప్రాణభీతితో యుక్తాయుక్తాలు మర్చిపోయారు. గాలికన్నా వేగంగా పరుగుతీశారు. అదే వారు చేసిన పొరపాటు! డాన్ సమక్షంలో వారిద్దరూ వున్నంతసేపు డాన్ ఎక్స్‌పోజ్ చేయడు. చేస్తే డాన్ కూడా మిగలడు. ఆ క్షణాన వారికా ఆలోచన రాలేదు.

బయటికి పరుగెత్తిన మరుక్షణం వారిద్దరూ తను మోటారుకార్లని బయటికి తీశారు. చకచకా గేర్లు మార్చి ముందుకు కదిలారు రివ్వున.

పైన బాల్కనీ నుండి వారిద్దరినీ చూస్తూనే వున్నారు రతన్ డాన్, మిగతా అనుచరులు,

అప్పుడు తీశాడు డాన్ తన జేబులో వున్న ఓ పూసల మాలని. చేతిలో పూసల మాలను లెక్కపెడుతూ ఒక పూసని నొక్కాడు.

మరుక్షణం ... ఆ మోటారువాహనాలు రెండూ పెద్ద విస్ఫోటనంతో పైకి లేచి పడ్డాయి. వాళ్లిద్దరి శరీరాలు తునాతునకలైపోయాయి. ఆ షాక్ నుండి అంతా తేరుకునే లోపే డాన్ గొంతు కదిలింది.

"మీరంతా అనుకుంటున్నట్టు ఇది పూసల మాల కాదు. రిమోట్ కంట్రోలర్. వాళ్ల వాహనాలలో బాంబులు పెట్టి, ఈ రిమోట్ కంట్రోలర్ నొక్కాను. అంతే చచ్చి నరాకిని వెళ్లారు.

ఈ డాన్‌ని తక్కువగా అంచనా వేయడం వల్ల వచ్చిన ముప్పు అది. ఇక నా తదుపరి టార్గెట్ యుద్ధవీర్. మనం అతడిని ఎదుర్కొనబోతున్నాం..."

ప్రారంభమయ్యింది మరో యుద్ధకాండ.

❖ ❖ ❖

రాత్రి పదవుతోంది. లవర్స్‌సిటీ నిశ్శబ్దంగా వుంది. చల్లని మంచుతో కూడిన వాయుతరంగాలు సిటీని చుట్టుముడుతున్నాయి.

ఫిరోజనాపూర్ సెంటర్లో సిటీబస్సు వచ్చి ఆగింది. అందులోంచి ఓ అందమైన అమ్మాయి దిగింది. బస్సు తిరిగి కదిలింది.

ఆ అమ్మాయి తడుముకుంటూ ముందుకు నడవసాగింది. కిళ్లీషాపులో ఒకరిద్దరి తలకాయలు ఆశ్చర్యంగా ఆమెకేసి తిరిగాయి.

మరో పది సెకండ్లు గడవకముందే వారికి పూర్తిగా అర్థమైంది ఆ అమ్మాయి గుడ్డిదని.

అంత రాత్రివేళ ఆ అమ్మాయి అక్కడెందుకు దిగిందో అర్థంకాలేదు వారికి. వాళ్ళలా సంభ్రమాశ్చర్యాలతో చూస్తుండగానే ఆ అమ్మాయి చేతిలోని కర్ర సహాయంతో ముందుకు నడిచింది.

"లాంజ్ రోడ్‌కు ఎలా వెళ్లాలో చెబుతారా?" అడిగింది పక్కనే ఏదో అలికిడి వినిపించి.

అప్పుడే అటుగా వస్తున్న ఇద్దరు రఫ్‌గా వున్న యువకులు ఆమెని సమీపించారు.

"లాంజ్ రోడ్‌కా? రండి మేడమ్! మేము తీసుకెళతాం... అర్థరాత్రి పాపం ఒంటరిగా ఎలా వెళతారు?" అంటూ అటుగా వెళుతున్న ఆటోని కేకేశారు.

ఆటో వచ్చి వారిముందు ఆగింది.

ఆ అమ్మాయి చేతిలోని కర్ర సహాయంతో ఆటో ఎక్కింది. ఆమె వెంబడే వారిద్దరూ ఎక్కారు.

మరుక్షణంలో ఆటో ముందుకు కదిలింది రివ్వున.

ఆ ఇద్దరు యువకులు ఆమెని తాకుతూ కూర్చున్నారు. ఆటో కుదుపులకు ఆమె మీద పడసాగారు కావాలని. ఆమెకు ఇబ్బందిగా వుంది పరిస్థితి. కానీ చేసేదిలేక అలాగే కూర్చుంది.

“ఛ! పాపం! ఎంత అందంగా వుంది. కానీ కళ్లు లేకపోవడం నిజంగా దురదృష్టం..” ఒకడు అన్నాడు.

“అవును బాస్... నిజంగా ఇంత అందమైన అమ్మాయికి కళ్లని ఇవ్వకపోవడం ఆ దేవుడికే శాపం తగులుతుంది” అన్నాడు రెండోవాడు.

ఆటో కదులుతూనే వుంది వారి కామెంట్స్‌తో.

“ఇంకా లాంజ్‌రోడ్ రాలేదా?” అడిగిందా అమ్మాయి.

“లేదు! ఇంకా పదినిముషాలు పడుతుంది...”

“అలాగా!” అంటూ అమాయకంగా తల వూపింది ఆ అమ్మాయి.

ఆటో ప్రయాణం చేసి చేసి కొంతసేపటికి వూరి చివరున్న బంగళా దగ్గర ఆగింది.

“ఇదే మేడమ్ లాంజ్‌రోడ్...” ఆ అమ్మాయి రెక్కపట్టి దింపుతూ అన్నాడొకడు.

“అవునా?” అంటూ ఆ అమ్మాయి ముందుకు నడిచింది.

“ఆ బంగళా సమీపిస్తూనే ఆ అమ్మాయి ఒక్క ఉదుటున లోపలికి తీసుకెళ్ళారు. ఆ అమ్మాయి గింజుకోసాగింది. లోపల చాలామంది సాయుధులు గస్తీ తిరుగుతున్నారు.

సింహద్వారం లోపల ఓ సింహాసనం లాంటి మెత్తటి కుర్చీమీద ఆసీనుడై వున్నాడు రతన్ డాన్!

అతని దగ్గరకు ఆ అమ్మాయిని తీసుకెళ్లారా ఇద్దరు యువకులు.

“బాస్! మీ కోసం ఈ అమ్మాయిని పట్టుకొచ్చాం....” అన్నాడు ఒకడు.

“శభాష్! గుంట జాంపండులా వుంది. ఎక్కడ దొరికింది.?” అని అడిగాడతను.

“సెంటర్లో తిరుగుతుంటే పట్టుకున్నాం బాస్! గుడ్డిది కావడంతో తేలిగ్గా పట్టుకొచ్చాం...”

“ఓహ్! గుడ్డిదా?” నవ్వాడు రతన్ డాన్.

"ఈమధ్య కన్నెపిల్లని రుచిచూసి చాలా రోజులయ్యిందిరా! పైగా గుడ్డిది కావడంతో మనం దీనిని ఏం చెయ్యబోతున్నామో దీనికి అర్థంకాదు. ఇలాంటి దానితో అనుభవం చాలా బాగుంటుంది...."

ఆ మాటలు వింటూన్న ఆ అమ్మాయి అయోమయంగా నిలబడుతోంది. ఆమెకు అర్థం కావడంలేదు అక్కడినుండి ఎలా తప్పించుకోవాలో.

మరుక్షణం వేగంగా కదిలాడు రతన్ డాన్.... ఆమెకేసి. వేటగాడి వలలో చిక్కిన లేడిపిల్లలా ఆమె చేతిని ముందుకు చాపింది ఏదైనా తగులుతుందేమోనని.

రతన్ డాన్ ఆమె దగ్గరకు వచ్చి చటుక్కున ఆమె పైటమీద చేయివేశాడు.

గుండెలు జలదరించేలా అరచింది ఆమె. అణువణువునా భయం సుడులు తిరుగుతుంటే అరుస్తూనే వుంది. "ప్లీజ్ నన్నేం చేయకు..."

అతడు ఆమె మాటల్ని వినడం లేదు.

ఆబగా, ఆమె లేత గుండెలవైపే చూస్తున్నాడు. అతడి కళ్లల్లో 'ఆకలి' కసిగా ప్రతిబింబిస్తోంది.

మరుక్షణం... ఆమె చీర వూడిపోయింది. అతడు మొరటుగా లాగిన తీరుకు కళ్ళల్లో నీళ్లు తిరుగుతుండగా అతడికేసి చేతులెత్తి దణ్ణం పెట్టింది.

ఊహూ! నరమాంసం రుచికి అలవాటుపడ్డ పులికి లేడి వేడికోళ్లు వినిపించవు... అర్థం కావు. ఫలితంగా అతని చేయి ఈసారి లంగామీద పడింది. చుట్టూ వున్న అనుచరులు ఆకలిగా చూస్తున్నారు ఆమె గుండెలకేసి.

ఈసారి మెరుపువేగంతో కదిలింది రతన్ డాన్ చెయ్యి. ఓ చేత్తో లంగాని లాగేసి, ఇంకో చేత్తో ఆమెని పట్టుకున్నాడు. కామాతురంగా వాటేసుకున్నాడు. కుడి బుగ్గ కొరికాడు. ఎడమ బుగ్గమీద పళ్లుపెట్టి కసుక్కున లాగాడు. కుడి వక్షోజంమీద చేయి వేయబోయాడు.

అటూ ఇటూ గింజుకుందామె. నిశ్శబ్దంగా ప్రతిఘటించాలని ప్రయత్నించింది.

ఊహూ! కుదరలేదు. ఆఖరి ప్రయత్నంగా గుండెలు అవిసిపోయేలా కేకలు పెట్టింది.

డాన్ ఆమె కేకలకు డ్రాక్యులా నవ్వినట్టు నవ్వాడు. నవ్వుతూనే ఆమె కుడి వక్షోజాన్ని తన చేతిలోకి తీసుకున్నాడు. గుండెపైన ఎవరో మేకు బిగించి కొట్టిన భావన ఆ అమ్మాయిలో. ప్రతిఘటిస్తూనే కేకలు పెట్టింది.

ఈసారి డాన్ చేయి ఆమె ఎడమ వక్షోజంపైన పడబోయింది.

సరిగ్గా అప్పుడు...

ఫెళ ఫెళ ఆర్భాటాలతో పెద్ద శబ్దం వినిపించింది. బయట వేల వేల మెషిన్‌గన్ల శబ్దం ఆకాశమంతా అగ్నితో మండుతున్నట్లుగా మంటలు.

రతన్ డాన్ ఏం అర్థంకాక చూస్తూండిపోయాడు. దూరంగా రతన్ డాన్ మనుషులు ప్రాణభయంతో కేకలు పెడుతూ నేలరాలిపోతున్నారు.

సరిగ్గా అదే సమయంలో –

హాల్లో రతన్ డాన్ చుట్టూ వున్న అనుచరులు కూడా నేలకూలారు – మెషిన్‌గన్‌ల దెబ్బలకు.

చుట్టూ పొగ, ఆ పొగలోంచి మెల్లగా ఓ ఆకారం బయటికి వచ్చింది.

పొగ దూరంగా తొలగిపోవటంతో ఆ ఆకారం ఇప్పుడు స్పష్టంగా కనపడింది రతన్ డాన్‌కి.

ఆ ఆకారం... యుద్ధ్‌వీర్.

షాక్‌మీద షాక్ దాని వెనకాల మరొకటి తగిలినట్లుగా ఎగిరిపడ్డాడు రతన్ డాన్.

మైగాడ్! ఏ వ్యక్తి నుండి తాను తప్పించుకోవాలనుకున్నాడో ఆ వ్యక్తి తన ఎదురుగా వున్నాడు. ఏ వ్యక్తి కళ్లబడకూడదనుకన్నాడో ఆ వ్యక్తి తన స్థావరంలోకి వచ్చి తన అనుచరుల్ని పిట్టల్ని కాల్చినట్లు కాల్చి చంపి, తన ఎదురుగా వచ్చాడు. రతన్ డాన్ శరీరంలో నిశ్చేష్టత అణువణువునా ఆవరించుకుంది.

అప్పుడు నవ్వాడు యుద్ధ్‌వీర్ తెరలు తెరలుగా.

"నీళ్లల్లో వున్న చేపకి వలవేస్తే గాలంలో చిక్కుకుంటుంది. అలాగే నీ అచూకీ కనుక్కోవాలంటే ఓ గాలం వేయక తప్పలేదు. ఫలితం... మా సి.బి.ఐ. లేడీ ఇన్స్‌పెక్టర్‌కి గుడ్డిదాని వేషం వేసి సెంటర్‌లో వదిలాను. మామూలు ఆడదైతే మీరు అనుమానిస్తారని, గుడ్డివేషం వేస్తే అనుమానం రాదని అలా నటింపజేశాను. సరిగ్గా మేము అనుకున్నట్లుగానే ఆమెని మీ వారు బలవంతంగా మీ స్థావరానికి తీసుకొచ్చి రేప్ చేయబోయారు. మీ వారిని అనుసరిస్తూ మేముకూడా ఇలా మీ స్థావరంలో అడుగుపెట్టాము."

నిశ్చేష్టత... రతన్ డాన్‌లో. మైగాడ్! ఆ అమ్మాయి గుడ్డిది కాదా? ఎంత పెద్ద ప్లాన్ వేశారు.

అదే సమయంలో ఆ అమ్మాయి నవ్వుతూ యుద్ధ్‌వీర్ వెనకకు వెళ్ళింది.

నిశ్శబ్దం... నిశ్శబ్దం... అక్కడ. ఆ నిశ్శబ్దంలోనే కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం రౌద్రంగా.

"ఇంకా ట్రిక్స్ ప్రదర్శించాలని ప్రయత్నించకు. నీ అనుచరులలో ఒక్కరు కూడా బతికిలేరు. నీవు ప్రస్తుతం ఏకాకివి. మర్యాదగా నా వెంట నడువ్."

రతన్ డాన్ ఇంకా డీప్‌షాక్‌లోనే వున్నాడు. తాను ఇప్పుడు యుద్ధ్‌వీర్ బందీనన్న విషయం అతడి మెదడు జీర్ణించుకోలేకపోతోంది. తన శరీరంలో పేరుకున్న కంపన అతడికి స్పష్టంగా తెలుస్తోంది.

ఆ తర్వాత సంఘటనలు చక చకా జరిగిపోయాయి... యుద్ధ్‌వీర్ ఆజ్ఞమేరకు.

రతన్ డాన్ ప్యాంటూ చొక్కా విప్పించి మెడలో 'దేశద్రోహికి ఇదే శిక్ష' అని రాసివున్న బోర్డుని వేలాడదీయడం, ఆ విషయాన్ని లవర్స్ సిటీ నలుమూలలా అనౌన్స్ చేయడం, చుట్టూ జనమంతా చూస్తుండగానే పోలీసులు, సైనికులు ఇనుప గొలుసులతో రతన్ డాన్‌ని సిటీ చుట్టూ తిప్పించండం ఒక దాని వెంట మరొకటి వేగంగా జరిగి పోయాయి.

❖ ❖ ❖

జాయింట్ ఇంటెలిజెన్స్ స్టీరింగ్ ఇంటరాగేషన్ ఛాంబర్.

గదిపై కప్పుకు కట్టబడిన ఇనుపతాళ్ల ఆధారంగా తలకిందులుగా వేలాడుతున్నాడు రతన్ డాన్. అతని ఎదురుగా వున్న కుర్చీలో కూర్చొని వున్నాడు యుద్ధ్‌వీర్ తాపీగా. అతని పక్కనే ఓ టేప్‌రికార్డర్, వీడియో ప్లేయర్ వున్నాయి.

విసురుగా లేచాడు యుద్ధ్‌వీర్ కుర్చీలోంచి. అతడి కళ్ళు ఎర్రగా మండిపోతున్నాయి క్రోధంతో.

"చెప్పు.... దుబాయ్ నుండి ఇండియాకు ఎందుకొచ్చావ్?"

"ఊహూ" చెప్పనన్నట్లుగా తల అడ్డంగా వూపాడు రతన్ డాన్.

"ఆల్‌రైట్! నువ్వు చావడానికి సిద్ధపడితే, నేను చెయ్యగలిగేది ఏం లేదు. కానీ ఆ చావు నువ్వు అనుకునేంత తేలిగ్గా వుండదు... " అంటూ తన పక్కనే వున్న క్యాన్ మూత తెరిచాడు యుద్ధ్‌వీర్.

తలక్రిందులుగా వేలాడగట్టబడిన రతన్ డాన్ చూపులు పెద్దవయ్యాయి... ప్రశ్నార్థకంగా.

ఆ క్యాన్‌లో తెల్లటి పాలు వున్నాయి.

అప్పుడు కదిలింది యుద్ధ్‌వీర్ శరీరం వేగంగా. ఆ క్యాన్‌లోంచి గుప్పెడు పాలని తీసుకొని రతన్ డాన్ కళ్ళమీద పోశాడు విసురుగా.

మరుక్షణం ఆ గదంతా రతన్ డాన్ అరుపులతో ఛిన్నాభిన్నమైపోయింది.

కళ్లముందు మంట... భగ్గున మంట... నొప్పి... కళ్లు పెకిలిస్తున్నట్లుగా నరకయాతన...

ఆ స్థితిలో కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం. "ఇప్పుడు నీ కంఠంమీద పోసినవేమిటో తెలుసా? జిల్లేడు పాలు – ఆ పాలు నీ కంట్లోకి పోయిన మరుక్షణం నీ రెండు కళ్లూ పోయాయి. ప్రస్తుతం నీవు గుడ్డివాడివి. నా చెల్లెల్నీ, తండ్రిని చంపిన నీకు ఇది చాలా చిన్న శిక్ష కదూ..."

రతన్ డాన్ మాట్లాడే స్థితిలో లేడు.

కళ్లల్లో సూదులుపెట్టి గుచ్చుతున్నట్లుగా బాధ... నొప్పి... టార్చర్.

"ఇప్పటికైనా చెప్పు? ఇండియాకి నీవు ఏ పనిమీద వచ్చావు? నిన్ను ఎవరు పంపించారు?"

చెప్పనన్నట్లుగా తల అడ్డంగా వూపాడు రతన్ డాన్.

"సరే నీ ఇష్టం" అంటూ మెరుపువేగంతో కదిలాడు యుద్ధ్‌వీర్. కదులుతూనే జేబులోంచి ఓ టాబ్లెట్ తీసి రతన్ డాన్ దగ్గరకు వెళ్లితాళ్లని కిందికి దించాడు. ఇప్పుడు రతన్ డాన్ తలకిందులుగా గాక మామూలుగా వేలాడుతున్నాడు... ఇనుప గొలుసులతో.

యుద్ధ్‌వీర్ కదిలాడు వేగంగా. దూరంగా వున్న కుండలో మంచినీళ్లు లోటాతో తీసుకుని రతన్ డాన్ దగ్గరకు వస్తూనే తన గుప్పెటలో వున్న తెల్లటి టాబ్లెట్‌ని బలవంతంగా అతని గొంతులోని స్వరపేటికలోంచి లోపలికి తోసి, లోటాలోని నీళ్లని విసురుగా లోపలికి పంపించాడు.

అతడేం చేస్తున్నాడో అర్థంగాక అయోమయంలో వున్నాడు రతన్ డాన్.

ఆ టెన్షన్‌లో కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం.

"ఇప్పుడు  నీ ఒంట్లోకి నేను పంప్ చేసిన టాబ్లెట్ ఏమిటో తెలుసా? 'జోక్టేరిన్' అది భయంకరమైన మందది. అది నీ ఒంట్లోకి ప్రవేశించిన అర్థగంటలోపే నీ కాళ్లూ చేతులూ చచ్చుపడిపోతాయి. అంటే అవి జీవితాంతం పనిచెయ్యవన్నమాట...."

"నో..... నో.... " నరాల్ని పెకలించుకుంటూ, స్వరపేటికని బద్దలు కొట్టుకుంటూ ధ్వనించింది అరుపు అతడి గొంతునుంచి.

యుద్ధ్‌వీర్ కంఠం తిరిగి కదిలింది అతనికేసి.

"నేను పంపించిన ఈ టాబ్లెట్‌కి విరుగుడు ఈ విశ్వంలోనే లేదు. వైద్యశాస్త్రంలో పట్టా తీసుకున్న ఓ డాక్టర్‌గా ఈ విషయం నాకు తెల్సు. ఈ ప్రపంచంలో ఏ వ్యక్తీ ఇక నిన్ను రక్షించలేడు. ఎందుకంటే నీ శరీరంలో పంపిన విషం ఏమిటో పోస్ట్‌మార్టంలోనే తెలుస్తుంది. కాబట్టి..."

రతన్ డాన్‌లో నిశ్చేష్టత... నిశ్చేష్టత! భయం అతడి నరనరాల్లో చొరబడుతోంది.

"ఇప్పటికైనా చెప్తావా! లేక..." యుద్ధ్‌వీర్ మాటలు పూర్తి కాకుండానే అరిచాడు రతన్ డాన్.

"చెప్తాను... నన్ను ఇంకేం చెయ్యవద్దు..." భయం రతన్ డాన్‌లో అతడు ఇంకా ఏం చేస్తాడోనని.

"గుడ్! నీవు ఇండియాకి ఎందుకొచ్చావ్?"

అతికష్టం మీద రతన్ డాన్ గొంతు పెగిలింది.

"పాకిస్తాన్ ప్రెసిడెంట్ ఆజ్ఞ మీద వచ్చాను. లవర్స్ పార్క్‌ని ఎలాగైనా బద్దలు కొట్టి అందులో వున్నవారిని బయటికి పంపిస్తే ఆ వ్యాధి ప్రబలుతుందన్న ఉద్దేశ్యంతో అలా చేశాను."

"అలా చేయడం వల్ల అతనికి లాభం ఏమిటి?"

"ఏం లేదు! ఇండియాను ఘోరంగా దెబ్బతియ్యడం.... తద్వారా దేశ ప్రజల దృష్టిని మరల్చడం..."

"చెప్పు.... లవర్స్ పార్క్ నుంచి ఎంతమంది తప్పించుకున్నారు?"

"ఓ జంట..."

"నీకెలా తెలుసా విషయం?"

"ఆ రాత్రి పార్క్ మీద బాంబు బ్లాస్ట్ చేసిన వెలుగులో నా అనుచరులు చూశారు."

"ఇప్పుడెక్కడున్నారు ఆ జంట?"

"ప్చ్" తెలీదన్నట్లుగా తలూపడు రతన్ డాన్.

ఒక్క క్షణం ఆగి తిరిగి కదిలింది యుద్ధవీర్ కంఠం.

"మన దేశ ప్రధాని సౌగంధిక మీద హత్యా ప్రయత్నాలు చేసిందెవరు?"

"తెలియదు."

"నిజం చెప్పు... లేకపోతే..."

"నిజం! ఆ విషయంలో మాకు సంబంధం లేదు. లవర్స్ పార్కులో అరాచకం సృష్టిద్దామని వచ్చాం తప్ప ప్రధానిని హత్య చేయాలన్న ఉద్దేశ్యం మాకులేదు."

యుద్ధ్‌వీర్‌లో ఆలోచనలు. ప్రధానిపై హత్యాప్రయత్నానికీ, తనకూ ఏ సంబంధం లేదంటున్నాడు. చూస్తుంటే ఇతడు నిజమే చెప్తున్నాడనిపిస్తోంది. అలాంటప్పుడు ప్రధాని మీద హత్యాప్రయత్నాలు ఎవరు చేస్తోంది. క్షణాలు కదులుతున్నాయి. అతని ఆలోచనలతో అతని ఆలోచనల్ని చెదరగొడుతూ నీరసంగా కదిలింది రతన్ డాన్ గొంతు.

"మీకు కావాల్సిన ఇన్ఫర్మేషన్ చెప్పాను. ఇక నన్ను వదిలెయ్యండి. పోయిన ఈ రెండు కళ్ళతో, కాళ్ళూ చేతులతో ఎలాగో శేష జీవితం గడిపేస్తాను."

సాలోచనగా చూశాడు యుద్ధ్‌వీర్ అతనికేసి.

"అంత త్వరగా నిన్ను ఎలా వదిలేస్తారు? రెండు సంవత్సరాల క్రితం ఢిల్లీ, బాంబేలలో జరిగిన మతదాడుల్లో నీ హస్తం వుంది కదూ?"

భయం రెపరెపలాడగా అవునన్నట్లుగా తల కదిలించాడు రతన్ డాన్.

"మరి దానికి శిక్ష అనుభవించవద్దా?" వంకరగా నవ్వాడు యుద్ధ్‌వీర్.

"అందుకే చెడు మాట్లాడకుండా నీ నాలిక కింద పారేస్తాను. అలాగే చెడు వినకుండా నీ చెవుల్లో విషం పోస్తాను. ఎలాగూ చెడు చూడడానికి నీకు కళ్ళులేవు. కాబట్టి చెవులు, స్వరపేటిక తీసేస్తాను. ఏమంటావ్?"

టెర్రర్‌తో వణికిపోయింది రతన్ డాన్ శరీరం.

మరుక్షణం ఓ పదునైన కత్తి ప్రత్యక్షమైంది యుద్ధ్‌వీర్ చేతిలో. రతన్ డాన్ నోటి అంగుటి చివరిదాకా చేతిని పోనిచ్చి కత్తితో జర్క్ యిచ్చాడు.

అంతే! రతన్ డాన్ స్వరపేటిక తొలగించబడింది.

అంతటితో ఊరుకోలేదు యుద్ధ్‌వీర్.

వేగంగా కదిలి తన మెడికల్ కిట్‌ని తెరవడం, అందులోంచి ఓ లిక్విడ్ బాటిల్‌ని బయటికి తీయడం, దాన్ని వేగంగా రతన్ డాన్ చెవుల్లోకి పంప్ చేయడం చకచకా జరిగిపోయాయి.

క్షణాలు గడుస్తున్నాయి.... ఆ దారుణహింసలోనే.

ఇప్పుడు రతన్ డాన్ బతికి వున్న శవం లాంటివాడు. నడవటానికి కాళ్లూ చేతులు లేవు. మాట్లాడడానికి నోరు లేదు. చూడడానికి కళ్లు కనిపించవు. వినడానికి చెవులు పనిచెయ్యవు.

ఇంటరాగేషన్ ఛాంబర్ నుండి బయటికి వచ్చాడు యుద్ధ్‌వీర్. అతడ్ని చూస్తూనే సెల్యూట్ చేశారు బయటవున్న సి.బి.ఐ. ఇన్స్‌పెక్టర్లు.

వారిని దగ్గరకు రమ్మని సంజ్ఞ చేశాడు యుద్ధ్‌వీర్. అతి వినయంగా వచ్చారు.

"చూడండి... లోపల బతికున్న శవం ఒకటుంది. అతగాడిని తీసుకెళ్లి బాంబేలోని 'ఇండియాగేట్' ముందు వసతి ఏర్పాటు చేసి, అక్కడే ప్రదర్శకులకు చూపించే ఏర్పాట్లు చేయండి.

ప్రతిరోజూ తినటానికి ఓ రెండు రొట్టెముక్కలు, మంచినీళ్లు ఇవ్వండి. దేశంలోని ప్రతి టెర్రరిస్టు అతడ్ని చూసి దడుసుకునేటట్లుగా అతడి తలచుట్టూ 'భారతదేశంలో బాంబులదాడికి పరిహారం' అని రాసి వున్న బోర్డుని వేలాడగట్టండి.

జీవితాంతం అతడు అక్కడే వుంటూ, దేశంలో అరాచకాలు సృష్టించే టెర్రరిస్టులు, మాఫియా లీడర్లు – ఇక ముందు ఏం చెయ్యాలన్నా భయపడేటట్లుగా అరేంజ్‌మెంట్స్ చెయ్యండి... ఇందులో టెక్నికల్‌గా, లీగల్‌గా ఏదైనా సమస్య వస్తే ప్రధానితో నేను మాట్లాడతాను. మీ పని మీరు చెయ్యండి..." అతడి ఆజ్ఞలను శిరసావహిస్తూ లోపలికి పరిగెత్తారు వారు.

ఇంటరాగేషన్ ఛాంబర్ నుండి నేరుగా తన ఆఫీసుకు వచ్చాడు యుద్ధ్‌వీర్.

అతడి మెదడులో గంట క్రితం రతన్ డాన్ చెప్పిన మాటలు ప్రతిధ్వనిస్తున్నాయి. అతడికి అర్థం కాని విషయాలు రెండున్నాయి. ఒకటి లవర్స్‌పార్కు నుంచి పారిపోయిన జంట ఎక్కడుంది? ఏం చేస్తున్నారు? వారిని తిరిగి పట్టుకోవడం ఎలా?

రెండవ విషయం – ప్రధాని సౌగంధికని చంపబోయింది ఎవరు? టెర్రరిస్టులా? టెర్రరిస్టులే అయితే అలా చీటికి మాటికి చంపుతానని వార్నింగ్ సిగ్నల్స్ పంపరు.

అలాంటప్పుడు ఎవరు?

సిగరెట్ వెలిగించుకొని కుర్చీలో వెనక్కి వాలాడు అతడు. మెదడంతా శూన్యం సంతరించుకుంటుంటే.

ఆ శూన్యత నుంచి నెమ్మదిగా మళ్లీ మామూలు ప్రశ్నే తలెత్తుతోంది. లవర్స్ పార్క్ సంఘటనకీ, ప్రధాని హత్యకూ సంబంధం వుందా? అని.

సరే! రెండూ సెపరేట్ ప్రాబ్లమ్స్ అనుకున్నా, ఏ 'క్లూ' లేకుండా ఆ జంటని పట్టుకోవడం ఎలా? ఏ ఆధారం లేకుండా ప్రధానిపై హత్యాప్రయత్నం చేస్తున్న వారిని బంధించడం ఎలా?

ఒకటి. రెండు... మూడు... క్షణాలు కదులుతున్నాయి. సరిగ్గా నాలుగో క్షణంలో ఓ నిర్ణయానికి వచ్చాడు యుద్ధవీర్.

# 29

"షిట్!"

వందోసారి తిట్టుకున్నాడు కౌలేకర్ అప్పటికి.

'ప్చ్! ఎంత బ్యాడ్‌లక్! ఆ లవర్స్‌పార్కులో వున్నాపోయేది తను. ప్రతిరోజూ వెళ్లే తాను ఆ ఒక్కరోజు వెళ్లలేదు. ఫలితం.... గోల్డెన్ ఛాన్స్ మిస్సయ్యాడు. ఇటీజ్ రియల్లీ బ్యాడ్‌లక్' ఆలోచనలు కౌలేకర్‌లో.

పాతిక సంవత్సరాల కౌలేకర్ ఓ సెక్స్ పిచ్చివాడు. కొంతమంది బతకడానికి ఏదో ఒక వ్యాపకం కావాలి. కొందరికి ఉద్యోగం, ఇంకొందరికి పేకాట, జూదాలు కాగా కౌలేకర్‌కి అమ్మాయిల పిచ్చి.

పన్నెండో ఏట నుంచి అతడికా వ్యసనం అబ్బింది. ఇప్పటిదాకా కొన్ని వందల మందిని అనుభవించి వుంటాడు. అయినా సెక్స్ పిచ్చి తగ్గలేదు.

ఒకవేళ ఎవరైనా అందమైన ఫ్యామిలీ అమ్మాయి కనిపిస్తే ఆ అమ్మాయిని వలలోకి లాగుదామని ప్రయత్నిస్తాడు. ఆ అమ్మాయి అతడికి అందుబాటులోకి లేకపోతే, ఆ అమ్మాయి స్ట్రక్చర్‌ని కళ్ల ముందు నుండి బెదరనీయకుండా రకరకాల ఫాంటసీల్లోకి వెళ్లిపోతుంటాడు. ఇదీ అతడి వ్యాపకం.

కానీ... ఆ రోజు లవర్స్ పార్కులో ఫార్ములా ప్రయోగించినప్పుడు తాను అక్కడ లేనన్న వాస్తవం అతడి మెదడుని నిలువునా కోసేస్తోంది.

ఆ సమయంలో గనుక తానక్కడ వున్నట్లయితే ఆ వ్యాధి తనకూ వ్యాప్తి చెందుతుంది. తద్వారా ఆ వ్యాధితో తనకిష్టం వచ్చిన అమ్మాయిని వశపరచుకొని అనుభవించవచ్చు. నిజానికి ఆ ఫార్ములా తనలాంటివాడికోసమే ఆ సైంటిస్ట్ కనిపెట్టి ఉంటాడు. అదే గనుక నిజమైతే ఆ సైంటిస్ట్ ఫోటోని పూజగదిలో పెట్టుకొని తనలాంటివాళ్లు పూజించాలి.

ఇటీవలే అతడు జీవితంలో ఓ అరుదైన యువతని చూశాడు. ఆ యువతి... దమయంతి. అతడి పక్కింటి పోర్షన్‌లో అద్దెకి దిగారు.

మొట్టమొదటిసారి ఆమెని చూసినప్పుడు కౌలేకర్ నరాలు మెలితిరిగిపోయాయి.

సుమారు అయిదు అడుగుల ఎనిమిదంగుళాల పొడవుతో చక్కటి పర్సనాలిటీ వున్న ఆమెకు ఐదు సంవత్సరాల క్రితమే పెళ్లయింది. అయినా ఆమె అందం అతడ్ని వెర్రెత్తించింది.

ఆమె ఛాతి జంటనగరాలంత విశాలంగా, ఆమె వెనుక భాగం ఢిల్లీ రోడ్డంత నున్నగా వుండి కసెక్కించింది అతడ్ని.

ఇప్పటివరకూ తానునుభవించిన అమ్మాయిలంతా ఆమె ముందు తామరాకు మీద నీటిబొట్టులా అగుపించిందాతడికి.

ఎలాగైనా సరే... ఒక్కసారి ఆమెను అనుభవించగలిగితే తన జన్మసార్థకమవుతుంది.

అప్పట్నుంచి ఆమె కోసం అతడు చేయని పనిలేదు. ఆమెతో చూపు కలపటానికి ప్రయత్నించాడు. కుదరలేదు. ఆమె అసలు అతడి కళ్లలోకే చూసేది కాదు. మాట కలపాలని ప్రయత్నిస్తే, ముక్తసరిగా జవాబిచ్చి ఊరుకునేది. ఆమెను చూడాలన్న వంకతో

ఎప్పుడూ తలుపు తీసుకొని వరండాలోనే తచ్చట్లాడేవాడు. అయినా ఆమె అతడ్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఇక చేసేది లేక ఆరోగ్యవంతమైన శరీరాన్ని తన మెదడులో అటూ ఇటూ చెదరనీయకుండా రకరకాల ఊహల్లోకి వెళ్లిపోయేవాడు.

సరిగ్గా అప్పుడే – లవర్స్ పార్కు నుండి ఓ జంట తప్పించుకుని సిటీలోకి ప్రవేశించారన్న వార్త అతడి చెవులకు వీనులవిందుగా సోకింది. ఆ తప్పిపోయిన జంటని ఎలాగైనా తాను కలవగలిగితే చాలు. వారి నుండి ఆ వ్యాధి తనకు, తన నుండి దమయంతికి తేలికగా పాకిపోతుంది. ఆ తర్వాత దమయంతిని తాను రోజూ పక్కలో వేసుకొని....

అంతే! కౌలేకర్ ఒళ్ళు వేడెక్కిపోయింది. గబగబా ప్యాంటూ, చొక్కా వేసుకుని కిటికీలోంచి తొంగిచూశాడు. బయట కర్ఫ్యూ విధించారు.... ఎవరూ రాకుండా, ఆ చీకట్లో గస్తీ తిరుగుతున్న పోలీసుల కళ్లు గప్పి సిటీలోకి ప్రవేశించాడు కౌలేకర్.

❖ ❖ ❖

పార్క్‌లోంచి పారిపోయిన జంట పేర్లు కళ్యాణి, ప్రవీణ్‌లు ఆ రోజు పార్కు గోడలు బద్దలుకాగానే మెరుపువేగంతో బయటపడ్డారు వాళ్లిద్దరూ. పడుతూనే ఎవరికీ కనిపించకుండా బ్రిడ్జి చివర దాక్కున్నారు.

సద్దుమణిగాక బ్రిడ్జి చివర్నుంచి సిటీలోని మెకానికల్ షెడ్డులోకి ప్రవేశించారు.

బాగా ఆకలిగా వుండడంతో ఏదైనా దొరుకుతుందేమోనని చూశారు.

ఊహూ! సిటీ మొత్తం కర్ఫ్యూ విధించడం వల్ల షాపులన్నీ మూసేసి వున్నాయి.

పోలీసు, మిలటరీ తప్ప నగరంలో మిగతావారు సంచరించటం లేదు. అలా ఆ రాత్రంతా గాలిస్తూనే వున్నారు వాళ్లిద్దరూ.

సరిగ్గా నాలుగు గంటలకు

జీన్స్ ప్యాంట్, చొక్కా వేసుకొన్న కౌలేకర్ కనిపించాడు వారి కళ్లకు.

"ష్....ష్..." అంటూ పిలిచాడు ప్రవీణ్.

ఆ శబ్దం వినిపిస్తూనే అటు చూశాడు కౌలేకర్.

మరుక్షణం... అతని కళ్లు మెరిసిపోయాయి. తనకు కావల్సిందేదో దొరికిన ఆనందం ఆ కళ్లలో. వారి దగ్గరకు వచ్చాడు.

కళ్యాణి అతనిని చూస్తూనే వాటేసుకుంది.

కౌలేకర్ ఆమెను పొదివి పట్టుకుని ఓ పక్కకి తీసుకెళ్ళాడు.

కొన్ని నిముషాలు గడిచాయి వడివడిగా.

పని పూర్తయినట్లుగా కౌలేకర్. కళ్యాణీలు విడిపోయారు.

"బాగా ఆకలి వేస్తోంది – ఏదైనా తెచ్చిపెట్టవా?" గోముగా అడిగింది కళ్యాణి.

"పదండి – మా ఇంటికి వెళదాం. అక్కడ బిస్కట్లు, పండ్లు వున్నాయి జాగ్రత్త..."

ముగ్గురూ మెల్లగా అటూ ఇటూ చూసి నడవసాగారు.

"జాగ్రత్త... శబ్దం చేయవద్దు..." చెప్పులు తీసేసి చేతిలో పట్టుకుంటూ నడిచాడు కౌలేకర్.

కళ్యాణీ, ప్రవీణ్‌లు తలలూపి నడవసాగారు.

సరిగ్గా కౌలేకర్ ఇల్లు ఇంకా కిలోమీటర్ వుందనగా జరిగిందా సంఘటన.

వాళ్ల ముగ్గురిని చూసి ఓ కుక్క అరవడం, ఆ అరుపులకు కునుకుపాట్లు పడుతున్న పోలీసులు లేవడం, చకచకా జరిగిపోయాయి.

తమ కళ్ల ఎదురుగా పారిపోతున్న ముగ్గురు మనుషులు కనిపించారు పోలీసు వాళ్లకు.

"ఆగండి... ఆగండి... లేకపోతే కాల్చేస్తాం..." అంటున్నా వినకుండా పరిగెత్తారు ముగ్గురు.

అంతే! అప్పటికే కౌలేకర్ ఆ వీధి మలుపు తిరుగుతుండగా రివాల్వర్స్ పేలాయి. ఆ తుపాకీ దెబ్బలకు నేలకూలారు ప్రవీణ్, కళ్యాణీలు.

సందు తిరగడంతో తుపాకీ గుండు దెబ్బ తప్పించుకున్న కౌలేకర్ ముందు ఆగిందో వ్యాన్. ఆ వ్యాన్‌లోని మనుషులు కౌలేకర్‌ని వ్యాన్ ఎక్కించారు.

**వ్యాన్ ఎక్కిన కౌలేకర్‌కి అర్థమైంది. తనని పట్టుకున్నది పోలీసులు కాదని, వేరే దుండగులని.**

# 30

రాత్రి పది గంటలు.

కంటిమీదకు నిద్రరాక అస్థిమితంగా కదులుతున్నాడు విశ్వసౌరభ్ పక్కమీద.

ఢిల్లీ నగరంలోని 'గోల్డ్ స్టోన్' అపార్ట్‌మెంటది. గత వారం రోజుల నుంచి అక్కడే వుంటున్నాడు అతడు. సాధారణంగా ఎప్పుడూ బయటకు అడుగుపెట్టడు. తనకు కావల్సిన సరంజామా అంతా ఎప్పుడో కొని తెచ్చుకున్నాడు.

సిటీ బయట తన మీద నిఘా వుంది కాబట్టి ఎప్పుడైనా అవసరమొస్తే వేషం కొద్దిగా మార్చుకొని వెళుతుంటాడు. తలపైన చిన్న క్యాప్, కళ్లకు నల్లటి కూలింగ్ గ్లాసెస్, గడ్డానికి అతికించుకున్న కృత్రిమ గడ్డంతో బయటికి వెళ్ళి వస్తూంటాడు. అదీ అత్యవసర మైతేనే – ఒంటరితనంతో అలమటిస్తున్న అతనికి ... ఆ రాత్రి మరీ మరీ గుర్తొస్తోంది సౌగంధిక.

మనశ్శాంతికోసం ఆమెతో కలిసి అలా అలా రకరకాల ఊహల్లోకి వెళుతుంటాడు.

కళ్లముందు ప్రస్తుతం అతనికి ఒకే ఒక రూపం కనిపిస్తోంది. సౌగంధిక!

దేవలోకంలో బ్రహ్మ, విష్ణు, శివుడూ కలసి బాగా ఆలోచించుకుని ఓ అద్భుత సౌందర్యమూర్తిని సృష్టించగా, స్వర్గలోకంలోని సుందరీమణులంతా కలసి ఆమెపైన అసూయ చెంది కామధేనువుమీద భూలోకానికి పంపించారా అన్నట్టుంది.

గుండ్రటి ముఖం, పాలదంతం లాంటి శరీరం, మల్లెపూవులాంటి స్వచ్ఛమైన నవ్వు, సంపెంగ పూవులాంటి నాసిక, నాగుపాములాంటి జడ, ఎర్ర పగడాల్లాంటి పెదవులు... ఓ రాజకుమారిలా వుంది.

స్వేచ్ఛని పొందిన ఆమె హృదయం పరవళ్లు తొక్కుతోంది. ఆమె కాళ్లకున్న మువ్వలు ఎగిరెగిరి పడుతున్నాయి. తోటలో ప్రతిచెట్టూ, పుట్టా గంతులేస్తున్నాయి ఆమెని చూస్తూ.

ఎక్కడో సైరన్ మోగటంతో విశ్వసౌరభ్ భావోద్వేగపు ఆలోచనలు తెగిపోయాయి.

గతలోకం నుండి ఇహలోకంలోకి వచ్చేసరికి మనసంతా చేదు తిన్నట్లు అయిపోయింది అతనికి.

వాస్తవ ప్రపంచంలోకి రావటం అసలు ఇష్టం వుండదు అతనికి. సౌగంధికతో కలల ప్రపంచంలో వుండడమే హాయిగా వుంటుంది.

ఆమె శారీరకంగా, మానసికంగా దూరం కావటం అతడు జీర్ణించుకోలేడు. అందుకే అలా... పచ్చిక బయళ్లు, సెలయేర్లు, ఆమె – తాను, వెన్నెల రాత్రులు... లాంటి కలల లోకంలో వుండిపోతాడు.

వాస్తవలోకంలోకి వస్తే అతనికి మిగిలేది.. ఏదో లోటు... బావురుమంటూ మనస్సు... మనస్సు నిండా శూన్యం, బతుకంతా నిస్సారంగా అనిపించేది.

నిద్రపట్టదు. మనస్సంతా ఏదో విషాదంలో వున్నట్లుగా భారంగా వుంటుంది.

బరువుగా ఫోంబెడ్ మీద నడుం వాల్చిన అతనికి ఎంత సేపటికి నిద్రపట్టడంలేదు.

"ఏం చెయ్యాలి?" అంటూ ఒకే ఒక ప్రశ్న అతన్ని చుట్టుముడుతోంది భూతంలా.

చుట్టూ వున్న చీకటి అతన్ని భయపెడుతోంది... ఆలోచనల్ని తోడుచేసుకొని.

ఎలా? ఎలా ఈ చిత్రహింసని భరించటం? ఆమెలేని ఈ ఒంటరితనం ఎలా గడపటం?

ఒక్కసారిగా తల విదిలించాడు విశ్వసౌరభ్ సూదుల్లా పొడుస్తున్న ఆలోచనల్ని భరించలేక.

అంతే! మరుక్షణం దిగ్గున లేచాడు ఆ చీకట్లో. ఇంకాసేపు అలాగే ఆలోచిస్తే తన మెదడు బద్దలయి సెలబ్రమ్ బయటికి వస్తుందేమోనన్న భయంతో.

లేచి ట్యూబ్‌లైట్ స్విచ్ నొక్కాడు. మరుక్షణం తెల్లటి వెలుతురు ఆ గది నిండా పరుచుకుంది.

ప్రస్తుతం అతడి మానసిక పరిస్థితి అతనికే అర్థం కావటం లేదు. సంగీతఝురిలా హృదయాంతరాళాలలో సౌగంధిక రూపం, లావణ్యం, పేరు ప్రతిధ్వనించి అతన్ని పరవశింపజేస్తున్నాయి.

ఒక్క ఉదుటున వెళ్లి కంప్యూటర్ ముందు కూర్చున్నాడు. ఎదుటగా వున్న కంప్యూటర్ స్క్రీన్ మీద గ్రాఫిక్ ఫిగర్ దర్శనమిచ్చింది.

అంతకుముందే వివిధ వార, దిన, మాసపత్రికలలో వచ్చిన ప్రధాని సౌగంధిక ఫోటోలను కంప్యూటర్‌కి ఫీడ్ చేశాడు విశ్వసౌరభ్.

అయితే ఇక్కడ మరో ప్రయోజనం వుంది. సౌగంధికని ఏ డ్రస్‌లో ఎలా చూడాలనుకుంటే అలా చూడవచ్చు. స్కీమింగ్ అంతా కీబోర్డు మీద చేతివేళ్ల కదలికతో మార్చేయవచ్చు.

పట్టుచీరలో కొద్దిసేపు –

నైటీలో మరికొద్దిసేపు,

మిడ్డీలో మరికొంచెం సేపు – ఇలా రకరకాల డ్రసెస్‌తో సౌగంధికని చూసి మురిసిపోతున్న విశ్వసౌరభ్ అంతటితో వూరుకోలేదు.

కంప్యూటర్‌కి అటాచ్ చేసి కెమెరా ఒకటి వుంది. ఆ కెమెరా ఆపరేట్ చేస్తే చాలు, లైవ్ ఫిగర్‌ని ఫోటోగ్రాఫ్ చేసినట్టు రిజల్టు వస్తుంది. ఫిల్మ్ డెవలప్ చేసి, ఎన్‌లార్జిలో పెట్టి కావలసిన సైజుకి ప్రింటు చేయడం, డ్రైవ్ చేయడంలాంటి సమయం వృథా అయ్యే అవకాశం లేదు. జపాన్ నుంచి దిగుమతి చేసుకున్న ఫోటో పేపర్ వుంది. ఆ పేపర్ని కంప్యూటర్లో లోడ్ చేసి మనకు కావల్సిన ఫిగర్, కావాల్సిన సైజు ప్రోగ్రామింగ్ ఇస్తే చాలు. వెంటనే ఫోటోలు వస్తాయి.

స్క్రీన్ మీద సౌగంధిక కాస్ట్యూమ్స్, హెయిర్‌స్టైల్స్ చకచకా మారిపోతున్నాయి. అన్ని ఫోటోలు అతడి టేబుల్ మీద దొంతరగా పడుతున్నాయి.

తలంటు పోసుకోవడంవల్ల ఫోటోలో ఆమె జుట్టు జలపాతంలా ఎగిసిపడుతోంది. నుదుటి మీద ఎర్రటి బొట్టు పవిత్రతకు చిహ్నంలా వుంది.

తడారుతున్న పెదవులు యమునానది ఒడ్డున వుండే ఇసుకతిన్నెల్ని గుర్తుకు తెస్తున్నాయి. కుడిచేతి వేలికి మెరుస్తున్న లేత గులాబీ రంగు ఉంగరం మహారాణి ఠీవిని జ్ఞాపకం తెస్తోంది. ఆమె ఒక్క చూపు, ఒక్క దరహాసం చాలు అతడి జన్మ ధన్యమవడానికి.

ఆమె వక్షం మీద చెంప ఆన్చి, గుండె చప్పుడు వినాలని, శతాబ్దాల నాటి రసగానంలో మునిగిపోవాలన్న ఆర్ద్రతతో నిండిపోయాడు.

అతడి జీనియస్ వేగంగా పనిచేసింది. వెంటనే రకరకాల యాంగిల్స్‌లో వున్న తన ఫోటోల్ని కూడా కంప్యూటర్‌కి ఫీడ్ చేశాడు. కంప్యూటర్ స్క్రీన్‌లో తాను, సౌగంధిక వివిధ రకాల ప్రేమభంగిమలలో కనిపించాలి. అది అతని లక్ష్యం!

శరీరం మాంసపుయంత్రం కాదు! శతతంత్రుల వీణ! ఫలితం.... అతడి చేతివేలి కదలికలతో కంప్యూటర్ స్క్రీన్ మీద భంగిమలు చకచకా రూపు మార్చుకుంటున్నాయి. క్షణాలు గడుస్తున్నాయి. అతడి ప్రయత్నాలతో. అతడి ప్రయత్నం చివరికి వచ్చింది. నుదుటి మీదున్న చెమటని తుడుచుకుంటూ ఓ బటన్‌ని ప్రెస్ చేశాడు.

అప్పుడు వినిపించింది కిలకిలారావం. దిగ్గున తలెత్తి కంప్యూటర్ స్క్రీన్ మీదకు చూశాడు సౌరభ్.

స్క్రీన్ మీద సౌగంధిక విశాలమైన డబుల్‌కాట్ బెడ్ మీద కూర్చున్నది. వెనక జారగిలబడి రెండు చేతులమీద భారమంతా మోపి కూర్చోవడంతో ఎదుటి వ్యక్తిని ప్రోవోక్ చేస్తున్నట్టుంది.

ఆమె కళ్లతో చిలిపిగా నవ్వుతోంది. తమలపాకుల్లాంటి సన్నటి పెదవుల్ని నాజూగ్గా కదిలించింది. మెల్లగా ముందుకు వంగి చేతులు రెంటినీ ముందుకు తీసుకువచ్చి ముఖాన్ని కప్పేసింది. ఆ తర్వాత నెమ్మదిగా వేళ్లు ఎడం చేసి. ఆ వేళ్ల సందుల్లోంచి చూస్తూ 'ఛీ... అలా చూడకు బాబూ... నాకు మహాసిగ్గుగా వుంది' అంది హస్కీవాయిస్‌తో అతడిని స్క్రీన్ మీద.

సైన్స్ సాధించిన విజయం అది. ఇద్దరు ప్రేమికుల ఫోటోలను కంప్యూటర్ ఫీడ్ చేసి, వాయిస్ మాడ్యులేషన్ ఇస్తే తాననుకున్న ఎఫెక్ట్ వస్తుంది.

స్క్రీన్ మీద అతడు ఆమె మీదకు వంగి ముద్దు పెట్టుకున్నాడు. ఆ తర్వాత మల్లెపూలు తీసి ఆమె పైన చల్లాడు. మరుక్షణం... ఓ భావోద్వేగపు కెరటం మిన్నులా ఎగసిపడింది. ఓ ఆత్మీయపు వీచిక తుపానులా మారి చుట్టేసింది. ఓ అనురాగపు బిందువు వరదై, ఉప్పెనై ముంచేసింది ఆమెని. తమకంగా అతడి చేతిని తీసుకుని తన పెదవులపై వుంచుకుంది.

అప్పుడు అతను ఆమె పాదాలకు ప్రణమిల్లి, 'ఓ దేవతా! భారతదేశ వ్యవస్థని కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా నీ చూపుడువేలుతో శాసించగల ప్రధానివి నీవు. నేను ఓ మామూలు పౌరుడిని.

అటువంటి నేను నీ అనుగ్రహం కోసం నీ ముందు మోకరిల్లి వున్నాను. ఎందుకో తెలుసా? నీ ప్రేమభిక్ష కోసం, సిద్ధార్థుడు సత్యాన్వేషణ కోసం బయలుదేరినట్లుగా నేను నీ ప్రేమభిక్ష కోసం ప్రాధేయపడుతున్నాను.

ఇప్పుడు తెలుసుకున్నాను నాకేం కావాలో. మల్లెపూల సౌరభంగల నీ మోము, సంపెంగపూవులాంటి నీ నాసిక, ఎర్రపగడాల్లాంటి నీ పెదదవులు, చంద్రుడి తెల్లదనాన్ని సైతం తరిమికొట్టగల నీ పలువరుస... అన్నింటికీ మించి నీ నిష్కల్మషమైన చిరునవ్వు కావాలి.

ఆదర్శమూర్తిని, భారతదేశ స్త్రీలందరిలో అద్భుత సౌందర్యరాశిని నీవు. అలాంటి నీవు నాకు కావాలి. నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను. నీలాంటి చక్కని భార్య ఆధ్వర్యంలో నేను యముడినైనా ఎదిరించగలను' అన్నాడు ఆర్తిగా.

అప్పుడు కదిలిపోయిందామె చాలాలోతుగా. గుండె కరిగింది. మనస్సు ఆర్ద్రమైంది. అంతలో చప్పున కరెంటు పోయింది అక్కడ. కంప్యూటర్‌లో ఇమేజస్ మాయమయ్యాయి.

నిశ్చేష్టుడైపోయాడు విశ్వసౌరభ్. అతడి గుండెల్లో అగ్నిపర్వతాలు లావాని కక్కుతున్నాయి.

ఎడమచేతితో గుండెని నొక్కిపట్టుకొని అలాగే కూర్చుండిపోయాడు.

# 31

రాత్రి పదిగంటలు. బయట ప్రకృతిలో చిన్న కదలిక ఏర్పడినట్లుగా గాలి విసురుగా కొడుతోంది. తన మాస్టర్ బెడ్‌రూమ్‌లోని బెల్జియం గ్లాసు నుంచి బయటికి చూస్తోంది సౌగంధిక. ఆమె మనసంతా నిర్లిప్తంగా వుంది.

పెనుతుపాను ప్రారంభమైనట్లుగా గడ్డితీగె ఊగిపోతోంది. ఆ వర్షంలోనే అడుగుకొకరు చొప్పున వాచ్ చేస్తున్నారు స్పెషల్ ప్రొటెక్షన్ సిబ్బంది.

బయట ప్రకృతి వంకే చూస్తున్న సౌగంధికలో ఆలోచనలు!

సమస్యలు ఒకదాని వెనకాల మరొకటి ముంచుకొస్తున్నాయి. ముందు విశ్వసౌరభ్ ఫార్ములా గొడవ మొదలయింది. లవర్స్‌పార్కుతో మొదలయిన ఆ సమస్య ప్రస్తుతం కేరళలోని త్రివేంద్రానికి పాకింది.

సరే అదలా వుంది కదా అనుకుంటే, లవర్స్‌పార్కులోంచి ఓ జంట పారిపోయారు. అదీ చాలక విశ్వసౌరభ్ టి.వి.కి. ఎక్కాడు. ప్రజలలో సానుభూతి సంపాదించుకున్నాడు. దాంతో ప్రజలలో కొన్ని వర్గాలు 'ప్రధాని దిగిరావాలి' అని, ఇంకొన్ని వర్గాలు 'విశ్వసౌరభ్‌పై

నిఘా తీసెయ్యాలి' అని, మరికొన్ని వర్గాలు 'విశ్వసౌరభ్ ప్రేమని ప్రధాని అంగీకరించాలి' అంటూ బ్యానర్స్‌తో సహా నిరసన ధ్వనులు వినిపిస్తున్నట్లుగా ఇంటిలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి.

క్షణాలు గడుస్తున్నాయి.... ఆమె ఆలోచనలతో. బయట వర్షం క్షణ క్షణానికీ పెద్దదవుతోంది. వర్షం తాలూకు మెరుపులతో ఆ ప్రధాని బంగళా తళుక్కున మెరుస్తోంది అప్పుడప్పుడూ.

సరిగ్గా అప్పుడు...

అడుగుపెట్టిందో జీపు విసురుగా ప్రధాని బంగళా బయట. గాలిని పీల్చుకుంటూ, వర్షాన్ని తోసుకుంటూ సెక్యూరిటీ గేటుముందు ఆగింది.

ఆ జీపు అద్దం ముందు పెయింట్ వేయబడిన తెల్లటి అక్షరాలు మెరుస్తున్నాయి. 'జాయింట్ ఇంటిలిజెన్స్ స్టీరింగ్ డిపార్ట్‌మెంట్' అంటూ. జీపులోంచి బయటకు అడుగుపెడుతూనే రెయిన్‌కోటు విప్పి, తలపైనున్న హేట్‌ని తీశాడు యుద్ధ్‌వీర్. అతన్ని చూస్తూనే సెక్యూరిటీ సిబ్బంది సెల్యూట్ చేశారు. అతడు తలపంకిస్తూ లోపలికి నడిచాడు.

సాధారణంగా ఎవరైనా ప్రధానిని కలుసుకోవాలంటే ముందుగా ప్రధాని పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (P.R.O.) ని కలుసుకోవాలి. అతడు సంతృప్తి చెందితే, ఇంటర్‌కమ్ ద్వారా పి.ఏ.కి. తెలియజేస్తాడు. పి.ఏ. వెంటనే అపాయింట్‌మెంట్ డైరీ చూసి ఆ రోజు ఆ వ్యక్తికి అపాయింట్‌మెంట్ ఇచ్చారో లేదో చెక్ చేసుకుని, సంతృప్తి చెందితే ప్రధాని పర్సనల్ సెక్రటరీ దగ్గరకు పంపిస్తాడు.

పర్సనల్ సెక్రటరీ దగ్గరకు వెళ్లేముందు ఎవరైనా మెటల్ డిటెక్టర్ ద్వారానే వెళ్లాల్సి వుంటుంది. ప్రధాని పర్సనల్ సెక్రటరీ సంతృప్తి చెందితే, ప్రధాని దగ్గరకు వెళ్లటానికి అనుమతి లభిస్తుంది.

"అర్జంటుగా ప్రధానిని కలుసుకోవాలి".

విసుగ్గా చూశాడు పర్సనల్ సెక్రటరీ. నిజానికి ప్రధాని తర్వాత పర్సనల్ సెక్రటరీకి, కేబినెట్ సెక్రటరీకి కీలక నిర్ణయాలు తీసుకోవడానికి ప్రాధాన్యత వుంటుంది. ఆఖరికి కేబినెట్ మంత్రులు కూడా వీరి ముందు దిగదుడుపే. అలాంటిది నిన్నగాక మొన్న వచ్చిన యుద్ధవీర్ నేరుగా ప్రధాని దగ్గరకు వెళ్ళి ముఖ్యనిర్ణయాలు చర్చించడం... అతనికి అసహనంగా వుంది. కానీ చేసేదేంలేక కోపాన్ని దిగమింగి వూరుకుంటున్నాడు.

మరుక్షణం – విసుగ్గా ఇంటర్‌కమ్ అందుకున్నాడు పర్సనల్ సెక్రటరీ.

"మేడమ్! యుద్ధ్‌వీర్ వచ్చారు..... మీతో మాట్లాడాలట..."

"................"

"అలాగే మేడమ్" ఫోన్ పెట్టేస్తూ యుద్ధ్‌వీర్‌ని లోపలికెళ్లమని చెప్పాడు పర్సనల్ సెక్రటరీ.

లోపలికి ప్రవేశించాడు యుద్ధ్‌వీర్.

"వెల్‌కమ్ ...యూ ఆర్ వెల్‌కమ్ యుద్ధ్‌వీర్..." చిరునవ్వుతో ఆహ్వానించసాగింది సౌగంధిక.

"థాంక్స్! డిస్టర్బ్ చేసినట్లున్నాను..."

"నో.... అదేం లేదు. ఈ సమస్యలతో నిద్రపడుతుందా అసలు?" అంది సౌగంధిక.

సానుభూతిగా చూశాడు యుద్ధ్‌వీర్. ఒకప్పుడు కాలేజీలో చదివేటప్పుడు ఎంత యాక్టివ్‌గా ఉండేది. నేడు ఆమె జీవితం సమస్యలమయం! దేశ ప్రధానుల జీవితాలన్నీ ఇలాగే ఉంటాయి కాబోలు!....

బయట వర్షపు తీవ్రత కొద్దిగా తగ్గిన శబ్దం.

"ఇప్పుడు నేను చెప్పబోయేది మీకు బాధ కలిగించవచ్చు... అయినా చెప్పక తప్పదు.."

నరాల్ని తెంచుకొని బయటపడుతున్న టెన్షన్ ఆమెలో. "ఏమిటది?" ఆ ప్రశ్నలో ఉద్వేగం.

అప్పుడు కదిలింది అతడి కంఠం –

"మీ తండ్రిగారు యాక్సిడెంట్‌వల్ల చనిపోలేదు. ఎవరో కావాలని హత్య చేశారు..."

"మైగాడ్...." రెండు బలమైన మేఘాలు 'ఢీ'కొన్నప్పుడు ఏర్పడే విస్ఫోటంలా ఆమెలో షాక్.

ఆమె మస్తిష్కం మొద్దుబారిపోయింది. హృదయంలో సముద్రహోరులో ప్రారంభమైంది.

దారుణమైన నిశ్శబ్దం... మృత్యుఘోషలా.

ఒకటి... రెండు... క్షణాలు గడుస్తున్నాయి.

అంతే అప్పుడు... నరాల్ని నెట్టుకుంటూ...

స్వరపేటికని బద్దలుకొట్టుకుంటూ ఒక్కసారిగా బయటికెగసింది ఆమె గొంతుదాటి శబ్దం –

"ఎవరు నా తండ్రిని చంపింది?" అంటూ.

"ప్చ్... తెలియదు" యుద్ధవీర్ గొంతు కదిలింది. "ఆ విషయమై నేను ఇన్వెస్టిగేషన్ కొనసాగిస్తున్నాను."

ఆగిపోయిన పెనుతుపాను మళ్ళీ చుట్టుముడుతున్నట్లుగా... ప్రకృతిలో కదలిక!

అప్పుడు కదిలింది యుద్ధవీర్ కంఠం –

"అసలు మీ మీద హత్యాప్రయత్నాలు చేస్తున్నారనగానే నాకో అనుమానం వచ్చింది. మిమ్మల్ని చంపటానికిగల బలమైన ఆధారం ఏమిటాని? అదే సమయంలో మీ తండ్రిగారు చనిపోయిన తీరుపై నాకు అనుమానం వచ్చింది. ఆ రోజు విమానం గ్రౌండ్ కంట్రోల్ తప్పటం కాదు – ఆ విమానంలో ఎవరో బాంబుపెట్టి మొత్తం ప్యాసింజర్లని చంపేశారు.

ఈ విషయంపై నాకు అనుమానం వచ్చి టెక్నికల్ ఇంజనీర్‌ని తీసుకుని ఆ ప్రదేశానికి వెళ్లాను. అక్కడ మిగిలిపోయిన శకలాలని పరీక్షించి విమానం బాంబు పేలుడివల్లే కూలిపోయిందని నిర్ధారించాడు..."

కంటిరెప్ప ఉనికిని సైతం మర్చిపోయినట్లుగా ఓ శిలలా నిలబడిపోయింది సౌగంధిక. దేశ రక్షణ కోసం పాటుపడ్డ తన తండ్రిని ఎవరో హత్య చేయడాన్ని ఆమె మెదడు రిసీవ్ చేసుకోలేకపోతోంది.

క్షణం చిట్లి ముక్కలు ముక్కలవుతున్నట్లుగా... కాలం కదులుతోంది.

ఆ నిశ్శబ్దాన్ని బద్దలు కొడుతూ కదిలింది యుద్ధవీర్ కంఠం. "మీ తండ్రిగారు ఏదైనా డైరీ రాసేవారా?"

ఒక్క క్షణం తేరుకొని చెప్పిందామె. "ఉహూ! ఆయనకు డైరీ రాయడం అలవాటు లేదు..."

"ఐ సీ" తాపీగా ఆలోచనల్లో పడ్డాడు.

అప్పుడే ఏదో స్ట్రయిక్ అయినట్లుగా అందామె.

"అప్పుడప్పుడు కంప్యూటర్‌లో ఏదైనా సీక్రెట్ ఇన్‌ఫర్‌మేషన్ వుంటే ఫైలు చేసేవారు."

"ఎక్కడా కంప్యూటర్?" ఉద్వేగం అతనిలో.

సౌగంధిక పక్కగదిలోకి నడిచింది మౌనంగా... ఆమెని అనుసరించాడు అతను.

గదిలో ఓ మూల వుంది సూపర్ ఐ.సి. కంప్యూటర్. దానిముందు కూర్చున్నాడు యుద్ధవీర్. అతని పక్కనే వున్న మరో కుర్చీలో కూర్చుంది సౌగంధిక.

యుద్ధవీర్ ఓ బటన్ నొక్కాడు.

నల్లటి కంప్యూటర్ స్క్రీన్ మీద ఎర్రటి అక్షరాలు..."వెల్‌కమ్ టు ది ప్రైమ్‌మినిస్టర్ పర్సనల్ కంప్యూటర్" అంటూ.

ఇంకో బటన్ నొక్కాడు. అంతకుముందున్న అక్షరాలుపోయి "విచ్ ఫైల్ యూ వాంట్?" అన్న అక్షరాలు ప్రత్యక్షమయ్యాయి.

యుద్ధవీర్ చకచకా బటన్స్ ప్రెస్ చేశాడు.

కంప్యూటర్ మీద అక్షరాలు వేగంగా కదిలాయి. అవన్నీ దివంగత ప్రధానమంత్రి మహంతి స్వయంగా ఫైలు చేసుకున్న వివరాలు.

యుద్ధవీర్ కళ్లు చకచకా వెతుకుతున్నాయి... కావల్సిన సమాచారం కోసం.

క్షణాలు కదులుతున్నాయి ఆ ఉద్విగ్నతలోనే.

అప్పుడు మెరిశాయి అతని కళ్లు స్క్రీన్ మీద ప్రత్యక్షమైన ఆ అక్షరాలను చూడగానే.

"దేశంలో మాఫియా కల్చర్ ఎక్కువగా విస్తరిస్తోంది. ఒకనాటి మాఫియా నాయకులే నేడు ప్రముఖ రాజకీయవేత్తలై చెలామణి అవుతున్నారు. రాజకీయాల్నుంచి ఈ మాఫియా కల్చర్‌ని ఎంత విడదీద్దామనుకున్నా సాధ్యం కావటం లేదు.

నా మంత్రిమండలిలో కూడా నలుగురు మాఫియా లీడర్లు వున్నారు. వారు ప్రతాప్ యాదవ్, వై.జయంతి, చౌహాన్, బల్విందర్‌సింగ్‌లు. ఈ నలుగురూ దేశంలో నాలుగు ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తూ రోజు రోజుకూ ప్రాబల్యాన్ని పెంచుకుంటున్నారు. వీరివెనుక ఓ ప్రముఖుని హస్తం వుందని తెలుస్తోంది. ఎప్పటికైనా ప్రధాని పదవిని స్వంతం చేసుకోవాలని వారి వెనుక వున్న ఆ ప్రముఖుని ఆశయం అట.

ఆ ప్రముఖ వ్యక్తి రాజకీయాల్లో అతి ముఖ్యమైన స్థానంలో వున్నాడని, ఎంత ప్రయత్నించినా ఆ వ్యక్తి ఎవరో కనిపెట్టలేకపోయామని ఇంటెలిజెన్స్ వర్గాల భోగట్టా. ఆ నలుగురూ, వారి వెనకాల వున్న ప్రముఖ వ్యక్తి వల్లే ప్రధాని ప్రాణానికి భంగం వాటిల్లవచ్చని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి.

అందుకే ప్రధాని మరింత స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ని ఏర్పాటు చేయాలని ఇంటెలిజెన్స్ బ్యూరో తీర్మానించింది. తగిన ఆధారాలు లేనందున వారిని అరెస్ట్ చేయడం వీలుకాదని సి.బి.ఐ. వక్కాణించింది."

ఒక్క క్షణం. కంప్యూటర్‌లోని మాటలు తనచుట్టూ లక్షరెట్లుగా ప్రతిధ్వనిస్తున్నట్లుగా స్తంభించిపోయింది సౌగంధిక. ఆ సమయంలో ఆమెకు గుర్తొచ్చాయి మరణశయ్యమీద తండ్రి అన్న మాటలు.

'బేబీ! నేను పోయాక ఈ దేశం ముక్కలు ముక్కలవుతుందమ్మా! నా తర్వాత పదవిని ఆక్రమించుకొని దేశాన్ని మాఫియాపాలు చేయాలని కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయి..."

అవే మాటల్ని యుద్ధ్‌వీర్‌కి చెప్పిందామె.

"నో డౌట్! ఆ నలుగురిలో ఒకరో, లేక వారి వెనుకాల వున్న ఆ 'అజ్ఞాతవ్యక్తో' అయ్యుంటాడు మీ తండ్రిగారిని చంపిన హంతకుడు." ఒక్క క్షణం ఆగి తిరిగి కదిలింది అతడి కంఠం.

"నా అనుమానం... మీ తండ్రిగారిని చంపినవారే మీపైన హత్యాప్రయత్నాలు చేస్తున్నారని..."

ఆమె మెదడు కండరాల్ని చీల్చుకుంటూ ప్రవేశించాయి ఆ మాటలు.

మైగాడ్! ఎందుకు వారలాతనని, తన కుటుంబాన్ని వెంటాడుతున్నారు? ఎందుకు?

ఆమె ప్రశ్నకు సమాధానం చెపుతున్నట్లు గంభీరంగా కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం.

"బహుశా మీ తండ్రిగారిని చంపి ప్రధాని పదవిని చేపడదామనుకుంటారు. ఈవిషయం పసిగట్టే మీ తండ్రిగారు మిమ్మల్ని ప్రధానిని చేశారు. దాంతో కథ మళ్ళీ మొదటికొచ్చేసరికి తిరిగి మిమ్మల్ని చంపి ఆ గద్దెనెక్కాలని ప్లాన్ వేస్తున్నారు."

"అలాగా!" అతని ఆలోచనా విధానానికి ఆశ్చర్యపడింది ఆమె.

"మరి ఈ పరిస్థితుల్లో ఏమిటి చేయడం?" ప్రశ్న ఉద్భవించింది ఆమె కంఠం నుండి.

"ఆ నలుగురు మాఫియా వ్యక్తుల విషయం నాకు వదిలెయ్యండి. నేను తేలుస్తాను వారి కథేమిటో, వారి వెనకాల వున్న ఆ ప్రముఖ వ్యక్తి ఎవరో. వీలైతే సాక్ష్యాధారాలతో సహా వారిని ప్రజల ముందు నిలబెడదాం". ఓ క్షణం ఆగి కదిలింది అతని కంఠం.

"ఎటొచ్చీ అసలు సమస్య – లవర్స్ పార్కు నుండి తప్పించుకుని పారిపోయిన జంట విషయం ఏం చేయాలనేదే పాలుపోవడం లేదు"

"ఈ విషయంలో మనం ప్రస్తుతం చేసేది ఏంలేదు. లవర్స్ సిటీలో కర్ఫ్యూ విధించండి. ఓ రెండు రోజులు కర్ఫ్యూ విధించి, ఆ తర్వాత పరిస్థితిని బట్టి వ్యవహరిద్దాం."

"దట్స్ గుడ్ ఐడియా"

"పోతే .. కేరళలో త్రివేండ్రంలో ఫార్ములాని విశ్వసౌరభ్ ఎక్కడ ప్రయోగిస్తాడో తెలియదు. అందుకని ఆ ఫార్ములా ప్రయోగించిన చోట వీధి లేక సిటీలో రాకపోకలు బంద్ చేయండి... ఆ వ్యాధి వ్యాపించకుండా."

ఆమె ఆలోచనావేగానికి మనసులోనే మెచ్చుకున్నాడు యుద్ధ్‌వీర్ అంత వేగంగా నిర్ణయాలు తీసుకుంటుంది కాబట్టే ఆమె సమర్థురాలైన ప్రధానమంత్రిగా దేశంలో పేరుగాంచింది.

అతను లేచి నిలబడ్డాడు. "ఓ కే సౌగంధికా! ఇక నేను వెళతాను. మీరు హాయిగా నిద్రపోండి...."

ఆమె కూడా లేచి గుమ్మం దాకా వచ్చింది.

"మీరేం వర్రీ అవకండి. మీ సమస్యల్ని నామీద వదిలేసి నిశ్చింతగా నిద్రపోండి. మిగతా విషయాలు నేను చూసుకుంటాను...."

"థాంక్స్ యుద్ధవీర్..."

"ఓ.కె! గుడ్‌నైట్...." అతను వెళ్లిపోయాడు.

# 32

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ హాలు.

ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లున్నాయి అక్కడ సమావేశమైన వాళ్లందరి వదనాలు.

అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్–ఈ ఐదు దేశాలకు వీటో పవర్స్ వుంటాయి.

ఆ ఐదు దేశాలలో ఏ మూడుదేశాలు ఒప్పుకున్నా ఆ తీర్మానం పాస్ అయిపోతుంది.

వారి ముందున్న సమస్య – ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీగా ఎవర్ని ఎన్నుకోవాలి?

ప్రపంచంలోనే అత్యున్నత పదవి అది. దాదాపు 200 దేశాలకు ప్రాతినిధ్యం వుండే ఆ పదవి కోసం తీవ్రమైన పోటీ వుంటుంది. ఆ అత్యున్నత పదవిని అధిష్ఠించిన వ్యక్తి సలహాని ప్రతి దేశపు అధ్యక్షుడు, లేదా ప్రధానమంత్రి తప్పక మన్నిస్తారు.

ప్రస్తుతం జనరల్ సెక్రటరీ పదవీకాలం ఇంకో వారం రోజుల్లో ముగుస్తున్నందున కొత్త జనరల్ సెక్రటరీని ఎన్నుకోవటానికి ప్రస్తుతం సమావేశమయ్యాయి ఆ ఐదు దేశాలు.

"బ్రిటన్ ఎక్స్ ప్రైమ్‌మినిస్టర్‌ని ఎన్నుకుంటే?" హఠాత్తుగా అడిగాడు అమెరికన్ ప్రెసిడెంట్.

"నో... కాపిటలిస్ట్ కంట్రీస్‌కి సంబంధించినవారు ఆ పదవికి వద్దు" చైనా అభ్యంతరం పెట్టింది.

"అలాంటప్పుడు కమ్యూనిస్ట్ వాళ్లు కూడా ఆ పదవికి ఎలక్ట్ కాకూడదు" కటువుగా చెప్పాడు అమెరికన్ ప్రెసిడెంట్.

"ప్చ్... మీరలా గోల చేయకండి. జనరల్ సెక్రటరీ అనేవాడు ఏ సమస్య వచ్చినా ఎదుర్కొనేటట్లు వుండాలి కానీ ఇలా జాతి – మత భేదాలతో చూడకూడదు" అన్నాడు ఫ్రాన్స్ ప్రధాని.

తిరిగి నిశ్శబ్దం ఏర్పడింది అక్కడ.

“పోనీ ఇప్పుడున్న జనరల్ సెక్రటరీనే తిరిగి నియమిస్తే?” అమెరికా ఉవాచ.

“నో... వి... అబ్జెక్టెడ్!....” రష్యా, చైనాలు ముక్తకంఠంతో చెప్పాయి.

అక్కడున్న మిగతా దేశాల ప్రతినిధులకు కూడా తెలుసు ప్రస్తుత జనరల్ సెక్రటరీ ప్రెసిడెంట్ తొత్తుగా పనిచేస్తున్నాడని. అందుకే ఈసారి అమెరికాకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని గట్టిగా తీర్మానించుకున్నాయి.

“పోనీ ఈ సంవత్సరం మెగసెసే అవార్డు వచ్చిన వ్యక్తిని సెలక్ట్ చేస్తే?” అన్నాడు బ్రిటన్ ప్రైమ్‌మినిష్టర్.

అప్పుడు కదిలింది రష్యా అధ్యక్షుడి కంఠం.

“నో.... అలాంటి అవార్డులకు ఎన్నికైనవారు ఏదో ఒకటి, రెండు ఫీల్డ్‌లలో ఎక్స్‌పర్ట్ అయ్యుంటారు. కానీ అత్యున్నతమైన ఈ పదవికి కావాల్సింది – అపరిమితమైన తెలివితేటలు, సమయస్ఫూర్తి. చకచకా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, ముందు చూపు, అందరినీ కలుపుకొని పోగలిగే నేర్పు – ఇలాంటివెన్నో కావాలి...”

నిజమేనన్నట్లుగా తలలూపారు మిగతావారు. అలాంటి లక్షణాలు గల వ్యక్తి ఈ ప్రపంచంలో ఎవరు? పదే పదే ఆలోచిస్తున్నారు.

ఒకటి... రెండు... మూడు... క్షణాలు గడుస్తున్నాయి. సరిగ్గా ఆరో క్షణంలో అరిచాడు ఫ్రాన్స్ ప్రైమ్‌మినిస్టర్. “అలాంటి వ్యక్తి ఒకరున్నారు.”

అందరి తలకాయలు ఆశ్చర్యంగా తిరిగాయి అతని వైపు ఎవరా వ్యక్తి అన్నట్లుగా?

ఒక్క క్షణం. అప్పుడు కదిలింది తిరిగి ఫ్రాన్స్ ప్రైమ్‌మినిస్టర్ కంఠం.

“ఆ వ్యక్తి... ఇండియా ప్రైమ్‌మినిస్టర్ సౌగంధిక.”

దిగ్భ్రాంతిగా కదిలాయి అందరి వదనాలు.

సౌగంధిక ప్రపంచ పటంలో అట్టడుగున వున్న భారతదేశాన్ని కేవలం రెండు సంవత్సరాలలో అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్ లాంటి దేశాలతో పోటీ రాగల దేశంగా తీర్చిదిద్దింది.

దేశంలోని టెర్రరిజాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. నిరుద్యోగ సమస్యని ఆమడ దూరం తరిమికొట్టి, దేశ ఆర్థిక వ్యవస్థని మెరుగుపరచి ప్రజల తలసరి ఆదాయాన్ని నాలుగింతలు పెంచింది.

“యస్... నేను కూడా ఆమెకే సపోర్ట్ ఇస్తున్నాను. రియల్లీ షీ ఈజే లవ్‌లీ ప్రైమ్‌మినిస్టర్” అడ్మైరింగ్‌గా అన్నాడు రష్యా అధ్యక్షుడు.

"ఆమె గురించి నేను కూడా పేపర్లలో, టీవీల్లో చూశాను. చాలా చిన్న వయసులో అత్యున్నత పదవిని చేపట్టడంతో పాటు తమ దేశపు కీర్తిని ఆకాశానికి తీసుకెళ్ళింది. నా ఓటు కూడా ఆమెకే..." అన్నాడు బ్రిటన్ ప్రైమ్‌మినిష్టర్.

అప్పటికే మూడు దేశాలు సపోర్టు చేశాయి ఆమె క్యాండిడేచర్‌కి. చైనా తటపటాయిస్తూనే ఓకే చేసింది. ఇక మిగిలింది అమెరికన్ ప్రెసిడెంట్.

ఆయన ముఖంలో కొద్దిగా చిరాకు కనిపించింది. అంత అందమైన అమ్మాయిని సెలక్టు చేస్తే ఆమె పక్కన తాను తీసికట్టుకాడా? ప్రపంచంలోనే నెంబర్ వన్ దేశానికి అధిపతినైన తనని ఆమె డామినేట్ చేస్తే సహించగలగడా? పైగా కొరకరాని కొయ్యగా తయారైన ఆమె తనని అస్సలు లెక్కచేస్తుందా?

అందుకే ఎలాగయినా ఆమెని పక్కకు తొలగించాలన్న నిర్ణయానికి వచ్చాడు.

"కానీ.... ఆమె తన దేశంలోనే 'లవ్ డిసీజ్' అనే వ్యాధి సమస్యని ఎదుర్కొంటోంది. ఇంతవరకూ దానిని ఎలా టికిల్ చేయాలో ఆమెకు తెలియటం లేదు. అలాంటి అమ్మాయిని మనం యు.యన్.ఓ. జనరల్ సెక్రటరీగా ఎన్నిక చేసుకుంటే సమంజసంగా వుంటుందా?" అన్నాడాయన.

అతడు ఎటువైపు నుంచి నరుక్కుంటూ వచ్చాడో అర్థమైంది రష్యా ప్రెసిడెంట్‌కి.

అందుకే, అమెరికా ప్రెసిడెంట్‌కి కౌంటర్ ఎటాక్ ఇస్తూ కదిలిందతని కంఠం.

"ఓ పని చేద్దాం. సౌగంధిక ఆ లవ్ ఫార్ములా సమస్యని ఎదుర్కొన్న తరువాతే – మనం ఎన్నుకుందాం. ఒకవేళ ఆ ప్రయత్నంలో ఆమె ఓడిపోతే ఆమెను మన లిస్ట్ నుంచి తీసేద్దాం" అన్నాడు.

అమెరికా ప్రెసిడెంట్ మొహం మాడిపోయిందీ. కాలికేస్తే మెడకు, మెడకేస్తే కాలికి చుట్టుకుంటున్నట్లుగా వుంది తన పరిస్థితి. ఇక చేసేది లేక ఆఖరి ప్రయత్నం చేస్తున్నట్లుగా అతడి కంఠం కదిలింది.

"అసలు రాజకీయాలు, పదవి అంటే ఆమెకు పడవని విన్నాను. అలాంటిది ఆమె అసలు ఈ పదవిని స్వీకరిస్తుందా?"

దానిని కూడా రష్యా ప్రెసిడెంట్ దీటుగా సమాధానం ఇచ్చాడు.

"ఆమెను ఒప్పించే బాధ్యతని మేము నలుగురం తీసుకుంటున్నాం – సరేనా?"

ఇంకేం మాట్లాడాలో అర్థంకాక ఓకే చేసేశాడు. అమెరికా ప్రెసిడెంట్.

**అలా ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ పదవికి సౌగంధిక పేరు ఖరారయింది.**

❖ ❖ ❖

ఏ మనిషికయినా నాలుగువైపుల నుండి ప్రమాదాలు ఎదురైతే ధైర్యాన్ని పోగొట్టు కోవటం సహజం. ఫలితంగా ఆ మనిషి మానసికంగా దుర్బలుడవుతాడు. మరణం చేతివేళ్ల అంచుల దాకా వచ్చినట్లనిపిస్తుంది. అక్కడ సౌగంధిక విషయంలో జరిగిందదే.

ఒకవైపు విశ్వసౌరభ్ లవ్ ఫార్ములా సమస్య. ఇంకోవైపు ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ పదవిని స్వీకరించాల్సిందిగా అన్ని దేశాల ప్రధానులు, దేశాధ్యక్షులు ఒత్తిడి చేయటం, మూడోవైపు తన తండ్రిని, తనని మాఫియా వర్గం చంపాలనుకోవడం – ఆమెను మానసికంగా కృంగదీశాయి. ఏం చేయాలో తోచని అయోమయ స్థితిలో పడేశాయి.

ఆమె ఆ స్థితిలో వుండగానే నాలుగోవైపు నుండి ప్రమాదము రానే వచ్చింది.

ఆ ప్రమాదం చాలా పెద్దది. ఈ సృష్టిలో భగవంతుడు కూడా తప్పించలేనిది. ఆమెని ప్రజల్లో అల్లరిపాలు చేసి ఆమె ప్రధాని జీవితానికి చరమాంకం పలికేది. అదెలా సంభవించిందంటే...

## 33

ఆ రోజు రాత్రి ఎప్పటిలాగే ఆమె రిమోట్ కంట్రోల్‌తో టీవీ ఆన్ చేసింది. విదేశీయ వార్తలు ప్రసారం చేసే స్టార్ ఛానల్ అది.

రోజూ డైలీ షెడ్యూల్ పూర్తికాగానే ఓ పావుగంట ఆమెకు విదేశాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడం కోసం టీవీ చూడడం అలవాటు. ఆ రోజు రాత్రి కూడా అలసటగా టీవీ ఆన్ చేసింది.

న్యూస్ రీడర్ ముఖం టీవీ స్క్రీన్ మీద చోటుచేసుకుంది. విడివడ్డ అతని పెదాలు కదులుతున్నాయి.

సౌగంధికకు ఏదో అస్పష్టంగా వుంది. ఎక్కడో ఏదో తెలియని అనీజీనెస్ చోటుచేసు కుంటోంది ఆమె శరీరంలో. అది నిద్రా? కాదు. అలసటా? అసలే కాదనిపిస్తోంది.

టీవీ స్క్రీన్ మీద కనిపిస్తున్న న్యూస్‌రీడర్ అందంగా కనిపిస్తున్నాడు. ఏదో తెలియని ఆకర్షణ చోటుచేసుకుంటోంది అతని మీద.

తన ఇరవై నాలుగేళ్ల జీవితంలో ఎప్పుడూ కలగని వింత స్పందన అది.

తనకేం జరుగుతుందో అర్థంకావటంలేదు ఆమెకు. ఎందుకు తన శరీరం అలా వశం తప్పుతోంది? ఎందుకు తన మెదడు తన కంట్రోల్‌లో వుండటంలేదు?

అలా అని ఆ న్యూస్‌రీడర్ అందంగా వున్నాడా అంటే లేదు. ఆ న్యూస్‌రీడర్ ఓ నీగ్రో వ్యక్తి.

విదేశీ ఛానల్ కావడంవల్ల వెరైటీగా వుంటుందని అతడికి ఆ ఉద్యోగం ఇచ్చారు.

నల్లటి ముఖం... బండ పెదాలు... గద్ద ముక్కు... ఏదో అంటినట్లుగా తలమీద వుంగరాల జుట్టుతో గమ్మత్తుగా, వింతగా వున్నాడు.

అతడికంటే విశ్వసౌరభ్ కొన్ని లక్షల రెట్లు హాండ్‌సమ్‌గా, మ్యానీగా వుంటాడు.

అలాంటి నీగ్రో న్యూస్‌రీడర్ తనలో ఇంతటి అలజడిని కలిగించటం ఏమిటి? పైగా తను చాలా స్టబర్న్. మగవారి పట్ల అంత తేలికగా ఆకర్షణ పెంచుకునే గుణం తన రక్తంలోనే లేదు. ఉంటే ఎప్పుడో విశ్వసౌరభ్ ప్రేమకు దాసోహమనేది.

ఆమెకేం అర్థంకావటంలేదు తన స్థితి.

తెరమీద న్యూస్‌రీడర్ ముఖం మాయమై ఆ స్థానంలో ఓ మంగోలియన్ వ్యక్తి వచ్చాడు.

తమ ప్రదేశంలో భూకంపం ఎలా వచ్చిందో స్టార్ టీవీకి వివరిస్తున్నాడు అతడు.

అదేమిటి–మరగుజ్జులా వున్న ఆ వ్యక్తిమీద కూడా తాను మరులుగొంటున్నదేమిటి?

అసలు తనకు ఏమైంది? తల తిరుగుతోంది? ఆరోగ్యం బాగోలేదా? ఎంత ఆరోగ్యం బాగోకపోయినా ఈ విపరీత ధోరణులు ఏమిటి?

ఏమైపోతోంది తనకు?

ఎందుకిలా జరుగుతోంది?

ఆమె అనుమానంగా రిమోట్‌కంట్రోల్‌మీద బటన్స్ ప్రెస్ చేసింది... ఛానల్స్ మారుస్తూ.

ఎన్ని ఛానల్స్ మార్చినా ఆమెలో అవే భావనలు, కంపనలు. తన శరీరం తన వశంలో లేదు. ఎదురుగా వున్న వ్యక్తులమీద ప్రేమతో స్వాధీనం తప్పుతున్నట్లు అనిపిస్తోంది. ఓగాడ్ ఇదేమి వైపరీత్యం? విధి నేడు ఇలా తమస్సులు మూసినదేమిటి?

సరిగ్గా అప్పుడు స్ట్రయిక్ అయ్యిందామె మెదడులో ఏం జరిగిందో!

తనకు కూడా ఆ 'ప్రేమ జబ్బు' అంటుకుంది. తనపైన కూడా ఆ లవ్ ఫార్ములా ప్రయోగించారు. ఓ మైగాడ్! నిజమేనా అది?

అదుపు తప్పుతున్న శరీరాన్ని అతికష్టంమీద సోఫా సహాయంతో నిలదొక్కుకుంది.

తూర్పున ఎక్కడో ఓ డైనమైట్ బ్లాస్టు అయిన శబ్దం. ఎక్కడో వల్కనో పగిలిన చప్పుడు. ఓ శతఘ్ని మెదడు పొరల్ని చీల్చిన సవ్వడి. ఫలితంగా ఆమె కుప్పలా కూలిపోయింది.

'మైగాడ్! తనకు ఆ ప్రేమజబ్బు...' ఆకాశంలో ఓ దేవుడు నిర్దయగా ఓ బాణంతో కొట్టినట్లుగా విలవిల్లాడిపోయిందామె. ప్రేమన్నా, పెళ్లన్నా పడని తనకు ఈ జబ్బు ఎలా వచ్చింది?

పవిత్ర గంగలా వుంచుకునే మనస్సుకు, ఎలా అంటిందా జబ్బు?

ఓహ్! ఎక్కడ ప్రారంభమైన జీవితం ఎక్కడికి వెళ్లి అంతమవబోతోంది?

తనకూ ఆ జబ్బు వచ్చిందన్న సత్యం విని ప్రజలు తనని ఎలా చూస్తారు? ఇలా బ్రతకడాన్ని మించిన దుర్భర వేదన మరొకటి వుంటుందా?

సరిగ్గా ఆ సమయంలో గుర్తొచ్చాడు ఆమెకు.... విశ్వసౌరభ్.

అతడే... అతడే ఈ దారుణానికి ఒడిగట్టాడు? తనని, తన ప్రేమని పట్టించుకోలేదన్న సాకుతో తనకు అతడే ఈ జబ్బుని అంటించి వుంటాడు. మొదట్నుంచి తన జీవితాన్ని అతడే నాశనం చేశాడు.

ఎక్కడో దూరంగా స్వేచ్ఛగా చదువుకుంటున్న తనని ప్రేమిస్తున్నానంటూ వెంటబడి తన ప్రైవసీని నాశనం చేశాడు.

ఆ తర్వాత దేశ ప్రధానై ఎలాగో రోజులు గడుపుతున్న తనని లవర్స్ పార్కులో ఫార్ములాని ప్రయోగిస్తున్నానంటూ మనశ్శాంతి లేకుండా చేశాడు. ఆ తర్వాత ఇప్పుడు... ఏకంగా ఆ ఫార్ములాని తనమీద ప్రయోగించాడు... తన మాట వినలేదన్న సాకుతో.

అలాంటి... అతడిని... అతడిని బతకనివ్వకూడదు. విశ్వసౌరభ్‌ని చిత్రహింసలు పెట్టి చంపాలి–కసిగా కదిలాయి ఆమె పెదాలు.

అతడిమీద రెడ్‌ఫ్లాగ్ రిలీజ్ చెయ్యాలి. రెడ్‌ఫ్లాగ్ అంటే కనిపిస్తే కాల్చి పడెయ్యటం. అతడిని కుక్కని కాల్చినట్లు కాల్చి చంపాలి.

ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా కసిగా ఆమె ఫోన్‌ని చేతిలోకి తీసుకుంది... పర్సనల్ సెక్రటరీని పిలవడం కోసం. బటన్స్ ప్రెస్ చేసింది.

ఇంకో బటన్ మిగిలి వుంది. దానిని కూడా ప్రెస్ చేయబోతూ ఓ క్షణం ఆగింది ఆలోచిస్తూ.

అవును! ముందు అసలు సమస్యని యుద్ధ్‌వీర్‌ని కన్సల్ట్ చేసి ఆ తర్వాతే రంగంలోకి దిగాలి.

మరుక్షణం ఆమె సెల్యులర్ ఫోన్‌ని చేతిలోకి తీసుకొని బటన్స్ ప్రెస్ చేసింది.

అటువైపు నుండి శబ్దం వినిపించింది.

"యస్! యుద్ధవీర్ ఆన్ దిస్ సైడ్...." అంటూ.

మరుక్షణం సౌగంధిక కంఠం కదిలింది.

"వీర్! ఆ ప్రేమవ్యాధి నాకు కూడా అంటుకుంది...."

ఎప్పుడూ నిర్లిప్తంగా వుండే యుద్ధవీర్‌లో కూడ షాక్. "మైగాడ్! ఈజిట్ ట్రూ?" అంటూ.

ఆమె కంఠం వేగంగా కదిలి పరిస్థితిని వివరించింది. అవతలనుండి నిశ్శబ్దం... నిశ్చేష్టత అణువణువుని ఆవరించుకున్నట్లు, ఊపిరి పీల్చటం కూడా మర్చిపోయినట్లుగా స్థంభించిపోయాడు యుద్ధవీర్.

"మైగాడ్! ఎవరు? ఎవరి పనది?" అతనిలో .

"ఇంకెవరిది? విశ్వసౌరభ్ పనే ఇది. తనను, తన ప్రేమను నిరాకరించానన్న కోపంతో ఆఖరికి ఈ దారుణానికి పూనుకున్నాడు..." ఉద్వేగంతోపాటు ఆవేశం, కోపం, కసి, దిగ్భ్రాంతి ఆమెలో.

"సౌగంధికా! ప్లీజ్ కూల్‌డౌన్."

"నో.... ఆ విశ్వసౌరభ్‌మీద ఇప్పుడే రెడ్‌ఫ్లాగ్... " ఆగ్రహం... భయంకరమైన ఆగ్రహం ఆమెలో.

"ప్లీజ్ సౌగంధికా! కూల్‌డౌన్! ఆవేశం వద్దు. ఏదైనా సమస్య ముంచుకొచ్చినప్పుడు తొందరపాటు వద్దు. తొందరపాటువల్ల అనుచిత నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది..." అన్నాడు యుద్ధవీర్.

సౌగంధిక మౌనంగా వుండిపోయింది ఏం మాట్లాడాలో అర్థంకాక.

అటువైపు నుండి యుద్ధవీర్ గొంతు కదిలింది తెరలు తెరలుగా, "సౌగంధికా! మొత్తం పరిస్థితిని అనలైజ్ చేస్తే నాకు అనిపించిందేమిటంటే – నీమీద ఆ ఫార్ములాని ప్రయోగించింది విశ్వసౌరభ్ కాదు."

అది విని పక్కనే డైనమైట్ బద్దలయినట్లుగా ఎగిరిపడిందామె. అతని మాటలు అర్థం కానట్లుగా మెదడు స్తంభించిపోయింది.

"విశ్వసౌరభ్ అలాంటివాడు కాదు. అతడి ప్రేమ నిజమైంది. బలవంతంతో కూడిన ప్రేమని పొందటానికి అతడు ఎప్పుడూ అలా గోతులు తవ్వే రకం కాదు. ఒకవేళ అలాంటి ప్రయత్నం చేసినా, ముందే చెప్పి చేస్తాడు కానీ ఇలా వెనుక నుంచి గోతులు తవ్వేవాడు కాదు..." యుద్ధవీర్ కంఠం పలికింది.

అతడు చెప్పిన మాటలు ఆమెని ఆలోచింపచేస్తున్నాయి. నిజమేనేమో! ఐదేళ్ళు తాము ముగ్గురూ ఒకే కాలేజీలో చదివారు. పైగా విశ్వసౌరభ్, యుద్ధ్‌వీర్‌లు ఫ్రెండ్స్! అలాంటప్పుడు తన స్నేహితుడి మనస్తత్వం ఏమిటో యుద్ధ్‌వీర్‌కి తెలియకుండా పోదు.

అప్పుడు... తిరిగి స్వరపేటికని బద్దలు కొట్టుకుంటూ కదిలింది ఆమె కంఠం.

"మరి ఎవరు దీనికి కారకుడు?"

యుద్ధ్‌వీర్‌లో ఆలోచనలు.

దేశ ప్రధానిపైన ఆ వ్యాధి ప్రయోగించారంటే ఇది మామూలు కుట్ర కాదు. పెద్ద ఎత్తున ఎక్కడో ఏదో కుట్ర జరుగుతోంది. ఏమిటది? ఆలోచనల్నుంచి తేరుకుంటూ కదలింది యుద్ధ్‌వీర్ కంఠం.

"ఆ విషయం నేను తేలుస్తాను. దానికంటే ముందు విశ్వసౌరభ్‌ని తిరిగి ఫోన్ ద్వారా నన్ను కాంటాక్ట్ చేసే ప్రయత్నం చేయాలి."

ఒకటి... రెండు...మూడు... నాలుగు...

సరిగ్గా ఐదో సెకండులో ఓ నిర్ణయానికొచ్చినట్లుగా కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం.

"ప్రస్తుతం మీరు ఓ పని చెయ్యండి. మత్తుమందు వేసుకుని నిద్రపోండి. ప్రధాని ఆరోగ్యం బాగోలేకపోవటం వల్ల ఎవరినీ కలవరని పర్సనల్ సెక్రటరీకి ఫోన్ ద్వారా చెప్పండి. దానివల్ల మీ ప్రవర్తనని ఎవరూ పరిశీలించే అవకాశం లేదు. అందువల్ల మీకా వ్యాధి వచ్చిన విషయం ఎవరికీ తెలియదు."

"కానీ... ఎంతకాలం ఇలా దాచిపెట్టగలం?"

"ప్రస్తుతానికి ఓ పన్నెండు గంటలు హాయిగా స్లీపింగ్ టాబ్లెట్ వేసుకుని నిద్రపోండి. ఈ లోపు పరిస్థితుల్ని చక్కదిద్దే ప్రయత్నంలో నేనుంటాను..."

"థాంక్స్! థాంక్స్ యుద్ధ్‌వీర్" ఫోన్ పెట్టేస్తూ అందామె. ఆమె కళ్లల్లో కొద్దిపాటి తడి. ఏమవుతాడు యుద్ధ్‌వీర్ తనకు? ఒకప్పుడు తన క్లాస్‌మేట్ అంతే! ఇప్పుడు... తనకొచ్చిన ప్రతి సమస్యని పరిష్కరించడానికి రాత్రింబవళ్లు కష్టపడుతున్నాడు.

తన కష్టమే అతడి కష్టంగా భావిస్తూ తన జీవితాన్నే పణంగా పెడుతున్నాడు. అలాంటి వ్యక్తికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలదు? ఆలోచిస్తూనే ఆమె చేయి కదిలి స్లీపింగ్‌పిల్స్ బాటిల్‌ని అందుకుంది.

ఓ నాలుగు పిల్స్‌ని నోట్లో వేసుకుని నీళ్లు తాగింది. మరో పది నిముషాల తర్వాత నిద్రలోకి జారుకుందామె.

# 34

ఫోన్ మోగింది గణగణమంటూ.

యుద్ధ్‌వీర్ చేయి కదిలింది వేగంగా. గత పది గంటలుగా అతడు విశ్వసౌరభ్ ఫోన్ కోసం వెయిట్ చేస్తున్నాడు. విశ్వసౌరభ్ వేషం మార్చుకుని బయటికెళ్లి సెల్యులర్ ఫోన్‌ని మారుపేరుతో అద్దెకు తీసుకుంటాడని, అలా మారుపేరుతో అడ్వాన్స్ కట్టి తీసుకున్న సెల్యులర్ ఫోన్‌లను ట్యాపింగ్ చేయడం చాలా కష్టమన్న విషయం యుద్ధ్‌వీర్‌కి తెలుసు.

అంతకు ఎనిమిది గంటల ముందే ఆ నగరంలో రకరకాల పోస్టర్లు వెలిశాయి ఇలా.

**విశ్వసౌరభ్,**

అత్యంత ముఖ్యమైన విషయం నీతో మాట్లాడాలి. ఆ విషయం 'మాకే' కాదు, 'మనకు' సంబంధించిన 'కీలక' విషయం. ఇదే ఆఖరిసారి ఇంకెప్పుడూ నిన్ను విసిగించను. ఈ ఒక్కసారికి నాకు ఫోన్ చేయి.

**- యుద్ధ్‌వీర్.**

ఫోన్‌ని చేతిలోకి తీసుకున్న యుద్ధ్‌వీర్‌కి రిసీవర్‌ని చెవిలోకి పెట్టుకోకుండానే వినిపించింది.

"హలో! నేను విశ్వసౌరభ్‌ని..." అంటూ.

శరీరం లోపల ఓ జర్కు ఇచ్చినట్లుగా నిటారుగా అయ్యాడు యుద్ధ్‌వీర్. "సౌరభ్! నీ ప్రేమవ్యాధి సౌగంధికకు కూడా సోకింది..."

"మైగాడ్...!"

లక్ష ఓల్టుల షాక్ తిన్నట్టు ఒక్కసారిగా అదిరిపడ్డాడు విశ్వసౌరభ్ అవతల వైపు. "ఇది... ఇదెలా సంభవం? సౌగంధికకు కూడా ఆ వ్యాధి సోకిందంటే అది సామాన్య విషయం కాదు. ఎక్కడో ఏదో జరిగింది..." సౌరభ్ గొంతు తడబడుతోంది.

"అవును! నేనూ అదే అనుకుంటున్నాను. దేశంలో ఏదో కుట్ర పెద్ద ఎత్తున జరుగుతోంది. ప్రస్తుతం నేను ఆ పనిలోనే వున్నాను."

"పాపం... అన్నెంపున్నెం ఎరుగని సౌగంధికకు ఆ వ్యాధి సోకిందంటే నా గుండెల్లో ఏదో కెలుకుతున్నట్లుగా అనిపిస్తోంది. దానికి కారణం నేనే అని ఆమె భావిస్తుంది. ఫలితం... ఈ జన్మలో ఆమె నన్ను క్షమించదు."

"అదేం కాదు! ఆ వ్యాధి నీ వల్ల సంక్రమించింది కాదని ఆమెకు నచ్చచెప్పాను. బహుశా లవర్స్‌పార్కు నుండి పారిపోయిన జంట ఎవరికో అంటిస్తే, వారి ద్వారా ఆమెకు సంక్రమించి వుంటుంది".

"మేబీ" కదిలింది సౌరభ్ గొంతు అవతల్నుంచి, "అయినా సౌగంధిక దిగులు పడాల్సిన అవసరం లేదు. నా దగ్గర దానికి విరుగుడు మందు వుంది. దాన్ని ఆమెకు అందజేస్తాను. దాంతో మూడో కంటివాడికి తెలియకుండా ఆమెకు ఆ వ్యాధి నయమవు తుంది".

"థాంక్స్... థాంక్స్ సౌరభ్" ఉద్వేగం యుద్ధ్‌వీర్‌లో.

"నో మెన్షన్ ప్లీజ్! ఆమెకే చిన్న సమస్య వచ్చినా నేను అల్లాడిపోతాను. నా జీవితం ఇప్పటికీ ఆమెకే అంకితం."

కదిలిపోయాడు యుద్ధ్‌వీర్! సౌగంధిక దురదృష్టవంతురాలు. ఇలాంటి అత్యుత్తమ ప్రేమికుడి ఆరాధన అందుకోలేకపోతున్నందుకు.

నిజంగా అతడి ప్రేమని చరిత్రకారులు సువర్ణాక్షరాలతో లిఖించాలి.

"వీర్ ... లైన్‌లో వున్నావా?" ఆందోళనగా కదిలింది విశ్వసౌరభ్ గొంతు.

"ఆ..... ఆ..." తేరుకుని అన్నాడు యుద్ధ్‌వీర్.

"ఆ విరుగుడు మందుని ఆమెకు ఎలా అందజేస్తావు?"

ఒక్క క్షణం నిశ్శబ్దం.

"నేనే స్వయంగా ఆమెకు అందజేస్తాను వీర్..."

"నీవా! నీపైన నిఘా వుంది కదా?"

"ఉండనీ... మారు వేషంలో వెళతాను. నేనే స్వయంగా ఎందుకు వెళతానంటే నాకు ఆమెని చూడాలని ఆర్తిగా వుంది వీర్... ఆమెని ఎప్పుడో కాలేజీలో చూశాను. నా ఈ చిన్న జీవితంలో... నేను పోయేలోపు ఒకసారి ఆమెని చూడాలనుంది వీర్... నా జీవితంలో మిగిలిన ఆఖరి కోరిక – ఆమెని ఒక్కసారి చూడాలి. ప్రామిస్... అక్కడ నేను పిచ్చివేషాలేం వెయ్యను."

కళ్లమ్మట నీళ్లు చిప్పిల్లాయి యుద్ధ్‌వీర్‌లో. దేనికీ చలించని అతడు విశ్వసౌరభ్ ప్రేమకు నిలువెల్లా కదిలిపోయాడు. "అలాగే సౌరభ్! నీ పేరు మార్చుకుని 'విక్రమ్ – ఫిజియాలజిస్ట్' అని గేటు దగ్గర సెక్యూరిటీ' స్టాఫ్‌కి చెప్పు. లేకపోతే నిన్ను వెంటనే పట్టుకుంటారు. ఈ లోపు నేను కూడా సౌగంధికకి ఈ విషయం చెప్పి 'విక్రమ్' అనే డాక్టర్ వస్తే లోపలికి పంపమని సెక్యూరిటీ స్టాఫ్‌కి చెప్పమని చెప్తాను."

"థాంక్స్ వీర్... థాంక్స్."

"అబ్బే... ఆ మాటకొస్తే నేనే నీకు థాంక్స్ చెప్పాలి."

నిశ్శబ్దం... నిశ్శబ్దం అవతల నుండి ఏం మాట్లాడాలో తెలియనట్లుగా.

ఆ నిశ్శబ్దాన్ని చెదరగొడుతూ నెమ్మదిగా కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం.

"విష్ యూ ఆల్ ది బెస్ట్ సౌరభ్... చాలాకాలం తర్వాత నీ ప్రియురాలిని నీవు కలుసుకోబోతున్న ఈ శుభసందర్భంలో నీకు అంతా శుభమే జరగాలని మనసారా కోరుకుంటూ సెలవ్ తీసుకుంటున్నాను.... ఐ అగైన్ విష్ యూ ఆల్ ది సక్సెస్"

మరుక్షణం ఫోన్ క్లిక్‌మంది.

❖ ❖ ❖

తన ఆఫీసులో అడుగుపెట్టిన యుద్ధ్‌వీర్ మెదడులో ఎడతెగని ఆలోచనలు.

ఆ వ్యాధి సౌగంధికకు ఎలా సోకింది? ఫార్ములా ప్రకారం ఆ వ్యాధి అపోజిట్ సెక్స్ నుండే సంక్రమిస్తుంది. అంటే ఆడవారి నుండి మగవారికి, మగవారి నుండి ఆడవారికి మాత్రమే సోకుతుంది. అంటే సౌగంధికకు ఆ వ్యాధి ఎవరో మగవాడివల్లే సంక్రమించింది.

రెండు – సాధారణంగా ఆ వ్యాధి అవతల వ్యక్తి సౌగంధికని కల్సిన నాలుగు నుండి ఆరుగంటలలోపు సంక్రమిస్తుంది.

సౌగంధికకి ఆ వ్యాధి సరిగ్గా రాత్రి ఏడింటికి బయటపడింది. అంటే ఉదయం పదకొండు గంటల్నుంచి మధ్యాహ్నం మూడు గంటలలోపు సౌగంధికని ఆ వ్యక్తి కలుసుకున్నాడన్నమాట.

ఓ నిశ్చయానికి వచ్చిన అతడు దిగ్గున లేచాడు. కార్డ్‌లెస్ ఫోన్‌ని చేతిలోకి తీసుకుని బటన్ నొక్కాడు. "హలో! చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మహాదేవ్ స్పీకింగ్."

"హలో... నేను యుద్ధ్‌వీర్‌ని మాట్లాడుతున్నాను. చిన్నపాటి ఇన్ఫర్మేషన్ కావాలి."

"విత్ ప్లెజర్... చెప్పండి."

"ఇవ్వాల్టి పి.ఎమ్.ప్రోగ్రామ్ షెడ్యూల్ కావాలి."

"ఇప్పుడే పంపిస్తాను".

"దాంతోపాటు పి.ఎమ్.ని. కలుసుకున్న విజిటర్స్ లిస్ట్ కావాలి."

"అలాగే! ఇరవై నిమిషాలలో మీ ముందు వుంటాయి."

యుద్ధ్‌వీర్ ఫోన్ పెట్టేశాడు.

సోఫాలో జారగిలబడి సిగరెట్ వెలిగించుకున్నాడు. తిరిగి సిగరెట్ పొగల్లా ఆలోచనలు.

నేరుగా ప్రధానిమీదే ఆ ఫార్ములా ప్రయోగించారంటే దేశంలో పెద్ద ఎత్తున ఏదో కుట్ర జరుగుతోంది. ఫార్ములాని ఉపయోగించి ప్రజల దృష్టిలో ప్రధానిని అల్లరి చెయ్యాలనుకున్నారు.

అసలా ఫార్ములా వారికి ఎలా దొరికింది? రెండే రెండు మార్గాలు వున్నాయి. ఒకటి – విశ్వసౌరభ్ నుండి సంగ్రహించి వుండాలి. కానీ విశ్వసౌరభ్ నుండి ఆ ఫార్ములా దొంగిలించబడలేదని తెలిసింది.

రెండు, లవర్స్ పార్కు నుంచి పారిపోయిన ప్రేమికుల జంటని దుండగులు పట్టుకొని, వారిలో ఒకరిని ప్రధాని దగ్గరకు తీసుకురావటమో లేదా ప్రధాని బయటకు వెళ్లినప్పుడు ఆ వ్యక్తి ప్రధానికి ఎక్కడో తారసపడి వుండాలి. అంతే! ఈ రెండింటిలో ఒక పద్ధతి వల్ల ఆ ఫార్ములా బారినపడ్డారు ప్రధాని.

క్షణాలు గడుస్తున్నాయి అతని ఆలోచనలతో.

"మే ఐ కమిన్ సర్!" పి.ఏ. అడిగాడు డోర్ గుమ్మం ముందు నిలబడి.

రావచ్చున్నట్లుగా తలూపాడు యుద్ధ్‌వీర్.

లోపలికి వచిచ అతని చేతిలో రెండు ఫైళ్లు వుంచి వెళ్ళిపోయాడు.

అవి ప్రధాని డైలీ షెడ్యూల్, విజిటర్స్ లిస్ట్‌లు.

ముందుగా ప్రధాని డైలీ షెడ్యూల్ ఫైల్‌ని ఓపెన్ చేశాడు. ఉదయం పదకొండు గంటల నుండి రెండింటిదాకా ప్రధాని విజిటర్స్‌ని కలిశారు. రెండున్నరకు లంచ్ అయ్యాక తిరిగి నాలుగు గంటల దాకా రకరకాల ప్రతినిధులను మీట్ అయ్యారు.

"ఓ మై గుడ్‌నెస్! లక్కీగా ఆ టైమ్‌లో ప్రధాని బయటకు వెళ్లలేదు' అనుకొని తిరిగి అదే టైమ్‌లో ప్రధాని కలుసుకున్న విజిటర్స్ లిస్ట్ ఫైల్‌ని ఓపెన్ చేశాడు యుద్ధ్‌వీర్. ఆ రోజు 11.00–3.00 గంటల మధ్య ప్రధాని కలుసుకున్న విజిటర్స్ వివరాలు ఇవి!

11 AM to 11.30 AM - దక్షిణాఫ్రికా రాయబారి

11.30 AM to 12.00 - బీహారు ముఖ్యమంత్రి

12.00 to 12.45 PM - ప్లానింగ్ కమిషన్ సభ్యులు

12.45 PM to 1.00 PM -స్టూడెంట్స్ ఫెడరేషన్ యూనియన్

1.00 PM to 1.15 PM - పాక్ రాయబారులు

1.15 PM to 1.30 PM - అసమ్మతివాదులు

1.30 PM to 2.00 PM - అపోజిషన్ పార్టీ లీడర్స్

2.30PM to 3.00 PM - పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ త్రిపాఠి

తల విదించాడు యుద్ధవీర్ ఒక్కసారిగా ఆ లిస్ట్‌ని చూస్తూనే. అందులో అనుమానాస్పదంగా కనిపించేవి మొత్తం ఎనిమిది గ్రూపులు. ఆ ఎనిమిది గ్రూపుల్లో దక్షిణాఫ్రికా రాయబారి గిరాన్ నెల్సన్ ఆడది కాబట్టి ఆమె నుండి ప్రధానికి ఆ వ్యాధి అంటే అవకాశం లేదు. ఇంకా మిగిలి వుంది ఏడు గ్రూపులు.

ఆ ఏడుగురిలోనే ఒకడు అసలైన దొంగ. ఎలా? ఎలా దొంగని పట్టుకోవటం?

అప్పుడు స్ట్రయిక్ అయ్యింది యుద్ధవీర్ మెదడులో ఓ ఐడియా. విజిటర్స్ రూమ్ లోపలికి వెళ్లాలంటే రిసెప్షనిస్ట్ దగ్గరున్న బుక్‌లో సంతకం పెట్టి వెళ్లాలి. రిసెప్షనిస్ట్‌గా వున్న యువతి కూడా ఆ రోగం ఎటాక్ కావాలి. సో... తన పని తేలిక అవుతుంది.

వెంటనే ఫోన్‌ని చేతిలోకి తీసుకున్నాడు యుద్ధవీర్. మరుక్షణం అతని ఆజ్ఞ మేరకు సి.బి.ఐ. ఆఫీసర్ వైభవ్ లోపలికి వచ్చాడు.

"మిస్టర్ వైభవ్! మీరు వెంటనే ప్రధాని విజిటర్స్ రూమ్ రిసెప్షనిస్ట్ అనితారాయ్ దగ్గరకు వెళ్లండి.." అంటూ అతనికి వివరాలు చెప్పి పంపించాడు.

తిరిగి ఆలోచనల్లోపడ్డాడు యుద్ధవీర్. ఇప్పుడు సౌగంధిక ఏం చేస్తుందో? విశ్వసౌరభ్ ఆమెని కలుసుకొని ఆ విరుగుడు మందుని ఎప్పుడు ఇస్తాడు? అసలు వారిద్దరి కథ చివరకు ఎలా ముగుస్తుంది?

ఒకటి...

రెండు.. నిమిషాలు కదులుతున్నాయి.

టేబుల్ మీద ఫోన్ మోగడంతో ఈ లోకంలోకి వచ్చాడు యుద్ధవీర్.

"సర్! నేను సి.బి.ఐ. ఇన్స్‌పెక్టర్ వైభవ్‌ని, మీరు చెప్పినట్లే రిసెప్షనిస్ట్ అనితారాయ్ దగ్గరకు వెళ్లాను సర్! ఆమెలో ఏ లక్షణాలు లేవు సర్! ఆమె పూర్తి ఆరోగ్యంతో వుంది సర్..."

"....." ఏం మాట్లాడాలో అర్థం కాలేదు యుద్ధవీర్‌కి.

తిరిగి కదిలింది వైభవ్ కంఠం రిసీవర్‌లో.

"ఓ విషయం సర్! అయితే ఆ రిసెప్షనిస్ట్ డ్యూటీ ఆ కౌంటర్‌లో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మాత్రమే. ఆ తర్వాత ఇంకొకతను డ్యూటీ తీసుకుంటాడు సర్..." ఫోన్ క్లిక్‌మంది.

అదీ సంగతి! ఆ లేడీ రిసెప్షనిస్ట్ మధ్యాహ్నం ఒంటిగంట దాకా డ్యూటీలో వుంటుంది. పైగా ఆమెకు ఏం కాలేదంటే ఈ రోజు ఒంటిగంట ముందు విజిటర్స్‌లో ఎవరికీ ఆ వ్యాధి లేదన్నమాట. సో... తన అనుమానితుల లిస్ట్‌లో ఒంటిగంటకి ముందున్నవారి పేర్లు తొలగిస్తే మిగిలినవారు నలుగురు.

వారు.......

1.00 PM to 1.15 PM - పాక్ రాయబారులు

1.15 PM to 1.30 PM - అసమ్మతివాదులు

1.30 PM to 2.00 PM - అపోజిషన్ పార్టీ లీడర్స్

2.30PM to 3.00 PM - పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ త్రిపాఠి

వీరిలో ఎవరై వుంటారు? పాకిస్తాన్ రాయబారులు ఏదో విషయం మాట్లాడాలని ప్రధానిని కలిశారా? వారిలో ఆ వ్యాధి సోకిన వ్యక్తి వున్నదా? ప్రధానికి ఆ వ్యాధి సోకటం వల్ల పాక్‌కి కలిగే లాభం ఏమిటి?

ఇక లిస్ట్‌లో రెండు మూడు జాబితాలలో వున్న అసమ్మతివాదులు, అపోజిషన్ పార్టీవారు కూడా ప్రధానిని అల్లరిపెట్టటానికి ఆ ఫార్ములాని ఉపయోగించవచ్చు. వాళ్లకూ అవకాశం వుంది.

ఇక లిస్ట్‌లో ఆఖరివాడైన పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ త్రిపాఠి కురువృద్ధుడు.

పైగా ప్రధానికి శ్రేయోభిలాషి, తండ్రిలాంటివాడు. అతన్ని లిస్ట్‌లోంచి తీసివేస్తే?

ఒకటి... రెండు...మూడు...

క్షణాలు కదులుతున్నాయి అక్కడ.

సరిగ్గా పదోక్షణంలో ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా కదిలాడు. పక్కనే వున్న ఫోన్ తీసుకొని సి.బి.ఐ.కి రింగ్ చేశాడు. అవతల రిప్లై రాగానే తాను చెప్పాల్సింది చెప్పేశాడు.

సరిగ్గా పావుగంట తర్వాత –

అక్కడ అడుగుపెట్టారో ఇరవైమంది లేడీ సి.బి.ఐ. ఇన్స్‌పెక్టర్స్.

తన ముందు సెల్యూట్ పొజిషన్‌లో నిలబడున్న వారికేసి చూస్తూ కదిలింది యుద్ధ్‌వీర్ కంఠం.

“ఇదిగో మీరు ఒక్కొక్కళ్లు ఈ ఫైల్‌లో వున్న ఒక్కో వ్యక్తిని కలవండి. ఆ వ్యక్తులంతా చాలా ఉన్నతస్థాయికి చెందిన విదేశీ రాయబారులు, పార్టీ అసమ్మతివాదులు, అపోజిషన్ పార్టీలకి చెందిన లీడర్లు, ఆఖరికి పార్టీ కమిటీ ఛైర్మన్ త్రిపాఠి కూడా వున్నారు.

మీరంతా ఆయా వ్యక్తుల్ని కలిసి – ప్రస్తుత లవ్ ఫార్ములా బారి నుండి దేశాన్ని రక్షించడానికి సలహాలు అడగండి. మీరంతా ప్రధాని ఆదేశం ప్రకారం పి.ఎమ్.ఓ. నుండి వచ్చామని చెప్పండి... అలా అందరినీ పర్సనల్‌గా కలిసి మధ్యాహ్నం ఒంటిగంటకు డాక్టర్ పరందేశ్‌ని కలపండి."

"యస్సార్..." అన్నారు అందరూ.

"నౌ! యు కెన్ గో..."

వాళ్లంతా చకచకా బయటికి నడిచారు.

యుద్ధ్‌వీర్ తిరిగి ఆలోచనలోపడ్డాడు. వీళ్లంతా ఆ లిస్ట్‌లో వున్న వారిని కలిసి వచ్చాక నేరుగా డాక్టర్ పరందేశ్‌ని కలుస్తారు. డాక్టర్ పరందేశ్ వారిని పరీక్ష జేసి ఎవరికి లవ్ డిసీజ్ సోకిందో తెలియజేస్తాడు.

ఆ లవ్ డిసీజ్ సోకిన అమ్మాయి ఆ రోజు ఎవరిని కలుసుకొని ఇంటర్వ్యూ చేసిందో చెక్ చేస్తే తెలిసిపోతుంది దీని వెనుకాలున్న 'కీలక వ్యక్తి' ఎవరో.

దీర్ఘంగా నిట్టూరుస్తూ వెనక్కి కూలబడ్డాడు యుద్ధ్‌వీర్. అలా కూలబడుతూనే నిద్రలోకి జారిపోయాడు.

ఒకటి..... రెండు.

మూడు.... నిమిషాలు మెత్తగా కరుగుతున్నాయి.

ట్రింగ్, ట్రింగ్‌మంటూ ఫోన్ మోగటంతో తిరిగి ఈ లోకానికి వచ్చాడు యుద్ధ్‌వీర్. చేతిలో రిస్ట్ వాచ్ చేసి చూసుకున్నాడు. మైగాడ్! తాను నిద్రపోయి గంటపైగా కావస్తోంది. ఈ మధ్య బిజీలోపడి అసలు నిద్ర వుండడం లేదు.

విసుగ్గా కదిలిందతని చేయి రిసీవర్‌కేసి.

"హలో యుద్ధ్‌వీర్ స్పీకింగ్..."

ఆ ఫోన్‌కాల్ సారాంశం...

"పాక్ రాయబారులలో యిద్దరిని ఎవరో టెర్రరిస్టులు షూట్ చేశారు..."

ఒక్కక్షణం దిగ్భ్రాంతిలోకి జారిపోయాడు యుద్ధ్‌వీర్. తను వింటున్నది నిజమేనా?

"ఎప్పుడు? ఎక్కడ...?" నెమ్మదిగా షాక్‌లోంచి తేరుకుంటూ అడిగాడు.

"ఓ అరగంట క్రితం... ఢిల్లీలో షాపింగ్‌కి వెళ్లాను. ఎవరో ఇద్దరు ఆగంతకులు రివాల్వర్‌తో షూట్ చేసి జీప్‌లో వెళ్లిపోయారు..."

ఫోన్ పెట్టేస్తూ అలాగే నిలబడిపోయాడు యుద్ధ్‌వీర్. ఆ రాయబారులను తన లేడీ ఇన్స్‌పెక్టర్స్ కలుసుకోబోతున్న విషయం తెలిసి, ఎవరో ఈ హత్య చేశారన్న వాస్తవం మనస్సుని స్పృశిస్తుండడంతో.

పాక్ రాయబారులనే హత్య చేయడానికి సిద్ధపడ్డారంటే సామాన్య విషయం కాదు. ఏదో కుట్ర చాలా పెద్ద ఎత్తున జరుగుతోంది. ఏమిటది...?

ప్రశ్న యుద్ధ్‌వీర్‌లో.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించబోయే పాక్ రాయబారుల హత్య గురించి ఆలోచిస్తూ జీపెక్కాడు యుద్ధవీర్. నిర్మానుష్యంగావున్న రోడ్ల మీద సర్రున దూసుకుపోతోంది మిలటరీ జీప్.

ఇప్పుడేం చేయాలి? పాక్ బారులను చంపిందెవరు? మరణించిన ఇద్దరు రాయ బారులకు ఆ వ్యాధి వుందా? లేక వారిని వేరే కారణాల వల్ల చంపారా? సరిగ్గా అప్పుడు గుర్తొచ్చింది అతనికి. అది... చనిపోయిన వారి బాడీలని నిపుణుడైన సర్జన్ చేత పోస్ట్‌మార్టం చేస్తే తెలిసిపోతుంది. ఆ వ్యక్తులకు ప్రేమవ్యాధి అంటిందో లేదో.

అయితే ఇక్కడ ఓ విషయం ఆలోచించాలి. చనిపోయిన ఆ డెడ్ బాడీలను పాక్‌కి పంపించకుండా ఇక్కడే పోస్ట్‌మార్టం చేస్తే పాక్ గోలపెడుతుంది. అంతర్జాతీయ వేదికకు ఎక్కుతుంది. అందుకే....

అక్కడే ఆగిపోయాడు యుద్ధ్‌వీర్, చదరంగంలో ఏ పావుని కదపాలో ఆలోచిస్తూ.

అంతే! ఆ తర్వాత పనులు చకచకా జరిగిపోయాయి అతని ఆదేశంతో.

చనిపోయిన ఆ డెడ్‌బాడీల చుట్టూ వున్న పోలీసుల్ని చెదరగొడుతూ టెర్రరిస్ట్‌లు అక్కడ పొగ బాంబులు వేయడం, వారు ఆ పొగమంచు తేరుకునేలోపే టెర్రరిస్ట్‌లు అక్కడ అడుగుపెట్టడం, ఆ డెడ్‌బాడీలని మెరుపువేగంతో జీపులలో ఎక్కించుకోవడం జరిగిపోయాయి.

అంతే! టెర్రరిస్ట్‌లు తిరిగి అటాక్ చేసి డెడ్‌బాడీలను అందరూ చూస్తూండగా ఎత్తుకుపోయారన్న వార్త అక్కడ సంచలనం సృష్టించింది. ఆ సంచలనం నుండి ప్రజలు, పోలీసులు తేరుకునేలోపే ఆ శవాలను యుద్ధ్‌వీర్ ముందు పడవేసి తమ టెర్రరిస్ట్ వేషాలకు తిలోదకాదు ఇచ్చారు సీక్రెట్ కమెండోస్.

మరో పది నిముషాలలో ఆ డెడ్‌బాడీలు ఓ ఇంటి లోపలికి చేరాయి. వాటిని పోస్ట్‌మార్టం చేయడానికి సుశిక్షుతలైన డాక్టర్లు అక్కడ అడుగుపెట్టారు.

తిరిగి యుద్ధ్‌వీర్ తన జాయింట్ ఇంటెలిజెన్స్ స్టీరింగ్ చాంబర్‌కి వచ్చాడు.

అతడు చాంబర్‌కి వచ్చిన మరో గంటకు వచ్చారు. లేడీ సి.బి.ఐ. ఇన్స్‌పెక్టర్స్. వారందరు కూడా డాక్టర్స్ చేత చెకింగ్ చేయబడ్డారు.

మరో అరగంట గడిచిన తర్వాత తేలింది... ఆ అమ్మాయిల్లో ఎవరికీ ఆ వ్యాధి అంటలేదని.

మరో రెండు గంటలు గడిచిన తరువాత పాక్ రాయబారుల డెడ్‌బాడీలను పోస్ట్‌మార్టం చేసిన డాక్టర్లు కూడా రిపోర్ట్ పంపించారు.

ఆ రిపోర్ట్ సారాంశం – ఆ డెడ్‌బాడీలలో ఒక్కరికి కూడా ఆ వ్యాధి అంటలేదని.

రిపోర్ట్స్ చూస్తున్న యుద్ధ్‌వీర్‌లో అవధులు దాటిన ఆశ్చర్యం! అసలు ఎవరికీ వ్యాధి సోకనేలేదా? అదెలా సంభవం? ఎవరికీ వ్యాధి లేకుండా ఆ రోజు ప్రధానికి ఆ వ్యాధి ఎలా సోకింది? నో.. ఇందులో ఏదో తిరకాసుంది. ఎక్కడో ఏదో జరిగింది.

ఎక్కడో ఏదో లింక్ తెగింది. అదేమిటో తనకు అంతుబట్టడం లేదు. ఎక్కడ వుంది లోగుట్టు? సమ్‌థింగ్ ఆన్ ఇమేజినబుల్...

క్షణాలు గడుస్తూనే వున్నాయి. ఎంత ఆలోచించినా యుద్ధ్‌వీర్‌కి పరిష్కారం దొరకడం లేదు. శత్రువులు చాలా తెలివైనవారు. తన ఇన్వెస్టిగేషన్‌ని తప్పుదారి పట్టించడానికి పాక్ రాయబారులను ఏ కారణం లేకుండానే హత్యచేశారు.

కానీ తాను డెడ్‌బాడీలను కూడా పోస్ట్‌మార్టం చేయిస్తానని అనుకొని వుండరు. ఇంకో విషయం – ఇంతకుముందు సౌగంధికపై జరిగిన హత్యాప్రయత్నాలకు, ఈ హంతకులకు 'లింక్' వుందా? ఇద్దరూ ఒకరేనా? అసలేమిటి వారికి ప్రయోజనం?

మెదడులోని రక్తనాళాలు బద్దలయ్యేలా ఆలోచిస్తున్నాడు యుద్ధ్‌వీర్.

## 35

విశ్వసౌరభ్‌కి ఆ రోజు పట్టరాని ఉత్సాహంగా వుంది. ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కినంత ఆనందంగా వుంది. ఒళ్లంతా పులకింతగా వుంది. ఎన్నో మధురభావనలు పరిమళాల్లా చుట్టుముడుతున్నాయి.

కారణం... ఆ రోజు అతడు సౌగంధికను కలుసుకోబోతున్నాడు. అందుకే అతని మనసు మానససరోవరంలో ఆనందోత్సాహాలతో విహరిస్తున్నట్లుగా వుంది.

ఆ సరోవరం దగ్గర ఓ ఉద్యానవనం. మధ్య పచ్చికలో పెద్ద కొలను, ఆ కొలనులో హంసతూలికాతల్పంలాంటి పడవ, ఆ పడవలో ఆమె, తాను విహరించడం...ఇలా ఊహలతో అతడి హృదయం పులకించిపోతోంది. దూరాన్నుంచి కిన్నెరల గానం మంద్రస్థాయిలో మధురంగా వినిపిస్తూండగా, ఆకాశంలోంచి దేవతలు భూమ్మీదకు దిగివచ్చి విహరిస్తుండగా, ఎక్కడో శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో రాజనర్తకిలు భరతనాట్యం చేస్తున్నారు లయబద్ధంగా. ఏదో వింతలోకంలో వున్న భావన అతనిలో.

వెనకాల ఏదో హారన్ వినిపించి హఠాత్తుగా ఈ లోకంలోకి వచ్చాడు విశ్వసౌరభ్.

ఇంకా నాలుగు కిలోమీటర్లు వుంది ప్రధాని నివాసం. ఉస్మాన్ నగర్ నుండి 10, సఫ్దర్ జంగ్ రోడ్‌లోని ప్రధాని అధికార నివాసం భవనం దగ్గరికి వెళ్లాలంటే కనీసం అర్ధగంటపైనే పడుతుంది.

తిరిగి నడక సాగించాడు అతడు. తలపైన చిన్న క్యాప్, కళ్లకు చల్లటి కూలింగ్ గ్లాసెస్, గడ్డానికి అతికించుకున్న కృత్రిమగడ్డంతో గమ్మత్తుగా కనిపిస్తున్నాయి. అతడి ఫ్యాంటుజేబులో లవ్‌ఫార్ములా తాలూకు విరుగుడు మందుసీసా గరుకుగా తగులుతోంది.

తిరిగి అతనిలో ఆలోచనలు. ఎన్ని రోజులు, ఎన్ని రాత్రులు గడిచిపోయాయి ఆమెని చూడక. ఆకాశంలో విహరించే ఓ యువరాణి భూమ్మీద సంచరించే నరుడిపై కోపగించుకుని తిరిగి చాలా రోజుల తర్వాత ప్రసన్నురాలయి అతడిని కలుసుకోవానికి ఆ రోజు దివి నుండి భువికి వస్తున్నట్లు వుంది.

ఎన్నో రోజులు తపస్సు చేశాడు?

ఎన్ని రాత్రులు నిద్రపోకుండా చూశాడు? తన ప్రణయదేవత ఒక్కసారి ప్రత్యక్షమైతే చాలని ఎన్ని రోజులు అన్నపానీయాలు లేకుండా చూశాడు?

ఓ ప్రియబాంధవీ! నా కంటిలో పాపవై, నా హృదయంలో ఊపిరై, నా అధరాలపై చిరునవ్వువై, నా గుండెల్లో నీవే నిండివున్నావు. అలాంటి నిన్ను కలుసుకోబుతున్నందుకు నా గుండె ఉప్పొంగిపోతోంది. అంతవరకు బిగబట్టిన కంటిగట్టు తెగింది.

అయితే అవి కన్నీరు కావు.

ఆనందభాష్పాలు!

ఎంతలో ఎంత మార్పు! నిన్నటిదాకా తనని కష్టాలు వెన్నంటాయి. సుడిగుండంలో నావలా ఊగిసలాడాడు తాను. అసలు ఆమె దర్శనమే కాదనుకున్నాడు. ఆమె ఒక చూపు... ఒక స్పర్శ చాలు తాను తృప్తిగా మరణించటానికి.

ఆమె ఒక్క కరుణావీక్షణం చాలు ఎన్నెన్నో జన్మలు తన ఆత్మతృప్తిగా వుండడానికి. క్షణాలు గడుస్తున్నాయి... అతని ఆలోచనల్ని పంచుకుంటూ.

ఎదురుగా అరకిలోమీటరు దూరంలో ఎండతాలూకు కిరణాలతో మెరుస్తోంది ప్రధాని అధికార నివాసం. ఆ సందు చివరిదాకా వెళ్లి ఆకాశమంత ఎత్తున సెక్యూరిటీ గేట్ ముందు ఆగాలి. సెక్యూరిటీ ఓ.కె. చేశాక యింకో పావుకిలోమీటరుంది లాన్ లోపల ప్రధాని విజిటర్స్ రూమ్.

ఆలోచనలతో వున్న విశ్వసౌరభ్ ఆ సందు మధ్యలో వున్న మారుతీ వ్యాన్‌ని పట్టించుకోలేదు.

విశ్వసౌరభ్ కాళ్లు కదులుతున్నాయి వేగంగా. ఒక్కో అడుగు తరుగుతున్న కొలదీ ఎత్తయిన సెక్యూరిటీ గేటులు దగ్గరవుతున్నాయి.

అక్కడ గాలి కూడా ఓ రకమైన ఉద్రిక్తతలో వీస్తోంది.

ఆ మారుతీ వ్యాన్‌లోంచి డోర్ నెట్టుకుంటూ దిగారు ఇద్దరు వ్యక్తులు. వారి చేతులలో మెరుస్తున్నాయి. ఎ.కె. 47 రైఫిల్స్.

ఇంకో ఏభై గజాలుంది గమ్యస్థానాన్ని చేరటానికి. ఉద్వేగంగా అడుగులు ముందుకు వేస్తున్నాడు విశ్వసౌరభ్. అదే సమయంలో మారుతీ వ్యాన్‌లోంచి కిందకు దిగిన ఆ వ్యక్తులు తమ మెషిన్‌గన్స్‌ని సూటిగా విశ్వసౌరభ్‌కేసి గురిపెట్టారు.

ఒకటి... రెండు... మూడు...

క్షణాలు కదులుతున్నాయి ఉద్వేగంలో...

ముందుకు అడుగు వేయబోతూ ఒక్కక్షణం ఆగాడు విశ్వసౌరభ్. ఏదో అనుమానంతో, వెనక్కి తిరిగి చూశాడు. దూరంగా ఇద్దరు వ్యక్తులు రైఫిల్స్‌ని సూటిగా తనవైపే గురిపెట్టడం కనిపించింది.

"మైగాడ్!" విడివడ్డ విశ్వసౌరభ్ గొంతులోంచి వెలువడిందా మాట. లక్ష ఓల్టుల ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లుగా దిగ్భ్రాంతి అతనిలో.

'ఎవరు వాళ్ళు? తననెందుకు చంపబోతున్నారు? అసలు తను ఇక్కడికి వస్తానని ఎలా వూహించారు? తనని ఎలా గుర్తుపట్టారు?

అడుగు ముందుకు వేసే శక్తి లేనట్లుగా నిల్చుండిపోయాడు అలాగే చుట్టూ కదులుతున్న గాలి మృత్యువులా తనని చుట్టుముడుతూంటే?

నిమిషాలు గడుస్తున్నాయి.... ఆ ఉద్వేగంలోనే. మరుక్షణం కర్తవ్యం గుర్తుకొచ్చి గబగబా సెక్యూరిటీ గేట్ల వైపు పరిగెత్తబోయాడు.

అప్పటికే ఆలస్యమైపోయింది.

అతడి ముందు ఆ సెక్యూరిటీ గేట్లు ఓ పది అడుగుల దూరంలో వుండగానే గొంతు చీల్చుకొని అరుస్తూ సెక్యూరిటీ వారిని పిలవబోయాడు.

అంతే!

**మరుక్షణం వెనకాలున్న ఆ ఇద్దరి వ్యక్తుల రైఫిల్స్‌లోంచి బుల్లెట్స్ శరవేగంతో దూసుకుపోయి, విశ్వసౌరభ్ శరీరాన్ని చిల్లులు పొడవడం ... చిన్నగా అరుస్తూ విశ్వసౌరభ్ రక్తపు మడుగులో నేలకొరిగిపోవటం – అంతా ఐదు సెకండ్లలో జరిగిపోయింది.**

అదే క్షణంలో గేటు దగ్గరున్న సెక్యూరిటీ స్టాఫ్ తమ రైఫిల్స్‌ని ఎక్కుపెడుతూ పరిగెత్తుకు రాసాగారు. అప్పటికే ఆ వ్యక్తులు మారుతీవ్యానులోకి తిరిగి ప్రవేశించడం, వారి వెనకాల వ్యాను తలుపులు మూసుకుపోవడం, అక్కడ్నుంచి చిన్న జర్కుతో వేగంగా వెళ్లిపోవడం చకచకా జరిగిపోయాయి.

చేసేది లేక సెక్యూరిటీ స్టాఫ్ రక్తపు మడుగులో కిందపడిపోయిన విశ్వసౌరభ్ దగ్గరకు పరిగెత్తారు.

అప్పటికే విశ్వసౌరభ్ ఊపిరి భారంగా పీలుస్తున్నాడు. అతడి కుడి చేయి ప్యాంటు జేబులోని విరుగుడు మందుని గట్టిగా పట్టుకొని వుంది... అదెక్కడ దూరమవుతుందోనన్న ఆర్తితో.

❖ ❖ ❖

యుద్ధ్‌వీర్‌కి శివమెత్తినట్టయింది. అతడిలో ప్రతి అణువూ శతకోటి నిర్ఘాత దారుణమైన ఒక మారణ మహాశక్తి ఆవహించింది.

విధి వికటించి అదృష్టదేవతకు మతిచెడినట్లుంది అక్కడి పరిస్థితి. ఎన్నెన్నో ఆశలతో ప్రియురాలిని కలుసుకోవటానికి వచ్చిన విశ్వసౌరభ్‌పై ప్రత్యర్థులు దాడిచేశారు. ఇటీజ్ రియల్లీ హారిబుల్!

అశ్రువులు అతడి హృదిలోనే ఘనీభవించాయి. అతడికి తెలుసు. అటువంటి సమయంలో ప్రతిక్షణం ఎంత ముఖ్యమైనదో.

అందుకే విశ్వసౌరభ్‌ని ఎవరో అగంతకులు కాల్చివేశారని ఫోన్ రాగానే అతడు అడిగిన మొదటి ప్రశ్న – "ఇంకా బ్రతికే వున్నాడా?" అని.

"నాడి కొద్దిగా ఆడుతోంది సార్!" చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సమాధానం.

"వెంటనే అంబులెన్స్‌లో ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కి తీసుకువెళ్ళండి. అతడి వి.ఐ.పి.కి ట్రీట్‌మెంట్ జరిపించండి... ఇమ్మీడియట్ యాక్షన్" అని ఆర్డర్ జారీచేశాడు.

తర్వాతేం చేయాలో నిర్ధారణ అయింది. వెంటనే సౌగంధికకు ఫోన్ చేశాడు.

అవతల్నుంచి ప్రధాని సౌగంధిక కంఠం చాలా బలహీనంగా, నీరసంగా వినిపించింఒది.

"హలో" అంటూ.

"హలో సౌగంధికా! జరిగిన విషయం మీకు తెలుసనుకుంటాను..." అని అడిగాడు యుద్ధ్‌వీర్.

"ఊc.... "ఫోన్లో మాట్లాడుతున్నా ఆమె మనసు అచేతనావస్థలోకి జారిపోతోంది. ఆలోచనలన్నీ ఉడిగిపోయినట్లుగా జరిగిన సంఘటనలు ఆమెని నిశ్చేష్టితురాలిగా మార్చివేశాయి. తనకోసం... విరుగుడుమందుని తెచ్చిన మిత్రుడు నేడు ఇలా నిర్జీవంగా... దుఃఖాన్ని కంట్రోల్ చేసుకోలేకపోతోంది.

"సౌగంధికా... ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్... నేనిప్పుడు హాస్పిటల్‌కి వెళుతున్నాను. చుట్టూ మరింత పటిష్టమైన సెక్యూరిటీ ఏర్పాటు చేస్తాను. దుండగుల సంగతి తర్వాత ఆలోచిద్దాం. ఈలోపు విశ్వసౌరభ్ కండిషన్ ఎలా వుందో చూసొస్తాను..."

వింటున్న సౌగంధిక ఒక్కసారిగా బరస్ట్ అయ్యింది.

"నా పరిస్థితి ఇప్పుడు పగవాడికి కూడా వద్దు. ఇటు ఆ ప్రేమజబ్బు వల్ల బయటికి రాలేక, అటు విశ్వసౌరభ్‌ని చూడలేక... జీవచ్ఛవంలా యిలా..." గొంతు గాద్గదికమయి పోయింది ఆమెకు.

"సౌగంధికా! డోంట్‌వర్రీ... విశ్వసౌరభ్‌కి ఏం కాదు. నేనొక పనిచేస్తాను. నేను వెంటనే హాస్పిటల్‌కి వెళ్లి విశ్వసౌరభ్ దగ్గర ఆ విరుగుడు మందు వుందో, లేదో చూస్తాను. ఉంటే వెంటనే దానిని మీకు పంపించే ఏర్పాటు చేస్తాను. ఆ మందుని సేవించి మీరు వెంటనే బయలుదేరండి..." అన్నాడు యుద్ధవీర్.

"అలాగే..." అంధకారంలో చిరుదీపం వెలిగించినట్లుగా కొద్దిగా వెలుగు సౌగంధికలో.

**కానీ...ఆ సమయంలో ఆమెకు తెలియదు కథ ఊహించని మలుపు తిరగ బోతోందని.**

# 36

ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్!

యుద్ధవీర్ కారు అక్కడకు ప్రవేశించేసరికే పోలీసులు గజానికి ఒకరు చొప్పున అటెన్షన్‌తో తుపాకీలు పట్టుకొని కాపలా కాస్తున్నారు.

అతడిని చూస్తూనే ఎదురువచ్చాడు డి.ఎస్.పి. రాజేంద్రసింగ్ చేతిలో వున్న వాకీటాకీతో.

"సార్! విశ్వసౌరభ్‌ని ఇప్పుడు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వుంచారు..."

దాదాపు పరుగుపెడుతున్నట్లుగా లిఫ్ట్ దగ్గరకు వెళ్లాడు యుద్ధవీర్.

ఇంటెన్సివ్ కేర్ ఫోర్త్‌ఫ్లోర్లో వుంది.

లిఫ్ట్‌లోంచి బయటపడుతూనే ఇంటెన్సివ్ కేర్ రూమ్‌కెళ్ళాడు. బయట మఫ్టీలో వున్న పోలీసులు అతన్ని చూస్తూనే లేచి సెల్యూట్ కొట్టారు. అతడు అవన్నీ పట్టించుకునే మూడ్‌లో లేడు. అతని ఆలోచనలన్నీ విశ్వసౌరభ్ పరిస్థితి మీదే వున్నాయి.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్ డోరు నెట్టాడు.

అప్పటికే అక్కడ హడావిడిగా వుంది.

డాక్టర్లు, నర్సులు బిజీబిజీగా వున్నారు.

ఆపరేషన్ థియేటరు లోపలికి విశ్వసౌరభ్‌ని తీసుకెళ్లడానికి స్ట్రెచర్ తీసుకొచ్చారు.

డాక్టర్ మల్‌హోత్రాని చూస్తూనే ఆదుర్దాగా అడిగాడు ఎలా వుందని?

"చెప్పలేము. బ్లడ్ చాలా పోయింది. ఎడమ ఛాతిమీదుగా బుల్లెట్ దూసుకు పోయింది. ఆపరేషన్ చేస్తే కానీ ఏ విషయం చెప్పలేము..."

నర్సులు, రూమ్‌బోయ్‌లు అప్పటికే స్ట్రెచర్ మీదకు విశ్వసౌరభ్‌ని ఎక్కించారు.

చిమ్మికొట్టిన నెత్తుటితో తల, ముఖం, ఒళ్లు పూర్తిగా తడిసిపోయాయి. ఆ రక్తంతో స్ట్రెచర్ తాలూకు వైట్ బ్లాంకెట్ తడిసిపోయింది.

ఒక్కక్షణం...

దిగ్భ్రాంతి చోటుచేసుకుంది యుద్ధ్‌వీర్‌లో. ఏవేవో జ్ఞాపకాల యుద్ధ్‌వీర్‌లో.

కాలేజీ రోజుల్లో స్వచ్ఛమైన చిరునవ్వుతో తెల్లకోటు వేసుకుని పుస్తకాలు చేతిలో పట్టుకుని తిరిగే సౌరభ్, ప్రొఫెసర్ అడిగిన ఏ ప్రశ్నకైనా తడుముకోకుండా వెంటనే సమాధానం చెప్పి ఇండియాలోనే తనంత జీనియస్ లేడని పేరుగాంచిన విశ్వసౌరభ్...

ఆఖరికి ప్రేమకోసం తన జీవితాన్నే పణంగా పెట్టాడు.

తల విదిలించాడు యుద్ధ్‌వీర్, కళ్లల్లో నీటిపొరలు అలముకుంటుంటే. కళ్ళముందు స్ట్రెచర్ కనుమరుగైపోతోంది క్రమక్రమంగా. సరిగ్గా అప్పుడు...గుర్తొచ్చింది యుద్ధ్‌వీర్‌కి విరుగుడు మందు.

ఒక్క ఉదుటున జంప్ చేశాడు స్ట్రెచర్‌వైపు. సరిగ్గా ఆపరేషన్ థియేటర్ లోపలికి స్ట్రెచర్ వెళ్లబోతున్న సమయంలో అతను వేగంగా పరిగెత్తుకుంటూ రావడం కనిపించింది డాక్టర్లకు.

స్ట్రెచర్ మీద విశ్వసౌరభ్ ఫ్యాంటు జేబులు అతను వెతకడం వారిని తికమక పరిచింది. ఏం అర్థంకాక ఒకరినొకరు చూసుకున్నారు.

నరాలు తెగిపోతాయేమోనన్నంతగా టెన్షన్ పడుతున్నాడు యుద్ధ్‌వీర్. వెతుకుతున్న అతడి చేతులు వణుకుతున్నాయి. అప్పుడు... చేతికి గరుకుగా తగిలింది అతడికి. మెరుపు

వేగంతో దాన్ని బయటికి తీశాడు. మరుక్షణం అతడి కళ్లు మెరిశాయి. కావాల్సినది దొరికినట్లుగా.

అతని చేతిలో తళతళలాడుతోంది లైటు వెలుతురుకు విరుగుడు మందు సీసా.

ఆ తర్వాత పనులు చకచకా జరిగిపోయాయి. దాన్ని ఓ సీల్డ్‌వర్‌లో వుంచి సౌగంధికకు పంపించడం, ఆమె దాన్ని స్వీకరించడం జరిగిపోయాయి.

❖ ❖ ❖

ముందు నాలుగు, వెనక మూడు కార్లు అనుసరిస్తుండగా త్రివర్ణ పతాకంగల ప్రధాని కారు శరవేగంతో వచ్చి ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ముందు ఆగింది.

ప్రధాని కారు అక్కడ ఆగగానే ముందూ వెనకాల కార్లలోంచి దిగిన బ్లాక్‌కాట్ కమెండోస్ పరిగెత్తుకువెళ్ళి ఆమె కారు డోరు తెరిచారు.

ముందుగా ఆమె గులాబీరంగు పాదాలు కదిలాయి నేల మీద. కళ్లల్లో ఎర్రజీరలతో, పీక్కుపోయిన మొహంతో అలసిపోయినట్లుంది. ఒక్కరోజులోనే పాతిక లంకణాలు చేసినట్లు కనిపిస్తోంది.

మరుక్షణం ప్రెస్ రిపోర్టర్ల చేతుల్లో కెమెరా ఫ్లాష్‌లు తళుక్కుమన్నాయి. వివిధ ఛానల్ల విలేఖర్లు ఆమెని తమ టీవీల్లో చూపించడానికి ఉత్సాహంగా వీడియో కెమెరాలతో షూటింగ్ చేస్తున్నారు.

దూరంగా కాలేజీ అమ్మాయిలు, అబ్బాయిలు పూలబొకేలతో హాస్పిటల్ లోపలికి చొచ్చుకొని రావాలని ప్రయత్నిస్తున్నారు. వారి ముందు రకరకాల బ్యానర్లలో 'సౌరభ్ బతకాలి', 'ప్రేమ పిపాసి విశ్వసౌరభ్ అమర్ హై' అంటూ అక్షరాలు మెరుస్తున్నాయి. పోలీసులు వారిచుట్టూ బారికేడ్లు కట్టి వారిని లోపలికి రానీయకుండా నియంత్రిస్తున్నారు.

సౌగంధిక దృష్టి వాటి మీద లేదు. ఆమె మనసంతా ఉద్వేగంగా ఉంది లోపలేం జరుగుతుందోనని.

వడివడిగా అడుగులువేస్తూ కారిడార్ దగ్గరకు నడిచింది. ఆమెని చూస్తూ స్టడీగా నిలబడి సెల్యూట్ చేశారు సెక్యూరిటీ సిబ్బంది. పేషెంట్లు, డాక్టర్లు ఆమెని చూస్తూ పక్కకు తప్పుకున్నారు.

తడబడే గుండెలతో సౌగంధిక ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ముందు ఆగింది.

అప్పటికే యుద్ధ్‌వీర్ అక్కడ నిలబడున్నాడు. అతడి ముఖం అలసిపోయినట్లుంది.

"ఏమయ్యింది వీర్? విశ్వసౌరభ్ పరిస్థితి ఎలా వుంది ఇప్పుడు?" ఉద్వేగం, దిగ్భ్రాంతి కలగలిసిన గొంతుతో అడిగింది సౌగంధిక.

"ప్చ్... తెలీదు..." అతడి కంఠం కదిలింది విచారంగా, "గంట నుంచి ఆపరేషన్ థియేటర్‌లోనే వున్నాడు. ఇంకా బయటికి తీసుకురాలేదు. ఆపరేషన్ పూర్తయితేగానీ ఏ సంగతీ చెప్పలేమన్నారు..."

ఆమె జీవితంలో మొదటిసారి దేవుడిని ప్రార్థించింది. విశ్వసౌరభ్‌కి ఏం కాకూడదని, ఒక గమ్యం కోసం ఆరాటపడిన అతడు బతకాలని ఇష్టదైవాన్ని మనస్ఫూర్తిగా కోరుకుంది.

ఆపరేషన్ పూర్తయినట్లుగా బయట గ్రీన్ బల్బు వెలిగింది. ఇద్దరూ ఒక్క ఉదుటున అక్కడికి పరిగెత్తారు. ఇద్దరిలోనూ ఉద్రిక్తత, ఉద్వేగం, దిగ్భ్రాంతి ఏం జరుగుతుందోనని.

చేతిలో గ్లౌవ్స్ వేసుకున్న డాక్టర్ మల్‌హోత్రా బయటకు అడుగుపెట్టాడు. అతడి ముఖం నిండా చెమటలు అలుముకున్నాయి. చేతితో తలపట్టుకుని పక్క నున్న తలుపుని ఆసరాగా పట్టుకున్నాడు.

గుండె పగిలిపోతున్న ఉద్వేగం సౌగంధికలో.

"ఏం జరిగింది డాక్టర్?"

**"ఐయాం సారీ ప్రైమినిస్టర్! మేమెంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. బుల్లెట్లు చాలా బలంగా అతడ్ని తూట్లు పొడిచాయి. అతడు బతకడు..."**

"మైగాడ్..."

రెండు బలమైన మేఘాలు విస్ఫోటనం చెంది తన మీద కూలిపడ్డాయా అన్నట్లుగా కుప్పకూలిపోయారు సౌగంధిక, యుద్ధ్‌వీర్.

శరీరాల్లో సర్వశక్తులు హరించుకుపోయినట్లుగా శూన్యంలోకి చూస్తుండిపోయారు కంటిపాపల కదలికలు కూడా మర్చిపోయినట్లుగా.

కడుపులో బాధ సుళ్లు తిరుగుతుండగా జీరబోయిన స్వరంతో అడిగాడు యుద్ధ్‌వీర్.

"డాక్టర్! అతడు ఇంకా మరణించలేదు కదా?"

"మరణించలేదు. కానీ ఇంకో అరగంటవరకూ అలాగే కోమాలో వుండిపోయి ఆ తర్వాత మరణిస్తాడు..." అన్నాడు డాక్టర్.

తన జీవితంలో ఏ రోజూ, ఏ క్షణంలోనూ ఎరగనంత షాక్‌కు లోనవుతూ అదిరి పడ్డాడు యుద్ధ్‌వీర్.

ఒకటి. రెండు...

మూడు... క్షణాలు బరువుగా కదులుతున్నాయి ఉద్రిక్తతలోనే... అప్పుడు గుర్తొచ్చింది అకస్మాత్తుగా అతడికి 'విరుగుడు మందు'.

అవును! సౌరభ్ ఇచ్చిన విరుగుడు మందు డోసు ఒక్క సౌగంధికకు సరిపోయింది. అసలా విరుగుడు మందు ఎలా తయారుచెయ్యాలో విశ్వసౌరభ్‌కి తప్ప ఎవరికీ తెలియదు. అలాంటి వ్యక్తి మరణించబోతున్నాడు. కానీ లవర్స్ పార్కులో, త్రివేండ్రం సముద్రతీరంలో ఆ ప్రేమవ్యాధి సోకినవారి మాటేమిటి? వారి జీవితాలు అలాగే ముగుస్తాయే?

మరుక్షణం దిగ్గున లేచాడు యుద్ధవీర్.

"డాక్టర్! ఎలాగైనా చనిపోయేలోపు అతడిని ఒక నిముషం కోమాలోంచి బయట పడేసే మార్గం చూడరూ?" అన్నాడు.

"ఇటీజ్ నాట్ పాజిబుల్..." డాక్టర్ మల్‌హోత్రా కంఠం కదిలింది. "నేనే కాదు – దాదాపు పదిమంది ఫేమస్ సర్జన్స్ కూడా ప్రయత్నించాం ఎలాగయినా అతడ్ని బతికించడానికి. కానీ ఉపయోగం లేకపోయింది..."

"నేను అనేది అతడ్ని బతికించమని కాదు..." అరిచాడు యుద్ధవీర్... "కోమాలో వున్న మనిషిని జస్ట్ ఒక నిమిషం స్పృహలోకి తీసుకురాగలరా? అని."

"అది ... అదెలా సాధ్యమవు...." డాక్టర్ మాట పూర్తికాకుండానే సౌగంధిక కంఠం అక్కడ మారుమోగింది అంత దుఃఖంలోనూ – "బైనెట్ టెక్నిక్ ఉపయోగించి మరణించేలోపు ఓ పదిహేను సెకండ్లు అతడ్ని స్పృహలోకి తీసుకురావచ్చు..."

దిగ్భ్రాంతిగా చూశాడు మల్‌హోత్రా ఆమెవైపు. ఈ ప్రైమ్‌మినిస్టర్ కూడా డాక్టరేనని, అందునా గోల్డ్‌మెడల్ అందుకున్న ర్యాంక్ హోల్డర్ అన్న విషయం అప్పుడు ఆయనకి గుర్తొచ్చింది.

డాక్టర్ బైనెట్ టెక్నిక్ ప్రకారం రోగులు కోమానుండి నేరుగా మరణపు అంచులు చేరుకునేలోపు బాడీలోకి ఆక్సిజన్, సెలైన్, బ్లడ్‌ని వేగంగా పంప్ చేస్తారు. దాంతోపాటు పంపింగ్ పద్ధతిలో అతడి గుండెని, బ్రెయిన్‌ని పక్కనే వుంచబడిన కంప్యూటర్‌తో అనుసంధానం చేస్తారు.

అప్పుడు మెదడులోని రక్తనాళాలు వేగంగా ఉత్తేజం చెంది పేషెంటు కళ్ళు తెరుస్తాడు. కంప్యూటర్లో అమర్చబడ్డ డిజిటల్ వాచ్ – ఆ పేషెంటు కోమా నుండి ఎప్పుడు బయటకు వస్తాడో నోట్ చేసుకుంటుంది. అలా పదిహేను సెకండ్లు రోగి చనిపోయేదాకా కంప్యూటర్లో డిజిటల్ క్లాక్ నోట్ చేస్తుంది.

ఆ పదిహేను సెకండ్ల కాలంలో పేషెంటు కేవలం కళ్లు తెరిచి తనవాళ్లని చూడగలడు కానీ మాట్లాడలేదు. తన సంబంధీకులని ఆఖరిసారిగా కోమాలోంచి చూడడం కోసం ప్రముఖ విదేశీ డాక్టర్ బైనెట్ దీన్ని ఇటీవలే కనిపెట్టారు.

మరుక్షణం... ఆ విషయం గుర్తు రాగానే డాక్టర్ మల్‌హోత్రా గబగబా ఆపరేషన్ థియేటర్‌లోపలికి తిరిగి పరుగెత్తాడు. అతని ఆదేశం మేరకు లోపల హడావిడి మొదలయ్యింది. అంతా కలకలంగా వుంది. వెంటనే అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ నుండి సూపర్ ఐ.బి.ఎం. కంప్యూటర్‌ని తేవటానికి అసిస్టెంట్ డాక్టర్లు, ఆఫీస్‌బాయ్‌లు పరుగులు పెట్టారు.

యుద్ధ్‌వీర్‌కీ అర్థం కావటం లేదు పరిస్థితి. బైనెట్ టెక్నిక్ ప్రకారం ఆ పదిహేను సెకండ్లలో సౌరభ్ మాట్లాడలేదు. అలాంటప్పుడు ఆ విరుగుడు మందు ఫార్ములాని తనకు ఎలాచెబుతాడు? ఏమిటో అంతా అగమ్యగోచరం.. చీకటి.. ఎవ్విరిథింగ్ ఈజ్ డార్క్.

సౌగంధిక పరిస్థితి కూడా అదేవిధంగా వుంది. మరణం తప్పదని తెలిసి... ఆ బాధ భరించడం కంటే హింస ఇంకొకటి లేదు. మరణం అనివార్యమని తెలిసి గుండెలో పేగులు తెగుతున్నంత బాధ ఆమెలో.

ఆ పరిసరాల్లో వాయువు కూడా జడత్వం ఆవరించుకున్నట్లుంది... కదలిక మర్చిపోయినట్లుగా.

ఆ నిశ్శబ్దంలోంచి తిరిగి డాక్టరు మల్‌హోత్రా సౌగంధిక దగ్గరకు వచ్చాడు.

"బైనెట్ టెక్నిక్ అమలుపరచడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి యువర్ మెజిస్టీ... అన్నట్లు అతడు చనిపోతున్నాడన్న వార్తని మీకు ఎలా చెప్పాలోనని అసలు విషయం మర్చిపోయాను.

ఇందాక ఆపరేషన్ జరిగేముందు విశ్వసౌరభ్‌కి అనస్తీషియా ఇవ్వాలని ప్రయత్నిస్తే అంత బాధలోనూ అతను కళ్లు తెరిచాడు.

తనకు అనస్తీషియా ఇవ్వద్దని, తాను దేశాన్ని కాపాడే ఓ విషయం చెప్పాలని ఓ సెల్‌ఫోన్‌ని తెమ్మని అర్థించాడు.

మేము ఎంత చెప్పినా వినలేదు. దాంతో చేసేది లేక ఓ సెల్‌ఫోన్‌ని తెప్పించాము.

మేము ఓ పక్కన ఆపరేషన్ చేసి బుల్లెట్స్ తీసేస్తూంటే, అతడు తాపీగా సెల్‌ఫోన్‌లో తన మాటల్ని రికార్డు చేశాడు.

నిజంగా నా వైద్యజీవితంలో అలాంటి వ్యక్తిని నేను చూడలేదు. ఓ పక్క అతడి బాడీని పదిమంది డాక్టర్లు ఆపరేట్ చేస్తుండగా అతడు మాత్రం తన లక్ష్యాన్ని సాధించుకోవడం కోసం తన మాటలు రికార్డు చేసి కోమాలోకి వెళ్లిపోయాడు..." అంటూ ఆ సెల్‌ఫోన్‌ని సౌగంధిక చేతిలో పెట్టాడు.

తన గుండె కదలిక ఆగిపోతుందేమో అన్నట్లుగా వూపిరి పీలుస్తూ, కంపిస్తున్న చేతివేళ్లతో ఆ సెల్‌ఫోన్‌ని చేతిలోకి తీసుకుంది. ఆమె ముఖం నిండా చిరుచెమటలు.. అలాగే వణుకుతున్న చేతితో సెల్‌ఫోన్‌లో సౌరభ్ వీడియో ఫైలుని తెరిచింది.

మరుక్షణం అక్కడ విశ్వసౌరభ్ మాటలు ప్రతిధ్వనించసాగాయి.

**ఓ హృదయంలేని ప్రియురాలా,**

*ఆకాశంలో ఆడుతూ పాడుతూ చాలాకాలం తర్వాత తన నెచ్చెలిని కలుసుకోవడానికి వెళుతున్న రాయంచని తన బాణంతో కొట్టాడో బోయవాడు. ఫలితం ఆ రాయంచ రక్తసిక్తమైన శరీరంతో కొనూపిరి పీలుస్తోంది. ప్రస్తుతం నా పరిస్థితి ఇదే.*

*ప్రేమ ఒక తీయని కల. అది అందని పండు నాకు. ఓ ప్రియా! ఎప్పటికప్పుడు నిన్ను అందుకోవాలని ప్రయత్నిస్తే నీవు మటుకు జాబిల్లిలా ఆకాశంలో నాకందకుండా దోబూచులాడుతున్నావు. ఇంకా ఎంతకాలం నన్ను ఏడిపిస్తుంటావ్ ప్రియా ఇలా!*

*ఇక అలసిపోయాను ప్రియతమా! మరణ సరిహద్దులో వున్న నాకు నీతో జాబిల్లి ఆట ఆడుకునే శక్తిలేదు. జాబిల్లి ఎప్పుడూ ఆకాశంలోనే వుంటుంది. అది ఎప్పుడూ సామాన్యులకు అందదు అన్న విషయం తెలియక ఆరాటపడి భంగపడ్డాను.*

*చరిత్రలో జరిగే ప్రేమకథలన్నీ రాచరిక వ్యవస్థకూ, ఓ సామాన్యపౌరుడికి మధ్య జరిగిన సంఘర్షణలే. ఓ లైలా–మజ్నూ, ఓ రోమియో – జూలియట్, ఓ సలీం–అనార్కలి... ఇలా ప్రేమకథలన్నీ చివరకు విషాదంగా ముగిసినవే.*

*కానీ మన ప్రేమ కథ ఎప్పుడూ అలా ముగియకూడదని, సుఖాంతం కావాలన్న పట్టుదలతో ప్రేమ ఫార్ములాని ప్రయోగించి దేశాన్ని అతలాకుతలం చేశాను...ప్చ్... కానీ చివరికేమైంది?*

*ఓ రాచరిక వ్యవస్థ మీద విజయం సాధించలేని సామాన్యుడిగా ఓటమినంగీకరించి ఇదిగో ఇలా రక్తపు శరీరంతో పడున్నాను.*

*నాకు తెలుసు... ఓ డాక్టరుగా... ఇన్ని బుల్లెట్స్ తగిలిన నేను బతకనని. ఆపరేషన్ పేరుతో ఈ డాక్టర్లు కత్తులు, కటార్లతో నా శరీరం మీద స్వైరవిహారం చేస్తున్నారు. కానీ అనస్తీషియా కూడా తీసుకోని నాకు ఇసుమంత నొప్పికూడా లేదు.*

*ఎందుకంటే ఈ చివరి క్షణాలలో కూడా నీ తలపులే నన్ను మైమరిపిస్తున్నాయి.*

*ఎదురుగా వెన్నెల్లో తాజ్‌మహల్ కనిపిస్తూంటే, మల్లెపూల మంచమేసి నాపక్కన నీవుంటే... ఇలాంటి మధురమైన ఊహల ముందు ప్రాణంలేని కత్తులు, సూదులు నన్నేంచేస్తాయి ప్రియతమా? నా ప్రియురాలి 'ప్రేమమత్తు' ముందు ఏ అనస్తీషియాలు, క్లోరోఫామ్‌లు, ట్రాంక్విలైజర్లు పనిచేస్తాయి?*

*మరణం అంటే ఏమిటి? మనిషి లేకపోవటమేగా! నేను వుండను నీవు వుంటావు. నీ ప్రజలు, దేశం సుభిక్షంగా వుంటాయి. తాజ్‌మహల్ వుంటుంది. కుతుబ్‌మినార్ వుంటుంది. కాశ్మీరు కన్యాకుమారిలు మామూలే. యమునానది గలగల సాగుతూనే వుంటుంది. ఎటొచ్చీ నీ దేశ జనాభాలో 'సౌరభ్' అనే వ్యక్తి స్థానం ఖాళీగా ఉంటుంది.*

*దానివల్ల ఎవరికి నష్టం?*

*ఎందుకంటే నా కోసం వర్షించే నేత్రం లేదు. నా కోసం హర్షించే అధరం లేదు.*

*వెళ్లిపోతున్నాను ప్రియతమా! చేయని నేరం శిక్ష అమలు జరుపుతుంటే రక్తసిక్తమైన హృదయంతో వెళ్ళిపోతున్నాను. మృత్యుదేవత మందిరంలో సరదాల అగరొత్తులు వెలిగించడానికి చావు పల్లకీనెక్కి అనంతయాత్రకు తరలిపోతున్నాను. కనీసం నా డెడ్‌బాడీని చూడడానికయినా వస్తావా?*

*చివరిసారిగా చలనంలేని నా శరీరాన్ని దర్శించడానికైనా వస్తావా? లేక నా మీద కోపమా?*

*నీ మీద లవ్‌ఫార్ములాని నేనే ప్రయోగించానని నీలో ఇంకా అనుమానం మిగిలి వుందా? అదంతా నా పనేనని ఇంకా అపోహపడుతున్నావా?*

*నా ప్రేమ స్వచ్ఛం ప్రియా...! నా ప్రేమ పవిత్రం. నా ప్రేమ శాశ్వతం. నీ ప్రేమని గెలుచుకోవటానికి కొన్ని జన్మలైనా తిరిగి ఎత్తుతాను కానీ అక్రమమార్గంలో ఫార్ములా వుపయోగించి లొంగదీసుకునే నీచుడుని కాను! అన్నట్టు ఫార్ములా అంటే గుర్తొచ్చింది. దాని తాలూకు విరుగుడు మందు కోసమైనా నీవు ఉద్వేగంగా నా డెడ్‌బాడీని వెతుకుతావు! నేను పనికిరాకున్నా నా విరుగుడు మందు కావాలి కదూ!*

*లవర్స్ పార్కు, త్రివేంద్రం సముద్రతీరంలోని ప్రజల్ని కాపాడటానికి అది కావాలి కదూ! అరే ఇతడు అది చెప్పకుండా మరణించాడే అని తిట్టుకుంటావ్!*

*ఓ నా ప్రేమమయీ! ఈ దీనుడిని ఇంకా తిట్టుకోకు. ఇప్పటికే అయింది చాలు. ఆ విరుగుడు మందు సొల్యూషన్ చెపుతున్నాను.*

*కాస్త కార్బన్ డై ఆక్సైడ్, కొద్దిగా శరంటోస్ పెరాక్సైడ్ మిశ్రమాన్ని కలిపి తొంభై డిగ్రీల వేడిలో కరగబెడితే విరుగుడుమందు తయారవుతుంది.*

*ప్రేమ ఎప్పుడూ త్యాగాన్ని కోరుకుంటుంది. త్యాగాన్ని మించిన ప్రేమ లేదు. అందుకే నీ ప్రేమ సాక్షిగా మరణించేముందు ఆ విరుగుడు మందు ఫార్ములా చెప్పి అనంతలోకాల్లోకి వెళ్లిపోతున్నాను.*

*ఇక పాలించు నీ రాజ్యాన్ని! తరతరాలుగా నీ ప్రజల్ని మెప్పించి చరిత్రలో సమర్థురాలైన ప్రధానిగా పేరు తెచ్చుకో తల్లీ!*

*నేనొక ప్రేమ పిపాసిని. నిరంతరం నీ ప్రేమకై పాకులాడుతాను. మళ్లీ జన్మంటూ వుంటే ఈ దేశంలో పుట్టి మళ్లీ నీ ప్రేమ కోసం పాకులాడుతాను. నీ ఒడిలోని వెచ్చదనం, నీ స్పర్శలోని చల్లదనం, నీ ముద్దులోని కమ్మదనం కోసం.... తిరిగి ఎన్ని జన్మలైనా నీ కోసం పుడతాను. నీ కోసం మరణిస్తాను.*

*ప్రియా.... ఆఖరిగా నాదొక్క కోరిక. నేను మరణించాక నన్ను చూడడానికైనా రావూ?*

*బతికివున్నప్పుడు నా మీద నీకెప్పుడూ కరుణలేదు. కనీసం నేను చనిపోయాక నా డెడ్‌బాడీకి ఓ పూలదండైనా వేయవూ? కనీసం ఆ పూలదండ స్పర్శకైనా నా ప్రేమ కొద్దిగా పునీతం అవుతుందేమో!*

*అలా చేస్తే నేనిచ్చిన 'ఓ హృదయం లేని ప్రియురాలు' అన్న బిరుదుని వెనక్కి తీసుకుంటాను. నా ప్రేయసికి ఓ హృదయం వుంది ఆ హృదయానికి చలించే గుణం వుంది అన్న తృప్తితో నా ఆత్మ పరలోకానికి వెళుతుంది.*

*మళ్లీ కలుసుకుందాం... వచ్చే జన్మలో...*

*ఇట్లు*
*ఈ జన్మలో ఓటమి నంగీకరించి*
*అలసి సొలసి వెళ్లిపోతున్న*
*నీ విశ్వసౌరభ్*

సెల్ ఆగిపోయింది చప్పున.

సరిగ్గా అదే సమయంలో –

డాక్టర్ మల్హోత్రా బయటికి వచ్చాడు.

"బైనెట్ టెక్నిక్ అమలుపరచడానికి అని ఏర్పాట్లు పూర్తయ్యాయి. లోపలికి రండి.." అన్నాడు.

కలలో నడుస్తున్నదానిలా ముందుకు నడిచింది సౌగంధిక. ఆమె కళ్ళలో 'తడి' మెరుస్తోంది. జీవితంలో ఎంత మధురంగా ప్రవేశించి, ఎంత దుఃఖంతో తప్పుకో బోతున్నాడు విశ్వసౌరభ్.

ఎదురుగా బెడ్ మీద విశ్వసౌరభ్ దేహం కనిపిస్తోంది.

ఏవో స్వాప్నిక తీరాలలో విహరిస్తున్నట్లుగా అతడి ముఖం ప్రశాంతంగా, నిర్మలంగా వుంది. కంప్యూటర్‌కి అటాచ్ చేయబడిన అతడి చెయ్యి వెళ్లొస్తాను మిత్రమా' అని సెల్యూట్ చేస్తున్నట్లుంది.

ఆమె అతడినే చూస్తోంది. ఓ నిశ్శబ్ద పవనం విషాదగీతాన్ని ఆలపిస్తున్నట్లుగా ఇద్దరిమధ్య నుండి వెళ్లిపోయింది. అమరత్వం సిద్ధించిన రుషిలా వింత ఛాయతో వెలిగి పోతున్న విశ్వసౌరభ్‌కి స్వాగతం పలుకుతున్నట్లు వున్నాయి ఆ థియేటర్ లైట్లు.

అంత విషాదంలోనూ గంభీరంగా కదిలింది డాక్టర్ మల్‌హోత్రా కంఠం.

"నౌ... ది ఆపరేషన్ బిగిన్స్... విశ్వసౌరభ్ స్పృహలోకి వస్తున్నాడు... కేవలం పదిహేను సెకండ్లు..."

కంప్యూటర్ కీబోర్డు మీద కదిలింది డాక్టర్ మల్‌హోత్రా చేయి. మరుక్షణం కంప్యూటర్ డిజిటల్ వాచ్ టైమ్‌ని చూపించసాగింది.

10.00

అప్పుడు...

చిన్నగా కదిలాడు విశ్వసౌరభ్ బెడ్ మీద.

ఊపిరి బిగపట్టి చూస్తున్నారు సౌగంధిక, యుద్ధవీర్‌లు కంటిరెప్పని కూడా అర్పకుండా.

10.01

కళ్ళు తెరిచిన విశ్వసౌరభ్ కళ్లు ఒక్కసారిగా మెరిశాయి.

ఎదురుగా తన ప్రేమదేవత సౌగంధిక.

10.02

అప్పుడు నవ్వింది సౌగంధిక వరమీయవచ్చిన దేవతలా.

10.03

అతడి కళ్లలో నీటి తెర. కరుణించింది తన దేవత. తన తపస్సు ఫలించింది. తన జన్మ సార్థకమైంది.

10.04

అతడి కళ్ళలో నీటి తెరని చూసి ఆమె గుండె కరిగింది. మనసు ఆర్ద్రమైంది. ఎంత కాదనుకున్నా అతడి ప్రేమ తనకి ఓ మరపురాని అనుభూతి. అతడి మరణం విద్యుద్ఘాతం.

10.06

మరుక్షణం ఓ భావోద్వేగపు కెరటం మిన్నులా ఎగసిపడింది. ఓ ఆత్మీయపు వీచిక తుఫానులా మారి చుట్టేసింది. ఓ అనురాగపు బిందువు వరదై, ఉప్పెనై ముంచేసింది. తమకంగా అతడి తలని తన గుండెలకు బలంగా అదుముకుంది.

10.09

"ఐ లవ్ యూ సౌరభ్... ఐ లవ్‌యూ సౌరభ్..."

ఆమె నోట్లోంచి వెలువడిన ఆ మాటలు ఆ గదిలో పరిమళాల్లా వ్యాపించాయి.

ఓ అద్భుతాన్ని తానింతవరకూ అనుభవించని ఓ చిత్రమైన అనుభూతిని, తన జీవితంలో కోల్పోయి దానిని తిరిగి తెస్తూ వసంతరాత్రి మల్లెతోటల నుంచి మత్తుగా వీచే గాలితెమ్మెరల్లా అనిపిస్తున్నాయి ఆమె పదాలు అతనికి.

10.11

"ఐ లవ్ యూ... ఐ లవ్ యూ సౌరభ్... నన్ను వదిలి వెళ్ళకు..... ఐ లవ్ యూ..."

అతని మీద పడి రోదిస్తోంది ఆమె. ఆమె కళ్లలోని కన్నీళ్లు తెగి అతడి తలని అభిషేకిస్తున్నాయి.

10.13

హాయిగా తీయగా అతని గుండెలోతుల్ని స్పృశిస్తూ, ఏవో సిల్కుతెరలు మనసులోంచి ఒక్కొక్కటే విడిపోతున్న భావన.

10.15

"ఐ లవ్..." తిరిగి కదలబోయిన ఆమె ఆగిపోయింది విశ్వసౌరభ్ కళ్లు మూసుకు పోవడంతో.

డిజిటల్ వాచ్ తన పని ముగిసినట్లుగా కాలాన్ని చూపించటం ఆపేసింది.

ప్రక్షాళితమైన ఆమె హృదయం ఒక్కసారిగా నిశ్చేష్ఠతకు గురైనట్లుగా వేదన. ఈ లోకమనే నాటక రంగంలో తన పాత్ర ఏమిటో మర్చిపోయినట్లుగా శూన్యంలోకి చూస్తోంది.

ఆమె స్థితిని అర్థం చేసుకున్నట్లుగా ఆ గదిలోంచి అంతా బయటికి వెళ్లిపోయారు.

ఒక్కసారిగా బావురముంది సౌగంధిక... విశ్వసౌరభ్ శవం మీద పడి. అతని మొహాన్ని ఆర్తిగా తన అరచేతిలోకి తీసుకుంది.

*సంవత్సరాలు... సంవత్సరాలుగా బ్యూరోక్రసీ, ప్రొటోకాల్‌ల మధ్య మరుగున పడ్డ ఆమెకు అప్పుడొచ్చింది దుఃఖం ఆనకట్ట తెగినట్లుగా.*

# 37

తన జీవితంలో సంఘటనలు ఎందుకంత వూహించలేనంత వేగంగా జరిగి పోతున్నాయో అర్థం కాలేదు యుద్ధవీర్‌కి.

మూడు రోజులు గడిచినా సౌగంధికకు ఆ లవ్ డిసీజ్ అంటించిన వ్యక్తి ఎవరో తెలియలేదు. పైగా దానికి విరుగుడు మందు తీసుకురాబోయిన విశ్వసౌరభ్‌ని దుండగులు కాల్చివేశారు.

కాల్చివేశాక అతడి నుండి ఆ విరుగుడు మందుని లాక్కుపోదామని ప్రయత్నించిన దుండగులు తుపాకీ చప్పుళ్ళకి చకచకా ముందుకి వచ్చిన పి.ఎమ్. సెక్యూరిటీ స్టాఫ్‌ని చూసి భయపడి కిందపడ్డ సౌరభ్‌ని వెతికే ప్రయత్నం మాని వ్యాన్‌లో పారిపోయారు.

హాస్పిటల్‌కి తీసుకెళ్ళిన సౌరభ్ చనిపోయాడు. సౌగంధిక డీప్ షాక్‌లో వుంది. ఇంతవరకూ దీని వెనకాలున్న వ్యక్తి ఎవరో తెలియరాలేదు. తనకే సిగ్గుగా వుంది వారిని పట్టుకోలేకపోయినందుకు.

ఇక లాభం లేదు. ఈ విషయం తానే ఎలాగైనా తేల్చాలి. లేకపోతే జాయింట్ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాలి అనుకుంటూ సి.ఎం. బంగళాకేసి బయలుదేరాడు.

అతన్ని చూస్తూనే స్టడీగా నిలబడి సెల్యూట్ చేశారు సెక్యూరిటీ స్టాఫ్. అతడు తలపంకిస్తూ లోపలికి నడిచాడు. నేరుగా సి.ఎం. విజిటర్స్ రూం రిసెప్షనిస్టు దగ్గరకు వెళ్ళి మూడు రోజుల క్రితం విజిటర్స్ లిస్ట్, రిజిస్టరు, మిగతా పుస్తకాలు తీసుకున్నాడు. అక్కడే వున్న సోఫాలో కూర్చుని ఒక్కొక్క పుస్తకాన్ని నిశితంగా పరిశీలించసాగాడు. విజిటర్స్ లిస్ట్, రిజిస్టరు పూర్తయ్యాక మెటల్ డిటెక్టర్ అందజేసిన కంప్యూటర్ స్లిప్‌లు పరిశీలించ సాగాడు.

ఒకటి... రెండు...

మూడు... క్షణాలు కదులుతున్నాయి అక్కడ.

మెటల్ డిటెక్టర్ కంప్యూటర్ స్లిప్‌ని విజిటర్ రిజిస్టరుతో పోల్చిచూశాడు.

మరుక్షణం... అతడి భృకుటి ముడిపడింది. వెంటనే మరోసారి పోల్చిచూశాడు.

ఆశ్చర్యం! ఒక అంకె తేడా వస్తోంది.

ఆ రోజు ప్రధానిని కలుసుకున్నవారు విజిటర్స్ రిజిష్టర్‌లో 17 మంది కాగా, మెటల్ డిటెక్టర్‌లోంచి వెళ్ళిన వ్యక్తులు 18 మంది వున్నారు. మైగాడ్! అదెలా సంభవం? ఎక్కడ జరిగింది పొరబాటు?

మరుక్షణం అతని ఆదేవంతో అప్పటికప్పుడే రిసెప్షనిస్ట్ అక్కడకు పిలిపించబడ్డాడు.

"ఇదెలా సంభవం? ప్రధానిని కలిసినవారు 18మంది కాగా, రిజిస్టర్‌లో 17మందే ఎలా ఎంటర్ అయ్యింది? ఆ సమయంలో నీవేం చేస్తున్నావు?"

రిసెప్షనిస్ట్ గాభరాపడ్డాడు. రెండు పుస్తకాలూ తనూ తనిఖీ చేశాడు నిజమే! ఒక సంఖ్య తేడా వస్తోంది.

“ఆ! గుర్తొచ్చింది సార్... ఆ రోజు అందరికంటే ఆఖరుగా వచ్చారు పార్టీ కమిటీ ప్రెసిడెంట్ త్రిపాఠిగారు. తనతోపాటు ఇంకో వ్యక్తిని తీసుకొచ్చారు ఆయన. ఆ వ్యక్తి పేరు కూడా రిజిస్టరులో రాయమని అడిగాను సార్. కానీ త్రిపాఠిగారు ఫర్వాలేదు, పని నాదే. అతన్ని జస్ట్ ప్రధానికి పరిచయం చేద్దామని తీసుకొచ్చాను, అని ఎంత చెప్పినా వినకుండా మెటల్ డిటెక్టర్ ద్వారా లోపలికి తీసుకెళ్లారు సర్. సరే ఆయన పార్టీ కమిటీ ప్రెసిడెంట్ కాబట్టి గొడవలు వస్తాయేమోనన్న భయంతో వదిలేశాను”.

దిగ్గున లేచాడు యుద్ధ్‌వీర్ సోఫాలోంచి.

వెంటనే ఫోన్ చేతిలోకి తీసుకొని త్రిపాఠి నెంబరుకి రింగ్ చేశాడు. రిసెప్షనిస్ట్ భయంగా, ఉద్వేగంగా చూస్తున్నాడు.

అవతలి నుంచి ఫోన్ రింగవుతోంది. ఎవరూ ఎత్తడంలేదు.

ఆశ్చర్యం యుద్ధ్‌వీర్‌లో... దానితో పాటు అనుమానం కొద్దికొద్దిగా ఊపిరి పీల్చుకుంటోంది. విజిటర్స్ రిజిష్టరులో తనతో కూడా వచ్చిన వ్యక్తి విజేంద్రప్రసాద్ అని, అతన్ని యు.పి. స్టేట్‌కి పార్టీ నాయకుడుగా నియమిద్దామని చెప్పినట్లుగా సి.ఎమ్. విజిటర్స్ మినిట్స్ రికార్డు చేసింది.

ఫోన్ డిస్కనెక్టు చేసి పార్టీ కమిటీ ఆఫీసుకు ఫోన్ చేశాడు.

“యు.పి. పార్టీ ప్రెసిడెంటు విజేంద్రప్రసాద్ ఇక్కడే వున్నారా?”

“ఒక్క నిమిషం... కనుక్కుని చెప్తాను” అవతలి గొంతులో ఎంతో వినయం.

ఒక్కో క్షణం గడిచిపోతుంది.

నుదుటి మీద పొటమరిస్తున్న చెమటని తుడుచుకోవడం కూడా మర్చిపోయినట్లుగా ఎదురుగా కనిపిస్తున్న గ్రే కలర్ వాల్ మీద నిలిచిపోయాయి యుద్ధ్‌వీర్ చూపులు.

చెవులు మాత్రం రిసీవరులోంచి రాబోయే జవాబు కోసం చూస్తూ.

మరో పది సెకండ్ల తర్వాత వినపడిందా కంఠం.

“ఉన్నారు సార్! హోటల్ రాజధానిలో రూమ్ నెంబర్ 204లో వున్నారు సార్.”

వెంటనే కదిలాడు యుద్ధ్‌వీర్ వేగంగా తన మిలటరీ జీప్‌కేసి.

జీపు పది నిమిషాల్లో హోటల్ రాజధాని ముందు ఆగింది.

అతడు చకచకా లిఫ్ట్‌లోకి ప్రవేశించి, సెకండ్ ఫ్లోర్‌లోకి అడుగుపెట్టాడు.

ఎదురుగా కనిపిస్తున్నాయి రూమ్ నెంబర్లు 201, 202, 203, 204, అక్కడే ఆగిపోయాడు.

రూమ్ 204ముందు నిలబడి కాలింగ్‌బెల్ నొక్కాడు. మరో పది క్షణాల తర్వాత తెరుచుకుంది డోరు.

"విజేంద్రప్రసాద్ కావాలి..."

"రండి లోపలికి" అంటూ ఆహ్వానించాడు ఆ వ్యక్తి.

లోపలికి నడిచాడు యుద్ధ్‌వీర్. అక్కడ భారీ విగ్రహంతో, బొద్దు మీసాలతో కూర్చుని వున్నాడు ఓ వ్యక్తి.

"ఐ యామ్ విజేంద్రప్రసాద్! మీరు...?"

"యుద్ధ్‌వీర్! ఛైర్మన్ ఆఫ్ జాయింట్ ఇంటిలిజెంట్ స్టీరింగ్ కమిటీ."

ఒక్క క్షణం టపటపా కొట్టుకున్నాయి అతడి కనుబొమలు.

"ఈ నెల 26తారీఖున మీరు ప్రధానిని కలిశారా?"

"అవన్నీ పార్టీ విషయాలు మీకు చెప్పాల్సిన అవసరం లేదు..."

జేబులోంచి పిస్టల్ తీశాడు యుద్ధ్‌వీర్.

"ఇది చూశారా? బ్యూరోక్రసీకి అచ్చమైన చిహ్నం ఇది. మీలాంటి రాజకీయ నాయకుల్నెలా వంచాలో దీనికి తెలుసు. మర్యాదగా చెప్తారా లేక నా దారిలోనే పొమ్మంటరా? చెప్పండి.."

కొద్దిగా వణికాడు విజేంద్రప్రసాద్.

"నేను ప్రధానిని ఇప్పటివరకూ కలవలేదు.

"అలాంటప్పుడు యు.పి. పార్టీ ప్రెసిడెంట్‌గా మిమ్మల్ని ఎలా నియమించారు?"

"అదంతా త్రిపాఠి సాబ్ గొప్పతనం. తానే నన్ను పార్టీ చీఫ్‌గా నియమించాడు. తానే ప్రధానితో మాట్లాడి వస్తానని ఆ రోజు. అదే 26వ తేదీన వెళ్లారు. ఓ గంటలో తిరిగొచ్చి నేను యు.పి. పార్టీ చీఫ్‌గా ఎలక్ట్ అయినట్లుగా చెప్పాడు.."

"మైగాడ్!" దిగ్భ్రాంతి యుద్ధ్‌వీర్‌లో.

దీని వెనకాల వున్నది ఆ కురువృద్ధుడా?

అతడేనా విజేంద్రప్రసాద్ పేరు మీద ఆ వ్యాధి వున్న వ్యక్తిని తీసుకొని ప్రధానికి ఆ వ్యాధిని వ్యాపింపజేసింది? అతడేనా? విశ్వసౌరభ్‌ని చంపించింది?

ఓ నిశ్చయానికి వచ్చిన యుద్ధవీర్ వేగంగా కదిలాడు.

# 38

సరిగ్గా అదే సమయంలో –

లోక్‌పాండ్ గెస్ట్‌హౌస్‌లో శోకతప్తహృదయంతో వున్న సౌగంధిక అడుగుల చప్పుడు వినిపించ తలెత్తింది.

ఎదురుగా త్రిపాఠి!

"రండి... రండి... కూర్చోండి" అంత దుఃఖంలోనూ ఆయనకు ఎదురెళ్లి ఆహ్వానించింది. తనతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలని ఆయన లోక్‌పాడ్ గెస్ట్‌హౌస్‌కి రమ్మని చెప్పాడు. తామిద్దరూ ఏది మాట్లాడుకోవాలన్నా అక్కడ కలుసుకోవడం ఆనవాయితీ.

త్రిపాఠి కూర్చొని ఆమె వంక చూశాడు.

ఈ రెండు రోజుల్లో చాలా నలిగిపోయింది.

"ప్చ్... నాకు ఏ.సీ. పడడం లేదు. గెస్ట్‌హౌస్ వెనకాల వున్న లాన్‌లో కూర్చుందాం పదమ్మాయ్" అంటూ లేచాడు.

ఆ గెస్ట్‌హౌస్ వెనకాల పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా వుంటుందా లాన్.

అయినా ఆయన మాటలను కాదనలేక లేచింది. ఆయన ఏదన్నా ముఖ్యమైన విషయం చెప్పబోతున్నారేమోనని అనుకుంది.

లాన్‌లోని చెట్లన్నీ ఆమెవంకే విషాదంగా చూస్తున్నాయి. ఆమె ముందుకు నడుస్తూ కాలికేదో తగిలి తూలి పడబోయింది. అతి కష్టంమీద నిలదొక్కుకుని వెనక్కి తిరగబోయింది.

సరిగ్గా అప్పుడు...

చల్లగా తగిలిందామె తలకు.

రివాల్వర్.

"మై...గా.....డ్..." రివాల్వర్‌ని తనకేసి గురిపెట్టిన పార్టీ ప్రెసిడెంట్ త్రిపాఠిని చూస్తూ లక్ష ఓల్టుల ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లుగా సౌగంధిక శరీరం ఎగిరిపడింది.

కలలో కూడా ఊహించని పరిణామం ఆమెకది!

స్ప్లిట్ సెకండ్‌లో తన పక్కన గ్రెనేడ్ పేలుతుందని తెలిసినా అంత షాక్‌కు గురై వుండేది కాదేమో! అడుగు ముందుకు వేసే శక్తి కోల్పోయినట్లుగా అలాగే నిల్చుండిపోయింది... చుట్టూ కదులుతున్న గాలి మృత్యువులా తనని చుట్టుముడుతున్నట్లని పిస్తుంటే!

డబ్బాలో గులకరాళ్ళు వేసి గుమ్మరించినట్లుగా నవ్వాడు త్రిపాఠి... పిస్టల్‌ని ఆమెకేసి గురిపెడుతూ, ఆనందం ఎక్కువైతే కలిగే నవ్వది.

షాక్‌తో మొద్దుబారిన ఆమె మెదడులో వేయి ప్రశ్నలు, లక్ష అనుమానాలు.

'మైగాడ్! కిరాతకులైన నలుగురు మాజీమంత్రులు, ప్లస్ మాఫియా లీడర్లు అయిన వారినే అనుమానించింది కానీ, తెర వెనకాల ఇంత కథని నడిపించింది ఇతడేనని కలలో కూడా అనుకోలేదు.

ఆమె ఆలోచనల గట్టు తెగింది. త్రిపాఠి కర్కశ గొంతుధాటికి.

"సౌగంధికా! నిన్ను ఎలా చంపాలా అని చాలా రోజులుగా ఆలోచిస్తున్నాను. ఎన్నో మార్గాలు కనిపించాయి. కానీ... నీ అదృష్టం బాగుండబట్టి ప్రతిసారీ నీవు తప్పించుకుంటున్నావు. ఈసారిమటుకు నిన్ను ఏ మానవ మాత్రుడూ కాపాడలేడు..."

తిరిగి కదిలింది త్రిపాఠి కంఠం.

"నీవు సస్పెన్స్‌లో కొట్టుమిట్టాడుతుంటావ్. అసలు ఇంత అద్భుతమైన డ్రామా నేనెలా సృష్టించానా అని, సాధారణంగా ఉరి తీసేముందు ఖైదీని అడుగుతారు నీ కోరిక ఏమిటని. అలాగే నీవు అడక్కపోయినా నిన్ను చంపేముందు నీకో వరం ఇస్తున్నాను. అది... మొత్తం జరిగిందంతా నీకు చెప్పి, ఆ తర్వాత నిన్ను పరలోకానికి సాగనంపుతాను."

అర్థమైంది సౌగంధికకు... మృత్యువు అనివార్యమని, కాకపోతే కాస్తంత సమయం వుందని.

ఆమెలో కదిలిన ఊహకు అడ్డుకట్ట వేస్తున్నట్లుగా త్రిపాఠి గొంతు కదిలింది.

"అసలు ఈ కథకు ప్రారంభం ప్రధానమంత్రి పదవి మీద నాకు కలిగిన వ్యామోహం. పార్టీలో సీనియర్ లీడర్ అయిన నేను ఎప్పటికైనా ప్రధాని పదవిని అధిష్ఠించాలని నా ప్రగాఢ కోరిక.

నిజానికి మీ తాత రామ్మోహన్‌రాయ్ తర్వాత నేనే ప్రధానమంత్రిని కావాల్సింది. కానీ మీ తాత ఆ పదవిని ఎలాగైనా తన వంశీయులకే ఇవ్వాలని మీ నాన్నగారిని అప్పజెప్పారు. చేతికి దొరికిన పెన్నిధి చేజారిపోతూ వుంటే నాకు కసి పెరిగింది.

ఎప్పటికైనా ఆ పదవిని ఆక్రమించాలన్న పట్టుదల మరింతగా పెరిగింది. దాంతో మీ నాన్నగారు బయలుదేరిన ఫ్లయిట్‌లో బాంబు పెట్టించి ఆయనను పైకి పంపించాలని ప్లాన్ వేశాను.

కానీ చావుబతుకుల్లో వున్న ఆయన హైదరాబాద్ నుండి నిన్ను ఢిల్లీకి పిలిపించి ప్రధానిని చేశారు. అలా రెండోసారి ఘోరంగా దెబ్బతిన్నాను నేను."

ఒక్కక్షణం కళ్ళు పెద్దవి చేసి ఆయన వైపే చూస్తుండిపోయింది సౌగంధిక. "మై గాడ్! తన తండ్రిని చంపించింది ఈయనేనా?'

ఆమె ఆలోచనల్ని చీల్చుతూ సర్రున కదిలింది త్రిపాఠి గొంతు.

"సరే నీవు ప్రధానివి అయ్యావు. రోజురోజుకూ ప్రజల దృష్టిలో అభిమానం సంపాదించుకుంటున్న నిన్ను కూడా మట్టుపెట్టాలని ప్రయత్నించాను. ఉహూ! లాభం లేకపోయింది.

నీ అదృష్టమో, నా దురదృష్టమో గానీ ఆ హత్యా ప్రయత్నాలన్నీ విఫలం అయ్యాయి. సరిగ్గా అలాంటి సమయంలో బయటపడింది విశ్వసౌరభ్ ఫార్ములా..." ఓ క్షణం ఆగాడు ఊపిరి పీల్చుకోవడానికి.

తిరిగి కర్కశంగా ప్రతిధ్వనించింది ఆయన గొంతు అక్కడ. "అతడి ఫార్ములా దెబ్బతో ప్రజలలో నీ పలుకుబడి క్షీణించి రాజీనామా చేస్తావని ఎదురుచూశాను. కానీ... నీవు ఆ పరిస్థితిని ఎదుర్కోవటానికే సిద్ధమయ్యావు. అందుకే ఎలాగైనా నిన్ను సమస్యల్లోకి ఇరికించాలనుకున్నాను. కానీ... ఎప్పుడయితే విశ్వసౌరభ్ తన ఫార్ములాకి విరుగుడు మందు వుందని టీవీల్లో చెప్పాడో అప్పుడు నాకు మతిపోయింది.

ఆ విరుగుడు మందు సహాయంతో నీవు దేశ క్లిష్టపరిస్థితి నుండి తేలికగా బయట పడతావని అర్థమైంది. సరిగ్గా అప్పుడు ఆలోచించాను ప్లాన్ నెంబర్ టూ...." అంటూ ఆగాడు త్రిపాఠి.

సౌగంధికలో నిశ్చేష్టత. మైగాడ్! లవ్ ఫార్ములా వెనుక కూడా ఈయన డ్రామా వుందా?

తిరిగి కదిలింది ఆయన కంఠం అక్కడ.

"ప్లాన్ నెంబర్ టూ ప్రకారం – లవర్స్ పార్కులో జబ్బు అంటి పారిపోయినవారిలో కౌలేకర్ అనే వ్యక్తిని పట్టుకున్నాను. ఆ వ్యక్తి ద్వారా నీకు ఆ జబ్బుని అంటించాను. ఆ తరువాత కౌలేకర్‌ని చంపేశాను.

ఒకసారి ఆ జబ్బు అంటాక నీవు రిజైన్ చెయ్యక తప్పదని నాకు తెలుసు. కానీ... నీవు ఈసారి కూడా నాకు నిరాశే మిగిల్చావు.

విశ్వసౌరభ్ ద్వారా ఆ జబ్బుకు విరుగుడుమందుని తెప్పించుకునే ఏర్పాటు చేశావు. దాంతో తిరిగి నేను ఆలోచించాను ప్లాన్ నెంబరు త్రీ. దాని ప్రకారం – విశ్వసౌరభ్‌ని ఆ విరుగుడుమందు నీకు ఇవ్వకముందే చంపేసి, ఆ మందుని మేము వెనక్కి తీసుకెళ్ళడం. కానీ... ఇక్కడ నా ప్లాన్ కొద్దిగా దెబ్బతింది.."

శరీరంలోని రక్తనాళాల్లో కదలిక ఒక్కసారిగా ఆగిపోయినట్లుగా స్తంభించిపోయింది సౌగంధిక. ఇటీజ్ హారిబుల్!.... విశ్వసౌరభ్‌లాంటి అమాయకుడ్ని అన్యాయంగా పొట్టనబెట్టుకున్నాడు.

ఆమె ఆలోచనల్ని బద్దలు కొడుతూ తిరిగి కదిలింది త్రిపాఠి కంఠం.

"అతడిని చంపటం విజయవంతంగా పూర్తిచేశాను. కానీ విరుగుడు మందుని వెనక్కి తీసుకోలేకపోయాము. దాన్ని మేము హస్తగతం చేసుకుందామని ప్రయత్నించేలోపు నీ అనుచరగణం అక్కడకు పరుగెత్తుకు రావడంతో మావాళ్లు వెనక్కి తిరిగారు.

నిజానికి విశ్వసౌరభ్‌ని మధ్యలోనే దారికాసి చంపుదామనుకున్నాం. కానీ వేషం మార్చిన అతడ్ని గుర్తించలేకపోవడంతో ఆఖరి స్టేజైన ప్రధాని బంగళాకు రెండు ఫర్లాంగుల ముందు అతణ్ణి చంపగలిగాము. కానీ అతడిని చంపినా ఆ విరుగుడు మందుని తేలేకపోవడం వల్ల నా ప్లాన్ విఫలమైంది. అందుకే...."

ఓ క్షణం ఆగి కదిలింది ఆయన కంఠం.

"నిన్ను పదవి నుండి దింపే దారులన్నీ మూసుకుపోవడంతో ఆఖరికి మాస్టర్ ప్లాన్ వేశాను. అదేమిటంటే – విశ్వసౌరభ్ చనిపోయిన దుఃఖంలో వున్న నిన్ను చంపటం. ఆ తర్వాత ప్రజల దృష్టిలో 'తన ప్రియుడు విశ్వసౌరభ్ చనిపోవటంతో ఆ వియోగాన్ని భరించలేక ప్రధాని సౌగందిక ఆత్మహత్య చేసుకుంది' అని నమ్మేటట్లుగా కథని అల్లడం.

హాస్పిటల్లో నీవు విశ్వసౌరభ్ మీద పడి దుఃఖించడం లాంటి దృశ్యాలన్నీ టీవీల్లో, పేపర్లలో రావడం వల్ల జనాలు తేలిగ్గా ఆ మాటలు నమ్ముతారు. ఆ తర్వాత ప్రధానిగా నేను ఆ కుర్చీలో కూర్చుంటాను.. ఎలా వుంది నా మాస్టర్ ప్లాన్?" రివాల్వర్ని సూటిగా ఆమెకేసి గురిపెడుతూ అడిగాడు.

ఊపిరి బిగపట్టి అలాగే చూస్తుండిపోయిందామె మెదడు స్తంభించిపోతుంటే. తాను సరిగ్గా పులినోట్లో తల పెట్టింది. ఇక పులి తనని చంపడమే ఆలస్యం. క్షణాలు గడుస్తున్నాయి... ఉద్వేగంతో...

ట్రిగ్గర్ మీద బిగుసుకుంటోంది. త్రిపాఠి చూపుడువేలు పేలడానికి సిద్ధంగా. అర్థమైంది సౌగంధికకు – తన జీవితం ముగియబోతోందని.

క్షణం పొరలు పొరలుగా విడివడుతోంది... ఆమెని మృత్యువుకి దగ్గరదగ్గరగా నెడుతూ.

సరిగ్గా అప్పుడు –

దబ్బున ఏదో చప్పుడు కావటంతో ఉలిక్కిపడి అటు తిరిగాడు త్రిపాఠి.

అదే సమయంలో – మెరుపువేగంతో అతని చేతిలోని పిస్టల్‌ని ఎగరగొట్టి తన చేతిలోని పిస్టల్‌ని అతనికి గురిపెట్టి నవ్వాడు యుద్ధ్‌వీర్.

"నాకు తెలుసు... నీవు ఇక్కడకు వస్తావని. అందుకే నీ మూవ్‌మెంట్స్ మీద ఓ కన్ను వేసుంచాను. నీవు ఇక్కడకు వచ్చావని తెలియగానే వెనుక ద్వారం నుండి లాన్‌లోకి వచ్చాను. అనుకున్నట్లుగానే రెడ్‌హ్యాండెడ్‌గా దొరికావు."

సరిగ్గా అప్పుడే చకచకా మిగతా సెక్యూరిటీ స్టాఫ్ అక్కడకు అడుగుపెట్టడం, త్రిపాఠి చేతికి సంకెళ్ళు వేసి బయటకు తీసుకెళ్ళడం జరిగిపోయాయి.

# ఉపసంహారం

"మనుషుల పట్ల నేను పెంచుకున్న నమ్మకాలే నన్ను అసలు అటువైపు ఆలోచించకుండా చేశాయి. దీనకంతటికి కారణం... 'త్రిపాఠి' అని కలలో కూడా అనుకోలేదు" అంది సౌగంధిక.

సాఫీగా వున్న రోడ్డు మీద ప్రధాని కంటెస్సా సర్రుమని దూసుకుపోతోంది.

యుద్ధ్‌వీర్ చేతిలో వుంది స్టీరింగ్.

ముందు రెండు, వెనకాల రెండు బుల్లెట్‌ల మీద బ్లాక్ క్యాట్ కమెండోలు అనుసరిస్తుండగా కారు వేగంగా ప్రయాణిస్తోంది.

"అదంతా గతం. జరిగిందేదో జరిగింది" యుద్ధవీర్ కంఠం వేగంగా కదిలింది. "కానీ మీరు ఇలా దేశాన్ని వదిలేసి... ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీగా వెళ్లడమే నాకు నచ్చలేదు. ఇప్పుడు ఈ దేశంలో ప్రశాంతంగా వుండవచ్చు కదా?"

"సారీ నేను వుండలేను" కన్నీళ్లు సౌగంధికలో.

"విశ్వసౌరభ్. అతడి ప్రేమ గుర్తొచ్చినా మనస్సు కకావికలమయిపోతోంది. ఇక్కడున్నంతసేపూ అతడి జ్ఞాపకాలు, అతడి ఆరాధనే గుర్తుకొచ్చి నేను స్థిమితంగా ఉండలేను. అతడి ప్రేమని చాలాకాలం నిర్లక్ష్యం చేసి ఒక రకంగా అతడి చావుకి నేనే కారణమేమోనన్న రంపపుకోత నా హృదయాన్ని తూట్లు పడేస్తోంది. బతికున్నప్పుడు అతడి ప్రేమని గుర్తించి అన్యాయం చేశానేమోనన్న టార్చర్ నా మనసుని మెలిపెడుతోంది. ఇలాంటి పరిస్థితులతో నేను ఈ దేశంలో ప్రశాంతంగా వుండలేను."

"కానీ ... కానీ... రాజకీయాల్లో ఏమీ తెలియని నన్ను ప్రధానిగా చేయటమే అసలు బాగోలేదు" నిష్ఠూరంగా అన్నాడు యుద్ధ్‌వీర్.

"ఈ దేశానికి కావాల్సింది నీలాంటివారే యుద్ధ్‌వీర్!' స్థిరంగా కదిలిందామె కంఠం. "దేశానికి ఒక సమస్య ముంచుకొచ్చినప్పుడు వెరవక గుండెనిబ్బరంతో ఎదుర్కొనే నీలాంటి ఫెరోషియస్ పీపుల్ ఈ దేశానికి కావాలి.

నిజానికి దేశాన్ని త్రిపాఠికి అప్పజెప్పి, నేను ఐక్యరాజ్యసమితికి వెళ్లాలన్న నిర్ణయం రెండు రోజుల క్రితమే తీసుకున్నాను.

కానీ ఆ ముసలాడు త్రిపాఠి తన గొయ్యి తానే తవ్వుకున్నాడు. దాంతో తర్వాత ప్రధానికి కావాల్సిన సమర్థుడెవరా అని చూస్తే నిన్ను మించినవారు కనిపించలేదు. నా మంత్రిమండలి, నా ఎం.పీ.లు నేను నీ విషయం చెప్పగానే అంగీకరించారు. దాంతో పి.ఎం. పదవికి నీ పేరు ఖరారు అయిపోయింది."

కారు ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు సమీపిస్తోంది.

అప్పటికే విలేఖరులు, ప్రెస్ ఫోటోగ్రాఫర్స్ అక్కడ కిక్కిరిసి వున్నారు.

దూరంగా బారికేడ్లని తోసుకుంటూ జనం ముందుకు రావాలని ప్రయత్నిస్తున్నారు. వారిని అదుపులో పెట్టలేక పోలీసులు సతమతమవుతున్నారు.

కారు ఎయిర్‌పోర్టు పోర్టికోలో ఆగింది. ఓ బ్లాక్ క్యాట్ కమెండో పరుగున వచ్చి వెనక డోరు తెరిచాడు.

సౌగంధిక అడుగుపెట్టింది మెల్లగా బయటికి. మరుక్షణం ప్రెస్ రిపోర్టర్ల చేతిలో కెమెరా ఫ్లాష్‌లు తళుక్కుమన్నాయి విరామం లేకుండా.

తెల్లటి చీర, తెల్లటి జాకెట్టు, నుదుట దోసకాయ గింజంత బొట్టు, జడలో మల్లెపూలు, సంపెంగపూవులాంటి నాసిక, ఎర్రపగడాల్లాంటి పెదవులు... అప్పుడే రెక్కలు విప్పుకుని ఎగరబోతున్న తెల్లటి శాంతికపోతంలా వుందామె.

ఒక్కసారిగా సైనిక కవాతు ప్రారంభమైంది. చుట్టూ బ్యాండుమేళం ధ్వనులు మిన్నంటగా సైనికవందనం స్వీకరించింది.

దూరంగా...

ఆకాశంలోంచి ఓ రాయంచ నిలబడినట్లుగా కనిపిస్తోంది ఆమె ఎక్కాల్సిన బోయింగ్ 737 విమానం.

దానికున్న ట్రాలీ పక్షిముక్కులా అతక్కున్నట్లుగా అగుపిస్తోంది.

ఆమె ఆఖరిసారిగా భారతరాష్ట్రపతికి షేక్‌హ్యాండ్ ఇచ్చింది వీడ్కోలు చెపుతున్నట్లుగా. గంభీరంగా వుండే ఆయన కళ్లల్లో దిగులు కనిపిస్తోంది.

బయట జనాల కేకలు మిన్నంటుతున్నాయి.

"ప్రధాని సౌగంధిక వర్థిల్లాలి..."

"ప్రధాని ఇక్కడే వుండాలి. మమ్మల్ని వదిలి ఎక్కడికీ వెళ్లకూడదు".

ప్లేన్ బయలుదేరుతున్నట్లుగా మైక్‌లో అనౌన్స్ చేశారు. ఆమె ముందుకు కదిలింది. మెటల్ డిటెక్టర్ దాటి లోపలికి పోతూ వెనక్కి తిరిగింది. విచారవదనంతో నిలబడి వున్నాడు యుద్ధవీర్.

"వెళ్లొస్తాను మిత్రమా...." అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటూ చెప్పిందామె చిరునవ్వుతో.

తల ఊపాడు మౌనంగా.

ఆమె కదిలింది ముందుకు.

కళ్లల్లో నీటిపొర అడ్డుపడి తెల్లతెల్లగా కనిపిస్తోందామె యుద్ధ్‌వీర్‌కి.

మరో ముప్ఫై సెకండ్ల తర్వాత... బోయింగ్ 737 కదిలింది భారతదేశానికి వీడ్కోలు చెపుతూ.

ఆ విమానం కనుమరుగయ్యేదాకా అలాగే చూస్తున్నాడు యుద్ధ్‌వీర్ - నూతన భారత ప్రధానమంత్రి.

***-: అయిపోయింది :-***

# డా॥ కె. కిరణ్ కుమార్

## ఇతర సంచలన నవలలు

ఆమె ఓ ప్రభంజనం



డా॥ కె. కిరణ్ కుమార్

ఈ ప్రేమ వర్షం ఏ మేఘానిదో
(సౌందర్య వీక్లీ సీరియల్)

సెలయేరు
(చెలిమి సీరియల్)

మల్లెపూవు
(మయూరి వీక్లీ సీరియల్)

నిన్నటి దాకా శిలనే
(స్వాతి వీక్లీ సీరియల్)

వయసే ఒక పూల తోట
(స్వాతి వీక్లీ సీరియల్)